epaper.vaartha.com WWW.VAARTHA.COM

తెలుగు జాతీయ దినపత్రిక

# వార్త

6-3-2026 శుక్రవారం సంపుటి: 32 సంచిక: 34 పేజీలు: 16 వెల: 6.50

విశాఖపట్నం ::fb.com/vaarthaDigital

Published from Visakhapatnam, Vijayawada, Hyderabad, Rajahmundry, Guntur, Nizamabad, Ongole, Warangal, Tirupati, Kadapa, Kurnool, Anantapur, Karimnagar, Mahabubnagar, Khammam, Nellore, Nalgonda, Tadepalligudem, Srikakulam

ఇతర రాష్ట్రాలు, ప్రపంచ దేశాల ముఖ్యమైన పరిణామాలు
సామాజిక, ఆర్థిక, రాజకీయ పుస్తక సమీక్షలు
ప్రతి ఆదివారం 'వార్త' మెయిన్‌లో ఒక పూర్తి పేజీ



# ఫైనల్‌కు భారత్

7 పరుగుల తేడాతో ఇంగ్లండ్‌పై అఖండ విజయం

8న న్యూజిలాండ్‌తో టీమిండియా ఫైనల్

ఆటలో

'సూర్య సేన' సూపర్ షో చేసింది. పరుగుల వరద పారిన రెండో సెమీస్‌లో విజయ గర్జన చేసింది. మొదట బ్యాటింగ్, ఆ తర్వాత బౌలింగ్‌లో రాణించింది. మధ్యలో బెతెల్ సూపర్ సెంచరీతో భారత్ శిబిరంలో కలవరం రేపినా.. ఇంగ్లాండ్‌కు అవకాశం ఇవ్వకుండా మ్యాచ్ ముగించింది. ఏడు రన్స్‌తో గెలుపొంది నాలుగోసారి ఫైనల్లో ప్రవేశించింది. న్యూజిలాండ్‌తో తుదిపోరుకు సిద్ధమైంది.

## బాంబుల వర్షం



గురువారం ఇరాన్‌దాడిలో దగ్ధమవుతున్న అమెరికా ఇంధన ఓడ

వార్- 6

### ఒమన్ పోర్టుపై ఇరాన్ దాడి, ఇద్దరు భారతీయులు మృతి

### ఇజ్రాయెల్-యుఎస్ దాడుల్లో 1,230మంది ఇరానియన్లు మృతి

### లెబనాన్‌లో వంద మంది పైగా పౌరులు మృతి

### గ్రావిటీ బాంబులు ప్రయోగిస్తామని అమెరికా హెచ్చరికలు

**లండన్, మార్చి 5:** గతవారం నుంచి అమెరికా-ఇజ్రాయెల్, ఇరాన్ మధ్య యుద్ధంతో పశ్చిమాసియాలో అల్లకల్లోలం చెలరేగింది. సైనిక చర్యలు, పరస్పర హెచ్చరికలు, క్షి పణి దాడులతో ప్రాంతమంతా ఉద్రిక్తంగా మారింది. ఇరాన్ రాజధాని టెహ్రాన్ సహా దాదాపు 127 ప్రాంతాలను లక్ష్యంగా చేసుకుని ఇజ్రాయెల్-యుఎస్ వైమానిక దాడులుచేస్తూ, బాంబుల వర్షం కురిపిస్తోంది. పట్టణాలు, నగరాల్లో బాంబు దాడులతో దద్దరిల్లింది. ఎటుచూసినా బాంబుపేలుళ్ల



ఇరాన్‌లో యుఎస్ బాంబు దాడి దృశ్యం

>>2

# ఒకరు వద్దు.. ముగ్గురు ముద్దు

### ఇదీ మన జనాభా విధానం
### ఎందరు పిల్లలున్నా.. అందరికి 'తల్లికివందనం'
### రాష్ట్ర జనాభా 5కోట్లుపైనే ఉండాలి
### ఫెర్టిలిటీ రేటు 1.5కి తగ్గడం ప్రమాదకరం
### పాపులేషన్ మేనేజ్‌మెంట్ పాలసీపై అసెంబ్లీలో ప్రకటన చేసిన సిఎం చంద్రబాబు



**విజయవాడ.మార్చి5,ప్రభాతవార్తప్రతినిధి:** జనాభా నిర్వహణపై దృష్టి సారించాల్సిన సమయం వచ్చిందని ముఖ్యమంత్రి చంద్రబాబు అన్నారు. లేకపోతే భవిష్యత్తులో చాలా సమస్యలు వస్తాయని ఆందోళన వ్యక్తం చేశారు. పాపులేషన్ మేనేజ్‌మెంట్ పాలసీపై అసెంబ్లీలో సీఎం ప్రకటన చేశారు. 1.5 ఉన్న టీఎఫ్ఆర్‌ను 2.1కు తీసుకెళ్లటం మన లక్ష్యమని వెల్లడించారు. ఇద్దరి కంటే ఎక్కువ మంది పిల్లల్ని కంటే కాన్పుసమయంలోనే రూ.25 వేలు ఇస్తామని ఈ నగదు పురస్కారం గేం ఛేంజర్ కానుందని భావిస్తున్నామని అన్నారు. జనాభా నిర్వహణపై ఎమ్మెల్యేలు క్షేత్రస్థాయిలో చర్చలు జరపాలని ఆ చర్చల తర్వాత పాపులేషన్ మేనేజ్‌మెంట్ పాలసీ రూపొందిస్తామని సీఎం వెల్లడించారు. మనం జోక్యం చేసుకోకుంటే టీఎఫ్ఆర్ వేగంగా తగ్గు తుంది. ఏడాదికి 6.70లక్షల మంది పిల్లలు ఏపీలో పుడుతున్నారు. 57 శాతం మంది ఒక్కరితో ఆపివే స్తున్నారు. 32శాతం మంది ఇద్దరిని కంటున్నారు. 9 శాతం మాత్రమే ఇద్దరి కంటే ఎక్కువ మందిని కంటున్నారు. 60 ఏళ్లు దాటిన వారు 10 శాతం ఉన్నారు. 2047కు ఇది 23 శాతానికి చేరుతుంది. మనవద్ద పనిచేసే మహిళలు తక్కువగా ఉన్నారు. 2023 లెక్కల ప్రకారం రాష్ట్రంలో ఏడాదికి 6.70 లక్షల మంది పిల్లలు పుడుతున్నారు. 2047 నాటికి రాష్ట్రంలో వృద్ధాప్యం ఎక్కువగా ఉంటుంది. రాష్ట్రంలో 1.5శాతంగా సంతానోత్పత్తి రేటు ఉంది. దేశంలో కంటే రాష్ట్రంలో వృద్ధాప్యం ఎక్కువగా ఉంది. ఏప్రిల్ 1 నుంచి కొత్త పాలసీని అమలు చేస్తామని, పాపులేషన్ మేనేజ్‌మెంట్ పాలసీ అమలు చేసిన మొదటి రాష్ట్రంగా ఏపీ నిలుస్తుందని సీఎం చంద్రబాబు వెల్లడించారు. ఇద్దరి కంటే ఎక్కువ ఉంటే ఎన్నికల్లో పోటీకి అర్హత లేదనే చట్టం రద్దు చేశామని, ఇద్దరి కంటే తక్కువ మంది పిల్లలు ఉంటే పోటీకి అనర్హుల్ని చేయాల్సి వస్తుందేమోనని వ్యాఖ్యానించారు. పాపులేషన్ కంట్రోల్ నుంచి పాపులేషన్ కేర్ దిశగా వెళ్తున్నామని చెప్పారు. మాతృత్వ, శక్తి, నైపుణ్య, క్షేమ, సంజీవని అనే 5 అంశాలు తీసుకున్నామని అలానే కుటుంబ నియంత్రణ ఆపరేషన్లు 75శాతం నుంచి 50 శాతానికి తగ్గించాలని చెప్పారు. 90లక్షల మంది జంటల్లో 11 లక్షల మంది ఇన్‌ఫెర్టిలిటి సమస్యతో ఉన్నారని, 11 లక్షల మంది సంతాన >>2

# యుద్ధంతో సమస్యలు పరిష్కారం కావు



### ప్రధాని మోడీ స్పష్టీకరణ
### ఫిన్లాండ్ అధ్యక్షుడు అలెగ్జాండర్ స్టబ్‌తో ద్వైపాక్షిక చర్చలు
### వలసలు, మొబిలిటీపై భారత్, ఫిన్లాండ్ కీలక ఒప్పందం
### విద్యా రంగంలో పరస్పర సహకారానికి నిర్ణయం

**న్యూఢిల్లీ, మార్చి 5:** ప్రపంచవ్యాప్తంగా నెలకొన్న ఉద్రిక్త పరిస్థితుల నేపథ్యంలో భారత్ మరోసారి శాంతి మంత్రం జపించింది. కేవలం సైనిక చర్యలతో ఏ సమస్యా పరిష్కారం కాదని, చర్చలు, దౌత్యమే సరైన మార్గమని ప్రధాన మంత్రి నరేంద్ర మోడీ స్పష్టం చేశారు. గురువారం ఢిల్లీలోని హైదరాబాద్ హౌస్‌లో ఫిన్లాండ్ అధ్యక్షుడు అలెగ్జాండర్ స్టబ్‌తో ప్రధాని మోడీ ద్వైపాక్షిక చర్చలు జరిపారు. అనంతరం ఇరువురు నేతలు సంయుక్తంగా మీడియాతో మాట్లాడారు. ఈ సందర్భంగా పశ్చిమాసియా, ఉక్రెయిన్‌లలో నెలకొన్న ఘర్షణలను ముగించేందుకు జరిగే ప్రతి ప్రయత్నానికి భారత్ మద్దతు ఇస్తుందని మోడీ హామీ ఇచ్చారు. చట్టం, న్యాయం, ప్రజాస్వామ్య విలువలపై భారత్, ఫిన్లాండ్‌లకు ఒకే రకమైన అభిప్రాయం ఉందని ఆయన తెలి పారు. ప్రస్తుతం ప్రపంచంఎదుర్కొంటున్న సవాళ్లను పరిష్కరించడానికి అంతర్జాతీయ సంస్థల్లో సంస్కరణలు అత్యవసరమని ఇరువురు నేతలు ఏకాభిప్రాయానికి వచ్చారు. ఉగ్రవాదాన్ని అన్ని రూపాల్లోనూ నిర్మూలించడమే తమ ఉమ్మడి లక్ష్యమని మోడీ పేర్కొన్నారు. ఫిన్లాండ్ అధ్యక్షుడు అలెగ్జాండర్ స్టబ్ 'ఐరన్‌మ్యాన్ ట్రయాథ్లాన్'పూర్తి చేయ డాన్ని ప్రస్తావిస్తూ మోడీ ఆసక్తికర వ్యాఖ్యలు చేశారు. 'మీరు ఐరన్ మ్యాన్ ట్రయాథ్లాన్ పూర్తి చేశారు.. మీలాంటి శక్తివంతమైన నాయకత్వంతో భారత్, ఫిన్లాండ్ కూడా ఇన్నోవేషన్, డిజిటల్, సస్టైనబిలిటీ అనే కొత్త 'ట్రయాథ్లాన్'ను సాధిస్తాయని నాకు నమ్మకం ఉంది' అని మోడీ చమత్కరించారు.

**కొత్త శకంలో భారత్- యూరప్ బంధం:** ప్రస్తుతం ప్రపంచం అస్థిరత, అనిశ్చితి మధ్య ఉందని, ఉక్రెయిన్ నుంచి పశ్చిమాసియా వరకు అనేక ప్రాంతాల్లో ఘర్షణలు కొనసాగుతున్నాయని ప్రధాని మోడీ >>2



శివ్‌ప్రతాప్ శుక్లా

## తెలంగాణ కొత్త గవర్నర్‌గా శివ్‌ప్రతాప్ శుక్లా

### బెంగాల్‌కు తమిళ గవర్నర్ రవి బదలీ
### ఆనంద్‌బోస్ రాజీనామా
### కేరళ గవర్నర్‌కు తమిళనాడు అదనపు బాధ్యత
### బీహార్‌కు సయ్యద్ అతా హస్నైన్
### నాగాలాండ్‌కు నందకిశోర్ యాదవ్
### ఢిల్లీకి తరంజిత్ సింగ్

2లో

# మొక్కలకు జియో ట్యాగింగ్

### స్థానిక సంస్థల బలోపేతమే ప్రభుత్వ లక్ష్యం
### పంచాయతీరాజ్‌కు రూ.15,485కోట్లు
### చెట్ల సంరక్షణకు బలమైన చట్టం: డి. సిఎం పవన్

**విజయవాడ,మార్చి5,ప్రభాతవార్తప్రతినిధి:** రాబోయే స్థానిక సంస్థల ఎన్నికల్లో భాగంగా జడ్పీ ఎన్నికలను విభజించిన జిల్లాల ప్రాతిపదికన నిర్వహించే యోచనలో ప్రభుత్వం ఉంది. ఇందుకు అనుగుణంగా కసరత్తు జరుగుతోందని ఉప ముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్ పేర్కొన్నారు. పంచాయతీల పునర్విభజనపైనా న్యాయపరమైన అడ్డంకులు ఏవీ లేవని చెప్పారు. గురువారం శాసనసభలో పవన్ మాట్లాడుతూ స్థానిక సంస్థల స్వావలంబనకు కూటమి ప్రభుత్వం కట్టుబడి ఉంది. అధికారంలోకి వచ్చిన వెంటనే స్థానిక సంస్థలను బలోపేతం చేసే చర్యలను తీసుకున్నాం. అలాగే రహదారుల విస్తరణ, ఇతర అభివృద్ధి కార్యక్రమాల కోసం చెట్లను తొలగించేటపుడు అక్కడ ఎలాంటి ప్రత్యామ్నాయం తీసుకురావాలనే దానిపై పరిశీలన జరుపుతున్నాం. పర్యావరణ ప్రేమికుడిగా ఈ విషయంలో అన్ని వైపులా ఆలోచించి పచ్చదనాన్ని కాపాడేందుకు చర్యలు తీసుకుంటాం. కేవలం చర్యలు తీసుకోవడమే కాదు.. భవిష్యత్తులోనూ చెట్లను, వృక్షాలను సంరక్షించేలా బలమైన చట్టం తీసుకొచ్చేందుకు ఆలోచిస్తున్నాం. ఇది కఠినంగా అమలు చేస్తేనే పచ్చదనానికి భరోసా దొరుకు తుంది. అటవీ శాఖ ఆధ్వర్యంలో



మొక్కలను నాటుతున్నారు తప్పితే వాటి సంరక్షణకు చర్యలు తీసుకోవడం లేదని సభ్యులు నా దృష్టికి తీసుకొచ్చారు. పచ్చదనం సంరక్షణకు సభ్యుల నిశిత దృష్టిని అభినందిస్తున్నాను. అదే విధంగా ఇక మీదట అటవీ శాఖ ఆధ్వర్యంలో పంపిణీ చేసేవాటికి, నాటే ప్రతి మొక్కకు జియో ట్యాగ్ వేసే ప్రక్రియ అమలు చేయాలని భావిస్తున్నాం. నర్సరీల దగ్గర నుంచే దీనికి ప్రత్యేక వ్యవస్థను అమలు చేసేలా ఓ ప్రత్యేక వ్యవస్థను తీసు కువస్తాం. బెంగళూరు నర్సరీల్లో అమలు చేస్తున్న అత్యాధునిక విధానాలను పరిశీలిస్తున్నాం. మొక్కలు నాటడమే కాదు, వాటి సంరక్షణకు తగిన ప్రాధాన్యం ఇస్తాం. ఎర్రచందనం అమ్మకం విషయంలో మెరుగైన ధరలను పరిశీలించేందుకు, గోదాముల్లో ఉన్నదుంగలను అమ్మకాలను చేసేం దుకు ఓ ప్రత్యేక బృందాన్ని నియమించాం. వారు ఎప్పటికప్పుడు గ్లోబల్ ధరలకు అనుగుణంగా దుంగలకు వేలం నిర్వహిస్తూ ప్రభుత్వ ఖజానాకు మంచి ధరలు వచ్చేలా ప్రయత్నం చేస్తారు. పంచాయతీరాజ్,గ్రామీణాభివృద్ధి ద్వారా ప్రజలకు కల్పిస్తున్న సౌకర్యాలు ఉద్యోగులకు ఇచ్చని నిష్పక్షపాత పదోన్నతులు, అటవీ >>2

# 200 సబ్‌స్టేషన్లు

### రాష్ట్ర వ్యాప్తంగా రూ.6వేల కోట్లతో నిర్మాణం
### విద్యుత్ సరఫరాలో లోటురాదు: మంత్రి గొట్టిపాటి



**సచివాలయం,మార్చి 5,ప్రభాతవార్త:** రాష్ట్రంలో విద్యుత్‌లోడ్ ఎక్కువగా ఉన్న ప్రాంతాల్లో కొత్తసబ్ స్టేషన్ల నిర్మాణానికి రూ.6వేల కోట్లతో పనులు చేపట్టినట్లు ఇంధనశాఖమంత్రి గొట్టిపాటి రవికుమార్ తెలిపారు. అసెంబ్లీలో ప్రశ్నోత్తరాల సమయంలో సభ్యులు అదితి విజయలక్ష్మీ గజపతిరాజు, కోళ్ళ లలిత కుమారి, ముత్తుముల అశోక్‌రెడ్డి అడిగిన ప్రశ్నకు మంత్రి గొట్టిపాటి రవికుమార్ సమాధానం ఇచ్చారు. రాష్ట్రంలో విద్యుత్‌లోడ్ అధికంగా ఉన్న ప్రాంతాల్లో 200కు పైగా 33/11కెవి సబ్ స్టేషన్లు అవసరం ఉందని గుర్తించి, వాటి నిర్మాణానికి చర్యలు చేపట్టామని మంత్రి వెల్లడించారు. విజయనగరం జిల్లా వేణుగోపాలపురం సబ్‌స్టేషన్ నిర్మాణ పనులు ప్రస్తుతం రీటెండరింగ్ దశలో ఉన్నా యని, 2027మార్చినాటికి పనులు పూర్తిచేస్తామని హామీ ఇచ్చారు. ఇప్పటికే జిల్లాలో రూ.46కోట్ల వ్యయంతో 220కేవి,132కేవీ లైన్ల పనులు పూర్తి అయ్యాయని, వాటిని త్వరలో చార్జ్ చేసేందుకు సిద్ధంగా ఉంచినట్లు తెలిపారు. వేణుగోపాలపురంలో రూ.77కోట్లతో సబ్ స్టేషన్ పనులు కొనసాగుతున్నాయని మంత్రి సభకు వివరించారు. విజయనగరంలో కూడా విశాఖపట్నం తరహాలో అండర్‌గ్రౌండ్‌కేబులింగ్ వ్యవస్థను ఏర్పాటు చేయాలని ఎమ్మెల్యే అదితి గజపతి రాజు కోరగా, ఆవ్యవస్థ ఖర్చుతో కూడుకుందని మంత్రి తెలిపారు. నిధుల లభ్యత, అవసరాన్ని బట్టి ఆ అంశాన్ని పరిశీలిస్తామని స్పష్టం >>2

## కవిత నోట.. 'జై ఆంధ్ర' మాట

### తిరుమలేశుని దర్శనానికి వచ్చిన తెలంగాణ జాగృతి నేత



**తిరుమల,మార్చి 5ప్రభాతవార్తప్రతినిధి:** తెలంగాణ జాగృతి నాయకురాలు, మాజీ ఎంఎల్‌సి కల్వకుంట కవిత నోటజై ఆంధ్ర నినాదం వినిపించడంతో విమానాశ్రయంలో అందరూ ఆశ్చర్యచకితులయ్యారు. తెలంగాణలో త్వరలో నూతన రాజకీయ పార్టీ ఏర్పాటుకు ముందు ఆమె గురువారం సాయంత్రం తిరుమలకు చేరుకున్నారు. అలిపిరి నడకమార్గంలో >>2

# ప్రకృతి విపత్తు వేళ.. రైతులకు ఇన్‌పుట్ సబ్సిడీ

### అరకు కాఫీ తోటలకు వ్యాధి నియంత్రణ చర్యలు: మంత్రి అచ్చెన్నాయుడు

**విజయవాడ,మార్చి5,ప్రభాతవార్తప్రతినిధి:** ప్రకృతి వైపరీత్యాల కారణంగా నష్టపోయిన రైతులను ఆదుకోవడంలో కూటమి ప్రభుత్వం కట్టుబడి పనిచేస్తోందని వ్యవసాయ శాఖ మంత్రి కింజరాపు అచ్చెన్నాయుడు తెలిపారు. ప్రకృతి విపత్తులు సంభవించినప్పుడు రైతులకు ఇన్‌పుట్ సబ్సిడీ రూపంలో ప్రభుత్వం సహాయం అందిస్తుందని చెప్పారు. రాష్ట్రంలో ఇటీవల సంభవించిన ప్రకృతి వైపరీత్యాల కారణంగా నష్టపోయిన రైతులకు నష్టపరిహారం అందించడం, అరకులో కాఫీ తోటల నష్టంపై సభ్యులు అడిగిన ప్రశ్నలకు ప్రభుత్వం తీసుకున్న చర్యలను మంత్రి అసెంబ్లీలో వివరించారు. నష్టపోయిన ప్రాంతాల్లో వ్యవసాయ శాఖ అధికారులు ఫీల్డ్ స్థాయిలో పంట నష్టాన్ని వారం రోజుల్లో అంచనా వేసి నివేదికలు సిద్ధం చేశారని, ఆ నివేదికల ఆధారంగా అర్హులైన రైతులకు ప్రభుత్వ నిబంధనల ప్రకారం నష్టపరిహారం అందచేశామని మంత్రి పేర్కొన్నారు. రైతులకు అవసరమైన సహాయాన్ని త్వరితగతిన అందించేందుకు ప్రభుత్వం కట్టుబడి ఉందని స్పష్టం చేశారు. రాష్ట్రంలో ప్రకృతి వైపరీత్యాల వల్ల నష్టపోయిన రైతులకు ప్రభుత్వం ఇన్‌పుట్ సబ్సిడీ రూపంలో సహాయం అందిస్తున్నట్లు మంత్రి అచ్చెన్నాయుడు తెలిపారు. గతంలో 2014 వరకు పత్తి, వేరుశెనగ, వరి, చెరుకు పంటలకు హెక్టారుకు రూ.12,000 ఇన్‌పుట్ సబ్సిడీని అం దించేసేవారని, 2014లో తెదేపా >>2



06-3Pg2exHNWMJQE.qxd:06-3Pg2exHNWMJQE.qxd 1/1/02 7:44 AM Page 1





# పెళ్లి వేడుకలో మిత్రుల కలయిక

**ఆర్థిక మంత్రి హోదాలో ఒకరు.. రాజ్యసభ సభ్యుని హోదాలో మరొకరు**

నరేందర్ రెడ్డిని ఆప్యాయంగా ఆలింగనం చేసుకుంటున్న మంత్రి పయ్యావుల కేశవ్

**అనంతపురం, మార్చి 5 ప్రభాతవార్త బ్యూరో:** తెలంగాణ నుంచి రాజ్యసభకు ఎంపికైన ఆ రాష్ట్ర ముఖ్యమంత్రి సలహాదారు వేం నరేందర్ రెడ్డికి ఏపీ ఆర్థిక మంత్రి పయ్యావుల కేశవ్ శుభాకాంక్షలు తెలిపారు. హైదరాబాదులో గురువారం తెలంగాణ డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క తనయుని వివాహ కార్యక్రమానికి ఏపీ ఆర్థిక మంత్రి పయ్యావుల కేశవ్ హాజరయ్యారు. అదే కార్యక్రమానికి వచ్చిన వేం నరేందర్ రెడ్డిని ఆ వేడుకలో కలిశారు. ఈ సందర్భంగా వేం నరేందర్ రెడ్డిని అప్యాయంగా ఆలింగనం చేసుకున్న మంత్రి పయ్యావుల కాబోయే రాజ్యసభ సభ్యునికి శుభాకాంక్షలు తెలిపారు. తెలంగాణలో తన మిత్రులిద్దరిలో ఒకరు సీఎం హోదాలో ఉండగా మరొకరు రాజ్యసభకు ఎన్నికవుతున్నందుకు సంతోషంగా ఉందని మంత్రి పయ్యావుల అన్నారు. ఈ సందర్భంగా ఉమ్మడి రాష్ట్రంగా ఉన్నప్పటి సంగతులు విభజన తర్వాతి పరిణామాలపై మాట్లాడుకున్నారు. తన తెలంగాణ మిత్రులు సీఎం రేవంత్ రెడ్డి, సలహాదారు వేం నరేందర్ రెడ్డి కష్టాల్లోనూ కలిసే ఉన్నారంటూ గతంలో జరిగిన పరిణామాలను పయ్యావుల గుర్తు చేసుకున్నారు.

## మోటారు వాహనాల పన్ను చట్టసవరణ బిల్లు ఆమోదం

**విజయవాడ,మార్చి 5,ప్రభాతవార్తప్రతినిధి:** ఏపీఅసెంబ్లీలో మోటారు వాహనాల పన్ను చట్టసవరణ బిల్లుకు ఆమోదం ఆమోదం లభించింది. అసెంబ్లీలో మోటారు వాహనాల పన్ను చట్టసవరణ బిల్లును రవాణాశాఖా మంత్రి రాం ప్రసాద్‌రెడ్డి ప్రవేశపెట్టారు. ఈ సందర్భంగా రహదారుల నిర్వహణ కోసం రహదారి భద్రత సెస్సు వసూలు చేస్తున్నామన్నారుకేంద్రం ఇటీవల జీఎస్టీని 28 నుంచి 18 శాతానికి తగ్గించిందన్నారు. ఈ క్రమంలో రహదారి భద్రతా సెస్సు పెంచాలని నిర్ణయించినట్లు మంత్రి మండిపల్లి వివరించారు. రహదారుల భద్రత, ప్రమాదాల్లో మరణాలు తగ్గించేందుకు సెస్సు ఉపయోగపడుతుందని మంత్రి అన్నారు. ఏటా సరాసరిన 8.70 లక్షల వాహనాలు రిజిస్టర్ అవుతున్నాయన్నారు. 10 శాతం పన్నువిధించటంవల్ల రూ.270కోట్లు ఆదాయంవస్తుందని మంత్రి మండిపల్లి అన్నారు. మోటారు వాహనాల పన్ను చట్టసవరణ బిల్లును ఎంఎల్‌ఏల అభిప్రాయాల అనంతరం శాసనసభ ఆమోదించింది.

# బాంబుల వర్షం

>> ధ్వనులు, దట్టమైన పొగ, ప్రజల హాహాకారాలతో హృదయ విదారకర పరిస్థితులు దర్శనమిచ్చాయి. సైనికులు, ఐఆర్‌జిసి కేంద్రాలే కాకుండా పౌరుల నివాసాలు, ఆస్పత్రులు, విద్యా సంస్థలపైనా దాడులు చేస్తున్నారని ఇరాన్ మండిపడుతోంది. గురువారం జరిపిన దాడుల్లో నలుగురు హెల్త్ వర్కర్ల ప్రాణాలు కోల్పోగా, 11 ఆస్పత్రులు ధ్వంసమయ్యాయని పేర్కొంది. అమెరికా- ఇజ్రాయెల్ సైనిక కేంద్రాలు లక్ష్యంగా గల్ఫ్ దేశాలపై ఇరాన్ క్షిపణులు ప్రయోగిస్తోంది. ఒమన్ పోర్టుపై జరిపిన దాడిలో ఇద్దరు భారతీయులు మృతి చెందారు. అటు ఇజ్రాయెల్- అమెరికా వైమానిక దాడుల్లో ఇప్పటి వరకు 1230 మంది ఇరానియన్లు చనిపోయారని ఇరాన్ అధికారికంగా ప్రకటించింది. మరోవైపు లెబనాన్‌లోని హెజ్బొల్లా మిలిటెంట్ల స్థావరాలను లక్ష్యంగా చేసుకుని ఇజ్రాయెల్ వైమానిక, భూతల దాడులకు పాల్పడింది. ఈ దాడుల్లో లెబనాన్‌లో వంద మందికి పైగా హెజ్బొల్లా మిలిటెంట్లు, పౌరులు ప్రాణాలు కోల్పోయారు. ఇరాన్ హెచ్చరికలు జారీ చేస్తూ, ఇజ్రాయెల్‌పై దాడులు కొనసాగితే డిమోనా అణు కేంద్రం లక్ష్యంగా చేసుకుంటామని స్పష్టం చేసింది. దీనికి ప్రతిగా ఇజ్రాయెల్ రక్షణ మంత్రి కఠిన చర్యలు తీసుకుంటామని పేర్కొన్నారు. ఇజ్రాయెల్ సైన్యం ఇజ్రాయెల్ డిఫెన్స్ ఫోర్సెస్ ప్రకారం, ఇరాన్ మరోసారి బాలిస్టిక్ క్షిపణి దాడులు జరిపింది. కేంద్ర ఇజ్రాయెల్, జెరూసలేం ప్రాంతాల్లో ఎయిర్ రైడ్ సైరన్లు మోగడంతో ప్రజలు ఆశ్రయ కేంద్రాలకు పరుగులు తీశారు. ఖతార్ రాజధాని దోహా నగరం భారీ పేలుళ్లతో దద్దరిల్లింది. ఇరాన్ ప్రయోగించిన క్షిపణులను ఖతార్ వైమానిక రక్షణ వ్యవస్థలు అడ్డుకోవడంతో భారీ శబ్దాలు వినిపించాయి. మరోవైపు, అజర్‌బైజాన్‌లోని నఖ్చివన్ ప్రాంతాన్ని లక్ష్యంగా చేసుకుని ఇరాన్ డ్రోన్ దాడులు చేసింది. అజర్‌బైజాన్ విదేశీ వ్యవహారాల మంత్రిత్వ శాఖ ఈమేరకు స్పందించింది. ఒక డ్రోన్ నఖ్చివన్ అంతర్జాతీయ విమానాశ్రయం టెర్మినల్ భవనాన్ని ఢీకొట్టినట్లు వెల్లడించింది. ఇరాన్ దాడులపై అజర్ బైజాన్ తీవ్రంగా ఖండించింది. అంతర్జాతీయ నిబంధనలను ఉల్లంఘిస్తూ జరిగిన ఈ దాడిపై వివరణ ఇవ్వాలని ఇరాన్‌ను డిమాండ్ చేసింది. ఈ మేరకు ఇరాన్ రాయబారికి అజర్ బైజాన్ సమన్లు జారీ చేసింది.

**ఖండాంతర క్షిపణిని పరీక్షించిన యుఎస్:** యుఎస్ సైనిక స్థావరాలపై ఇరాన్ దాడులను అమెరికా తీవ్రంగా మండిపడింది. ఇలాగే కొనసాగితే, ఇరాన్‌పై గ్రావిటీ బాంబు ప్రయోగిస్తామని హెచ్చరించింది. మరోవైపు కాలిఫోర్నియాలోని వాండెన్‌బెర్గ్ స్పేస్ ఫోర్స్ బేస్ నుంచి మినిట్‌మ్యాన్3 అనే భారీ ఖండాంతర క్షిపణిని అమెరికా పరీక్షించింది. ఈ మేరకు అమెరికా స్పేస్ ఫోర్స్ ఓ ప్రకటన విడుదల చేసింది.

**ఖమేనీ అంత్యక్రియలు వాయిదా:** అమెరికా-ఇజ్రాయెల్ దాడిలో మృతి చెందిన ఇరాన్ సుప్రీం నేత అయతుల్లా అలీ ఖమేనీ అంత్యక్రియలు వాయిదా పడ్డాయి. లక్షలాది సంఖ్యలో జనం వచ్చే అవకాశం ఉండటంతో ఇరాన్ ఈ నిర్ణయం తీసుకుంది. అందుకు తగ్గ ఏర్పాట్లు చేయడానికి సమయం పడుతుందని ఇస్లామిక్ డెవలప్‌మెంట్ కోఆర్డినేషన్ కౌన్సిల్ అధిపతి మోహసిన్ మహముది ప్రభుత్వ మీడియాకు వెల్లడించారు. త్వరలో అంత్యక్రియల తేదీని ప్రకటించనున్నట్లు ప్రభుత్వం తెలిపింది. ఖమేనీ జన్మించిన మషాద్‌లోనే ఆయన అంత్యక్రియలు నిర్వహించనున్నారు.

**ఇజ్రాయెల్ నేతలు, ట్రంప్‌కు రక్తపాతం తప్పదు: ఇరాన్ మతగురువు**

**దేశ ఐక్యతను కాపాడుకోవాలంటూ పిలుపునిచ్చిన మత గురువు:** ఇరాన్ ప్రభుత్వ టెలివిజన్‌లో ప్రసారమైన సందేశంలో ప్రముఖ మత గురువు అయితొల్లా అబ్దుల్లా జవాది అమోలీ తీవ్ర హెచ్చరికలు చేశారు. ఇజ్రాయెల్, అమెరికా నేతలపై రక్తపాతం తప్పదని హెచ్చరించారు. ముఖ్యంగా అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ పేరును ప్రస్తావిస్తూ వ్యాఖ్యలు చేయడం గమనార్హం. దేశ ఐక్యతను కాపాడుకోవాలని, శత్రువులపై కఠినంగా పోరాడాలని ఆయన పిలుపునిచ్చారు. ఇరాన్ విదేశాంగ మంత్రి అబ్బాస్ అరాఘ్చీ కూడా అమెరికాపై ఘాటైన వ్యాఖ్యలు చేశారు. శ్రీలంక తీరానికి సమీపంలో అమెరికా జలాంతర్గామి దాడిలో ఇరాన్ నౌకాదళానికి చెందిన ఐఆర్‌ఐఎస్ డెన ఫ్రిగేట్ మునిగిపోయిందని ఆరోపించారు. ఇది అంతర్జాతీయ జలాల్లో జరిగిన దాడి అని, అమెరికా దీని ఫలితాలను అనుభవిస్తుందని హెచ్చరించారు. ఈ ఘటనతో రెండు దేశాల మధ్య ఉద్రిక్తతలు మరింత ముదిరాయని అన్నారు.

**చైనా మధ్యవర్తిత్వం ఆఫర్:** పశ్చిమాసియాలో నెలకున్న ఉద్రిక్తతలకు దౌత్యపరంగా పరిష్కరించుకోవాలని చైనా సూచించింది. పోరాటాన్ని ముగించడానికి తాము మధ్యవర్తిత్వం వహించడానికి సిద్ధంగా ఉన్నామని, సంయమనం పాటించాలని పిలుపునిచ్చింది. ఈ మేరకు చైనా విదేశాంగ మంత్రిత్వ శాఖ ప్రతినిధి లిన్ జియాన్ ఎక్స్ (ట్విట్టర్)లో పోస్ట్ పెట్టారు.

## పెద్దల సభకు నితీష్: బీహార్ సిఎంగా తప్పుకుంటున్నా

**న్యూఢిల్లీ, మార్చి 5:** దేశవ్యాప్తంగా 10 రాష్ట్రాలలో త్వరలో ఖాళీ అవుతున్న 37 రాజ్యసభ స్థానాల ఎన్నికలకు సంబంధించి నామినేషన్ల ప్రక్రియ గురువారంతో ముగిసింది. కేంద్రంలో అధికారంలో భారతీయ జనతా పార్టీ అత్యధిక స్థానాల్లో తమ పార్టీ తరఫున అభ్యర్థులను బరిలోకి దింపగా, ప్రతిపక్ష కాంగ్రెస్ పార్టీ కేవలం ఆరు స్థానాల్లోనే తమ అభ్యర్థులను పోటీలో నిలిపింది. ఇక పోతే, బీహార్ ముఖ్యమంత్రి నితీశ్ కుమార్ రాజ్యసభకు గురువారం నామినేషన్ దాఖలు చేశారు. కేంద్ర హోం మంత్రి అమిత్ షా, బిజెపి అధ్యక్షుడు నితిన్ నబిన్‌తో కలిసి గురువారం పాట్నాలో నామినేషన్ వేశారు. అంతకు ముందు నితీష్ మీడియాతో మాట్లాడుతూ, ముఖ్యమంత్రి పదవి నుంచి వైదొలగుతున్నట్లు ప్రకటించారు. బీహార్ నుంచి రాజ్యసభకు జెడియు తరఫున నితీష్ కుమార్, రామ్‌నాథ్ ఠాకూర్, ఆర్‌ఎల్‌ఎం అధినేత ఉపేంద్ర కుష్వాహ, బిజెపి అభ్యర్థులుగా నితిన్ నబిన్, శివేష్ కుమార్ నామినేషన్లు దాఖలు చేశారు. మహారాష్ట్ర నుంచి కేంద్ర మంత్రి రాందాస్ అథవాలే, బిజెపి సీనియర్ నేత వినోద్ తవ్డే, మహావికాస్ అఘాడీ తరఫున శరద్ పవార్ సహా ఆరుగురు నామినేషన్లు వేశారు.

## యుద్ధంతో సమస్యలు పరిష్కారం కావు

>> ఆవేదన వ్యక్తం చేశారు. ఇలాంటి పరిస్థితుల్లో ప్రపంచంలోని రెండు పెద్ద దౌత్య శక్తులైన భారత్, యూరప్ మధ్య సంబంధాలు స్వర్ణయుగంలోకి ప్రవేశిస్తున్నాయని ఆయన అభివర్ణించారు. 2026 ప్రారంభంలో కుదిరిన చారిత్రాత్మక 'ఇండియా- యూరోపియన్ యూనియన్ స్వేచ్ఛా వాణిజ్య ఒప్పందం' గురించి ప్రధాని ప్రత్యేకంగా ప్రస్తావించారు. ఈ ఒప్పందం ద్వారా భారత్, ఫిన్లాండ్ మధ్య వాణిజ్యం, పెట్టుబడులు, సాంకేతిక సహకారం మరింత బలపడుతుందని ఆశాభావం వ్యక్తం చేశారు. కీలక ఒప్పందాలపై సంతకాలుఇరు దేశాల మధ్య ఆవిష్కరణల వ్యవస్థను అనుసంధానించేందుకు సమగ్ర మైగ్రేషన్ అండ్ మొబిలిటీ (వలసలు మరియు రాకపోకల) ఒప్పందంపై సంతకాలు చేసినట్లు ప్రధాని ప్రకటించారు. భారతీయ విద్యార్థులకు, ప్రతిభావంతులకు ఫిన్లాండ్ ఇప్పుడు ఒక ప్రాధాన్య గమ్యస్థానంగా మారుతోందన్నారు. ఈ ఒప్పందం వల్ల ఇరు దేశాల మధ్య పరిశోధనలు, స్టార్టప్ సహకారం మరింత బలపడుతుందని తెలిపారు. విద్యా రంగంలో ఫిన్లాండ్ ప్రపంచానికే ఆదర్శంగా నిలుస్తోందని కొనియాడిన మోడీ, ఉపాధ్యాయ శిక్షణ, స్కూల్‌టుస్కూల్ భాగస్వామ్యం, భవిష్యత్ విద్యా విధానాలపై సహకారాన్ని విస్తరించుకోవడానికి అంగీకరించినట్లు వెల్లడించారు. నార్డిక్ ప్రాంతంలో ఫిన్లాండ్ భారత్‌కు ముఖ్యమైన భాగస్వామి అని, ఆర్కిటిక్, ధృవ ప్రాంతాల పరిశోధనల్లోనూ తమ సహకారం కొనసాగుతుందని మోదీ స్పష్టం చేశారు.

# 13న కేబినెట్ భేటీ

**విజయవాడ.మార్చి 5,ప్రభాతవార్తప్రతినిధి:** సీఎం చంద్రబాబు అధ్యక్షతన ఈ నెల 13వ తేదీ ఉదయం 10.30గంటలకు సచివాలయంలోని మొదటి బ్లాక్ లో రాష్ట్ర మంత్రివర్గ సమావేశం జరగనుంది. సమావేశానికి తీసుకువెళ్లాల్సిన ప్రతిపాదనలను ఈ నెల 11వ తేదీ సాయంత్రం 4 గంటలకల్లా సాధారణ పరిపాలన శాఖ (కేబినెట్ విభాగం)కు పంపాల్సిందిగా అన్ని శాఖలకు రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి ఆదేశాలు జారీ చేశారు.

## పంచాయతీల్లో ప్రత్యేక అధికారుల పాలన

**విజయవాడ,మార్చి5,ప్రభాతవార్తప్రతినిధి:** రాష్ట్రంలో వచ్చే నెల 2వ తేదీ తరవాత గ్రామపంచాయతీలకు ప్రత్యేక అధికారులను నియమించనున్నారు. ఎన్నికలు నిర్వహించే వరకు ప్రత్యేక పాలన కొనసాగనుంది. ఇందుకు సంబంధించిన ప్రతిపాదనలు ప్రభుత్వ పరిశీలనలో ఉన్నట్లు తెలుస్తోంది. సర్పంచుల పదవీ కాలం ఏప్రిల్ 2తో ముగియనుంది. ప్రస్తుత పరిస్థితుల్లో అంతకంటే ముందు, ఆ వెంటనే ఎన్నికలు నిర్వహించే అవకాశం లేనందున. కొన్ని నెలలపాటు ప్రత్యేక అధికారులతో పంచాయతీ పాలన కొనసాగించనున్నారు. ఈలోగా కొత్త ఎన్నికల కమిషనర్ నియామకం, రిజర్వేషన్ల ప్రక్రియ పూర్తయ్యాక ఎన్నికలకు వెళ్లాలని ప్రభుత్వం యోచిస్తున్నట్లు తెలుస్తోంది. రాష్ట్ర ఎన్నికల కమిషనర్ నీలంసాహ్ని పదవీ కాలం ఈ నెలాఖరుతో ముగియనుంది.

## మల్లవరం అటవీప్రాంతంలో పులి పాదముద్రలు



**ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లా బ్యూరో మార్చి5 ప్రభాతవార్త:** తూర్పుగోదావరి జిల్లా గోకవరం మండలం ట్యాంక్ బీడు, మల్లవరం గ్రామంలో పులి అడుగు ముద్ర లు ఉన్నాయని గ్రామస్తులు ఫారెస్ట్ అధి కారులు తెలిపారు. ఈ గ్రామంలో పులి సంచరిస్తుందని గ్రామస్తులు అన్నారు. విషయం తెలుసుకున్న ఫారెస్టు అధికారులు పులిని పట్టుకోవడానికి బోనులతో సిద్ధంగా ఉన్నామని అన్నారు. గ్రామంలో ఉన్న ప్రజలు కొండప్రాంతానికి పనులకు వెళ్లవద్దని రాత్రులు ఒంటరిగా బయటకు వెళ్లవద్దని అధికారులు తెలిపారు. అటవీప్రాంతం మల్లిశాలలో ప్రసిద్ధి చెందిన సింగరమ్మ అమ్మవారి తీర్థం జరుగు తుండటంతో రాత్రి సమయంలో భక్తులు అటవీప్రాంతంలో జాగ్రత్తగా ఉండాలని అధికారులు హెచ్చరించారు.

# ఒకరు వద్దు.. ముగ్గురు ముద్దు

>> సాఫల్యానికి ప్రభుత్వం నుంచి సహకారం ఉంటుందని చెప్పారు. 50 మంది చిన్నారులు ఉంటే చైల్డ్ కేర్ సెంటర్లు, పింక్ టాయిలెట్స్ ఏర్పాటు చేయాలని ఆలోచన చేస్తున్నాం అన్నారు. రాష్ట్రంలో మహిళల రక్షణ కోసం షీ క్యాబ్స్ ను అందుబాటులోకి తీసుకురావాలని ఆలోచన చేస్తున్నాం అన్నారు. విశాఖపట్నంలో రూ.172 కోట్లతో వర్కింగ్ ఉమెన్ హాస్టల్ నిర్మాణం చేపడుతున్నామన్నారు. ఏ ప్రాంతంలో మహిళా ఉద్యోగులు పనిచేస్తారో అక్కడ కొత్తగా వర్కింగ్ ఉమెన్ హాస్టళ్ల ఏర్పాటు చేయాలని నిర్ణయం తీసుకున్నామని చెప్పారు. మూడో సంతానం, ఆపై జననాలకు 12 నెలల పేరెంటల్ లీవ్ తండ్రులకు 2 నెలలు పెటర్నల్ లీవ్ ఇవ్వాలని ఆలోచన చేస్తున్నాం అన్నారు. త్వరలో తల్లి దండ్రుల సమాన బాధ్యత పేరుతో కుటుంబ బాధ్యతలు పంచుకోవడంపై అవగాహన క్యాంపెయిన్ నిర్వహిస్తామన్నారు. 2047 నాటికి రాష్ట్రంలో వృద్ధుల జనాభా 23 శాతం ఉంటుందని అంచనా వేస్తున్నాం. వృద్ధుల సంరక్షణకు ప్రతి జిల్లాలో ప్రత్యేక వార్డులు ఏర్పాటు చేయాలని నిర్ణయం తీసుకున్నాం అన్నారు. 175 సీహెచ్‌సీలలో రెండు వారాలకు ఒకసారి ప్రత్యేక క్లినిక్ నిర్వహిస్తాం అన్నారు. సిల్వర్ స్కిల్స్ రిజిస్ట్రీ ద్వారా 50,000 రిటైర్డ్ ప్రొఫెషనల్స్‌ను మెంటరింగ్‌లో భాగం చేస్తాం రిటైర్మెంట్‌కు ముందే ఉద్యోగులకు 15 రోజుల వెల్‌నెస్ లీవ్, రూ.50,000 ఆరోగ్య నిధి ఏర్పాటు చేస్తామన్నారు. ఒకరు వద్దు.. ముగ్గురు ముద్దు.. మారిన పరిస్థితులకు తగ్గట్టు కొత్త నినాదం కావాలన్నారు. రాష్ట్రంలో ఫెర్టిలిటీ రేటు 1.5కి పడిపోవడం భవిష్యత్తుకు ప్రమాదకరమని వెల్లడి ఎంతమంది పిల్లలుంటే అంతమందికి 'తల్లికి వందనం' అందిస్తామని ప్రకటన తెలుగు జాతి శక్తిమంతంగా ఉండాలంటే జనాభా 5 కోట్లకు తగ్గకూడదని ఉద్ఘాటించారు.

టీనేజ్ ప్రెగ్నెన్సీ తగ్గించాలి: టీనేజ్ ప్రెగ్నెన్సీ 8.80 శాతం ఉందని దీన్ని 3 శాతానికి తగ్గించాలని సీఎం చంద్రబాబు చెప్పారు. పనిచేసే మహిళల కోసం వర్కింగ్ ఉమెన్స్ హాస్టల్స్, పిల్లలకు బేబీ కేర్ సెంటర్లు ఏర్పాటు చేస్తామని, ఇంక భార్య మూడో కాన్పు ఉంటే భర్తకు 2 నెలలు సెలవు ఇస్తామని వెల్లడించారు. మహిళతో పాటు భర్త కూడా పిల్లల సంరక్షణ బాధ్యతలు చూడాలని చెప్పారు. 60 ఏళ్ల దాటిన వారు కూడా పని చేసుకునే అవకాశాలు కల్పిస్తామని అన్నారు. రిటైర్ కాబోయే 50 వేల మంది ఉద్యోగులను గుర్తించి ఆరోగ్య సంరక్షణపై శిక్షణ ఇస్తామని తద్వారా వారు రిటైరైన తర్వాత కూడా ఏదైనా పని చేసి సంపాదించే అవకాశం ఉంటుందని తెలిపారు. చైల్డ్ కేర్ విభాగాన్ని విస్తరిస్తున్నామని 10 వేల మంది సర్టిఫైడ్ కేర్ టేకర్స్‌ని సిద్ధం చేస్తామని సీఎం వెల్లడించారు. ఇప్పటి వరకూ కుటుంబ నియంత్రణకు ప్రాధాన్యం ఇచ్చామని ఇకనుంచి పాపులేషన్ మేనేజ్‌మెంట్ గురించి చర్చ చేస్తున్నామని సీఎం చంద్రబాబు వెల్లడించారు. ఇప్పుడు డ్రాఫ్ట్ పాలసీ రూపొందిస్తున్నామని, నెల రోజుల పాటు చర్చ తర్వాత తుదిరూపు ఇస్తామని వివరించారు. సంతానోత్పత్తి రేటు 2.1 ఉంటే సుస్థిర ప్రగతి ఉంటుందని అలానే దీనికంటే ఎక్కువగా ఉంటే జనాభా కొంత పెరుగుతుందని తెలిపారు. జపాన్‌లో 1.2, సౌత్ కొరియాలో 0.7 టీఎఫ్ఆర్ మాత్రమే ఉందని దీనివల్ల జనాభా తగ్గి మానవ వనరులు తగ్గిపోతాయని వెల్లడించారు. 1997లో ఏపీ పాపులేషన్ పాలసీ తీసుకొచ్చామని చెప్పారు. మన వద్ద 1992లో టీఎఫ్ఆర్ 3 ఉండగా ఇప్పుడు 1.5కు వచ్చిందని తమిళనాడులో 1.4 శాతం, కేరళలో 1.6, బిహార్‌లో 3 శాతం ఉందని తెలిపారు. సమాజంలో వస్తున్న మార్పులపైనా సీఎం ఆందోళన వ్యక్తం చేశారు. గతంలో బాల్య వివాహాలు సమస్యగా ఉండేవని, ఇప్పుడు ఆలస్యంగా వివాహాలు చేసుకోవడం వల్ల సంతానలేమి సమస్యలు తలెత్తుతున్నాయని తెలిపారు. యాంత్రిక జీవనం వల్ల మానసిక ఒత్తిళ్లు పెరిగిపోతున్నాయని అన్నారు. పేదలు, గిరిజనుల్లో జననాల రేటు బాగానే ఉన్నా, ఆర్థికంగా స్థిరపడిన కుటుంబాల్లో (ఏపీఎల్) పిల్లలను కనడం తగ్గిపోయిందని విశ్లేషించారు. ప్రపంచంలో మహిళలకు అత్యంత గౌరవం ఇచ్చే దేశం భారతదేనని, ఎన్డీయే హయాంలోనే చట్టసభల్లో మహిళలకు 33 శాతం రిజర్వేషన్లు రాబోతున్నాయని గుర్తు చేశారు.

వెంటిలేటర్ పై ఉన్న రాష్ట్రాన్ని ప్రధాని మోదీ, కేంద్ర ఆర్థిక మంత్రి ఆర్థికంగా ఆదుకున్నారని, ఆర్థిక ఇబ్బందులు ఉన్నప్పటికీ దూరదృష్టితో ఈ పాపులేషన్ పాలసీని తీసుకువస్తున్నామని చంద్రబాబు స్పష్టం చేశారు. తెలుగు జాతి శక్తిమంతంగా నిలవాలంటే ఏపీ జనాభా 5 కోట్లకు తగ్గకుండా నిర్వహించాల్సిన బాధ్యత మనపై ఉందన్నారు. రాబోయే 3040 ఏళ్లలో సమాజంలో సుస్థిరత, సంపద సృష్టి జరగాలంటే ఇప్పుడే సరైన పునాదులు వేయాలని పిలుపునిచ్చారు. ఈ పాలసీపై ప్రజల నుంచి సలహాలు, సూచనలు, అభ్యంతరాలు స్వీకరించి, అవసరమైన మార్పులతో పకడ్బందీగా అమలు చేస్తామని, ఈ చారిత్రక సంకల్పానికి ప్రజలందరూ సహకరించాలని సీఎం విజ్ఞప్తి చేశారు.

## మొక్కలకు జియో ట్యాగింగ్

>> శాఖ ద్వారా చేపడుతున్న పనుల గురించి సభలో మాట్లాడి, ప్రజలను చైతన్యపరిచిన ఎమ్మెల్యే పంచకర్ల రమేష్ బాబు బండారు సత్యనారాయణ మూర్తిలకు కృతజ్ఞతల్లు అని చెప్పారు.

**బడ్జెట్ ఆమోదానికి ప్రతిపాదనలు:** 2026-27 ఆర్థిక సంవత్సరాల బడ్జెట్ కు సంబంధించి పవన్ కళ్యాణ్ నిర్వహిస్తున్న పంచాయతీరాజ్, గ్రామీణాభివృద్ధి, అటవీ, పర్యావరణ, సైన్స్ అండ్ టెక్నాలజీ శాఖలకు సంబంధించిన ఆర్థిక ప్రతిపాదనలు, బడ్జెట్ ఆమోదం కోసం గురువారం శాసనసభలో ఉప ముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్ ప్రతిపాదనలు చేశారు. పంచాయతీరాజ్ శాఖకు రూ.15,485 కోట్లు, గ్రామీణాభివృద్ధి శాఖకు రూ.11,217 కోట్లు, అటవీ, సైన్స్ అండ్ టెక్నాలజీ శాఖలకు రూ.713 కోట్ల బడ్జెట్ గ్రాంట్ల కోసం ప్రతిపాదనలను సభకు సమర్పించారు. సభ ఈ ప్రతపాదనలను ఆమోదించింది.

# రైతులకు ఇన్‌పుట్ సబ్సిడీ

>> ప్రభుత్వం ఏర్పడ్డాక సీఎం చంద్రబాబు రైతుల అవసరాలను దృష్టిలో పెట్టుకుని ఈ మొత్తాన్ని హెక్టారుకు రూ.17,000కు పెంచినట్లు వివరించారు. అయితే గత వైసీపీ పాలనలో ఆ మొత్తాన్ని తిరిగి రూ.12,000కు తగ్గించారని మంత్రి పేర్కొన్నారు. 2024 లో కూటమి ప్రభుత్వం ఏర్పడ్డాక బుడమేరు వరదల సమయంలో నష్టపోయిన రైతులను ఆదుకునేందుకు ప్రభుత్వం ప్రత్యేకంగా ఆలోచించి హెక్టారుకు రూ.25,000 వరకు నష్టపరిహారం పెంచుతూ ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసిందని తెలిపారు. బుడమేరు వరదల అనంతరం కేవలం వారం రోజుల్లోనే సర్వే పూర్తి చేసి సుమారు రూ.370 కోట్ల నష్టపరిహారాన్ని రైతులకు అందించామని చెప్పారు. అరకు కాఫీ దేశవ్యాప్తంగా ప్రత్యేక గుర్తింపు పొందడానికి ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు కృషి చేశారని మంత్రి అచ్చెన్నాయుడు తెలిపారు.

అరకు ప్రాంతంలోని కాఫీ తోటల్లో కాఫీ బెర్రీ బోరర్ వ్యాధి పరిమిత స్థాయిలో మాత్రమే గుర్తించబడిందని చెప్పారు. ఏజెన్సీ ప్రాంతంలో మొత్తం సుమారు 1.03 లక్షల హెక్టార్లలో కాఫీ సాగు జరుగుతుండగా, కేవలం 60.8 హెక్టార్లలో మాత్రమే ఈ వ్యాధి ప్రభావం కనిపించిందని తెలిపారు. సమస్య గుర్తించిన వెంటనే ప్రభుత్వం ప్రత్యేక చర్యలు చేపట్టి శాస్త్రవేత్తలు, అధికారులు, కాఫీ బోర్డు ప్రతినిధులతో కలిసి పర్యవేక్షణ ప్రారంభించిందని చెప్పారు. వ్యాధికి గురైన 152 ఎకరాల్లోని 20,617 కిలోల కాఫీ కాయలను గుంతలు తవ్వి పాతిపెట్టినట్లు వివరించారు. ఈ కార్యక్రమంలో సుమారు 530 మంది కూలీలు, ఉద్యాన, వ్యవసాయ శాఖ విద్యార్థులు మరియు ఫీల్డ్ సిబ్బంది పాల్గొన్నారని తెలిపారు. నష్టపోయిన 81 మంది రైతులకు ఇన్‌పుట్ సబ్సిడీగా రూ.7,23,825 ప్రభుత్వం మంజూరు చేసిందని చెప్పారు. అరకు కాఫీ బ్రాండ్‌కు ఎలాంటి నష్టం కలగకుండా ప్రభుత్వం అప్రమత్తంగా చర్యలు తీసుకుంటుందని, ఎక్కడైనా వ్యాధి కనిపిస్తే వెంటనే సమాచారం అందించాలని మంత్రి సభ్యులకు విజ్ఞప్తి చేశారు.



గురువారం ముంబయిలో జరిగిన అర్జున్ టెండూల్కర్ వివాహానికి హాజరైన మంత్రి లోకేష్ దంపతులు

# కవిత నోట.. 'జై ఆంధ్ర' మాట

>> కాలినడకన తిరుమలకు వచ్చారు. అలిపిరి వద్ద ఆమె తొలుత శ్రీవారి పాదాలమండపం వద్ద పూజలుచేసి ఆశీర్వచనం అందుకున్నారు. ఆమె అనంతరం తోటి భక్తులతో కలిసి మెట్లమార్గంలో కాలినడకన తిరుమలకు వచ్చారు. త్వరలో ఏర్పాటు చేయనున్న తన పార్టీకి ఏడుకొండల వేంకటేశ్వరస్వామి ఆశీస్సులు ఉంటాయని నమ్ముతున్నానని విశ్వాసం వ్యక్తం చేశారు. తెలంగాణ రాజకీయాల్లో తనకంటూ ఒక నూతన ప్రస్థానాన్ని ప్రారంభించేందుకు సిద్ధమవుతున్నట్లు తెలిపారు. కొత్త పార్టీ ఏర్పాటుకు ముందు ఆమె తిరుమల శ్రీవారి మొక్కు తీర్చుకోవడానికి కుటుంబ సభ్యులతో, జాగృతి నాయకులతో కలిసి తిరుపతికి చేరుకున్నారు. శ్రేయోభిలాషులు, అభిమానులు పెద్ద ఎత్తున తరలివచ్చి స్వాగతం పలికారు. ఇందుకు నిదర్శనంగా ఆమె వారందరికీ కృతజ్ఞతలు తెలియజేశారు. మరోవైపు తనను ఇబ్బంది పెట్టిన కేసుల నుంచి న్యాయస్థానం క్లీన్ చిట్ ఇవ్వడంపై కవిత హర్షం వ్యక్తం చేశారు. సత్యం తన వైపు ఉన్నందునే దైవకృపతో కేసుల నుంచి విముక్తి లభించిందని, ఆ మొక్కు తీర్చుకునేందుకే అలిపిరినుంచి కాలినడకన తిరుమలకు వచ్చినట్లు ఆమె వివరించారు. తెలంగాణ అస్తిత్వం ప్రాతిపదికగా తన రాజకీయ ప్రయాణం ఉంటుందని కవిత చెప్పారు. రాత్రికి తిరుమలలోనే బస చేసి నేటి ఉదయం స్వామివారిని దర్శించుకోనున్నారు. ఈ పర్యటన ముగిసిన వెంటనే ఆమె హైదరాబాద్‌లో కొత్త పార్టీ పేరు, విధివిధానాలను అధికారికంగా ప్రకటించే అవకాశం ఉందనేది ఆమె అనుచరుల సమాచారం. కాగా కల్వకుంట కవిత తిరుపతి పర్యటనలో చేసిన వ్యాఖ్యలు ఇప్పుడు రెండు రాష్ట్రాల్లోనూ చర్చనీయాంశంగా మారాయి.

# 200 సబ్‌స్టేషన్లు

>> చేశారు. గిద్దలూరు నియోజకవర్గంలో 220కెవి సబ్ స్టేషన్ ఏర్పాటుచేయాలని ఎమ్మెల్యే ముత్తుముల అశోక్‌రెడ్డి కోరగా, విద్యుత్ శాఖ ఫిజిబిలిటీ రిపోర్టు ఆధారంగా చర్యలు తీసుకుంటామని మంత్రి చెప్పారు. ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయకత్వంలో కూటమి ప్రబుత్వం ఏర్పడిన తర్వాత రాష్ట్రంలో పరిశ్రమల స్థాపన పెరిగిందని దీంతో రోజువారి విద్యుత్ వినియోగం 263మిలియన్ యూనిట్ల నుండి 280మిలియన్ యూనిట్లకు పెరుగుతుందని అంచనా వేస్తున్నామని తెలిపారు. ఈ పెరుగుతున్న డిమాండ్‌ను దృష్టిలో పెట్టుకొని విద్యుత్ ఉత్పత్తి పెంపుతోపాటు రాష్ట్రవ్యాప్తంగా 400కెవి, 200కెవి, 132కెవి సబ్‌స్టేషన్ల నిర్మాణం చేపడుతున్నామని వెల్లడించారు. రైతులకు పెద్దఎత్తున వ్యవసాయ విద్యుత్ కనెక్షన్లు ఇచ్చామని, వ్యాపార, పారిశ్రామిక, గృహ అవసరాల కారణంగా విద్యుత్ వినియోగం పెరిగిందన్నారు. భవిష్యత్తులో రాష్ట్రంలో ఎక్కడా విద్యుత్ కొరత లేకుండా చూడటం ప్రభుత్వ ప్రధాన లక్ష్యమని పేర్కొన్నారు. భవిష్యత్ అవసరాలు, పెరుగుతున్న డిమాండ్‌ను దృష్టిలో పెట్టుకొని లోడ్ అధికంగా ఉన్న ప్రాంతాల్లో 33/11కెవి సబ్ స్టేషన్లు, విద్యుత్ లైన్ల నిర్మాణాన్ని రాష్ట్రవ్యాప్తంగా కొనసాగిస్తున్నామని మంత్రి స్పష్టం చేశారు.

## తెలంగాణ కొత్త గవర్నర్‌గా శివ్‌ప్రతాప్ శుక్లా

**న్యూఢిల్లీ, మార్చి 5:** దేశవ్యాప్తంగా పలు రాష్ట్రాల గవర్నర్లు, కేంద్ర పాలిత ప్రాంతాల లెఫ్టినెంట్ గవర్నర్లను రాష్ట్రపతి ద్రౌపది ముర్ము పునర్ వ్యవస్థీకరించింది. పశ్చిమబెంగాల్ గవర్నర్ ఆనంద బోస్ రాజీనామాను రాష్ట్రపతి ఆమోదించారు. పలువురు గవర్నర్లకు స్థానచలనం కల్పిస్తూ ఉత్తర్వులు జారీ చేశారు. కొత్తగా నియమితులైన గవర్నర్లు, లెఫ్టినెంట్ గవర్నర్లు ఆయా రాష్ట్రాలలో తక్షణమే బాధ్యతలు స్వీకరించాలని ఆదేశించారు. తెలంగాణ గవర్నర్ జిష్ణుదేవ్ వర్మను మహారాష్ట్ర గవర్నర్‌గా నియమితులయ్యారు. ఆయన స్థానంలో హిమాచల్ ప్రదేశ్ గవర్నర్ శివ్ ప్రతాప్ శుక్లా తెలంగాణ గవర్నర్‌గా బాధ్యతలు చేపట్టనున్నారు. బీహార్ మాజీ మంత్రి నంద్ కిషోర్ యాదవ్‌ను నాగాలాండ్ గవర్నర్‌గా, లెఫ్టినెంట్ జనరల్ (రిటైర్డ్) సయ్యద్ అతా హస్నైన్‌ను బీహార్ కొత్త గవర్నర్‌గా నియమించారు. ఆనంద బోస్ రాజీనామా తర్వాత తమిళనాడు గవర్నర్ ఆర్.ఎన్. రవి పశ్చిమ బెంగాల్ గవర్నర్‌గా నియమితులయ్యారు. ఇదిలా ఉండగా, కేరళ గవర్నర్ రాజేంద్ర విశ్వనాథ్ అర్లేకర్‌కు తమిళనాడు గవర్నర్‌గా అదనపు బాధ్యతలు అప్పగించారు. కేంద్రపాలిత ప్రాంతాలలో, లడఖ్ లెఫ్టినెంట్ గవర్నర్ కవిందర్ గుప్తా హిమాచల్ ప్రదేశ్ గవర్నర్‌గా నియమితులయ్యారు. ఢిల్లీ లెఫ్టినెంట్ గవర్నర్ వినయ్ కుమార్ సక్సేనా లడఖ్ లెఫ్టినెంట్ గవర్నర్‌గా బాధ్యతలు స్వీకరిస్తారు. అమెరికాలోని మాజీ భారత రాయబారి తరంజిత్ సింగ్ సంధు ఢిల్లీ కొత్త లెఫ్టినెంట్ గవర్నర్‌గా నియమితులయ్యారు. నోటిఫికేషన్ ప్రకారం, సంబంధిత అధికారులు వారి కొత్త పదవులకు బాధ్యతలు స్వీకరించిన తర్వాత అన్ని నియామకాలు, బదిలీలు అమలులోకి వస్తాయని రాష్ట్రపతి భవన్ విడుదల చేసిన ప్రకటనలో పేర్కొంది.

## అసోంలో సుఖోయ్-30 ఫైటర్ జెట్ గల్లంతు

**గువహటి, మార్చి 5:** భారత వైమానిక దళానికి చెందిన సుఖోయ్-30 ఎంకెఐ యుద్ధ విమానం అసోంలో గల్లంతైంది. గురువారం సుఖోయ్ యుద్ధ విమానం కర్బి అంగ్లాంగ్ జిల్లాలోని అటవీ ప్రాంతంలో గగన విహారం చేస్తుండగా రాడార్ సంబంధాన్ని కోల్పోయిందని రక్షణ శాఖ అధికారులు తెలిపారు. దీంతో వైమానిక దళం, ఇతర భద్రతా సంస్థలు వెంటనే అప్రమత్తమై గాలింపు చర్యలు చేపట్టినట్లు రక్షణ శాఖ ఒక ప్రకటనలో తెలిపింది. రాడార్‌తో సంబంధాలు కోల్పోయిన ప్రాంతంలో ఎక్కువగా దట్టమైన అటవీ, పర్వత ప్రాంతాలని, రెస్క్యూ కార్యకలాపాలకు సవాల్‌గా మారిందని రక్షణ శాఖ అధికారులు తెలిపారు. స్థానిక అధికారులతో సమన్వయంతో చేసుకుని సైనిక బలగాలు గాలిస్తున్నాయని వివరించారు.

## అనితకు స్వల్ప అస్వస్థత

**విజయవాడ,మార్చి5,ప్రభాతవార్తప్రతినిధి:** రాష్ట్ర హోం శాఖ మంత్రి వంగలపూడి అనిత అస్వస్థతకు గురయ్యారు. గురువారం అసెంబ్లీ సమావేశాలకు హాజరైన ఆమె కొంత అస్వస్థతకు గురయ్యారు. దీంతో అసెంబ్లీ ప్రాంగణంలో ఉన్న వైద్యులు అనితకు వైద్య పరీక్షలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమెకు బీపీ అధికంగా ఉందని గుర్తించారు. అనంతరం మెరుగైన వైద్య చికిత్స కోసం విజయవాడలోని ఆసుపత్రికి మంత్రి అనిత వెళ్లారు.

### వారం - వర్జ్యం

06-03-2026, శుక్రవారం
శ్రీ విశ్వావసు నామ సంవత్సరం,
ఫాల్గుణమాసం, ఉత్తరాయణం
శిశిర ఋతువు, కృష్ణపక్షం, పూర్వాభాద్ర కార్తె
తదియ సా.5.57
హస్త ఉ.9.31
వర్జ్యం : సా.6.06-7.49
దు.ఉ.8.46-9.34, 2) మ.12.43-1.31
శుభసమయం:ఉ.5.30-6.30, సా.6.30-7.30
రాహుకాలం - ఉ.10.30-12.00

### వార్తాఫలం

**మేషం:** ముఖ్యంగా రాజకీయ, శాస్త్ర, సాంకేతిక రంగాలలోని వారికి ప్రోత్సాహకరంగా ఉంటుంది. వాహనసౌఖ్యం కలదు.

**వృషభం:** వ్యాపారంలో రొటేషన్స్ బాగుంటాయి. కార్యాలయంలో మీ స్థాయి యధాతధంగా ఉంటుంది. దేవాలయ దర్శనం చేసుకుంటారు.

**మిథునం:** ప్రముఖవ్యక్తి ద్వారా మీకు అనుకూలంగా వ్రాయబడిన సిఫార్సు లేఖ చేరవలసిన చోటుకు చేరుతుంది.

**కర్కాటకం:** ఇంటా బయటా అనుకూల మైన పరిస్థితులు ఉంటాయి. ఎంతో కాలంగా ఎదురుచూస్తున్న అవకాశాలు లభిస్తాయి.

**సింహం:** జీవిత భాగస్వామి ద్వారా ఆర్థిక లాభం పొందుతారు. ఆరోగ్య, వాహనాల విషయంలో మెలుకువ అవసరం.

**కన్య:** వృత్తిలో మీరు ఆశించిన లాభాలు వుండకపోవచ్చు. సంఘ సేవా కార్యక్రమాలలో చురుకుగా పాల్గొంటారు.

**తుల:** బాధ్యతలు సక్రమంగా నిర్వహించడం వలన సంతృప్తి చెందుతారు. నూతన ప్రయత్నాలలో ఆటంకాలు ఎదురు అవుతాయి.

**వృశ్చికం:** కుటుంబ సభ్యుల సలహాతో నూతన కార్యక్రమాలకు శ్రీకారం చుడతారు. పనులలో జాప్యం జరిగిన చివరికి పూర్తి చేస్తారు.

**ధనుస్సు:** క్రమశిక్షణ లేని అత్యంత సన్నిహితులవల్ల ఇబ్బందులు వస్తాయి. దూర ప్రాంతాల నుండి శుభవార్తలు అందుకుంటారు.

**మకరం:** మీ ప్రమేయం లేకుండానే వివాదాలలోకి లాగబడతారు. క్రీడలలో వేడుకలలో పాల్గొంటారు. ధన లాభం.

**కుంభం:** సహోదర, సహోదరీ వర్గం యొక్క యోగక్షేమాలను విచారిస్తారు. వివాహ, ఉద్యోగ యత్నాలు సాగిస్తారు. వస్త్రలాభం.

**మీనం:** విధినిర్వహణలలో మీ విలక్షణమైన శైలితో అందరినీ ఆకట్టుకుంటారు. వ్యాపార పరంగా సాధారణంగా ఉంటుంది.

- శ్రీమతి ములుగు శివజ్యోతి, కోఠి, హైదరాబాద్

06-03Pg3exHMNWJQETLP-ff.qxd:06-03Pg3exHMNWJQETLP-ff.qxd 1/1/02 8:01 AM Page 1





## భూ సేకరణపై అభ్యంతరాలను దాఖలు చేసే గడువు కుదించడం సరికాదు

**- ఎమ్మెల్సీ మొండితోక అరుణ కుమార్**

**విజయవాడ,మార్చి5,ప్రభాతవార్తప్రతినిధి:** భూ సేకరణపై అభ్యంతరాలను దాఖలు చేసే గడువును కుదించడం తగదని ఎమ్మెల్సీ మొండి తోక అరుణ కుమార్ కోరారు. రాజధాని అవ ుటర్‌రింగ్ రోడ్డు భూసేకరణపై శాసనమండలిలో అరుణ కుమార్ మాట్లాడుతూ 2013 భూ సేకరణ చట్టంలో అభ్యంతరాలకు మూడు నెలల వరకు గడువు ఇవ్వాల్సి ఉందన్నారు. అలాగే సామాజిక అధ్యయనం జరగ లేదన్నారు. మార్కెట్ రేటును ప్రామాణికంగా తీసుకుని రైతులకు పరిహారం చెల్లించాలని కోరారు. భూ సేకరణలో కీలకమైన యజమానులతో సమా వేశం నిర్వహించడం లేదన్నారు. ఆర్‌అండ్‌బి మంత్రి బిసి జనార్ధన్ రెడ్డి మాట్లాడుతూ అమరావతి ఔటర్ రింగ్ రోడ్ (ఓఆర్ఆర్) నిర్మా ణం, యాజమాన్యం, నిర్వహణ కార్యాకలాపాల కోసం ఎన్‌టిఆర్ జిల్లాలో భూసేకరణకు కేంద్రం గెజిట్ నోటిఫికేషన్ ఇచ్చిందన్నారు. గెజిట్ ప్రకారం ఎన్‌టిఆర్ జిల్లాలోని కంచికచర్ల, వీరుల పాడు, గడ్డమానుగు, కొండూరు డ మైలవరం మండలాల్లో సుమారు 1416 హెక్టార్ల భూమిని ఈ ప్రాజెక్టు కోసం ప్రతిపాదించారని తెలిపారు. భూసేకరణ యొక్క ఖచ్చితమైన విస్తీర్ణం (3డి) మూడో విడత నోటిఫికేషన్‌లో ఉంటుందన్నారు. 2013, భూసేకరణ చట్టం ప్రకారం, ఎన్‌టిఆర్ జిల్లా జాయింట్ కలెక్టర్ నిర్ణయించిన విధంగా రైతులకు పరిహారం చెల్లిస్తామన్నారు. అరుణ్ కుమార్ మాట్లాడుతూ ప్రస్తుత నోటిఫికేషన్ రద్దు చేసి 2013 భూసేకరణ చట్టం ప్రకారం తాజాగా నోటిఫికేషన్ ఇవ్వాలన్నారు.

## రాష్ట్రంలో మన మిత్ర యాప్ ద్వారా టెన్త్ హాల్ టిక్కెట్లు

**విజయవాడ, మార్చి 5,ప్రభాతవార్త ప్రతినిధి:** రాష్ట్రంలో పదో తరగతి పబ్లిక్ పరీక్షలు ఈ నెల 16 నుంచి ప్రారంభంకానున్న నేపథ్యంలో విద్యార్థుల హాల్ టికెట్లు గురువారం నుంచి విడుదల చేస్తున్నట్లు ఆ ప్రభుత్వ పరీక్షల విభా గం డైరెక్టర్ కె.వి.శ్రీనివాసులురెడ్డి తెలిపారు. సెకండరీ ఎడ్యుకేషన్ బోర్డు అధికారిక వెబ్‌సైట్ లోను, లేక మన మిత్ర వాట్సప్ నంబరు 9552300009కు హాయ్ అని మెజేస్ పంపి వివరాలు నమోదు చేయడం ద్వారా, అలాగే పాఠశాల విద్యాశాఖ లీప్ యాప్ నుంచి విద్యార్థులు, తల్లిదండ్రులు హాల్ టికెట్లు డౌన్ లోడ్ చేసుకోవచ్చునని పేర్కొన్నారు. ఆయా పాఠశాలల ప్రధానోపా ధ్యాయులను సంప్రదించి కూడా హాల్ టికెట్ పొందవచ్చని తెలిపారు. ఎస్ఎస్‌సి హాల్ టికెట్లు పంపిణీకి, డౌన్ లోడ్‌కు బోర్డు ఎలాంటి ప్రైవేట్ ఏజెన్సీకి, థర్డ్ పార్టీ వెబ్‌సైట్లకు అనుమతి ఇవ్వలేదని స్పష్టం చేశారు. ఈ విషయాన్ని విద్యార్థులు, వారి తల్లిదండ్రులు గమనించాలని పేర్కొన్నారు. ఇలాంటి వాటి ద్వారా హాల్ టికెట్లు డౌన్లోడ్ చెయ్యవద్దని విద్యార్థులకు సూచించారు.

# దేశ నిర్మాణంలో జన గణన అత్యంత కీలకం

**- జనగణన డైరెక్టర్ నివాస్**



**తిరుపతి,మార్చి 5ప్రభాతవార్తప్రతినిధి:** దేశ నిర్మాణంలోజనాభా గణన ప్రక్రియ అత్యంత కీలకమైనదని జనగణన డైరెక్టర్ కె.నివాస్ తెలిపారు. జనగణన కార్యక్రమం దేశ నిర్మాణంలో అత్యంత కీలకమైన ప్రక్రియ అని, ప్రతి ఒక్క వ్యక్తిని ఖచ్చితంగా లెక్కించడం అవసరమన్నారు. జన గణన ద్వారా సేకరించే ప్రతి సమాచారం దేశం, రాష్ట్రం, జిల్లా, గ్రామ అభివృద్ధికి అత్యంత ప్రాముఖ్యమైనదని పేర్కొన్నారు. ఒక రాష్ట్రం , దేశం అభివృద్ధిని అంచనా వేయడానికి ప్రపంచవ్యాప్తంగా అత్యంత విశ్వసనీయమైన ఆధారం జనగణన మాత్రమే అని తెలిపారు. గురువారం ఉదయం తిరుపతి శ్రీవేంకటేశ్వర విశ్వ విద్యాలయం ప్రకాశంభవన్‌లో జరుగుతున్న మొదటి దశగృహాల జాబితా,గృహ వసతుల గణన శిక్షణా కార్యక్రమం ముగింపు సమావేశం జరిగింది. జనగణన డైరెక్టర్ కె.నివాస్ తిరుపతి జిల్లా కలెక్టర్ డాక్టర్ సలిజామల వెంకటేశ్వర్‌తో కలసి పాల్గొన్నారు. భారత ప్రభుత్వం ప్రతిష్టాత్మ కంగా చేపట్టనున్న 16 వ జన గణన కార్యక్రమం దేశ నిర్మాణంలో అత్యంత కీలకమైన ప్రక్రియ అన్నారు. అక్షరాస్యత రేటు, లింగ నిష్పత్తి, జనాభా సంఖ్య వంటి కీలక అంశాలు అన్నీ జన గణన ఆధారంగానే నిర్ణయించబడతాయని తెలిపారు. ప్రతి ఎన్యూమరేటర్ సేకరించే సమా చారం ఎంతో విలువైనదని పేర్కొన్నారు. జనగణన ప్రక్రియ 1872 సంవత్సరం నుంచి కొనసాగుతుండగా ఇప్పటి వరకు అనేక సార్లు నిర్వహించబడిందని, ప్రతి దశలోనూ దేశ ప్రణాళికలు రూపొందించడంలో ఇది కీలక పాత్ర పోషిస్తోందన్నారు. కేంద్రం నుంచి రాష్ట్రాలకు వచ్చే ఆర్థిక నిధుల కేటాయింపులో కూడా జనాభా ఒక ప్రధాన ప్రమాణంగా ఉండటంతో ప్రతి వ్యక్తిని లెక్కించడం చాలా ముఖ్యమని వివరిం చారు. ఎన్యూమరేటర్లు కొంతమంది వ్యక్తులను లెక్కించకుండా వదిలేస్తే అది పెద్ద మొత్తంలో జనాభా తగ్గినట్లుగా నమోదవుతుందని, దీని ప్రభావంగా రాష్ట్రానికి రావాల్సిన వేల కోట్ల రూపాయల నిధులు తగ్గే అవకాశం ఉంటుందని వివరించారు. ఈ దఫా జన గణన పూర్తిగా డిజి టల్ విధానంలో నిర్వహించబడుతుందని, అందువల్ల గతంలోలాగా ఫలితాలు రావడానికి ఎక్కువ సమయం పట్టదని, సాధారణంగా ఏడాది పట్టే ప్రక్రియ ఇప్పుడు డిజిటల్ విధానంలో సుమారు ఆరు నెలల్లోపే పూర్తయ్యే అవకాశం ఉందని తెలిపారు. తిరుపతి జిల్లా కలెక్టర్ డాక్టర్ సలిజామల వెంకటేశ్వర్ మాట్లాడుతూ సమా జంలోని ప్రతి వర్గం యొక్క నిజమైన జనాభా వివరాలు తెలిసినప్పుడే సరైన ప్రాతి నిధ్యం, సంక్షేమ కార్యక్రమాలు అమలు చేయడం సాధ్యమవుతుందని కలెక్టర్ వివరిం చారు. జన గణన కార్యక్రమాన్ని ప్రతి ఎన్యూ మరేటర్ బాధ్యతగా తీసుకొని, ప్రతి ఒక వ్యక్తిని ఖచ్చితంగా లెక్కించాలన్నారు.జిల్లాలో జనగణన కార్యక్రమా న్ని విజయవంతం చేయాలన్నారు. గత మూడు రోజులుగా జనగణన కార్యక్రమంపై ఎంతో శ్రద్ధగా శిక్షణ ఇవ్వడం జరిగిందని, శిక్షణతో పాటు హ్యాండ్స్ ఆన్ సెషన్స్ కూడా చిన్న చిన్న గ్రూపు లుగా నిర్వహించడం జరిగిందన్నారు. తిరుపతి జిల్లాను ప్రత్యేకంగా ఎంపిక చేసి ఈ శిక్షణా కార్యక్రమం నిర్వ హించడం ద్వారా ఈ జన గణన ఆపరేషన్‌కు ఎంత ప్రాముఖ్యత కలదో మనందరికీ స్పష్టంగా తెలుస్తోందన్నారు. చట్ట బద్ధమైన ఈ జనగణన కార్యక్రమాన్ని ప్రతి ఒక్కరూ తమ బాధ్యతగా తీసుకని అత్యంత నిబద్ధతతో నిర్వహించాలన్నారు. ముఖ్యంగా చార్జ్ ఆఫీసర్స్ పాత్ర చాలా కీలకమైనదని తెలిపారు. క్షేత్ర స్థాయిలో వచ్చే సందేహాలను చార్జ్ ఆఫీసర్స్ ముందుగా పరిష్కరించేలా సబ్జెక్ట్‌పై పూర్తి అవ గాహన కలిగి ఉండాలని, ప్రతి చిన్న సమ స్యకైనా ఉన్నతాధికారులను సంప్రదించాల్సిన అవసరం లేకుండాస్వయంగా ఎన్యూమరేటర్లకు మార్గనిర్దేశనం చేయగలిగేలా ఉండాలన్నారు. జన గణన కార్యక్రమం ప్రారంభానికి ఇప్పుడు చాలా తక్కువ సమయం మాత్రమే ఉందని ఏప్రిల్ 16 నుండి సెల్ఫ్ ఎన్యూమరేషన్ ప్రారంభమవు తుందని, మే 1 నుండి హౌస్ లిస్టింగ్ కార్యక్రమం ప్రారంభమవుతుందని తెలిపారు. అందించే మెటీరియల్‌ను పూర్తిగా అధ్యయనం చేసి, ఎన్యూ మరేటర్స్, సూపర్వైజర్స్‌కు చార్జ్ ఆఫీసర్లలు సరైన మార్గనిర్దేశం చేయాలన్నారు. జన గణన సమయంలో ముఖ్యమైన అంశం ప్రజల నమ్మకమని, ప్రతి ఇంటి వద్దకు వెళ్లే సమయంలో వారు చెప్పే సమాచారాన్ని గౌరవంగా స్వీకరిం చాలని సూచించారు.

వారి వ్యక్తిగత వివరాలు ఎటువంటి ఇతర ప్రయోజనాలకు ఉపయోగిం చబడవని వారికి స్పష్టంగా తెలియజేయాలన్నారు. ప్రజలతో స్నేహపూర్వకంగా మాట్లాడి వారు చెప్పిన సమాచారాన్ని నిజాయితీగా నమోదు చేసి స్థానిక ప్రజాప్రతినిధులు , ప్రముఖుల సహకారం కూడా తీసుకుంటే మంచి డేటా సేకరించడం సులభం అవుతుందన్నారు.

## టిటిడి చరిత్రలోనే భగవద్గీత పుస్తకాలు అతి పెద్ద స్కాం

**- తిరుపతి జనసేననేత కిరణ్‌రాయల్**



**తిరుపతి,మార్చి 5ప్రభాతవార్తప్రతినిధి:** హిందూధార్మిక సంస్థ తిరుమల తిరుపతి దేవస్థానం చరిత్రలో భగవద్గీత పుస్తకాల ముద్రణ భారీ స్కామ్ అని తిరుపతి నియోజకవర్గ జనసేనపార్టీ ఇన్‌ఛార్జి కిరణ్‌రాయల్ అన్నారు. 700శ్లోకాలతో భగవద్గీత పవిత్ర గ్రంథం ఉంటుందని, అయితేఈ పుస్తకం 50గ్రాములు కూడా లేదని,ఆ భగవద్గీత పుస్తకాన్ని వైసిపి హయాంలో భూమన కరుణాకర్‌రెడ్డి ముద్రించారని చెప్పారు. గత వైసిపి ప్రభుత్వంలో జగన్ హయాంలో తిరుమలలో భగవద్గీత పుస్తకాల పేరుతో పెద్ద అవినీతి జరిగిందని ఆరోపించారు. టిటిడి చరిత్రలోనే ఇదో అతి పెద్ద స్కామ్‌గా అభివర్ణించారు. గురువారం తిరుపతిలో మీడియాతో కిరణ్‌రాయల్ మాట్లాడారు. అయితే టిటిడి ముద్రించిన ఈ భగవద్గీత పుస్తకాలు కరుణాకర్ రెడ్డి, ధర్మారెడ్డి రాసిన భగవద్గీతా అని ప్రశ్నించారు.15 పేజీల భగవద్గీత ఇప్పటివరకు ఎక్కడా లేదని, భగవద్గీత లో ముద్రించిన వారి పేర్లు వేసుకోవడం టిటిడి చరిత్రలో ఎప్పుడూ లేదన్నారు. నిజంగా ఆ ఇద్దరు కవులకు సన్మానం చేయాలని ఎద్దేవా చేశారు. తప్పు చేసినా చేయకపోయినా ప్రతి ఒక్కరూ భగవద్గీత పైన ప్రమాణం చేసి నమ్మకంతో చెబుతుంటారని, అలాంటిది భగవద్గీత లోనే తప్పు చేసి భగవద్గీతను కల్తీ చేశారని విమర్శించారు. భగవద్గీత పుస్తక ముద్రణలో ధర్మారెడ్డి పేరు ఎందుకు వేశారనేది సమాధానం లేని ప్రశ్న అన్నారు. భగవద్గీత పుస్తకం పేరుతో కోట్ల రూపాయలు స్వాహా చేశారని,ఆ దేవుడికి అన్యాయం చేసి ,చివరకు ఎందుకు క్షమాపణ చెప్పడం లేదని గట్టిగా ప్రశ్నించారు. వైఎస్ జగన్, భూమన, ధర్మారెడ్డిలు యావత్ హిందూ సమాజానికి క్షమాపణలు చెప్పాలని కిరణ్‌రాయల్ డిమాండ్ చేశారు. భగవద్గీత బాగోతాన్ని బయటపెట్టినందుకు టిటిడి ఛైర్మన్ బిఆర్‌నాయుడును టార్గెట్ చేశారని, ఆయనపై వ్యక్తిగత విమర్శలు చేస్తున్నారని వైసిపి నేతలపై మండిపడ్డారు.

## వాసిరెడ్డి పద్మ కుమార్తె వివాహానికి హాజరైన మంత్రి నారా లోకేష్

**విజయవాడ,మార్చి4,ప్రభాతవార్తప్రతినిధి:**ఆంధ్రప్రదేశ్ మహిళా కమిషన్ మాజీ ఛైర్మన్, సీనియర్ నాయకురాలు వాసిరెడ్డి పద్మ ఇంట్లో జరిగిన శుభకార్యానికి రాష్ట్ర విద్య, ఐటీ శాఖల మంత్రి నారా లోకేశ్ హాజరయ్యారు. విజయవాడలోని ఏ కన్వెన్షన్ సెంటర్ వేదికగా వాసిరెడ్డి పద్మ కుమార్తె వివాహ మహోత్సవం వైభవంగా జరిగింది. ఈ వివాహ వేడుకకు విచ్చేసిన మంత్రి లోకేశ్.. నూతన వధూవరులు మేఘన, చక్రధారిలను ఆశీర్వదించారు. నూతన దంపతులకు పుష్పగుచ్ఛం అందించి, వారికి శుభాకాంక్షలు తెలియజేశారు. వివాహానికి హాజరైన మంత్రిని వాసిరెడ్డి పద్మ, ఆమె కుటుంబ సభ్యులు సాదరంగా ఆహ్వానించారు. ఈ కార్యక్రమంలో మంత్రి లోకేశ్ పాటు పలువురు టీడీపీ ముఖ్య నాయకులు, ప్రముఖులు పాల్గొని నూతన వధూవరులను ఆశీర్వదించారు. లోకేశ్ రాకతో పెళ్లింట సందడి నెలకొంది. ఆయనతో సెల్ఫీ దిగేందుకు అతిథులు పోటీపడ్డారు. ఆయన చిరునవ్వుతో అందరికీ సెల్ఫీలు ఇచ్చారు.

## పేలుడు ఘటనలో 28కి చేరిన మృతులు

**ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లా బ్యూరో, మార్చి5 (ప్రభాతవార్త):** కాకినాడ జిల్లా సామర్లకోట మండలం వేట్లపాలెం బాణాసంచా పేలుడు ప్రమాదంలో తీవ్ర గాయాలతో కాకినాడ ప్రభుత్వాసుపత్రిలో చికిత్స పొందుతున్న సప్పా సత్యవేణి (34) , మోర్తా శ్రీను చికిత్స పొందుతూ గురువారం మృతి చెందారు. మొత్తం సంఘటనకు చెంది ఇప్పటివరకు 28 మంది మృతి చెందారు. వేట్లపాలెం లో జరిగిన ప్రమాద పేలుడు ఘటనకు ముఖ్యమంత్రి చంద్రబాబు అసెంబ్లీలో మరణించిన వారి కోసం రెండు నిమిషాలు శాసనసభలో మోనం పాటించారు. బాణాసంచా తయారీ కేంద్రాలలో పరిమితికి మించి మందు సామాగ్రి తయారు చేసిన , నిబంధనలకు విరుద్ధంగా కార్మికులతో పని చేయిస్తున్న వారిపై చట్టపరంగా కఠిన చర్యలు తీసుకోవడం జరుగుతుందన్నారు. పెద్దాపురం డి.ఎస్.పి బాధ్యతలను కాకినాడ జిల్లా స్పెషల్ బ్రాంచ్ డిఎస్పి కేవీపీ సత్యనారాయణకు అప్పగించారు. వేట్లపాలెం ఘటన స్థలానికి సమీపంలో ఇల్లు, పొలాలు నష్టపోయిన బాధితుల వివరాలను అధికారులు సర్వే నిర్వహించారు. కార్మికుల ప్రాణాలతో యజమానులు చెలగాటాలాడితే సహించేది లేదని ముఖ్యమంత్రి ఘాటుగా హెచ్చరించారు.

# తిరుమల సమాచారం

## 17న తిరుమల ఆలయంలో కోయిల్ ఆళ్వార్ తిరుమంజనం

**- విఐపి బ్రేక్ దర్శనాలు రద్దు, 16న సిఫార్సులేఖలు స్వీకరించరు**



**తిరుమల,మార్చి 5ప్రభాతవార్తప్రతినిధి:** కలియుగప్రత్యక్షదైవం తిరుమల శ్రీవారి ఆలయంలో ఈనెల 19న ఉగాది ఆస్థానాన్ని పురస్కరించుకుని 17వ తేదీ మంగళవారం కోయిల్ ఆళ్వార్ తిరుమంజనం జరుగనుంది. కోయిల్ ఆళ్వార్ తిరుమంజనం కారణంగా 17న విఐపీ బ్రేక్ దర్శనాలు, అష్టదళ పాదపద్మారాధన సేవను టిటిడి రద్దు చేసింది. 16వ తేది ప్రోటోకాల్ ప్రముఖులకు తప్ప విఐపి బ్రేక్ దర్శనాలకు సిఫార్సు లేఖలు స్వీకరించరు. 19న ఉగాది ఆస్థానం సందర్భంగా ప్రోటోకాల్ ప్రముఖులకు మాత్రమే విఐపి బ్రేక్ దర్శనాలు ఉంటాయి. విఐపి బ్రేక్ దర్శనాలు రద్దు చేశారు. 17వ తేది ఆలయ అర్చకులు, ఉద్యోగులు పాల్గొని ఆలయంలోపల బంగారువాకిలి నుండి ఉప ఆలయాలు, మహద్వారం వరకు నీటితో శుభ్రం చేస్తారు. అనంతరం నామకోపు, శ్రీచూర్ణం, కస్తూరిపసుపు, పచ్చాకు, గడ్డకర్పూరం,గంధంపొడి, కుంకుమ, కిచిలిగడ్డ తదితర సుగంద ద్రవ్యాలు కలగలిపిన పరిత్ర పరిమళ జలాన్ని ఆలయమంతటా సంప్రోక్షణ చేసి, భక్తులకు దర్శనం కల్పిస్తారు. ఏడాదిలో ఉగాది ఆస్థానం,బ్రహ్మోత్సవాలు, వైకుంఠ ఏకాదశి,ఆణివార ఆస్థానం ముందువచ్చే మంగళవారాల్లో నాలుగుసార్లు కోయిల్ ఆళ్వార్ తిరుమంజనం చేపట్టడం ఆనవాయితీ.

## తిరుమల ఆలయ భద్రతపై మరింత జాగరూకత

**- భద్రత అప్రమత్తమేనన్న ఎన్ఎస్‌జి**



**తిరుమల,మార్చి 5ప్రభాతవార్తప్రతినిధి:** ప్రపంచ హిందూధార్మికసంస్థ తిరుమల తిరుపతి దేవస్థానంలో తిరుమల ఆలయ భద్రతపై భద్రతా దళాలు ఎప్పటికప్పుడు జాగరూకతతో వ్యవహరిస్తున్నాయని ఎన్ఎస్‌జి కమాండోలు తెలిపారు. భద్రతలో బలగాలు అప్రమత్తంగా వ్యవహరిస్తున్నాయన్నారు. ఆక్టోపస్ దళాలు ఆలయం భద్రతపై అనుక్షణం పహరాకాస్తున్నాయన్నారు. గురువారం ఉదయం ఎన్ఎస్‌జి కమాండోల బృందం తిరుమలకు చేరుకుని తిరుమల ఆలయం పరిసరాల్లో భద్రతపై పరిశీలించారు.అనంతరం ఆలయంలోనికి చేరుకుని శ్రీవారిని దర్శించుకున్నారు. ఆలయ అధికారులు భద్రత బలగాలకు స్వామివారి దర్శనం చేయించి తీర్థప్రసాదాలు అందజేశారు. తిరుమల, తిరుపతిలో ఎన్.ఎస్.జి. బృందం ద్వారా యాంటీ టెర్రరిస్ట్ మాక్ డ్రిల్ నిర్వహించారు. ఎన్.ఎస్.జి. కమాండో ఆపరేషన్ చేపట్టి ఉపద్రవాల సమయంలో యాత్రికులను రక్షించడం, ఆలయంలోపల నిఘా చేపట్టారు.

## స్విమ్స్ ట్రస్ట్‌కు రూ.10లక్షలు విరాళం



**తిరుమల,మార్చి 5ప్రభాతవార్తప్రతినిధి:** టిటిడి నిర్వహిస్తున్న పలు పథకాలు, ట్రస్ట్‌లకు దాతలు తమవంతుగా విరాళాలందిస్తున్నారు.

గురువారం ఉదయం మయిల్ మార్క్ పబ్లిక్ ఛారిటబుల్ ట్రస్ట్ ప్రతినిధి వివి సత్యనారాయణ 10 లక్షల రూపాయల చెక్కును తిరుమల ఆలయ డిప్యూటీ ఇఒ లోకనాథంకు అందజేశారు.

## వెంకన్నసేవలో విశ్వప్రసన్నతీర్థస్వామి



**తిరుమల,మార్చి 5ప్రభాతవార్తప్రతినిధి:** కర్నాటక ఉడిపి పెజావర్ అధోక్షాచార్య మహాసంస్థాన్ పీఠాధిపతి విశ్వప్రసన్నతీర్థ స్వామి గురువారం శ్రీవారిని దర్శించు కున్నారు. ఆలయం వద్దకు వచ్చిన స్వామికి టిటిడి అదనపు ఇఒ చిరుమామిళ్ళ వెంకయ్యచౌదరి, ఆలయ డిప్యూటీ ఇఒ లోకనాథం అర్చకులు ఆలయ సాంప్రద యంగా స్వాగతం పలికారు. ఆలయంలోనికి చేరుకున్న స్వామి తొలుత ధ్వజస్తంభానికి నమ స్కరించారు. ఆనందనిలయంలో శ్రీవారిని దర్శించుకున్నారు. రంగనాయకులమండపంలో వేదపండితులు వేదాశీర్వచనం చేశారు. ఆలయ అధికారులు శ్రీవారి తీర్థప్రసాదాలు అందజేశారు.

## ఇకపై పట్టు శాలువాలు ఆప్కో, కోఆప్టెక్స్‌ల నుంచి కొనుగోలు - అనుమతించిన టిటిడి



**తిరుమల,మార్చి 5ప్రభాతవార్తప్రతినిధి:** తిరుమలకు వచ్చిన ప్రముఖులకు మర్యాద పూర్వక స్వాగతంతోబాటు వేదాశీర్వచనం అందుకున్న భక్తులకు ఆలయ సాంప్రదాయంతో సత్కరించేందుకు అవసరమైన పట్టుశాలువాలు ఇకపై ఆప్కో, కోఆప్టెక్స్‌ల నుండి కొనుగోలుచేయాలని టిటిడి నిర్ణయించింది. ఇప్పటికే ఈ విషయంపై గత బోర్డుసమావేశంలో చర్చించారు. 43కోట్ల రూపాయలు విలువైన వస్త్రాలను 50:50నిష్పత్తిలో ,సరఫరాకు అంతరాయం లేకుండా మల్టీ వెండార్ విధానంలో సేకరించాలని నిర్ణయించారు. ఈ పట్టుశాలువాల కొనుగోళ్ళలో పారదర్శకత, నాణ్యతకు ప్రాధాన్యతనిస్తున్నారు. ఇప్పుడు గతంలో చోటుచేసుకున్న అక్రమాలు, అవినీతితో టిటిడి వస్త్రాల కొనుగోలు విధానంలో కీలక మార్పులు చేపట్టింది. ఇకపై కొనుగోళ్ళలో పారదర్శకత పాటించాలని నిర్ణయించారు. ప్రభుత్వ రంగసంస్థలు ఆప్కో ,కో ఆప్టెక్స్ ఆంధ్రప్రదేశ్,తమిళనాడులనుండి వస్త్రాలను సేకరించాలని తీర్మానించింది. పట్టుచీరలు, శాలువాలు,ఇతర వస్త్ర సామాగ్రిని ఈ రెండు సంస్థల నుండి కొనుగోలు చేయనుంది. సరఫరాలో ఎలాంటి అంతరాయాలు,ఇబ్బందులు తలెత్తకుండా ఉండేందుకే ఈ మల్టీ వెండార్ విధానాన్ని ఎంచుకున్నట్లు టిటిడి స్పష్టం చేసింది. అదనపు ఇఒ చిరుమామిళ్ళ వెంకయ్య చౌదరి ఇటీవల ఆప్కో, కోఆప్టెక్స్ ప్రతినిధులతో ప్రత్యేకంగా సమావేశమై చర్చలు జరిపారు. టిటిడి నిర్దేశించిన నాణ్యతా ప్రమాణాలు పాటించాలని సూచించారు. గతంలో టిటిడిలో పట్టు శాలువాల కుంభకోణం తీవ్ర చర్చనీయాంశమైన సంగతి తెలిసిందే. మల్బరీ పట్టు శాలువాల కోసం టెండర్ ఇస్తే ,ఓ ప్రైవేట్ సరఫరాదారుడు నాసిరకం పాలిస్టర్ శాలువాలను సరఫరా చేసినట్లు టిటిడి బోర్డు గుర్తించింది. 350 నుంచి 400 రూపాయలు విలువ చేసే శాలువాను మూడింతలు రెట్టింపుగా నుగోలు చేసినట్లు ఆరోపణలు వచ్చాయి. ఈ వ్యవహారంపై ఎసిబికి టిటిడి ఫిర్యాదు చేయడంతో కుంభకోణం వెలుగులోకి వచ్చింది.

## అంగరంగ వైభవంగా ఒంటిమిట్ట శ్రీరామ బ్రహ్మోత్సవాలు

**న- సమన్వయంతో టిటిడి, జిల్లా యంత్రాంగం ఏర్పాట్లు - పట్టువస్త్రాలు సమర్పించనున్న సిఎం - కలెక్టర్ శ్రీధర్ చెరుకూరి, టిటిడి జెఇఒ వీరబ్రహ్మాం వెల్లడి**

**రాజంపేట, మార్చి5 ప్రభాతవార్త:** రాష్ట్రప్రభుత్వం అధికారికంగా ఒంటిమిట్టలో నిర్వహించే శ్రీరామనవమి శ్రీ కోదండ రామస్వామి బ్రహ్మోత్స వాలను అంగరంగ వైభవంగా నిర్వహించేందుకు పక్కా ఏర్పాట్లు చేస్తున్నట్లు జిల్లా కలెక్టర్ డాక్టర్ శ్రీధర్ చెరుకూరి ,తిరుమల తిరుపతి దేవస్థానం సంయుక్త కార్య నిర్వహణ అధికారి వి.వీరబ్రహ్మం వెల్లడించారు. జిల్లా అధికార యంత్రాంగం, టీటీడీ సమన్వయంతో ఏర్పాట్లు చేసి సమిష్టి కృషితో విజయవంతం చేస్తామని వెల్లడించారు. గురువారం వారు కడప జిల్లాలోని ఒంటి మిట్టలోని శ్రీ కోదండరామస్వామి ఆలయంలో జరగనున్న శ్రీ కోదండరామ స్వామి బ్రహ్మోత్స వాల్లో భాగంగా శ్రీరామనవమి, శ్రీ సీతారాముల కళ్యాణోత్సవం సందర్భంగా అన్ని శాఖలు సమన్వయంతో ప్రత్యేక ఏర్పాట్లు చేయాలని జిల్లా కలెక్టర్ డా. చెరుకూరి శ్రీధర్ అధికారులకు సూచించారు. ఒంటిమిట్ట టిటిడి అతిథి గృహంలో టిటిడి జేఈవో వి. వీరబ్రహ్మాం, జిల్లా ఎస్పీ షెల్కే నచికేత్ విశ్వనాథ్ తదితర అధికారులతో కలిసి బ్రహ్మోత్సవాల ఏర్పాట్లపై సమీక్షా సమావేశం నిర్వహించారు.ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ, మార్చి 26న అంకురార్పణతో కార్యక్రమాలు ప్రారంభమై, మార్చి 27న ధ్వజా రోహణంతో బ్రహ్మోత్సవాలు మొదలవుతాయని తెలిపారు. ఏప్రిల్ 1న జరిగే శ్రీ సీతారాముల కళ్యాణోత్సవంలో రాష్ట్ర ముఖ్యమంత్రి శ్రీ నారా చంద్రబాబు నాయుడు చేతుల మీదుగా పట్టు వస్త్రాల సమర్పణ జరగనుందని చెప్పారు.ఈ సందర్భంగా టిటిడి జేఈవో వి.వీరబ్రహ్మాం మాట్లాడుతూ, భక్తుల రద్దీ దృష్ట్యా భద్రత, ట్రాఫిక్ నియంత్రణ, గ్యాలరీలు, పార్కింగ్, పబ్లిక్ అడ్రెస్ సిస్టమ్ వంటి ఏర్పాట్లు పటిష్టంగా ఉండాలని సూచించారు. వేసవి కాలాన్ని దృష్టిలో ఉంచుకుని చలువ పందిళ్లు, తాగునీరు, మజ్జిగ, అన్నప్రసాదాలు, వైద్య సదుపాయాలు కల్పించాలని అధికారులకు ఆదేశించారు.అలాగే ఓఆర్ ఎస్ ప్యాకెట్లు పంపిణీ, అంబులెన్స్ సేవలు, నిరంతర విద్యుత్ సరఫరా, పుష్పాలంకరణలు, సాంస్కృతిక కార్యక్రమాలు కూడా నిర్వహించనున్నట్లు తెలిపారు. జిల్లా యంత్రాంగం, టిటిడి అధికారులతో జిల్లా కలెక్టర్, టిటిడి జేఈవో శాఖల వారీగా సమీక్ష నిర్వహించారు. ఈ సమా వేశంలో జాయింట్ కలెక్టర్ డా. నిధి మీనా, రాజంపేట సబ్ కలెక్టర్ భావన, టిటిడి సీఈ సత్యనారాయణ, ఎస్ ఈలు మనోహరం, వేంక టేశ్వర్లు, డిప్యూటీ ఈవోలు రాజేంద్ర కుమార్, సెల్వం, శివప్రసాద్, అన్నప్రసాదం ప్రత్యేక అధి కారి జిఎల్ ఎన్ శాస్త్రి,అధికారులు పాల్గొన్నారు.



ఒంటిమిట్ట రామాలయంలో బ్రహ్మోత్సవాల ఏర్పాట్లు పరిశీలిస్తున్న కడప కలెక్టర్ శ్రీధర్, జెఇఒ వీరబ్రహ్మాం

## నార్త్ అమెరికా స్పెషల్ రిప్రజెంటేటివ్‌గా బాధ్యతలు స్వీకరించిన కోమటి జయరాం

**విజయవాడ, మార్చి5, ప్రభాతవార్త ప్రతినిధి:** ప్రవాస భారతీయుడు కోమటి జయరాం నార్త్ అమెరికా స్పెషల్ రిప్రజేంటేటివ్ గా నియమితు లయ్యారు. ఈ క్రమంలో ఈ రోజు ఆయన పదవీ బాధ్యతలు స్వీకరించారు. తాడేపల్లి ఏపీఎన్నార్టీ కార్యాలయంలో గురువారం జరిగిన కార్యక్రమంలో వివిధ దేశాలకు చెందిన ఎన్నారైల సమక్షంలో, వేద ఆశీర్వచనాల నడుమ ప్రమాణ స్వీకార కార్యక్రమం జరిగింది. ఈ కార్యక్రమలో ఎన్నారై శాఖా మాత్యులు కొండపల్లి శ్రీనివాస్, ఏపీ ఎన్నార్టీ అధ్యక్షులు వేమూరి రవి, సైన్స్ అండ్ టెక్నాలజీ ఛైర్మన్ రవి మండలపు, ప్రముఖ ఎన్నారై డాక్టర్ రాజా పిల్లి సహా తదితర ఎన్నారైలు పెద్ద ఎత్తున హాజరు అయ్యారు.



నార్త్ అమెరికా స్పెషల్ రిప్రజేంటేటివ్ గా బాధ్యతలు స్వీకరిస్తున్న కోమటి జయరాం

ఈ సందర్భంగా మంత్రి కొండపల్లి శ్రీనివాస్ మాట్లాడుతూ, ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర అభివృద్ధికి ఆయన సేవలు ఎంతగానో ఉపయోగపడతాయని, ఇదే సమయంలో అమెరికాలో చదువుకుంటున్న విద్యార్థులు, అక్కడ పని చేస్తున్న ఉద్యోగులకు ఏవైనా సమస్యలు వారి పరిష్కారాలకు కృషి చేయడమే కాకుండా, రాష్ట్రానికి పెట్టుబడులు ఆహ్వానించే విషయంలో, తన వంతు కృషి చేయడంలో సమర్ధవంతంగా పని చేస్తారని ఆశాభావం వ్యక్తం చేసారు.

## పామాయిల్ తోటలో భారీగా గంజాయి పట్టివేత

**యు.కొత్తపల్లి, మార్చి 5 (పిఠాపురం రూరల్) (ప్రభాతవార్త),** పామాయిల్ తోటలో భారీ స్థాయిలో దాచిన గంజాయిని పిఠాపురం సీఐ శ్రీనివాస్ ఆధ్వర్యంలో రూరల్ పోలీస్ లు గురువారం దాడి చేసి పట్టుకున్నారు. సీఐ తెలిపిన వివరాల ప్రకారం రూరల్ పోలీస్ స్టేషన్ పరిధిలోని పి. దొంతమూరు గ్రామ శివారు జగనన్న కాలనీ ఎదురుగా ఉన్న పామాయిల్ తోటలో గంజాయి ఉన్నదని సమాచారం మేరకు పిఠాపురం రూరల్ ఎస్సై జాన్ భాషా, తహసీల్దార్ గోపాలకృష్ణ సదరు ప్రదేశం వద్ద గాలింపు చేపట్టారు.

బస్తాలలో ఉన్న 92 కేజీలను గుర్తించి స్వాధీనం చేసుకున్నారు. గంజాయిని ఎవరో గుర్తు తెలియని వ్యక్తులు ఏదైనా వాహనంలో తీసుకుని వచ్చి అక్కడ దాచి ఉండవచ్చునని భావించి,

సీజ్ చేసి పోలీస్ స్టేషన్కు తరలించడం జరిగింది. దీనిపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు శ్రీనివాసు తెలిపారు.

## మద్యం కేసు నిందితుడు వాసుదేవరెడ్డిని ప్రశ్నిస్తున్న సిట్ అధికారులు

**విజయవాడ,మార్చి 5,ప్రభాతవార్తప్రతినిధి:** మద్యం కేసులో కీలక నిందితుడు వాసుదేవరెడ్డిని ఏసీబీ కోర్టు అనుమతి మేరకు సిట్ కస్టడీకి తీసుకుంది.వాసుదేవరెడ్డిని సిట్ అధికారులు విజయవాడ సిట్ కార్యాలయంలో వాసుదేవరెడ్డి విచారిస్తున్నారు. మద్యం కేసులో ఏ2 నిందితుడిగా ఉన్న వాసుదేవరెడ్డి ఉన్నారు. గుంటూరు జిల్లా జైలు నుంచి కస్టడీకి తీసుకున్న సిట్ అధికారులు రెండురోజుల పాట విచారిస్తారు.గురువారం వాసుదేవరెడ్డిని సిట్ అధికారులు పలు అంశాలపై ప్రశ్నించారు.అయితే పలు ప్రశ్నలకు

సిట్ ఆశించిన రీతిలో బదులు ఇవ్వలేదని సమాచారం మద్యం విక్రయాలు, కేటాయింపుల్లో కీలకంగా వాసుదేవరెడ్డి వ్యవహరించినట్లు సిట్ ఆరోపించింది.

## ఎన్టీఆర్ జిల్లా రామవరప్పాడు పంచాయతీలో రూ.4.04 కోట్ల అక్రమాలు జరిగినట్లు నిర్ధారణ

**విజయవాడ,మార్చి5,ప్రభాతవార్తప్రతినిధి:** ఎన్టీఆర్ జిల్లా రామవర ప్పాడు పంచాయతీలో రూ.4.04 కోట్ల అక్రమాలు జరిగినట్లు వచ్చిన ఆరోపణలపై జిల్లా కలెక్టర్ ఇటీవల విచారణ ఆదేశించారు. విచారణలో భారీ మొత్తంలో అవకతవకలు జరిగినట్లు ప్రాథమికంగా నిర్ధారణచింది.దాంతో అధికారంలో ఉన్న సర్పంచ్‌ను పదవి నుంచి తొలగిస్తూ ఆదేశాలు కలెక్టర్ లక్ష్మీ ్మశ జారీచేసారు. బాధ్యులుగా అప్పట(రిటైర్డ్) కార్యదర్శి గంటా రామమోహన్‌రావు,

ఇరిగేషన్ ఏఈ కొండ, ఎంపీడీవో సునీత ప్రస్తుత సర్పంచ్ శ్రీదేవిని బాధ్యురాలుగా విచారణ నివేదికలో వెల్లడించారు. సర్పంచ్ వాటాగా కోటి 64 లక్షల 31 వేల 758 చెల్లించాలని కలెక్టర్ ఉత్తర్వుల్లో పేర్కొన్నారు.

GREATER VISAKHAPATNAM MUNICIPAL CORPORATION
VISAKHAPATNAM

RFP Tender Notice No.7/2025-26/CE(GVMC)/SE(Projects)/EE(PD-I)/GVMC/ Dt: 05-03-2026

01. No.of Works : 1 (One) (RFQ Tender)
02. Downloading Starting Date : 05-03-2026 05.00 PM
03. Downloading End Date : 25-03-2026 @ 2.00 PM
04. Last date for Submission of bid : 25-03-2026 @ 4.00 PM

Further details at http://www.apeprocurement.gov.in
O/o the Executive Engineer (PD-I) Division
Sd/- Commissioner, GVMC, Visakhapatnam

# నిజంగా వైఎస్సార్సీకి దైవభక్తి ఉంటే లడ్డూ ప్రసాదంలో ఏ నెయ్యి వాడారో ప్రజలకు తెలపాలి :బిజెపి ఎమ్మెల్సీ సోము వీర్రాజు



మీడియా సమావేశంలో మాట్లాడుతున్న బిజెపి ఎమ్మెల్సీ సోము వీర్రాజు

**సచివాలయం,మార్చి 5,ప్రభాతవార్త :** శ్రీవేంకటేశ్వరస్వామి కలియుగ దైవం అని ప్రపంచవ్యాప్తంగా పవిత్రంగా భావించే దేవుడని,నిజంగా ఆయనపై ప్రేమ,భక్తి ఉంటే నిజమైన హిందువులమైతే ఏ నెయ్యి వాడాలో స్పష్టంగా తెలుసుకోవాలని శాశ్వత పరిష్కారం కావాలనేది తన ప్రధాన అభిప్రాయమని బిజెపి ఎమ్మెల్సీ సోము వీర్రాజు అన్నారు.గురువారం అసెంబ్లీ మీడియా పాయింట్ వద్ద విలేకరుల సమావేశంలో మాట్లాడుతూ రూ.320కిలోల నెయ్యి కొనుగోలు చేసి రూ.220కోట్లు తీసుకొని టెండర్ పాలసీ షెడ్యూల్స్‌ను తగ్గించి తప్పులు చేశారని,ఇప్పుడు కొన్ని కంపెనీలు రూ.150కిలో,రూ.250కిలో నెయ్యి తయారు కాదని వీడియోలు చూపిస్తూ మభ్యపెట్టే ప్రయత్నం జరుగుతోందని ఎమ్మెల్సీ ఆరోపించారు. నిజమైన నెయ్యి అంటే పాలు కాచి,తోడుపెట్టి,మజ్జిగ నుండి వెన్న తీసి దాన్ని కాస్తేనే అసలైన నెయ్యి వస్తుందని సోము వీర్రాజు వివరించారు.రూ.320 కిలో నెయ్యి కొని తప్పులుచేసిన తర్వాత ఇప్పుడు రూ.620కిలో నెయ్యిలో దోపిడి ఉందని,ఇందూపూర్ ఉందని,హెరిటేజ్ ఉందని బ్లాక్ మెయిల్ చేయడం సరికాదని అన్నారు.జగన్‌కి సిమెంట్, కరెంట్ సంస్థ ఉన్నాయని,వారి నాయకులకు వ్యాపారాలు లేవా అన్ని ప్రశ్నిస్తూ బ్లాక్‌మెయిల్ చేయకూడదని,ముఖ్యమంత్రి కుటుంబ సంస్థల ఉత్పత్తులు కొనడం తప్పుకాదని సోము వీర్రాజు అభిప్రాయపడ్డారు.రూ.620ల కిలో నెయ్యి కొనడం దోపిడి అని చెప్పేవారు హిందూ ధర్మానికి బద్ధ వ్యతిరేకులని ఆయన ఆరోపించారు.ఒక్కలీటర్ ఆవుపాలు రూ.60లకు కొంటే శీతాకాలంలో 700గ్రాముల నెయ్యి వస్తుందని,యావరేజ్‌గా నిజమైన ఆవుపాల నెయ్యి రూ.1500–2000కిలో ఉంటుందని సోము వీర్రాజు స్పష్టం చేశారు.రూ.600ల కిలో నెయ్యి ప్యాట్ బేస్డ్‌దేనని,కానీ శ్రీవేంకటేశ్వరస్వామికి అదే పెట్ట మంటారా అని ఆయన ప్రశ్నించారు. వైకాపాను ఉద్దేశించి రూ.200కోట్లు సంపాదించారని,పాపం పోవాలంటే ఆ డబ్బుతో గోవులు కొని శ్రీవేంకటేశ్వరస్వామికి ఇవ్వండని బొకాయించకండని వీర్రాజు సూచించారు. అయోధ్య రాముడికి మంచి నెయ్యితో లడ్డూలు తయారు చేసినప్పుడు శ్రీవేంకటేశ్వరస్వామి కి రూ.320ల నెయ్యితో ఎందుకు తయారు చేస్తారని,ఇది మీ మంత్రి ఒప్పుకున్నట్లేననని సోము వీర్రాజు తెలిపారు.రూ.320కిలో నెయ్యిలో కల్తీలు ఉన్నాయని,సువాసనకు రసాయనాలు వాడారని,వెజిటబుల్ ప్యాట్స్ కలిపారని రిపోర్టులు వచ్చినా సమాధానం లేదని ఆయన ఆరోపించారు. హిందూత్వంపై చర్చ జరుగుతోందని ఆనందంగా ఉందని,హిందూత్వం భారతీయ తత్వం,ప్రపంచ ధ్యానమని, ప్రధానమంత్రి మోదీ నాయకత్వంలో భారతదేశం బలంగా ఉండాలని,అన్ని శక్తులను కూడగట్టుకోవాలని సోము వీర్రాజు అన్నారు.ఈ తత్వానికి విరుద్ధంగా వ్యవహరిస్తే ఇబ్బందులు పడతారని హెచ్చరించారు.

# ప్రజల్లోకి వెళ్లి 'సంక్షేమం' చూడండి

## సమన్వయంతో జిల్లా అభివృద్ధికి పాటు పడాలి

## అనంత' ప్రజాప్రతినిధులతో సీఎం చంద్రబాబు



తాడేపల్లిలో అనంతపురం జిల్లా ప్రజా ప్రతినిధులతో సమావేశమైన సీఎం చంద్రబాబు నాయుడు

**అనంతపురం, మార్చి 5, (ప్రభాతవార్త బ్యూరో)** మీ వల్ల రాష్ట్ర ప్రభుత్వానికి చెడ్డ పేరు రాకుండా చూడండి. ప్రభుత్వ పథకాలను ప్రజలే తీసుకెళ్లేందుకు సమన్వయంతో పని చేయండి. కొన్ని ప్రభుత్వ పథకాల పట్ల ప్రజల్లో సంతృప్తి కనపడటం లేదు. అందుకు కారణం మీరే. మీరు తరచూ ప్రజల్లోకి వెళ్లి వారి సమస్యలను తెలుసుకోకపోవడం, ప్రభుత్వ అమలు చేస్తున్న పథకాలను ప్రజల్లోకి తీసుకోకపోవడం వల్లే ప్రజల్లో సంతృప్తి కలగడం లేదని రాష్ట్ర ముఖ్యమంత్రి నారా చంద్రబాబునాయుడు అనంతపురం జిల్లా ప్రజా ప్రతినిధుల సమావేశంలో ఆక్రోసం వెళ్లగక్కినట్లు సమాచారం. త్వరలో స్థానిక సంస్థల ఎన్నికలు వస్తున్నాయి మీరు గట్టిగా పని చేసి జనాల్లో ఉంటేనే మంచి ఫలితాలు వస్తాయన్న విషయాన్ని గుర్తించాలని సీఎం గట్టిగానే మాట్లాడినట్లు తెలియ వచ్చింది. తాడేపల్లిలోని సీఎం నివాసంలో గురువారం ఉదయం అనంతపురం జిల్లా అభివృద్ధిపై దాదాపు రెండు గంటల పాటు జిల్లా ఎమ్మెల్యేలు, ఎంపీ, మంత్రులతో సీఎం ప్రత్యేకంగా సమీక్షించి వారికి దిశ నిర్దేశం చేశారు. ఈ సమావేశంలో జిల్లా మంత్రి పయ్యావుల కేశవ్, జిల్లా ఇన్చార్జి మంత్రి టి.జీ. భరత్, అనంతపురం ఎంపీ అంబికా లక్ష్మీనారాయణ, రాష్ట్ర ప్రభుత్వ విప్ రాయదుర్గం ఎమ్మెల్యే కాల్వల శ్రీనివాసులు, ఎమ్మెల్యేలు కుమ్మనూరు జయరాం, బండారి శ్రావణి, జేసీ అస్మిత్ రెడ్డి, దగ్గుబాటి ప్రసాద్, అనంతపురం జిల్లా కలెక్టర్ ఆనంద్, జిల్లా ఎస్పీ జగదీష్ కూడా పాల్గొన్నారు. తాడేపల్లిలో ఉదయం 8:00 నుంచి 10 గంటల వరకు జరిగిన సమావేశంలో సీఎం చంద్రబాబు అనంతపురం జిల్లా అభివృద్ధిపై చర్చించడం విశేషం. రాష్ట్రంలో కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత రాష్ట్రంలో జరిగిన అభివృద్ధి, అనంతపురం జిల్లాలో జరిగిన అభివృద్ధి పనులు పోల్చుతూ సీఎం సమీక్ష నిర్వహించినట్లు, కొన్ని సందర్భాల్లో ప్రజా ప్రతినిధులకు గట్టిగా వార్నింగ్ ఇచ్చినట్లు తెలియ వచ్చింది. ప్రభుత్వ పథకాల గురించి రాష్ట్ర ప్రభుత్వం సర్వే చేసినప్పుడు ఉదాహరణకు అనంతపురం జిల్లాలో పంచాయతీరాజ్ రోడ్లు, బాలామృతం విషయంలో ప్రజలు సంతృప్తిగా లేరని రిపోర్టులు వచ్చాయని సీఎం చంద్రబాబు ప్రస్తావించినట్లు సమాచారం. మంత్రులు, ఎంపీ, ఎమ్మెల్యేలు సమన్వయంతో పనిచేయాలని, కూటమిప్రభుత్వం అమలు చేస్తున్న అభివృద్ధి పథకాలను తీసుకెళ్లాలని సీఎం చంద్రబాబు దిశా నిర్దేశం చేసినట్లు తెలియ వచ్చింది. ఈ సమావేశంలో అనంతపురం జిల్లాలో సాగునీటి ప్రాజెక్టుల విషయంలో తీసుకోవాల్సిన చర్యలపై సీఎం ప్రత్యేకంగా ఎమ్మెల్యేలను వివరాలు తెలుసుకుని సమీక్ష నిర్వహించినట్లు తెలియదు.. అదే సమయంలో జిల్లాలో అభివృద్ధి పథకాలు అమలకు సంబంధించి జిల్లా కలెక్టర్ ఆనంద్, జిల్లాలో శాంతి భద్రతలకు సంబంధించి జిల్లా ఎస్పీ జగదీష్ పలు విషయాలను సీఎం దృష్టికి తీసుకెళ్లినట్లు తెలియ వచ్చింది. సీఎంకు వినతిలో ఎమ్మెల్యేలు వెల్లువ... తాడేపల్లిలో సీఎం నివాసంలో గురువారం ఉదయం జరిగిన ప్రత్యేక సమావేశంలో సీఎం చంద్రబాబు నాయుడు అనంతపురం జిల్లా ఎమ్మెల్యేలు తమ నియోజకవర్గాలకు సంబంధించి పలు సమస్యలపై వినతి పత్రాలు ఇచ్చారు. ఎమ్మెల్యేలు పోటీపడి సీఎం దృష్టికి పలు సమస్యలు తీసుకెళ్లి నిధులు కేటాయించాలని కోరినట్లు సమాచారం.

# అసెంబ్లీలో అన్ని రాజకీయ పక్షాలు ఉంటేనే మసాలా : స్పీకర్ అయ్యన్నపాత్రుడు

## - వైఎస్సార్సీపీలో జగన్ మినహా ఎమ్మెల్యేలు అంతా జీతాలు తీసుకుంటున్నారు

**విజయవాడ,మార్చి 5,ప్రభాతవార్త ప్రతినిధి:** అసెంబ్లీలో అన్ని రాజకీయ పక్షాల సభ్యులు ఉంటేనే మసాలా ఉంటుందని శాసనసభ స్పీకర్ చింతకాయల అయ్యన్నపాత్రుడు వ్యాఖ్యానించారు. ప్రజా సమస్యల కోసమే ఎమ్మెల్యేలుగా ఎన్నుకోబడతారని అలాంటిది ప్రజా సమస్యల పరిష్కార వేదిక అయిన అసెంబ్లీకి గైర్హాజరు సబబు కాదని తెలిపారు. అసెంబ్లీలోని తన ఛాంబర్ లో మీడియాతో స్పీకర్ అయ్యన్న చిట్ చాట్ నిర్వహించారు. వైఎస్సార్సీపీలో జగన్ మినహా ఎమ్మెల్యేలు అంతా జీతాలు తీసుకుంటున్నారని గుర్తు చేశారు. వైఎస్సార్సీపీ సభ్యులకు నోటీసులు ఇవ్వాలంటే అందుకు తగ్గ సమయం రావాలని తెలిపారు. అనర్హత వేటు అంశం ఆంధ్రప్రదేశ్ లో సక్సెస్ అయితే దేశమంతా సక్సెస్ అవుతుందని వెల్లడించారు.

గవర్నర్ ప్రసంగం రోజు అసెంబ్లీకి వస్తే హాజరుగా పరిగణించాలనే నిబంధన ఎక్కడ ఉందో నెంబర్ 1 స్టూడెంట్ అనే చెప్పుకునే వారు చూపించాలని నిలదీశారు. గవర్నర్ ప్రసంగం రోజు అసెంబ్లీకి వస్తే అది హాజరుగా పరిగణించబడదని అన్నారు. అడ్డగోలు వాదనలు చేసే వారిని ఏమనాలని ప్రశ్నించారు. మాజీ ముఖ్యమంత్రిగా దక్కాల్సిన అన్ని గౌరవ మర్యాదలు జగన్ కు లభిస్తున్నాయని స్పష్టం చేశారు. జగన్ తండ్రి రాజశేఖర్ రెడ్డి పార్టీలకు అతీతంగా ఎమ్మెల్యేలందరితో సరదాగా ఉండేవారని తెలిపారు. విశాఖలో రామానాయుడు స్టూడియో ప్రారంభానికి సీఎంగా వచ్చిన వైఎస్సార్ ప్రతిపక్ష ఎమ్మెల్యే అయిన తనను స్టేజీపైకి ఆహ్వానించారని గుర్తు చేసారు.

ప్రోటోకాల్ పాటించలేదని అక్కడే కలెక్టర్ ను మందలించారని స్పీకర్ తెలిపారు. అప్పట్లో ప్రజా సమస్యలపై అధికార,ప్రతిపక్ష సభ్యులు సభలో పోరాడినా, బయట స్నేహంగా ఉండేవారని కానీ రాను రాను ఆ సంస్కృతి పోయి విరోధుల్లా తయారవుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. శాసనమండలి అంటే పెద్దల సభగా పెద్ద ఆలోచనలు ఉన్నవారితో ఉండేది కానీ పెద్ద ఆలోచనలు లేని వారు ఆ సభలో ఉంటే ఎలా ఉంటుందో ఇప్పుడు చూస్తున్నామని అన్నారు.

ఇక రోడ్ల విస్తరణ సమయంలో అడ్డంగా ఉన్నాయంటూ 100 ఏళ్ల పైబడిన చెట్లను కొట్టేయడం ఆవేదన కల్గిస్తోందని స్పీకర్ అయ్యన్నపాత్రుడు అసెంబ్లీలో చర్చ సందర్భంగా ప్రస్తావించారు. వృక్షాలను కొట్టేయకుండా వేరే దగ్గర వాటిని మళ్లీ నాటితే చిగురిస్తాయని ఈ విధంగా తన నియోజకవర్గంలో చేశామని తన అనుభవాన్ని పంచుకున్నారు. దీనిపై స్పందించిన డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్ రోడ్డుపై కొట్టేసిన చెట్లను తిరిగి నాటేలా ఒక పాలసీని రూపొందిస్తామని చెప్పారు.

# ఉగాది రోజున లక్ష ఇళ్లు లబ్ధిదారులకు అందజేస్తాం

## - బడ్జెట్ డిమాండ్స్ పై చర్చ సందర్భంగా అసెంబ్లీలో మంత్రి నారాయణ

## - దేశంలో ఎక్కడా జరగనంత భారీగా గత ప్రభుత్వంలో టీడీఆర్ స్కాం జరిగింది: మంత్రి



**విజయవాడ,మార్చి 5,ప్రభాతవార్తప్రతినిధి:** వచ్చే ఉగాది రోజు రాష్ట్రంలో లక్ష మంది లబ్దిదారులకు టిడ్కో ఇళ్లు అందజేస్తామని మంత్రి నారాయణ తెలిపారు. జూన్ నాటికి టిడ్కో ఇళ్ల ను పూర్తి చేయడంతో పాటు 2028 కల్లా ప్రజలందరికీ సురక్షి తమైన తాగునీరు అందించేలా ప్రణాళికాబద్ధంగా ముందుకెళ్తున్నామని మంత్రి చెప్పారు..గౌరవ ముఖ్యమంత్రి గారి సలహాలు,సూచనలతో పురపాలక మరియు పట్టణాభివృద్ధి శాఖ ద్వారా ప్రజలకు విస్తృతంగా మెరుగైన సేవలు అందిస్తున్నామని అన్నారు..శాసనసభలో సాధారణ బడ్జెట్ డిమాండ్స్ పై చర్చ సందర్భంగా తన శాఖకు సంబంధించిన వివిధ అంశాలపై మంత్రి వివరణ ఇచ్చారు.. పట్టణ ప్రాంతాల్లో జనాభా రోజురోజుకూ పెరుగుతుందని....2001 లో 24.2 శాతం జనాభా ఉంటే 2011 నాటికి ప్రస్తుతం 36 శాతం ఉన్నదని...2047 నాటికి ఇది 60 శాతానికి పెరిగే అవకాశం ఉందన్నారు.ఈ అంచనాలకు అనుగుణంగా పక్కా ప్రణాళికతో ముందుకెళ్తున్నామన్నారు..201419 మధ్య కాలంలో మున్సిపాల్టీల నుంచి పన్నుల రూపంలో వచ్చే నిధులను గ్రీన్ ఛానల్ ద్వారా ఆయా మున్సిపాల్టీలకే ఖర్చు పెట్టామన్నారు..కానీ గత ప్రభుత్వం మున్సిపాల్టీల నిధులను కూడా సొంత అవసరాలకు వినియోగించేసుకుందన్నారు..కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత సీఎం చంద్రబాబు గారు చొరవ తీసుకుని తిరిగి సీఎఫ్ఎంఎస్ తో సంబంధం లేకుండా మున్సిపాల్టీల నిధులు అక్కడే ఖర్చు చేసుకునేలా మార్పులు చేసారని అన్నారు....సీఎంగారు తీసుకున్న ఈ నిర్ణయం పట్ల రాష్ట్ర ప్రజల తరపున ఆయనకు ధన్యవాదాలు చెప్పారు ఈ బడ్జెట్ లో మున్సిపల్ శాఖకు 14,538.68 కోట్లు కేటాయింపులు చేసారని..గత బడ్జెట్ కంటే ఇది 4.88 శాతం ఎక్కువ అన్నారు..ప్రజలు కోరుకునే తాగునీరు,ఘన,ద్రవ వ్యర్థాల నిర్వహణ,రోడ్లు,వీధి లైట్లతో పాటు ఇతర అవసరాలను ప్రాధాన్యతాక్రమంలో కల్పిస్తున్నామన్నారు రాష్ట్రంలో 54,98,000 కొళాయి కనెక్షన్లు ద్వారా 3083 ఎంఎల్డీ తాగునీరు అందించాల్సి ఉండగా.....ప్రస్తుతం 38.48 లక్షల కనెక్షన్ల ద్వారా 2100 ఎంఎల్టీ నీరు అందిస్తున్నామన్నారు...మరో 16.5 లక్షల కనెక్షన్ల ద్వారా 983 ఎంఎల్డీ తాగు నీరు అందించాల్సిన అవసరం ఉందన్నారు...వీటిలో వివిధ పథకాల ద్వారా 941 ఎంఎల్డీల తాగు నీరు అందించేలా టెండర్లు పిలిచామన్నారుఅమృత్ పథకం ద్వారా 6,524 కోట్లతో ఏఐబీ ప్రాజెక్ట్ ద్వారా 2,461 కోట్లతో,యూఐడీఎఫ్ 1 పథకం ద్వారా 1504 కోట్లతో పనులు ప్రారంభించేందుకు టెండర్ల ప్రక్రియ పూర్తయిందని మంత్రి నారాయణ చెప్పారు.మొత్తంగా 11,937 కోట్లతో ప్రాజెక్ట్ చేపట్టినట్లు మంత్రి నారాయణ చెప్పారు. గత ప్రభుత్వం వివిధ కేంద్ర పథకాలకు రాష్ట్ర వాటా నిధులు విడుదల చేయకపోవడంతో తాగు నీటి ప్రాజెక్ట్ లు పూర్తి కాలేదని మంత్రి నారాయణ అన్నారు...ఏఐబీ ద్వారా 2019 లో 5350 కోట్ల నిధులు విడుదలయితే గత ప్రభుత్వం మ్యాచింగ్ ఫండ్స్ విడుదల చేయకపోవడంతో ఆ నిధులు విడుదల కాలేదన్నారు...అలాగే అమృత్ ద్వారా 8500 కోట్లకు రాష్ట్ర వాటా నిధులు విడుదల చేయలేదన్నారు...తిరిగి కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత కేంద్రంతో మాట్లాడి ఆయా పథకాల నిధులు విడుదల చేయించినట్లు మంత్రి నారాయణ చెప్పారు. గత ప్రభుత్వం చెత్త పన్ను వేసి చెత్తను మాత్రం తొలగించకుండా వెళ్లిపోయిందని మంత్రి ఆరోపించారు...భూమిపైన 85 లక్షల మెట్రిక్ టన్నులు,భూమి క్రింద 68 లక్షల మెట్రిక్ టన్నుల చెత్త కలిపి మొత్తం 153 లక్షల టన్నుల చెత్త వదిలివెళ్లిపోయిందన్నారు..2024 అక్టోబర్ లో గౌరవ ముఖ్యమంత్రి గారి ఆదేశాల ప్రకారం ఏడాదిలోగా 85 లక్షల టన్నుల లెగసీ వేస్ట్ ను తొలగించామని వచ్చే జూన్ నాటికి మిగిలిన 68 లక్షల మెట్రిక్ టన్నుల చెత్తను పూర్తిగా తొలగిస్తామని చెప్పారు...201419 మధ్యలో రాష్ట్రంలో 10 చెత్త నుంచి విద్యుత్ తయారీ ప్లాంట్ల ఏర్పాటుకు ప్రణాళికలు రూపొందించగా...గత ప్రభుత్వం కేవలం విజయవాడ,విశాఖపట్నం మినహా మిగిలిన ప్రాజెక్ట్ లను పట్టించుకోలేదన్నారు... ప్రస్తుతం ఈ రెండు ప్లాంట్ల నుంచి 2800 టన్నుల చెత్తను విద్యుత్ గా మారుస్తున్నామని అన్నారు. కాకినాడ, నెల్లూరు,కడప, కర్నూలులో కొత్తగా ప్లాంట్ల నిర్మాణం జరుగుతుందన్నారు...వీటితో పాటు విజయవాడ,తిరుపతిలో ప్లాంట్ల ఏర్పాటుకు కేంద్రంతో చర్చలు జరుపుతున్నామన్నారు.

# రెడ్ బుక్కుకు మా ఇంటి కుక్క కూడా భయపడదు!

## - లోకేష్‌పై నిప్పులు చెరిగిన మాజీ మంత్రి అంబటి రాంబాబు - గాజువాకలో కాపు నేతల కీలక భేటీ.. - రాజకీయాల్లో చర్చనీయాంశం



**గాజువాక, మార్చి 5,ప్రభాతవార్త :** రాష్ట్రంలో కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చినప్పటి నుంచి ప్రతిపక్ష నేతలను లక్ష్యంగా చేసుకుని దాడులు చేయడం పరిపాటిగా మారిందని మాజీ మంత్రి, వైకాపా నేత అంబటి రాంబాబు ధ్వజమెత్తారు. ముఖ్యంగా నారా లోకేష్ ప్రస్తావిస్తున్న 'రెడ్ బుక్' రాజకీయాలపై ఆయన తీవ్రస్థాయిలో మండిపడ్డారు. "లోకేష్ చూపిస్తున్న రెడ్ బుక్కుకు నా ఇంటి కుక్క కూడా భయపడదు" అంటూ ఎద్దేవా చేశారు. గురువారం గాజువాకలో మాజీ ఎమ్మెల్యే కరణం ధర్మశ్రీ నివాసానికి విచ్చేసిన ఆయన, అక్కడ ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో మాట్లాడారు.కాపు నేతలే లక్ష్యమా?...తెలుగుదేశం పార్టీకి కాపు నాయకులను హింసించడం కొత్తేమీ కాదని అంబటి విమర్శించారు. గతంలో వంగవీటి మోహన రంగా నుంచి నేటి ముద్రగడ పద్మనాభం వరకు అనేకమంది కాపు నేతలను టీడీపీ ఇబ్బందులకు గురిచేసిందని ఆరోపించారు. "పవన్ కల్యాణ్‌ను, కాపు సామాజికవర్గాన్ని అడ్డం పెట్టుకుని అధికారంలోకి వచ్చి.. ఇప్పుడు వారినే టార్గెట్ చేయడం ఎంతవరకు సమంజసం?" అని ప్రశ్నించారు.వందసార్లు జైలుకైనా సిద్ధమే....ప్రజాస్వామ్యబద్ధంగా పరిపాలన సాగించాలని, కక్ష సాధింపు చర్యలు మానుకోవాలని అంబటి సూచించారు. "వైఎస్ జగన్ మోహన్ రెడ్డి ఆదేశిస్తే ప్రజల కోసం పోరాడటానికి, వందసార్లు జైలుకు వెళ్లడానికైనా నేను సిద్ధం" అని స్పష్టం చేశారు. అక్రమ కేసులు, బెదిరింపులకు భయపడే ప్రసక్తే లేదని ఆయన తేల్చి చెప్పారు.ధర్మశ్రీ నివాసంలో కాపు నేతల ఖిఅల్పాహారఖి రాజకీయాలు.....అంబటి రాంబాబు పర్యటన సందర్భంగా గాజువాకలోని మాజీ ఎమ్మెల్యే కరణం ధర్మశ్రీ నివాసం రాజకీయ కోలాహలంగా మారింది. అంబటి రాంబాబుతో పాటు మాజీ మంత్రి గుడివాడ అమర్నాథ్, మాజీ ఎమ్మెల్యే చింతలపూడి వెంకటరామయ్య తదితరులు ఈ సమావేశంలో పాల్గొన్నారు.ముఖ్య చర్చ.....కాపు సామాజికవర్గానికి చెందిన కీలక నేతలందరూ ఒకచోట చేరి అల్పాహార విందులో పాల్గొనడం స్థానికంగా చర్చనీయాంశమైంది. ప్రస్తుత రాజకీయ పరిస్థితులు, భవిష్యత్ కార్యాచరణపై వీరి మధ్య లోతైన చర్చ జరిగినట్లు తెలుస్తోంది. ఈ కార్యక్రమంలో పలువురు కాపు సంఘం నాయకులు, వైకాపా కార్యకర్తలు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

### బాణసంచా పేలుళ్ల ఘటనల్లో నిర్వాహకుల ఆస్తులు జప్తు చేస్తాం

**విజయవాడ మార్చి5 ప్రభాతవార్త ప్రతినిధి:** బాణసంచా పేలుళ్ల ప్రమాదంలో నిర్వాహకుల ఆస్తులు జప్తు చేసి వాటిని బాధితులకు అందజేసేందుకు ప్రభుత్వం సిద్దంగా ఉందని హోంమంత్రి వంగలపూడి అనిత స్పష్టంచేశారు. రాష్ట్రంలో ఇటీవల జరిగిన బాణసంచా పేలుళ్ల ప్రమాదాల నేపథ్యంలో ప్రభుత్వం ఈ విషయంలో అత్యంత కఠినంగా వ్యవహరిస్తుందని ఆమె పేర్కొన్నారు. శాసనసభలో ఏపీ అగ్నిమాపక సేవల చట్టం సవరణ బిల్లు ప్రవేశపెట్టినప్పుడు సభ ఆమోదించాక ఆమె మాట్లాడారు. అగ్ని ప్రమాద నివారణ చర్యలకు సంబంధించి చట్టంలో మార్పులు చేస్తున్నాం. ఆధునిక భవన నిర్మాణాలు, బహుళ అంతస్తులు పెరగడంతో చట్టంలో మార్పులు అనివార్యమయ్యాయి.

# నా కుమార్తె మరణంపై న్యాయ విచారణ చేపట్టాలి

**విజయవాడ మార్చి 05 ప్రభాతవార్త ప్రతినిధి:** విజయవాడ ప్రభుత్వాసుపత్రిలో ఎనస్థీషియా పీజీ విద్యార్థిని బత్తుల దీపిక అనుమానాస్పద మరణంపై నిష్పక్షపాత విచారణకు జ్యుడిషియల్ అధికారిని నియమించి రాష్ట్ర సచివాలయంలో ముఖ్యమంత్రి చంద్రబాబు, మంత్రులు లోకేశ్, అనితలను కలిసి సమస్య వివరించారు. దీపిక రాత్రి విధులకు వెళ్లి ప్రాణాలు కోల్పోయింది. ఘటనలో తోటి విద్యార్థులు, మరికొందరిపై అనుమానం ఉంది. ఫిబ్రవరి 5న పోస్టుమార్టం చేస్తే ఇంతవరకూ నివేదిక రాలేదు. దీపిక మృతికి కారకులపై కఠిన చర్యలు తీసుకోవాలి. రూ.50 లక్షల పరిహారం ఇచ్చి మా కుటుంబాన్ని ఆదుకోవాలి అని కోరారు.

### అసెంబ్లీ లాబీలో వైసీపీఎమ్మెల్సీల మధ్య వాగ్వాదం

**విజయవాడ మార్చి5 ప్రభాతవార్త ప్రతినిధి:** శాసన మండలిలో వాయిదా తీర్మానంపై అసెంబ్లీ లాబీలో వైకాపా ఎమ్మెల్సీల మధ్య స్వల్ప వాగ్వాదం జరిగింది. మండలికి ఆలస్యంగా వచ్చిన వరుదు కల్యాణిపై లేళ్ల అప్పిరెడ్డి ఆగ్రహం వ్యక్తం చేశారు. మీ పేరుతో వాయిదా తీర్మానం ఇచ్చినప్పుడు సభలో ఉండాల్సిన పనిలేదా అని కళ్యాణిని ఉద్దేశించి ఆయన ప్రశ్నించారు. తీర్మానం ఇచ్చినవాళ్లు సభలో లేకుంటే ఎలాగంటూ ఛైర్మన్ అడిగిన విషయాన్ని ఆయన ప్రస్తావించారు. దీనిపై కొంత గట్టిగానే స్పందించిన వరుదు కల్యాణి తన పేరిట వాయిదా తీర్మానం ఇస్తున్నట్లు సమాచారం ఎందుకు ఇవ్వలేదని లేళ్ల అప్పిరెడ్డిని ప్రశ్నించారు.

# మావోయిస్టు అగ్రనేత గణపతి లొంగుబాటుపై ప్రజల్లో ఉత్కంఠ



## బీర్‌పూర్ గ్రామస్థుల ఎదురుచూపులు

## లొంగిపోవాలంటూ ముప్పాల లక్ష్మణ్‌రావు కొడుకు వేడుకోలు

**హైదరాబాద్, మార్చి 5, ప్రభాతవార్త:** మావోయిస్టు అగ్రనేత గణ పతి లొంగుబాటుకు సిద్దమైనట్లు వార్త లు వస్తుండటంతో తెలంగాణ వ్యాప్తంగా ప్రజల్లో ఉత్కంఠత నెలకొంది. 2025 జూన్ 8 నుంచి ఆగస్టు 10 వరకు అబూజ్‌మడ్‌లో ఉన్న గణపతి నేపాల్‌కు వెళ్లినట్లు ప్రచారం జరుగుతోంది. అమిత్‌షా సమక్షంలో గణపతి అలియాస్ ముప్పాల లక్ష్మణ్‌రావు లొంగిపోయేం దుకు నేపాల్ నుంచి ఢిల్లీకి వచ్చినట్లు తెలియడంతో ఆయన స్వగ్రామం జగిత్యాల జిల్లా సారంగపూర్ మండలం బీర్‌పూర్‌లో గత రెండు రోజులుగా ఉద్విగ్న వాతావరణం నెలకొంది. గ్రామంలోని వృద్ధులు, యువకులు, మహిళలు ఆసక్తితో యూట్యూబ్, టివి వార్తలు వీక్షిస్తూ ఎప్పటికప్పుడు సమాచారాన్ని తెలుసుకుంటు న్నారు. ఉపాధ్యాయుడిగా ఉండి ఉద్యమాల్లోకి వెళ్లిన గణపతి ఇప్పుడు ఎలా ఉన్నాడో చూడాలనే ఆత్రుతతో బీర్‌పూర్ ప్రజలు ఎదురుచూస్తున్నారు. గణపతి సోదరుడు మాజీ జడ్పీటిసి ఆయన లొంగిపోవాలని కోరుతూ విన్నపాలు చేశారు. ముపాల లక్ష్మ్మన్‌రావ్ అలియాస్ గణపతి లొంగిపోవాలని 2013లో బీర్‌పూర్ గ్రామంలో అప్పటి ఎస్పీ శివకుమార్ ఆద్వర్యంలో అంతర్మథనం కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా గ్రామంలో ఎస్పీ శివకుమార్ బస చేశారు. వేదికపై గణపతి లొంగిపోవాలని జనస్రవంతిలో కలవాలని ఎస్పీ ఆహ్వానించారు. తాజాగా గణపతి కుమారుడు కూడా నాన్న లొంగిపో అంటూ విన్నపాలు చేసే ఆడియో సామాజిక మాద్యమాల్లో వైరల్ అవుతుండటంతో .. అనేక మంది అది వింటూ భావోద్వేగానికి లోనవుతున్నారు. తండ్రి ప్రేమను తెలిసిన వాని మాటలు ఒకలా ఉంటాయి. తండ్రి ప్రేమ తెలియని వాని మాటలు మరోలా ఉంటాయి. కానీ తండ్రి కోసం ఎదురు చూసే నాలాంటి వాని భావాలు ఎలా ఉంటాయి? మనం కలిసి ఉంటే బహుశా 'నాన్నా' అనే పదం కొన్ని లక్షల సార్లు మిమ్మల్ని పిలిచి ఉండేవాడిని. కానీ నాకు ఊహ తెలిసిన తర్వాత మొదటిసారిగా మిమ్మల్ని 'నాన్నా' అని సంబోధిస్తూ మొదలు పెడుతున్నాను. అనాలోచితంగా కానీ, అప్రమేయంగా కానీ మీరు గుర్తుకు వస్తే నా రుధిరం ఎర్రబడుతుంది. ఓ మారుమూల గ్రామంలో ఓ దిగువ మధ్యతరగతి కుటుంబంలో జన్మించిన మీరు మీకున్న మేధా శక్తితో పన్నెండు రాష్ట్రాలకు మీ సామ్రాజ్యాన్ని విస్తరించి, మీ బంధాల్లో సేవ చేస్తూ మావోయిజం అంటే గణపతి, గణపతి అంటే మావోయిస్టు అనే అంతలా ఎదిగి సమాంతర ప్రభుత్వమే నడపడం అంటే అది సామాన్యమైన విషయం కాదు. మీ ప్రయాణంలో ఎంతో కఠోర శ్రమ ఉండి ఉండవచ్చు.

నాన్నా! నా చిన్నతనం నుంచే మిమ్మల్ని చూడాలని, మీతో గడపాలని, నా కష్టసుఖాలు మీతో పంచుకోవాలని, మీ అండలో ఎదగాలని ఉండేది. మీ కోసం నా మనసు పడే ఆరాటం, నాలో ఉండే నా ఆవేదనతో నా కన్నులు ఎన్ని దిక్కులు చూసినా మీరు కనపడరు. నా హృదయ ఘోష మీకు వినపడదు. ప్రతీ కుటుంబపు చిరునవ్వు వెనుక కనబడని ఒక గొప్ప మనసున్న తండ్రి కష్టం దాగి ఉంటుందని పెరిగే కొద్దీ అర్థమైంది. ఆ విషయంలో నాకు తండ్రి లేని లోటును తెలియకుండా అన్నీ తానై పెంచింది నన్ను కన్న తల్లి. అమ్మా! నీకు వందనం. నాన్నా! మీ వివాహం తర్వాత అమ్మతో మీరు గడిపిన మధుర క్షణాలను అప్పుడప్పుడూ తన గుండె చప్పుడుగా నాతో పంచుకునేది...ఈ జీవితానికి ఆ మధుర క్షణాలు చాలు అనుకుంటూ బరువెక్కిన హృదయంతో ఓ నిట్టూర్పు విడిచేది. మన బంధువులు కూడా మీరు మనసున్న మనిషి అని, మితభాషి అని, అమ్మతో అన్యోన్యంగా ఉండేవారని అంటూ ఉంటారు. మీరు తీసుకున్న నిర్ణయం మీ ఇద్దరి జీవితాలను జీవితకాలానికి ఎడబాటు చేసింది. మీరెంచుకున్న గమ్యం వైపు అడుగులు వేస్తూ అజ్ఞాత జీవితం ప్రారంభించాక అమ్మ ఎన్ని సంవత్సరాలు తన కన్నీటితో ఎన్ని మెత్తలు తడిసిపోయాయో ఎవ్వరికీ తెలియదు. ఏ బట్ట కట్టిందో, ఏ తిండి తిన్నదో కూడా ఎవ్వరికీ తెలియదు. సమాజానికి ఎదురు పడలేక ఇంటి గడప దాటలేదు.

నన్ను పెంచుకుంటూ తన బాధను మరిచిందంటూ.. ఆయన తండ్రిని జనజీవన స్రవంతిలోకి రావాలని ప్రాధేయపడుతూ విన్నపాలు చేశారు. ఇదిఇలా ఉంటే ఇప్పటికి ఆయనను ఉద్యమంలో దగ్గర నుంచి చూసినవాళ్ళు మాత్రం గణపతి మరో దళపతిగా మారి లొంగిపోకుండా ఉంటారని ఆయన మరణం కూడా సుభాష్ చంద్రబోస్ మరణం వలే మిస్టరీగా మారుతుందని అంటున్నారు. ఏదీ ఏమైనా లక్ష్మణ్ రావు లొంగుబాటుపై మాత్రం అనేక ఊహాగానాలతో ప్రజల్లో ఉత్కంఠ నెలకొంది.

# మహిళల ఆరోగ్య సంరక్షణకు పెద్దపీట

## అవయవ మార్పిడి కోటాలో అదనంగా రెండు పాయింట్లు

## కొత్త నిబంధనను తీసుకొచ్చిన జీవన్‌దాన్ ఫౌండేషన్

**హైదరాబాద్, మార్చి 5, ప్రభాతవార్త:** తెలంగాణ ప్రభుత్వం మహిళలకు మరో శుభవార్త చెప్పింది. మార్చి 8న అంతర్జాతీయ మహిళా దినోత్సవం సందర్భంగా మహిళల ఆరోగ్యంపై ప్రత్యేక దృష్టి పెడుతూ కీలక నిర్ణయం తీసుకుంది. ఇకపై రాష్ట్రంలో అవయవ మార్పిడి కోసం ఎదురు చూస్తున్న మహిళలకు జీవన్‌దాన్ స్కోరింగ్‌లో అదనపు ప్రాముఖ్యత లభించనుంది. మహిళలకు అదనంగా +2 పాయింట్లు కలపాలని రాష్ట్ర వైద్య ఆరోగ్య శాఖ మంత్రి దామోదర రాజనర్సింహ ఆదేశాలు జారీ చేశారు.

ఈ మేరకు జీవన్‌దాన్ ఈ కొత్త నిబంధనను తీసుకువచ్చింది. ఈ కొత్త నిబంధనల వల్ల అవయవ మార్పిడి కోసం రిజిస్టర్ చేసుకున్న మహిళలకు స్కోరింగ్‌లో అదనంగా 2 పాయింట్లు కేటాయిస్తారు. పురు షులు, మహిళలు ఒకే విధమైన అనారోగ్యంతో, ఒకే స్కోరుతో ఉన్నప్పుడు.. ఈ అదనపు పాయింట్ల వల్ల మహిళలకే మొదటి ప్రాధాన్యత దక్కుతుంది. దీనివల్ల వెయిటింగ్ లిస్ట్‌లో రెండేళ్లుగా వేచి చూస్తున్న వారికి కూడా త్వరగా అవ యవాలు లభించే అవకాశం ఉంది. సమా జంలో మహిళల పట్ల జరుగుతున్న వివక్షను అరికట్టేందుకే ఈ నిర్ణయం తీసుకున్నట్లు ప్రభుత్వం తెలిపింది. కుటుంబంలో పురుషులకు అనారోగ్యం వస్తే మహిళలు అవయవ దానానికి ముందుకు వస్తున్నారు. కానీ మహిళలకు అవసరమైనప్పుడు ఎవరూ ముందుకు రావడం లేదని అధికారుల దృష్టికి వచ్చింది. అయినా కనీసం ఇప్పటి వరకు జీవన్‌దాన్‌లో పేరు నమోదు చేయించ డానికి కూడా వెనకాడుతున్న పరిస్థితి ఉంది. అందుకే మహిళల ప్రాణాలను కాపాడేందుకు కేంద్ర సంస్థ నోట్టో గైడ్‌లైన్స్ ప్రకారం ఈ పాలసీని అమలు చేస్తున్నామని అధికారులు తెలిపారు. అయితే జీవన్‌దాన్ తాజా లెక్కల ప్రకారం మొత్తం 4,256 మంది వెయిటింగ్ లిస్ట్‌లో ఉండగా, అందులో పురుషులు 3,125 మంది, మహిళలు కేవలం 1,131 మంది మాత్రమే ఉన్నారు. కిడ్నీల కోసం 865 మంది మహిళలు, లివర్ కోసం 184 మంది మహిళలు, గుండె, ఊపిరితిత్తుల కోసం 55 మంది మహిళలు నిరీక్షి స్తున్నట్టు అధికారులు తెలిపారు.

### విరిగిన రైలు చక్రం హిస్సార్ ఎక్స్‌ప్రెస్‌కు తప్పిన పెనుముప్పు

**జమ్మికుంట/హుజురాబాద్, ప్రభాతవార్త:** గురువారం రాత్రి సికిందరాబాద్ నుండి బయలుదేరిన హిసార్ ఎక్స్‌ప్రెస్ 22737 నంబర్ ఖాజీపేట జంక్షన్ దాటిన 30నిమిషాలకే ఉప్పల్-జమ్మికుంట రైల్వేస్టేషన్‌ల మధ్య రాత్రి 2.45నిమిషాలకు మడిపల్లి 18వ నెంబర్ మైలురాయి వద్ద ఒక చక్రం విరిగి పోవడంతో పెనుప్రమాదం తప్పింది. అప్పటికే జరిగిన సంఘటనను జమ్మికుంట రైల్వేస్టేషన్ మేనేజర్ శుబోద్ యాదవ్ సికింద్రాబాద్-ఖాజీపేట రైల్వే ఉన్నతాధికారులకు సమాచారం అందించారు. రెండు గంటల పాటు అప్‌లైన్‌లో నిలిచిన రైలుబండి 26బోగీలను ఖాజీపేట్ నుండి వచ్చిన మరో రైలు ఇంజన్ వెనక్కి ఉప్పల్ వరకు రిటర్న్ తీసుకెళ్లింది. ఇంజన్ చక్రం విరిగిన ప్రదేశానికి ఖాజీపేట రైల్వే జంక్షన్ నుండి ఇంజినీరింగ్ టెక్నికల్ సిబ్బంది హుటాహుటిన తరలివచ్చి మరమ్మతులు చేసి ప్రమాదస్థలి నుండి ఖాజీపేట జంక్షన్‌కు చెడిపోయిన ఇంజన్‌ను తరలించారు. రైలు ఇంజన్ మొదటి శ్రేణి డ్రైవర్ మడిపల్లి బ్రిడ్జి వద్ద ఉన్న రైల్వే లైన్‌మెన్ సిబ్బంది శబ్దాన్ని గుర్తించకపోతే పెనుప్రమాదం జరిగుండేది.

### ప్రైవేటు స్కూళ్లు, టీచర్ల నుంచి వృత్తిపన్ను వసూలు చేయాలి

**హైదరాబాద్, మార్చి 5,ప్రభాతవార్త:** రాష్ట్రంలోని ప్రైవేట్ స్కూళ్లలో, అక్కడ పనిచేస్తున్న ఉపాధ్యాయుల నుంచి ప్రొఫెషనల్ టాక్స్ వసూలు చేయడంలో ఎటువంటి అలసత్వం వహించరాదని పాఠశాల విద్యా డైరెక్టర్ నవీన్ నికోలస్ జిల్లా విద్యాశాఖాధికారుల(డీఈవో)ను ఆదేశించారు. తెలంగాణ వృత్తి పన్ను చట్టం 1987 ప్రకారం రాష్ట్ర వ్యాప్తంగా వివిధ వృత్తులు, వ్యాపారాలు ఉద్యోగాల్లో ఉన్న ప్రతి వ్యక్తి ఈ పన్ను చెల్లించడం తప్పనిసరి అని ఆదేశాల్లో డైరక్టర్ సూచించారు. వేతనం పొందే ఉద్యోగుల విషయంలో, సదరు యాజమాన్యం జీతం చెల్లించే ముందే పన్ను మొత్తాన్ని మినహాయించి ప్రభుత్వానికి జమ చేయాలన్నారు. ప్రైవేట్ పాఠశాలలు, అక్కడి సిబ్బంది నుంచి పన్ను వసూలు చేసే బాధ్యతను ఆయా జిల్లాల విద్యాశాఖాధికారులు పర్యవేక్షణ .

# పాక్‌లో ఆర్థిక సంక్షోభం?




**ఆకాశాన్నంటుతున్న ఇంధన, నిత్యావసరాల ధరలు**
**పెట్రోల్ బంకుల వద్ద వాహనదారుల బారులు**
**హార్ముజ్ జలసంధి మూసివేతతో మరిన్ని ఇక్కట్లు**

**కరాచీ, మార్చి 5:** ఇరాన్ సర్వోన్నత నేత అయతొల్లా అలీ ఖమేనీ హత్యతో పొరుగు దేశమైన పాకిస్థాన్‌లో తీవ్ర ఆందోళన, అశాంతి నెలకొంది. అమెరికా-ఇజ్రాయెల్ దాడుల్లో ఖమేనీ మరణించడం పాకిస్థాన్‌పై, ముఖ్యంగా ఆర్థిక రంగంపై తీవ్ర ప్రతికూల ప్రభావం చూపుతుందని అంతర్జాతీయ మీడియాలో కథనాలు వెలువడ్డాయి. హోర్ముజ్ జలసంధి మూసివేస్తే ఇంధన ధరలు, విద్యుత్ ఛార్జీలు పెరిగిపోతాయని, ప్రజల జీవనం కష్టతరమవుతుందని పాకిస్థాన్ రీసెర్చ్ సెంటర్ డైరెక్టర్ ఖలీద్ తైమూర్ అక్రమ్ తెలిపారు. పశ్చిమాసియాలో పనిచేస్తున్న పాకిస్థానీయులు ఉద్యోగాలు కోల్పోయే ప్రమాదం ఉందని, తద్వారా దేశానికి వచ్చే రెమిటెన్స్‌లు తగ్గుతాయని ఆందోళన వ్యక్తం చేశారు. ఈ సంఘర్షణ ముదిరితే ప్రపంచం మొత్తం నష్టపోతుందని నిపుణులు అభిప్రాయపడుతున్నారు.

ఈ పరిణామంతో పాకిస్థాన్‌లో తీవ్ర శోకం, ఆందోళన నెలకొందని ఆ దేశ మాజీ విదేశాంగ కార్యదర్శి సల్మాన్ బషీర్ అన్నారు. పాలకుల ప్రకటనలకు భిన్నంగా పాకిస్తాన్‌లో పరిస్థితులు దారుణంగా ఉన్నాయని అంతర్జాతీయ మీడియాలో కథనాలు వెల్లడిస్తున్నాయి. ఇస్లామాబాద్‌లోని అధికారులు తప్పని సరి ఇంటి నుండి పని ఏర్పాట్లు, వారాని కోసారి ఇంధన ధరల సవరణలు, పెరుగుతున్న దిగుమతి ఖర్చులతో ఇబ్బంది పడుతున్న చమురు కంపెనీ లకు పరిహారం వంటి చర్యలను ఇప్పటికే అమలు చేస్తున్నారు. డాన్‌లోని ఒక నివేదిక ప్రకారం, పెట్రోలియం ధరలు విపరీతంగా పెరుగుతున్నందున అత్యవసర నిర్ణయాలు కోరుతూ ప్రభుత్వం ఫెడరల్ క్యాబినెట్ ఆర్థిక సమన్వయ కమిటీ కోసం ఒక కార్యాచరణ ప్రణాళిక రూపొందిస్తోంది. ప్రభుత్వ, ప్రైవేట్ రంగాలలోని ఉద్యోగులు వీలైన చోట ఇంటి నుండే పని చేయాలనే నిబంధన కూడా చర్చకు వస్తున్న ప్రతిపాదనలలో ఒకటి. అధికారులు చెప్పే

**లక్ష్యం చాలా సులభం:** తక్కువ మంది ప్రయాణికులు ఉండటం అంటే ఇంధన వినియోగం తగ్గడం. పెట్రోలియం ధరల సవరణలను ప్రస్తుత పక్షం రోజుల షెడ్యూల్ నుండి వారానికోసారి అమలు చేసే వ్యవస్థకు మార్చడాన్ని కూడా అధికారులు పరిశీలిస్తున్నారు. పెరుగుతున్న ప్రపంచ వ్యయాలను మరింత త్వరగా బదిలీ చేయడం మరియు సరఫరా గొలుసులో ఆర్థిక ఒత్తిడి పెరగకుండా నిరోధించడం దీని ఉద్దేశ్యం. ఇప్పటికే చమురు నిల్వలు గణనీయంగా పడిపోవడంతో దేశవ్యాప్తంగా పెట్రోల్ బంకులు వద్ద వాహనాదారులు బారులు తీరుతున్నారు. కిలోమీటర్ల కొద్దీ ప్రజలు క్యాన్లు పట్టుకుని నిలబడ్డ దృశ్యాలు దర్శనమిస్తున్నాయి. మరోపక్క నిత్యావసర ధరాలు ఆకాశాన్నం టుతున్నాయి. ఇదిలా ఉండగా, ఖమేనీ హత్యకు నిరసనగా పాకిస్థాన్ వ్యాప్తంగా అమెరికాకు వ్యతిరేకంగా హింసాత్మక ప్రదర్శనలు చెలరేగాయి. గత కొన్ని రోజులుగా ఈ నిరసనలు తీవ్రరూపం దాల్చడంతో కనీసం 25 మంది మరణించగా, అనేకమంది గాయపడ్డారు. దేశంలోని అతిపెద్ద నగరమైన కరాచీలోని అమెరికా కాన్సులేట్‌పైకి నిరసనకారులు దూసుకెళ్లేందుకు ప్రయత్నించారు. లాహోర్‌లోనూ ఇలాంటి దాడి యత్నాన్ని పోలీసులు భగ్నం చేశారు. ఈ ఘటనపై పాక్ ప్రధాని షెహబాజ్ షరీఫ్ తీవ్ర విచారం వ్యక్తం చేశారు. ఖమేనీ మృతి పట్ల ఇరాన్ ప్రజలకు సంతాపం తెలిపారు. 'అంతర్జాతీయ చట్టాల ఉల్లంఘనపై పాకిస్థాన్ ఆందోళన వ్యక్తం చేస్తోంది. దేశాధినేతలను లక్ష్యంగా చేసుకోకూడదనేది పురాతన సంప్రదాయం' అని ఆయన ఎక్స్ వేదికగా పేర్కొన్నారు. పశ్చిమాసియాలో ఉద్రిక్తతలు పెరిగితే పాక్‌పై తీవ్ర ప్రభావం పడుతుందని నిపుణులు హెచ్చరి స్తున్నారు.

# నేపాల్ పార్లమెంట్ ఎన్నికలు ప్రశాంతం



**ఖాట్మండు, మార్చి 5:** నేపాల్ పార్లమెంటరీ ఎన్నికలకు సంబంధించిన చెదురుమదురు ఘటనలు మినహా దేశవ్యాప్తంగా పోలింగ్ ప్రశాంతంగా సాగిందని ఆ దేశ ఎన్నికల సంఘం తెలిపింది. 915,119 మంది కొత్తగా నమోదైన ఓటర్లతో సహా 18.90 మిలియన్లకు పైగా ప్రజలు ఈ ఎన్నికల్లో ఓటు వేయడానికి అర్హులు కాగా, 65శాతానికి పైగా ఓటర్లు తమ ఓటు హక్కు వినియోగించుకున్నారని పేర్కొంది. ప్రధానమంత్రి సుశీలా కార్కి, నేపాలీ కాంగ్రెస్ అధ్యక్షురాలు గగన్ థాపా, నేపాల్ కమ్యూనిస్ట్ పార్టీ (యూనిఫైడ్ మార్క్సిస్టులెనినిస్ట్) చైర్‌పర్సన్ కె.పి. శర్మ ఓలి, నేపాలీ కమ్యూనిస్ట్ పార్టీ కోఆర్డినేటర్ పుష్ప కమల్ దహల్ ప్రచండ, ఆర్ఎస్‌పి అధ్యక్షుడు రబీ లామిచానే, సీనియర్ ఆర్ఎస్‌పి నాయకుడు, ప్రధాన మంత్రి అభ్యర్థి బాలెన్ షా సహా దేశంలోని అగ్ర నాయకులు తమ ఓటు హక్కు వినియోగించుకున్నారు.

23,112 పోలింగ్ కేంద్రాలలో పోలింగ్ నిర్వహచగా, ఎఫ్‌పిటిపి వ్యవస్థ కింద మొత్తం 3,406 మంది అభ్యర్థులు పోటీ చేస్తుండగా, 3,135 మంది అభ్యర్థులు దామాషా ప్రాతినిధ్య వ్యవస్థ కింద తమ భవితవ్యం తేల్చుకుంటున్నారు.

గత ఏడాది సెప్టెంబర్‌లో మాజీ ప్రధాన మంత్రి కెపి శర్మ ఓలి నేతృత్వంలోని ప్రభుత్వాన్ని పడగొట్టిన జెన్‌జెడ్ తిరుగుబాటు తర్వాత దేశంలో జరుగుతున్న మొదటి ఎన్నిక ఇది. ప్రతినిధుల సభ, దిగువ సభ 275 మంది సభ్యులను ఎన్నుకోవడానికి ఎన్నికలు జరుగుతున్నాయి. 165 మంది ఫస్ట్‌పాస్ట్‌దిపోస్ట్ (ఎఫ్‌పిటిపి) వ్యవస్థ ద్వారా 110 మంది దామాషా ప్రాతినిధ్య వ్యవస్థ ద్వారా ఎన్నుకోనున్నారు.

## అలా చేస్తే ఇజ్రాయెల్ అణు ప్లాంట్‌ను పేల్చేస్తాం:ఇరాన్ హెచ్చరిక

**టెహ్రాన్, మార్చి 5:** తమ దేశంలో పాలన మార్పునకు ప్రయత్నిస్తే ఇజ్రాయెల్‌లోని డిమోనా అణు ప్లాంట్‌పై క్షిపణులతో పేల్చివేస్తామని అమెరికాను ఇరాన్ హెచ్చరించింది. ఇజ్రాయెల్, అమెరికా తమ లక్ష్యాలను చేరుకున్నాయని, ఈ నేపథ్యంలో ట్రంప్ ఎప్పుడైనా యుద్ధాన్ని ఆపివేయవచ్చని వార్తలు వచ్చాయి. దీనిపై స్పందించిన ఇజ్రాయెల్ అధికారి ఇరాన్‌లో పాలకులు మారే వరకు యుద్ధం కొనసాగుతుందని స్పష్టం చేశారు. పాలకులను మార్చుతామంటూ ఇజ్రాయెల్ చేసిన ప్రకటనపై ఇరాన్ తీవ్రంగా స్పందించింది. తమ దేశంలో పాలనను మార్చే ప్రయత్నం చేస్తే ఇజ్రాయెల్‌లోని అణు ప్లాంటును లక్ష్యంగా చేసుకుంటామని ఇరాన్ హెచ్చరికలు జారీచేసింది. అంతేకాకుండా పశ్చిమాసియాలో చమురు మౌలిక సదుపాయాలను తమ క్షిపణులు లక్ష్యంగా చేసుకుంటాయని పేర్కొంది.

## ఖలిస్థానీ వ్యతిరేక మహిళా కార్యకర్త హత్య



**ఒంటారియో(కెనడా), మార్చి 5:** కెనడాలో మరో దారుణ ఘటన చోటుచేసుకుంది. ఖలిస్థానీ వేర్పాటువాదాన్ని తీవ్రంగా వ్యతిరేకించే ప్రముఖ సోషల్ మీడియా ఇన్‌ఫ్లుయెన్సర్ నాన్సీ గ్రెవాల్ (45) హత్యకు గురయ్యారు. అంటారియోలోని విండ్సర్‌ఎసెక్స్ ప్రాంతం పరిధిలో ఉన్న లాసెల్ టౌన్‌లోని ఆమె నివాసంలోనే ఈ ఘోరం జరిగింది. మార్చి 3న రాత్రి సుమారు 9:30 గంటల సమయంలో నాన్సీ గ్రెవాల్‌పై కత్తితో దాడి జరిగింది. సమాచారం అందుకున్న ఎమర్జెన్సీ సిబ్బంది ఘటనా స్థలానికి చేరుకునే సరికి ఆమె తీవ్ర గాయాలతో పడి ఉన్నారు. వెంటనే ఆసుపత్రికి తరలించగా, చికిత్స పొందుతూ మృతి చెందారు. ఈ ఘటనపై లాసెల్ పోలీసులు స్పందిస్తూ.. దర్యాప్తు ముమ్మరంగా సాగుతోందని తెలిపారు. అయితే, ప్రస్తుతానికి దీనిని ఒక ఐసోలేటెడ్ (వ్యక్తిగత లేదా అరుదైన) ఘటనగానే పరిగణిస్తున్నామని స్పష్టం చేశారు. నాన్సీ గ్రెవాల్ కుటుంబ సభ్యులకు ప్రగాఢ సానుభూతి తెలిపారు. ప్రజలు ఆందోళన చెందాల్సిన అవసరం లేదని, నిందితులను పట్టుకునేందుకు ఆ ప్రాంతంలోని సిసిటివి ఫుటేజీలను పరిశీలిస్తున్నామని వెల్లడించారు. నాన్సీ హత్యతో కెనడాలోని స్థానిక పంజాబీ కమ్యూనిటీ తీవ్ర దిగ్భ్రాంతికి గురైంది.

## యుద్ధనౌకను ముంచేసిన వీడియోను విడుదల చేసిన అమెరికా రక్షణ శాఖ

**వాషింగ్టన్, మార్చి 5:** శ్రీలంక తీరానికి సమీపంలో ఇరాన్‌కు చెందిన ఐఆర్ఐఎస్ దేనా (ఐఆర్ఐఎస్ దేనా) అనే యుద్ధనౌకను అమెరికా జలాంతర్గామి టార్పెడోతో దాడి చేసి ముంచివేసింది. ఈ ఘటనలో 87మంది ఇరాన్ నావికా సిబ్బంది మరణించగా, మరో 32మందిని రక్షించారు. ఈ దాడికి తామే బాధ్యులమని అమెరికా రక్షణశాఖ (పెంటగాన్) ప్రకటించడమే కాకుండా, ఇందుకు సంబంధించిన వీడియోను కూడా సోషల్ మీడియా ద్వారా విడుదల చేసింది. ఇరాన్ నౌకనుంచి అందిన అత్యవసర సమాచారంతో శ్రీలంక నౌకాదళం రంగంలోకి దిగింది. గాలింపు చర్యలు చేపట్టగా, ఘటనా స్థలంలో నౌకపూర్తిగా మునిగిపోయిందని, కేవలం ఆయిల్ మరకలు, లైఫ్‌జాకెట్లు మాత్రమే కనిపించాయని శ్రీలంక నౌకాదళం వెల్లడించింది. నీటిలో తేలియాడుతున్న సిబ్బందిని గుర్తించి 32 మందిని రక్షించామని, 87మృతదేహాలను వెలికితీశామని తెలిపింది. రక్షించిన వారిని ఆసుపత్రికి తరలించామని, వారిలో కొంతమందికి అత్యవసర చికిత్స అవసరమైందని వెల్లడించింది. కాగా, ప్రమాద

# ఇరాన్ సైనిక శక్తి నిర్వీర్యం

## 'ఆపరేషన్ ఎపిక్ ఫ్యూరీ' విజయవంతం

### అమెరికా అధ్యక్ష భవనం ప్రకటన



**వాషింగ్టన్, మార్చి 5:** ఇరాన్‌పై తాము చేపట్టిన భీకర సైనిక చర్య విజయవంతమైందని, దాని సైనిక సామర్థ్యాన్ని తీవ్రంగా దెబ్బతీశామని అమెరికా ప్రకటించింది. 'ఆపరేషన్ ఎపిక్ ఫ్యూరీ' పేరుతో గత వారాంతంలో ప్రారంభించిన ఈ దాడిలో 2,000కి పైగా లక్ష్యాలను ధ్వంసం చేశామని వైట్‌హౌస్ వెల్లడించింది. అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ తీసుకున్న ఈ నిర్ణయాన్ని సమర్థిస్తూ, ఇరాన్ నుంచి ఎదురవుతున్న ముప్పును తొలగించడమే తమ లక్ష్యమని స్పష్టం చేసింది. వైట్‌హౌస్‌లో ప్రెస్ సెక్రటరీ కరోలిన్ లీవిట్ మాట్లాడుతూ అధ్యక్షుడు ట్రంప్ నాయకత్వంలో ఇరాన్‌లోని ఉగ్రవాద పాలనను పూర్తిగా అణిచివేస్తున్నామని తెలిపారు. ఇరాన్ క్షిపణి సామర్థ్యాన్ని నిర్మూలించడం, దాని నౌకాదళాన్ని నాశనం చేయడం, అణ్వాయుధాలు సంపాదించకుండా నిరోధించడమే ఈ ఆపరేషన్ ముఖ్య ఉద్దేశాలని వివరించారు. ఈ దాడుల్లో వందల కొద్దీ బాలిస్టిక్ క్షిపణులు, లాంచర్లు, డ్రోన్‌లను నాశనం చేశామని పేర్కొన్నారు. ఇప్పటివరకు ఆపరేషన్ ఎపిక్ ఫ్యూరీ గొప్ప విజయం సాధించిందని ఆమె అన్నారు. ఈ సైనిక చర్యలో ఇరాన్ నౌకాదళానికి భారీ నష్టం వాటిల్లినట్లు లీవిట్ తెలిపారు. 'రెండో ప్రపంచ యుద్ధం తర్వాత మొదటిసారిగా టార్పెడోను ఉపయోగించి, ఇరాన్‌కు చెందిన అత్యంత కీలకమైన సబ్‌మెరైన్‌తో సహా 20కి పైగా నౌకలను ధ్వంసం చేశాం. ప్రస్తుతం అరేబియా గల్ఫ్, హార్ముజ్ జలసంధి, ఒమన్ గల్ఫ్‌లో ఒక్క ఇరాన్ నౌక కూడా సంచరించడం లేదు' అని ఆమె వివరించారు. ఆపరేషన్ మొదలైనప్పటి నుంచి ఇరాన్ క్షిపణి ప్రయోగాలు 86 శాతం తగ్గాయని చెప్పారు. ఈ దాడుల్లో ఇరాన్ అత్యున్నత నాయకత్వాన్ని లక్ష్యంగా చేసుకున్నట్లు లీవిట్ తెలిపారు. 'ఇరాన్ సుప్రీం లీడర్‌తో సహా 49 మంది అత్యంత సీనియర్ నాయకులను ఇప్పటికే అంతమొందించాం. ఈ క్రూరమైన ఉగ్రవాదులను చంపడం అమెరికాకు మంచిది, ప్రపంచాన్ని సురక్షితంగా మారుస్తుంది' అని ఆమె వ్యాఖ్యానించారు. అయితే, ఈ ఆపరేషన్‌లో ఆరుగురు అమెరికా సైనికులు ప్రాణాలుకోల్పోయారని ప్రభుత్వం అంగీకరించింది. మధ్యప్రాచ్యంలో చిక్కుకున్న అమెరికా పౌరులను సురక్షితంగా తరలిస్తున్నామని, ఇప్పటివరకు 17,500 మందికి పైగా స్వదేశానికి తిరిగి వచ్చారని లీవిట్ వెల్లడించారు. ఇరాన్‌లో పాలన మార్పు తమ లక్ష్యమా అన్న ప్రశ్నకు ఆమె నేరుగా సమాధానం ఇవ్వలేదు. అయితే, ఇరాన్‌ను ఒక ఉగ్రవాద ప్రభుత్వం నడపడాన్ని తాము కోరుకోవడం లేదని పరోక్షంగా సూచించారు.

# ఇరాన్ 'ఐఆర్‌జిసి'అత్యంత శక్తిమంతం

## సైన్యానికి మించిన కీలకపాత్ర



**టెహ్రాన్, మార్చి 5:** ప్రపంచంలో ఏదేశానికైనా సైన్యం ఒకటే ఉంటుంది. కానీ ఇరాన్‌లో మాత్రమే సైన్యానికి, ప్రభుత్వానికి సమాంతరంగా కొనసాగే వ్యవస్థ ఉంది. అదే, ఇస్లామిక్ రివల్యూషనరీ గార్డ్స్ కోర్ (ఐఆర్‌జిసి). ఇరాన్ రాజకీయ, సైనిక, ఆర్థిక ముఖచిత్రంలో ఐఆర్‌జిసిది అత్యంత కీలకమైన పాత్ర. వాస్తవానికి దేశ సైన్యం కంటే, ప్రభుత్వానికంటే ఈ రివల్యూషనరీ గార్డ్స్‌కే అధికారాలు ఎక్కువ. ఈ విప్లవ సైన్యం కేవలం ఇరాన్ సుప్రీం లీడర్‌కు మాత్రమే జవాబుదారీగా ఉంటుంది. ప్రభుత్వానికి కానీ, ప్రధాని, అధ్యక్షుడు, తదితర వ్యవస్థలకు ఇది ఎలాంటి బాధ్యత వహించదు. దేశ సరిహద్దులను కాపాడటంతో పాటూ ఇస్లామిక్ విప్లవ ఆశయాలను రక్షించడం ఐఆర్‌జిసి ప్రధాన ఉద్దేశ్యం. ఇరాన్‌లో 1979లో జరిగిన ఇస్లామిక్ విప్లవం తర్వాత, అప్పటి సుప్రీం లీడర్ ఆయతొల్లా రుహుల్లా ఖొమేనీ ఈ దళాన్ని స్థాపించారు. అప్పట్లో సాధారణ సైన్యం పాత రాజు (షా) పట్ల విధేయత చూపుతుందనే భయంతో, కేవలం ఇస్లామిక్ వ్యవస్థకు, సుప్రీం లీడర్‌కు మాత్రమే జవాబుదారీగా ఉండేలా ఈ ప్రత్యేక దళాన్ని రూపొందించారు. కాలక్రమేణా ఇది దేశంలోని అన్ని విభాగాలపై పట్టు సాధించి, ఒక శక్తిమంతమైన సామ్రాజ్యంగా ఎదిగింది. ఐఆర్‌జిసికి స్వంతంగా ఆర్మీ, నేవీ, ఎయిర్ ఫోర్స్ విభాగాలు ఉన్నాయి. దీనిలోని రెండు ప్రధాన విభాగాలు కాగా, ఒకటి ఖుద్స్ ఫోర్స్ (ఐఆర్‌జిసి విదేశీ విభాగం), రెండోది బాసిజ్ మిలీషియా (అంతర్గత విభాగం). ఇరాన్ వెలుపల లెబనాన్, సిరియా, ఇరాక్, యెమెన్ వంటి దేశాల్లో సైనిక, వ్యూహాత్మక కార్యకలాపాలను ఖుద్స్ ఫోర్స్ నిర్వహిస్తుంది. హిజ్బుల్లా, హమాస్ వంటి సంస్థలకు మద్దతు ఇవ్వడంలో ఇది కీలకం. దేశంలో తలెత్తే నిరసనలను అణిచివేసేందుకు, విప్లవ వ్యతిరేక కార్యకలాపాలను అడ్డుకోవడానికి బాసిజ్ మిలీషియాను ఉపయోగిస్తారు. ఐఆర్‌జిసి అతిపెద్ద బలం దాని అధికారక్రమం. ఇది ఇరాన్ ప్రభుత్వానికి లేదా అధ్యక్షుడికి జవాబు దారీ కాదు. ఇది నేరుగా దేశ అత్యున్నత నాయకుడైన సుప్రీం లీడర్ ఆదేశాల మేరకు పనిచేస్తుంది. దీనివల్ల దేశ విదేశాంగ విధానంలో, అంతర్గత రాజకీయాల్లో ఐఆర్‌జిసి మాటకే మొగ్గు ఉంటుంది. వాస్తవానికి, ఇరాన్ అణు కార్యక్రమం, క్షిపణి వ్యవస్థల నియంత్రణ కూడా వీరి చేతుల్లోనే ఉంటుంది. ఐఆర్‌జిసి కేవలం ఆయుధాలతోనే కాకుండా, ఆర్థిక బలంతోనూ దేశాన్ని శాసిస్తోంది. ఇరాన్‌పై అంతర్జాతీయ ఆంక్షలు ఉన్నప్పటికీ, దేశంలోని చమురు, గ్యాస్, నిర్మాణం, టెలికమ్యూనికేషన్స్, బ్యాంకింగ్ రంగాల్లోని ప్రధాన కంపెనీలు ఐఆర్ జీసీ నియంత్రణలో ఉన్నాయి. వేల కోట్ల డాలర్ల టర్నోవర్ కలిగిన ఈ వ్యాపార సామ్రాజ్యం ద్వారా వచ్చే ఆదాయాన్ని వారు తమ సైనిక కార్యకలా పాలకు, విదేశీ మద్దతుదారులకు ఉపయోగిస్తారు. ప్రస్తుతం మధ్యప్రాచ్యంలో మారుతున్న రాజకీయ సమీకరణాల వల్ల ఐఆర్‌జిసి తీవ్ర ఒత్తిడిని ఎదుర్కొంటోంది. ముఖ్యంగా ఇజ్రాయెల్, అమెరికాతో పెరుగుతున్న ఉద్రిక్తతలు, అంతర్గతంగా ప్రజల్లో వస్తున్న మార్పులు ఈ దళానికి సవాలుగా మారాయి. ఇటీవల జరిగిన దాడుల్లో కీలక కమాండర్లను కోల్పోయినప్పటికీ, ఇరాన్ మనుగడకు, ఆ ప్రాంతంలో ఇరాన్ ప్రాబల్యానికి ఐఆర్‌జిసి ఇప్పటికీ వెన్నెముకగా నిలుస్తుండటం గమనార్హం.

## మంటల్లో పశ్చిమాసియా



# అమెరికా ట్యాంకర్‌పై ఇరాన్ దాడి

**టెహ్రాన్, మార్చి 5:** హిందూ మహాసముద్రంలో ఇరానియన్ యుద్ధనౌక ఐరిస్ దేనాపై దాడి జరిగిన కొన్ని గంటల తర్వాత, ఇస్లామిక్ రివల్యూషనరీ గార్డ్ కార్ప్స్ (ఐఆర్‌జిసి) ఉత్తర పర్షియన్ గల్ఫ్‌లో ఒక అమెరికన్ ట్యాంకర్‌ను ఢీకొట్టినట్లు ప్రకటించింది. అమెరికా నౌక మంటల్లో చిక్కుకుందని ఇరాన్ మీడియా తెలిపింది. శ్రీలంక తీరంలో ఐరిస్ దేనాపై జరిగిన దాడికి అమెరికా కచ్చితంగా మూల్యం చెల్లించుకుంటుందని ఇరాన్ విదేశాంగ మంత్రి హెచ్చరించిన నేపథ్యంలో ఈ దాడి జరిగింది. శ్రీలంక దక్షిణ తీరంలో తమ యుద్ధనౌకను ముంచిన ఇరవై నాలుగు గంటల్లోనే ఇరాన్ అమెరికా ట్యాంకర్‌పై దాడి చేసింది. అమెరికా, ఇజ్రాయెల్- ఇరాన్ మధ్య తీవ్రస్థాయిలో యుద్ధం కొనసాగుతోంది. ఈ నేపథ్యంలో హార్ముజ్ జలసంధిని మూసివేస్తున్నామని, ఇక్కడి నుంచి ప్రయాణించే నౌకలను పేల్చివేస్తామని ఇరాన్ ప్రకటించింది. అనంతరం శ్రీలంక సమీపంలో ఇరాన్ యుద్ధ నౌక ఐరిస్ దేనాపై అమెరికా దాడి చేసి, ముంచివేసింది. దీనితో గల్ఫ్‌లోని అమెరికా ట్యాంకర్‌పై దాడి చేసి ఇరాన్ ప్రతీకారం తీర్చుకుందని మీడియా కథనాలు వెల్లడిస్తున్నాయి.

# ఇరాన్ యుద్ధనౌకపై అమెరికా దాడి భారత్‌కూ ప్రమాదకరమే: శ్రీలంక

**కొలంబో, మార్చి 5:** అమెరికా, ఇజ్రాయెల్ ఇరాన్ మధ్య నడుస్తున్న యుద్ధం ఇప్పుడు హిందూ మహాసముద్రానికి పాకింది. శ్రీలంక తీరానికి సమీపంలో ఇరాన్ యుద్ధనౌకను బుధవారం అమెరికాకు చెందిన ఒక జలాంతర్గామి ముంచివేయడం అంతర్జాతీయంగా పెను సంచలనం సృష్టిస్తోంది. ఈ ఘటనపై శ్రీలంక ఎంపీ నామల్ రాజపక్స స్పందిస్తూ, ఇది కేవలం శ్రీలంకకే కాకుండా భారత్ సహా మొత్తం దక్షిణాసియా ప్రాంత భద్రతకు పెను ముప్పు అని హెచ్చరించారు. ఈ ఆపరేషన్ గురించి శ్రీలంక ప్రభుత్వానికి ముందే తెలుసా? అని నామల్ రాజపక్స నిలదీశారు. ఒకవేళ తెలిస్తే ప్రజలకు ఎందుకు వెల్లడించలేదని, తెలియకుండానే మన జలాల్లో ఇంత పెద్ద దాడి ఎలా జరిగిందని ఆయన ప్రశ్నించారు. ఇది శ్రీలంక సార్వభౌమాధికారానికి సంబంధించిన అంశమని ఆయన పేర్కొన్నారు. గతంలో లిబియా, ఇరాక్, ఆఫ్ఘనిస్థాన్ యుద్ధాల తర్వాత ఏం జరిగిందో మనకు తెలుసని, ఇప్పుడు హిందూ మహా సముద్రంలో ఇలాంటి దాడులు జరగడం వల్ల భారత్, బంగ్లాదేశ్ వంటి పొరుగు దేశాల జాతీయ భద్రతపై ప్రభావం పడుతుందని ఆయన ఆందోళన వ్యక్తం చేశారు. ఈ విషయంలో భారత్ వంటి ప్రాంతీయ భాగస్వాములతో కలిసి శ్రీలంక చర్చలు జరపాలని ఆయన సూచించారు. ఈ అంశాన్ని భారత్ సీరియస్‌గా తీసుకుంటుందనే నమ్మకం తనకు ఉందని అన్నారు.



# శ్రీలంక దిశగా రెండో ఇరాన్ యుద్ధ నౌక

**కొలంబో, మార్చి 5:** అమెరికా, ఇజ్రాయెల్ దేశాలతో యుద్ధం వేళ, మరో ఇరాన్ యుద్ధ నౌక శ్రీలంక దిశగా వెళుతోంది. బుధవారం ఇరాన్‌కు చెందిన యుద్ధనౌక ఐరిస్ దేనాను అమెరికా జలాంతర్గామి దాడి చేసి ముంచివేసిన విషయం తెలిసిందే. ఈ ఘటన తర్వాత ఇరాన్ కూడా అమెరికా ట్యాంకర్‌పై దాడి చేసి ప్రతీకారం తీర్చుకున్నది. ఇలాంటి ఉద్రిక్త పరిస్థితుల్లో మరో ఇరాన్ నౌక శ్రీలంక దిశగా ప్రయాణిస్తోంది. ఈ విషయాన్ని శ్రీలంక మంత్రి నలిందా జయతిస్సా ధ్రువీకరించారు. గురువారం పార్లమెంటులో రెండవ ఇరాన్ నౌక గురించి శ్రీలంక ప్రతిపక్ష నాయకుడు సజిత్ ప్రేమదాస అడిగిన ప్రశ్నకు మంత్రి సలిందా జయతిస్సా సమాధానమిచ్చారు. శ్రీలంక ప్రాదేశిక జలాలకు సమీపంలో ఆ నౌక ఉందని, అందులో ఉన్న వారి ప్రాణాలను రక్షించేందుకు ప్రయత్నాలు చేస్తున్నట్లు వివరించారు. కాగా, ఈ నౌకపై కూడా అమెరికా, ఇజ్రాయెల్ దాడి చేయవచ్చనే ఆందోళనలు వ్యక్తమవుతున్నాయి. ఇందులో దాదాపు 100మందికి పైగా సిబ్బంది ఉన్నారు. అయితే ఈ నౌక అత్యవసర పోర్ట్ కాల్ కోసం ప్రభుత్వ అనుమతిని కోరిందని, క్లియరెన్స్ కోసం వేచి చూస్తున్నట్లు శ్రీలంక ఎంపి నమల్



# ఖమేనీ మృతికి అధికారికంగా సంతాపం తెలిపిన భారత్

**న్యూఢిల్లీ, మార్చి 5:** ఇరాన్ సుప్రీం లీడర్ అయతుల్లా అలీ ఖమేనీ మృతికి భారతదేశం అధికారికంగా సంతాపం ప్రకటించింది. ఇరాన్ అధినేత ఖమేనీ అమెరికా, ఇజ్రాయెల్ దాడిలో ఐదు రోజుల క్రితం మృతి చెందిన విషయం తెలిసిందే. దేశ రాజధాని న్యూఢిల్లీలోని ఇరాన్ రాయబార కార్యాలయంలో విదేశాంగ కార్యదర్శి విక్రమ్ మిస్రీ అధికారికంగా సంతాప సందేశం రాశారు. భారత ప్రభుత్వం తరఫున విదేశాంగ కార్యదర్శి గురువారం ఇరాన్ రాయబార కార్యాలయానికి వెళ్లారు. సంతాప సందేశాన్ని రాసిన అనంతరం మిస్రీ ఇరాన్ రాయబారితో కాసేపు మాట్లాడారు. ప్రస్తుతం పశ్చిమాసియాలో నెలకొన్న పరిస్థితులపై వారు చర్చించినట్లు తెలుస్తోంది. ఫిబ్రవరి 28న అమెరికా, ఇజ్రాయెల్ దేశాల సంయుక్త వైమానిక దాడిలో ఖమేనీ మృతి చెందారు. ఖమేనీ మృతి అనంతరం పశ్చిమాసియాలో భీకర యుద్ధం కొనసాగుతున్న విషయం తెలిసిందే.

# భారత్‌కు రష్యా చమురు భరోసా




**న్యూఢిల్లీ, మార్చి 5:** పశ్చిమ ఆసియాలో యుద్ధ వాతావరణం కొనసాగుతున్న వేళ, అంతర్జాతీయంగా చమురు ధరలు పెరిగే ప్రమాదం ఉందన్న ఆందోళనల నడుమ రష్యా కీలక ప్రకటన చేసింది. ప్రపంచవ్యాప్తంగా ఎలాంటి పరిస్థితులు నెలకొన్నప్పటికీ, భారత్‌కు ముడి చమురు సరఫరా చేసేందుకు తాము ఎల్లప్పుడూ సిద్ధంగానే ఉన్నామని భారత్‌లోని రష్యా రాయబారి డెనిస్ అలిపోవ్ స్పష్టం చేశారు. హార్ముజ్ జలసంధి మూసివేత భయాలు, తద్వారా ప్రపంచవ్యాప్తంగా ఇంధన ధరలు భారీగా పెరిగే అవకాశం ఉందన్న వార్తల నేపథ్యంలో ఆయన ఈ వ్యాఖ్యలు చేశారు. గురువారం న్యూఢిల్లీలో విలేకరులతో మాట్లాడిన అలిపోవ్ చమురు సరఫరాదారులు ఎవరనేది నిర్ణయించుకోవాల్సింది భారత నాయకత్వమేని, అయితే రష్యా మాత్రం భారత్‌కు ఆయిల్ ఇచ్చేందుకు ఎప్పుడూ సానుకూలంగానే ఉంటుందని భరోసా ఇచ్చారు. పశ్చిమ ఆసియాలో జరుగుతున్న ఘర్షణలపై స్పందిస్తూ, సమస్య ఏదైనా చర్చల ద్వారానే పరిష్కారం లభిస్తుందని అలిపోవ్ అభిప్రాయపడ్డారు. వీలైనంత త్వరగా ఈ ఘర్షణలకు ముగింపు పలకాల్సిన అవసరం ఉందన్నారు. ఇదే సమయంలో యుద్ధం ఇంకెంత కాలం కొనసాగుతుందని విలేకరులు ప్రశ్నించగా.. 'ఆ విషయం నాకేం తెలుసు? ఈ ప్రశ్నకు సమాధానం నాకంటే అమెరికాకే బాగా తెలుసు' అని ఆయన వ్యంగ్యంగా బదులిచ్చారు.

6-3Pg6exHMNWJQE.qxd:6-3Pg6exHMNWJQE.qxd 1/1/02 7:09 AM Page 1



# వడ్డెర, రజక,మత్స్యకారులను ఎస్సీ, ఎస్టీలలో చేర్చాలన్న ప్రతిపాదనపై చర్యలు :మంత్రి ఎస్.సవిత



**విజయవాడ,మార్చి 5,ప్రభాతవార్త ప్రతినిధి:** వెనుబడిన సామాజిక వర్గా అభ్యున్నతికి ప్రభుత్వం కృషి చేస్తుందని రాష్ట్ర బిసి సంక్షేమ శాఖ మంత్రి ఎస్.సవిత తెలిపారు. వడ్డెర, రజక,మత్స్యకారులను ఎస్సి, ఎస్టిలలో చేర్చాలన్న ప్రతిపాదనపై తగినరీతిలో చర్యలు తీసుకుంటామన్నారు. అసెంబ్లీలో ఆమె మాట్లాడుతూ వడ్డెర, రజక,మత్స్యకారులను ఎస్సి, ఎస్టిలలో చేర్చాలన్న ప్రతిపాదన కేంద్రం వద్ద పెండింగ్‌లో ఉందన్నారు. ఈ అంశంలో కేంద్రమే నిర్ణయం తీసుకోవాల్సి ఉందన్నారు. రాష్ట్ర ప్రభుత్వ పరిధిలో రిజర్వేషన్ల మార్పు ప్రతిపాదన ఏదీ లేదన్నారు. బిసిల్లో అత్యంత వెనుకబడిన వర్గాలుగా ఉన్న వడ్డెర, రజక,మత్స్యకారులను ఎస్సి, ఎస్టిలలో చేర్చాలన్న ప్రతిపాదన ఎన్నో ఏళ్లుగా కేంద్రం వద్ద ఉందని కానీ పాలకులు ఎన్నికలప్పుడు హామీలు ఇస్తున్నారని ఆ తరువాత విస్మరిస్తున్నారని సభ్యులు మంత్రి దృష్టికి తీసుకుని వెళ్ళారు. కేంద్రంలో టిడిపి కీలకంగా ఉందని అందువల్ల కేంద్రంపై ఒత్తిడి తెచ్చి ఈ మూడు కులాలను గతంలో హామీ ఇచ్చినట్టుగా ఎస్సి, లేదా ఎస్టి కేటగిరిలోకి మార్చేలా కూటమి ప్రభుత్వం కృషి చేయాలన్నారు. గతంలో వైసిపి ప్రభుత్వం కూడా అధికారులతో కమిటీలు వేసిందన్నారు. 1973లో వడ్డెర కులస్తులను ఎస్టిలుగా పరిగణించాలని ప్రతిపాదనతో అప్పటి ప్రభుత్వం కేంద్రానికి పంపినా ఇప్పటి వరకు ఆమోదం పొందలేదని చెప్పారు. గత 50 ఏళ్లకాలంలో పలు మార్లు కేంద్రానికి ప్రతిపాదనలు పంపారని గుర్తు చేశారు. కూటమి ప్రభుత్వం చొరవ తీసుకుని కేంద్రంపై ఒత్తిడి తెచ్చి ఎన్నికలలో హామీ ఇచ్చినట్టుగా ఈ మూడు కులాల వారికి న్యాయం చేయాలన్నారు. మంత్రి సవిత సమాధానం చెబుతూ 2014-19లో వడ్డెర్లకు, రజకులకు, మత్స్యకారులతో పాటు ఇతర కులాల వారికి అధిక ప్రాధాన్యం ఇచ్చామన్నారు. ప్రతి బిసి కుటుంబం పారిశ్రామికంగా అభివృద్ధి చెందాలన్నారు. గతంలో ఆదరణ, ఆదరణ2 పథకాలను ప్రారంభించిన ఘనత సీఎం చంద్రబాబుదేనని తెలిపారు. త్వరలో ప్రారంభించబోయే ఆదరణ 3.0లో వడ్డెర్లకు ప్రాధాన్యమిస్తున్నామన్నారు. వడ్డెర్లకు మైనింగ్ లీజు కేటాయింపుల్లో 15 శాతం రిజర్వేషన్లు, సీనరేజీలో 50 శాతం మినహాయింపు ఇచ్చే ఆలోచన ఉందన్నారు. సముద్రంలో చేపల వేట నిషేధం కాలంలో మత్స్యకారులకు(పల్లెకారులు) ఇచ్చే ఆర్థిక సాయం రూ.10 వేల నుంచి రూ.20 వేలకు పెంచామన్నారు. రాబోయే ఆదరణ 3.0 పథకంలో రజకులకు వాషింగ్ మిషన్లు, ఆధునిక పరికరాలు అంద జేయబోతున్నామన్నారు.



# ముగిసిన సునీల్ నాయక్ తొలి రోజు విచారణ

**హైకోర్టు ఆదేశాలతో విచారణకు హాజరైన సునీల్ నాయక్**

**గుంటూరు సీసీఎస్ పోలీస్ స్టేషన్‌లో 7 గంటలు పోలీసుల ప్రశ్నలు**

**పొంతన లేని సమాధానాలు చెప్పినట్లు సమాచారం**

**9వరకు కొనసాగనున్న విచారణ**

**గుంటూరు మార్చి 5 ప్రభాత వార్త ప్రతినిధి :** గత వైసీపీ ప్రభుత్వ హయాంలో అప్పటి ఎంపీ, ప్రస్తుత ఏపీ అసెంబ్లీ డిప్యూటీ స్పీకర్ రఘురామకృష్ణరాజు కస్టోడియల్ టార్చర్ కేసులో కీలక పరిణామం చోటుచేసుకుంది. ఈ కేసులో ఏడో నిందితుడిగా ఉన్న బీహార్ క్యాడర్ ఐపీఎస్ అధికారి సునీల్ నాయక్ గుంటూరు సి సి ఎస్ పోలీసు స్టేషన్లో విచారణకు హాజరయ్యారు. హైకోర్టు ఆదేశాల మేరకు గురువారం సీసీఎస్ పోలీస్ స్టేషన్‌లో దర్యాప్తు అధికారి, విజయనగరం ఎస్పీ దామోదర్ ఎదుట హాజరయ్యారు. తొలి రోజు సుమారు 7 గంటల పాటు సాగిన ఈ విచారణలో పోలీసులు అనేక ప్రశ్నలు సంధించినట్లు సమాచారం.పోలీసులు అడిగిన ప్రశ్నలకు సునీల్ నాయక్ అసంపూర్తిగా, పొంతన లేని సమాధానాలు ఇచ్చినట్లు తెలుస్తోంది. తిరిగి శుక్రవారం ఉదయం 10 గంటలకు సునీల్ నాయక్ పోలీసుల ఎదుట విచారణకు హాజరుకానున్నారు. ఈ విచారణ ఈనెల 9వ తేదీ వరకు కొనసాగనుంది. గత వైసీపీ ప్రభుత్వం 2021 మే నెలలో నాడు నరసాపురం ఎంపీగా ఉన్న రఘురామకృష్ణ రాజును హైదరాబాద్‌లోని ఆయన నివాసంలో అరెస్టు చేసి గుంటూరు సీఐడీ కార్యాలయానికి తరలించారు. ఆ రోజు రాత్రంతా ఆయనను సీఐడీ కార్యాలయంలోనే ఉంచారు. ఆ సమయంలో సీఐడీ డీఐజీగా ఉన్న సునీల్ నాయక్ ఆ రాత్రి వేళ పలుమార్లు సీఐడీ ప్రాంతీయ కార్యాలయానికి వెళ్లినట్లు దర్యాప్తులో ఆధారాలు లభించాయి. దీంతో, ఆయనను ఈ కేసులో ఏ7గా చేర్చారు. విచారణకు రావాలంటూ పలుమార్లు నోటీసులు ఇచ్చినా ఆయన హాజరు కాలేదు. ఈ క్రమంలో, సునీల్ నాయక్ ను అరెస్టు చేసేందుకు పోలీసులు పాట్నా వరకు వెళ్లినా, సాంకేతిక కారణాల వల్ల తీసుకురాలేకపోయారు. అయితే, ముందస్తు బెయిల్ కోసం ఏపీ హైకోర్టును ఆశ్రయించిన సునీల్ నాయక్‌కు నిరాశ ఎదురైంది. విచారణకు హాజరు కావాలని హైకోర్టు ఆదేశించడంతో గురువారం విచారణకు హాజరయ్యారు.

# లిక్కర్ స్కామ్ నిందితుడు బూనేటి చాణక్య అక్రమ ఆస్తులు జప్తు!

**విజయవాడ,మార్చి5,ప్రభాతవార్తప్రతినిధి:**వైఎస్సార్సీపీ హయాంలో జరిగిన మద్యం కుంభకోణం కేసులో ప్రధాన నిందితుడైన రాజ్ కెసిరెడ్డికి ముఖ్య అనుచరుడు, డిస్టిలరీల నుంచి ముడుపుల సొమ్ము వసూళ్ల నెట్‌వర్క్ నిర్వహణలో కీలక పాత్ర పోషించిన బూనేటి చాణక్య, అలా రాబట్టిన సొమ్ముతో తెలంగాణలోని పలు ప్రాంతాల్లో 11.29 ఎకరాల భూమిని కొన్నట్లు సిట్ దర్యాప్తులో వెల్లడైంది. వాటి మార్కెట్ విలువ రూ.6.09 కోట్లు అయితే కేవలం రూ.1.67 కోట్లకే కొన్నట్లుగా రిజిస్ట్రేషన్ చేయించినట్లు బయటపడింది. అంతేగాక ఈ భూముల కొనుగోలుకు మొత్తం నగదు రూపంలోనే చెల్లింపులు చేసినట్లు రుజువైంది.2021 -22 నుంచి 2024- 25 మధ్య తన ఆదాయం రూ.87.09 లక్షలుగా చూపి ఆదాయపు పన్ను రిటర్న్‌లు దాఖలు చేసిన బూనేటి చాణక్య ఆ సమయంలోనే రూ.6.09 కోట్ల విలువైన ఆస్తులు కొన్నట్లు సిట్ దర్యాప్తులో వెల్లడైంది. కేవలం మద్యం ముడుపుల సొమ్ముతోనే ఈ ఆస్తులన్నీ సమకూర్చుకున్నట్లు గుర్తించింది. ఈ ఆస్తుల జప్తు కోసం న్యాయస్థానంలో పిటిషన్ దాఖలు చేసేందుకు అనుమతి కోరుతూ ప్రతిపాదనలు పంపించగా రాష్ట్ర ప్రభుత్వం సైతం ఆమోదం తెలిపింది. ఈ క్రమంలోనే అనుమతిని జారీ చేస్తూ హోంశాఖ ముఖ్య కార్యదర్శి కుమార్ విశ్వజిత్ ఉత్తర్వులు జారీ చేశారు. 2021- 22 నుంచి 202425 మధ్య కాలంలో చాణక్య ఎక్కడెక్కడ ఆస్తులు కొన్నారో వాటి పూర్తి వివరాలివ్వాలని కోరుతూ సిట్ అధికారులు కొద్ది రోజుల కిందట తెలంగాణ రాష్ట్రంలోని కందుకూరు, శంషాబాద్, మహేశ్వరం, మేడ్చల్, కొత్తూరు, కుల్చారాం సబ్‌రిజిస్ట్రార్‌లకు లేఖలు రాశారు. ఇప్పుడు అధికారుల చేతికి ఆ ఆస్తుల వివరాలన్నీ అందాయి. వాటిని విశ్లేషించగా రంగారెడ్డి జిల్లా కొత్తూరు మండలం సిద్దాపూర్, శంషాబాద్ సమీపంలోని గొల్లపల్లె కలాన్, కందుకూరు మండలం చిప్పల్‌పల్లె, మెదక్ జిల్లా కుల్చారం మండలం మహమ్మద్‌పూర్, మేడ్చల్ మల్కాజిగిరి జిల్లా గుండ్లపోచంపల్లె గ్రామాల్లో మొత్తంగా 14 ఆస్తులు చాణక్య కొన్నట్లు సిట్ దర్యాప్తులో తేలింది. సిద్దాపూర్ గ్రామంలో ఒక చోట ఎకరా విలువ రూ.30 లక్షలుంటే దానిని కేవలం రూ.9.99 లక్షలకే కొన్నట్లు చూపించుకుని 2 ఎకరాలు కొన్నారు. ఇలా మొత్తం రూ.60 లక్షలకు రూ.50 లక్షలు నగదు రూపంలో, మిగత రూ.10 లక్షలు బ్యాంకు ఖాతా ద్వారా ఇచ్చారు. ఇదంతా కూడా ముడుపుల సొత్తే. అలాగే సిద్దాపూర్‌లోనే ఇంకోచోట 0.19 గుంటల విలువ రూ.53.20 లక్షలు కాగా, దాన్ని రూ.4.15 లక్షలకు కొన్నట్లు రికార్డుల్లో చూపారు. ఆ మొత్తమే బ్యాంకు ఖాతా ద్వారా చెల్లించారు. మిగతాదంతా నగదు రూపంలోనే ఇచ్చారు. ఇలా మొత్తం 14 ఆస్తుల కొనుగోలుకు నగదు రూపంలోనే సొమ్ము చెల్లించారని తెలింది.

# రాజాం జంట చోరీ కేసులలో ఇద్దరు నిందితులను అరెస్టు చేసిన పోలీసులు

**(విజయనగరం జిల్లా ) :** విజయనగరం జిల్లా రాజాంలోని జి.ఎం.ఆర్.క్వార్టర్సు లో ఫిబ్రవరి 1న జరిగిన జంట చోరీ కేసులలో మధ్యప్రదేశ్ ధార్ జిల్లాకు చెందిన ఇద్దరు నిందితులను అరెస్టు చేసి, వారి వద్ద నుండి 470 గ్రాముల బంగారు ఆభరణాలను రికవరీ చేసినట్లు జిల్లా పోలీసు అధికారులు చెప్పారు. గురువారం నిర్వహించిన పాత్రికేయుల సమావేశంలో అదనపు ఎస్పీ పి.సౌమ్యలత ఇందుకు సంబంధించిన వివరాలను వెల్లడించారు. రాజాం పట్టణంలో జి.ఎం.ఆర్.క్వార్టర్సు లో నివాసం ఉంటున్న జి.ఎం.ఆర్.కేర్ ఆసుపత్రి డా.నాగేష్ దసర్వార్, జి.ఎం.ఆర్.ఐ.టి.లో అసోసియేట్ ప్రొఫెసరుగా పని చేస్తున్న గద్దం మాధవ కృష్ణారెడ్డి ఇళ్లల్లోకి గుర్తు తెలియని వ్యక్తులు ఫిబ్రవరి 1న రాత్రి ప్రవేసించి, ఇళ్ల తాళాలు విరగ్గొట్టి, డా.నాగేష్ దసర్వార్ ఇంటిలో 1278 గ్రాముల బంగారు ఆభరణాలను, అసోసియేట్ ప్రొఫెసరు గద్దం మాధవ కృష్ణారెడ్డి ఇంటిలో 245 గ్రాముల బంగారు ఆభరణాలు దొంగిలించుకొని పోయినట్లుగా గుర్తించి, వారు ఇచ్చిన ఫిర్యాదుల మేరకు సంతకవిటి పోలీసులు రెండు కేసులు నమోదు చేసారన్నారు. దొంగతనం జరిగిన వెంటనే పోలీసులు ఘటనా స్థలానికి చేరుకొని, డాగ్ స్క్వాడ్ తో తనిఖీ చేయించి, క్లూస్ టీంతో క్షుణ్ణంగా పరిశీలించమన్నారు. కేసుని ఛేధించేందుకు సి.సి.ఎస్.పోలీసుల సహకారంతో నలుగురు ఇన్స్పెక్టర్ల ఆధ్వర్యంలో 12మంది ఎస్ఐలు, ఇతర పోలీసు సిబ్బందితో అయిదు బృందాలను ఏర్పాటు చేసి, నిందితులను ట్రాక్ చేసేందుకు చర్యలు చేపట్టామన్నారు. టెక్నికల్ ఆధారాలయిన సిసిటివి ఫుటేజితో ఈ నేరానికి పాల్పడిన వ్యక్తులను మధ్యప్రదేశ్ రాష్ట్రం ధార్ జిల్లాకు చెందిన గ్యాంగుగా గుర్తించామన్నారు. ఈ గ్యాంగు కదలికలను గుర్తించేందుకు ప్రత్యేకంగా పోలీసు బృందాలు మధ్యప్రదేశ్ ధార్ జిల్లాకు వెళ్ళాయన్నారు. రాజాం పట్టణంలో దొంగతనాలను నియంత్రించేందుకు రాత్రి పెట్రోలింగును,

గస్తీని ముమ్మరం చేసామన్నారు. ఈ క్రమంలో ఈ నేరాలకు పాల్పడిన వారిని అరెస్ట్ చేశామన్నారు. నిందితులను గుర్తించి, అరెస్టు చేయుటలోను, చోరీ సొత్తును రికవరీ చేయుటలో క్రియాశీలకంగా పని చేసిన చీపురుపల్లి డిఎస్పీ ఎస్.రాఘవులు, రాజాం రూరల్ సిఐ హెచ్. ఉపేంద్ర, ఎస్ఐలు ఆర్.గోపాలరావు, కే.లక్ష్మణరావు, షేక్ శంకర్, హెడ్ కానిస్టేబుళ్ళు ఇమ్రాన్ ఖాన్, డి.శంకరరావు, ఇతర పోలీసు అధికారులు, సిబ్బందిని అదనపు ఎస్పీ పి. సౌమ్యలత అభినందించారు.

# లడ్డూల కల్తీపై సిట్ నివేదిక బహిర్గతం చేయాలి

**- లౌకికవాదానికి టిడిపి స్వస్తి - సిపిఎం రాష్ట్ర కార్యదర్శి శ్రీనివాసరావు**

**తిరుపతి,మార్చి 5ప్రభాతవార్తప్రతినిధి:** తిరుమల లడ్డు వివాదానికి రాజకీయ రంగు పులిమి ఇప్పుడు మత వివాదంగా మార్చాలని టిడిపి చేస్తున్న ప్రయత్నాలు మంచిదికాదని, లౌకికవాదానికి పూర్తిగా స్వస్తి పలికి ఆర్ఎస్ఎస్ వంటి మతోన్మాద సంస్థలను మించి టిడిపి ప్రవర్తిస్తోందన్న భావన కలుగుతున్నదని సిపిఎం రాష్ట్ర కార్యదర్శి వి. శ్రీనివాసరావు తీవ్ర ఆరోపణలు చేశారు. రాష్ట్రంలో లడ్డు వివాదం తప్ప మరో సమస్య లేనట్టుగా పాలక, ప్రధాన ప్రతిపక్షాలు గత నెల రోజుల నుండిమాట్లాడుతుండటం వారి బాధ్యతా రాహిత్యానికి పరాకాష్టగా ఆయన అభివర్ణించారు. కల్తీకి పాల్పడిన వారిపై చర్యలు తీసుకోవడం మరచి అనవసర రాద్ధాంతాలతో పూటకో మాట మాట్లాడుతూ కూటమిలోని ప్రభుత్వ పెద్దలు బాధ్యతా రాహిత్యంగా తయారయ్యారని విమర్శించారు. గురువారం తిరుపతిలో జరిగిన ఓ కార్యక్రమంలో ఆయన మీడియాతో మాట్లాడారు. శాసనమండలిలో ఛైర్మన్ కు మతం రంగు పులమటం, సిట్ నివేదికను ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలకు కూడా ఇవ్వకుండా ,బాధ్యులపై చర్యలు తీసుకోకుండా ప్రభుత్వం ప్రకటన చేయడంలో అర్థం ఏమిటని ప్రశ్నించారు. మొదట లడ్డూ సమస్యను రాజకీయ సమస్యగా మార్చి, అనంతరం మత సమస్యగా మార్చారని విమర్శించారు. మొదట ఈ వివాదానికి కారణం చంద్రబాబేనని ఆయన అన్నారు. లడ్డూలో జంతు కొవ్వు, రసాయనాలు కలిశాయని పదేపదే ఆరోపణలు చేసి నివేదిక రాకముందే భక్తుల మనోభావాలతో చెలగాటం ఆడారని, నివేదిక వచ్చిన తర్వాత కూడా నివేదిక బయట పెట్టకుండా అవినీతిపరులను రక్షి చే కార్యక్రమంగా వ్యవహరిస్తున్నారని శ్రీనివాసరావు అన్నారు. సిట్ నివేదికను బయట పెట్టక ముందే మరొక కమిటీ వేయటంలో ప్రయోజనం ఏమిటని ఆయన ప్రశ్నించారు. ఏకసభ్య కమిటీలో సిట్టింగ్ జడ్జి లేదని, దీనివల్ల ప్రయోజనం ఏమిటని ఆయన ప్రశ్నించారు. ఈ వివాదాన్ని సాగదీస్తూ ప్రయోజనం పొందాలన్న కుట్ర బుద్ధి దాగి ఉందని, ప్రభుత్వంలో చిత్తశుద్ధి కొరవడిందని తీవ్రమైన ఆరోపణలు చేశారు. వైసీపీకి, టిడిపికి అనిల్ కుమార్ సింఘాల్ వంటి ఐఎఎస్ అధికారి ఎందుకు ఇష్టుడయ్యారని ప్రశ్నించారు. కేంద్ర బిజెపి పెద్దలను సంతృప్తి పరచడానికే రెండవ దఫా టిటిడి ఇఒగా అనిల్ కుమార్ సింఘాల్ ను నియమించారని ,లడ్డు కల్తీలో ఆయన బాధ్యుడని సిట్ నిర్ణయించిన తర్వాత చర్యలు తీసుకోకుండా బదలీతో సరిపెట్టారని తీవ్ర స్థాయిలో విరుచుకుపడ్డారు.




కేంద్ర ప్రభుత్వ పెద్దలను సంతృప్తి పరచడానికే ప్రభుత్వం ఈ రకంగా వ్యవహరించందని అన్నారు. ఉపముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్ లడ్డు కల్తీ విషయంలో మాజీ ముఖ్యమంత్రి కి సంబంధం లేదని ప్రకటన చేస్తున్నారని, ముఖ్యమంత్రి చంద్రబాబు జగన్ కు సంబంధం ఉందని మాట్లాడుతారని పూటకో మాటగా అర్థం లేని వ్యవహారంగా కూటమి ప్రభుత్వ తీరు తయారైందని శ్రీనివాసరావు అన్నారు. రాష్ట్రంలో వివిధ వర్గాల ప్రజానీకంలో తీవ్రస్థాయిలో అసంతృప్తి పెరుగుతున్నదని ఈ అసంతృప్తిని బయటికి వెల్లడి కానివ్వకుండా ఉండటానికి లడ్డూ లాంటి వివాదాలను రోజూ చర్చనీయాంశం చేస్తూ ప్రజా ఉద్యమాలను, అసంతృప్తిని పక్కదోవ పట్టించడానికి ప్రభుత్వం ప్రయత్నిస్తోందని అన్నారు. ఈ మీడియా సమావేశంలో సిపిఎం నేత కందారపు మురళి,వందవాసి నాగరాజు,ఎస్ జయచంద్ర తదితరులు పాల్గొన్నారు.

# కుంభాభిషేక ఉత్సవాలకు సర్వం సిద్ధం : ఇఒ వికె శీనా నాయక్



ఆంజనేయ స్వామివారి జెండాలను ఆవిష్కరిస్తున్న దృశ్యం

**ఇంద్రకీలాద్రి, మార్చి 5, ప్రభాతవార్త :** దుర్గమ్మవారి ఆలయంలో శుక్రవారం నుండి 8వ తేదీ ఆదివారం వరకు జరగబోయే కుంభాభిషేక ఉత్సవాలకు అన్ని ఏర్పాట్లు సిద్ధం చేశామని ఇఒ వికె శీనా నాయక్ తెలిపారు.

**- ఉత్సవాలకు శ్రీ ఆంజనేయస్వామివారి జెండా ఆవిష్కరణ:** శ్రీ దుర్గా మల్లేశ్వర స్వామి వారి దేవస్థానంలో గురువారం ఆధ్యాత్మిక శోభ సంతరించుకుంది. ఆలయ ఇఒ సీనానాయక్, ఉప ప్రధాన అర్చకులు శాండిల్య మరియు ఇతర అర్చక బృందం సమక్షంలో ఆలయ విమాన గోపురంపై శ్రీ ఆంజనేయ స్వామి జెండాలను అత్యంత భక్తిశ్రద్ధలతో ఆవిష్కరించారు. ఆధ్యాత్మిక సంప్రదాయం శాస్త్రోక్తంగా పూజలు నిర్వహించి, వేద మంత్రోచ్చారణల మధ్య విమాన గోపురంపై హనుమత్ ధ్వజాలను ప్రతిష్టించారు. భక్తుల రక్షణకు, క్షేమానికి చిహ్నమైన ఆంజనేయ స్వామి వారి జెండాలను ఆవిష్కరించడం వల్ల అమ్మవారిని దర్శించుకునే భక్తులకు మరింత శుభం కలుగుతుందని అర్చక స్వాములు పేర్కొన్నారు. శుక్రవారం కుంభాభిషేకం సందర్భంగా ఉదయం 7గంటలకు శ్రీ కనకదుర్గా నగర్ ప్రారంభం నుండి అర్చక బృందం కలశాలతో ఊరేగింపుగా ఇంద్రకీలాద్రికి చేరుకుంటారని ఇఒ వికె శీనా నాయక్ తెలిపారు. ఉదయం 8 గంటలకు యాగశాల ప్రవేశం, గణపతి పూజ, సాయంత్రం 4 నుండి అంకురార్పణ, రాత్రి 7కు మంత్రపుష్పం జరుగుతాయన్నారు.

**- ఆర్జిత సేవలు రద్దు:** శ్రీ దుర్గా మల్లేశ్వర స్వామి వార్ల దేవస్థానంలో కుంభాభిషేకం పురస్కరించుకుని భక్తులకు ఆలయంలో నిర్వహించే అన్ని రకాల ఆర్జిత సేవలను రద్దు చేసినట్లు ఇఒ వికె శీనా నాయక్ తెలిపారు. ఈ 4 రోజుల పాటు అన్ని సేవలను, ప్రత్యేక పూజలను దేవస్థానమే "సర్కార్ సేవ" కింద పరోక్షంగా సేవలు నిర్వహిస్తుంది. కుంభాభిషేకం సందర్భంగా ఈనెల 6 నుండి 8వ తేదీ వరకు అమ్మవారి అంతరాలయ దర్శనాలను నిలిపివేసి ముఖ మండపం, సర్వదర్శనం క్యూ లైన్ల ద్వారా మాత్రమే శ్రీ అమ్మవారి దర్శనం వుంటుందని తెలిపారు. ఉత్సవాల సమయంలో భక్తుల రద్దీని దృష్టిలో ఉంచుకుని, సామాన్య భక్తులకు ఇబ్బంది కలగకుండా ఆలయ యంత్రాంగం అన్ని ఏర్పాట్లు చేస్తోంది. భక్తులు దేవస్థానం సూచనలను పాటించి, అమ్మవారి కృపకు పాత్రులు కావాలని దేవస్థాన ఈవో విజ్ఞప్తి చేస్తున్నారు.

**- నిత్యాన్నదాన పథకానికి విరాళం:** ఇంద్రకీలాద్రిపై కొలువుదీరిన శ్రీ కనకదుర్గమ్మ వారికి నిత్య అన్నదాన పథకం నిమిత్తం పశ్చిమగోదావరి జిల్లా, పెనుగొండ వాస్తవ్యులు చిట్టెనిడి చిరంజీవి దుర్గ శేష సాయి కుటుంబ సభ్యులు శ్రీ చిట్టెనిడి వెంకట సూర్యనారాయణ రు.1,01,116/ ల విరాళం గురువారం అందించారు. ఆయా దాతలకు దుర్గమ్మవారి దర్శనం కల్పించిన అనంతరం శ్రీ అమ్మవారి చిత్రపటం, ప్రసాదం, శేషవస్త్రం అందించారు.

# ఎపిలో ఆధునిక రీసెర్చ్ సంస్థగా ఎయిమ్స్!

**: కేంద్రమంత్రి డా. పెమ్మసాని**



**గుంటూరు మార్చి 5 ప్రభాత వార్త ప్రతినిధి:** :మంగళగిరిలోని ఎయిమ్స్ హాస్పిటల్ లో సౌకర్యాల అభివృద్ధి అంశాలపై అధికారులతో కేంద్ర సహాయ మంత్రి డాక్టర్ పెమ్మసాని చంద్రశేఖర్ గురువారం సమీక్షి ంచారు. ఈ సందర్భంగా డా. పెమ్మసాని మాట్లాడుతూ కూటమి ప్రభుత్వం వచ్చిన తర్వాత ఎయిమ్స్ లో ఉన్నటువంటి సమస్యలను ఎలా అధిగమించాలని అంశంపై గతంలో రివ్యూలో సమీక్షి ంచి ఎయిమ్స్ ను ఆంధ్రప్రదేశ్ కు గొప్ప రీసెర్చ్ , అకడమిక్ ఇన్స్టిట్యూట్ గా చేయాలనే ఉద్దేశంతో ఫైనాన్స్ మినిస్ట్రీ దగ్గర విషయాన్ని తీసుకెళ్లి దాదాపుగా 500 లకు పైగా పోస్టులను తీసుకురాగలిగామని అన్నారు. గతంలో 12 ఆపరేషన్ థియేటర్స్ ఉంటే ప్రస్తుతం 87 థియేటర్స్ వున్నాయని తెలిపారు. గతంలో మూడు ఫార్మసీ కౌంటర్లు ఉంటే ఇప్పుడు మూడు నుంచి ఏడు ఫార్మసీ కౌంటర్లు పేషంట్లకు అందుబాటులో ఉన్నాయని అన్నారు. బస్సు షెల్టర్ కావాలంటే అందుబాటులోకి తీసుకువచ్చామని హైవే నుంచి వచ్చేవాళ్ళకు అనుకూలంగా ఉండేలా ర్యాంప్ నిర్మాణానికి అనుమతులు తీసుకున్నామని తెలిపారు.

# టిటిడి ఛైర్మన్ పై చర్యలు తీసుకోవాలి

**శాసనమండలిలో వైఎస్సార్సీ సభ్యుల డిమాండ్**

**సచివాలయం,మార్చి 5,ప్రభాతవార్త :** రాష్ట్రంలో ఆరోపణలు ఎదుర్కొంటున్న టిటిడి ఛైర్మన్ పై చర్యలు తీసుకోవాలని వైకాపా సభ్యులు డిమాండ్ చేశారు.గురువారం మండలి ఛైర్మన్ మోషేన్‌రాజు అధ్యక్షతన జరిగినప్రశ్నోత్తరాల కార్యక్రమం అనంతరం డిమాండ్ చేశారు. ప్రశ్నోత్తరాల అనంతరం స్పెషల్ మెన్షన్స్ కు మండలి ఛైర్మన్ అనుమతి ఇచ్చారు. టిటిడి లడ్డూ ప్రసాదంపై మండలిలో చర్చ ముగిసినట్లు తెలిపిన ఛైర్నన్...లడ్డూ తయారీలో కల్తీనెయ్యి వినియోగంపై మంత్రి స్టేట్‌మెంట్ ఇవ్వాలని కోరిన మండలి ఛైర్మన్.... టీటిడి ఛైర్మన్ పై చర్యలు తీసుకోవాలని పోడియంను చుట్టుముట్టి వైసీపీ సభ్యుల ఆందోళన ...మండలి ఛైర్మన్‌ను కించపరుస్తూ సోషల్ మీడియాలో పెట్టన పోస్టింగులు తొలగించాలని నినాదాలు.

**- శాసనమండలి ఛైర్మన్‌ను అవమానిస్తున్నారంటూ సభలో వైసీపీ సభ్యుల ఆందోళన**

తాను హిందూవునంటూ మండలి ఛైర్మన్ ప్రకటించిన అంశంపై సోషల్ మీడియాలో పోస్టింగులు పెట్టారు.శాసనమండలి ఛైర్మన్‌ను కించపరుస్తూ సోషల్ మీడియాలో పోస్టింగులు ట్రోలింగ్ చేస్తున్నారు.మండలి ఛైర్మన్‌ను అవమాన పరిచేలా విపరీతంగా ట్రోల్ చేస్తున్నారు.పోస్టులు పెట్టిన వారంతా తెలుగుదేశం వారికి చెందిన వారే మండలి ఛైర్మన్ పట్ల ప్రోటోకాల్ పాటించకుండా పలుమార్లు అవమానిస్తున్నారని లేళ్ళ అప్పిరెడ్డి అన్నారు. నిన్న జరిగిన ఘటన దురదృష్టకరం,సోషల్ మీడియాలో తనపై ప్రచారం పై మీరు ఫిర్యాదు చేస్తే నేను ప్రభుత్వానికి ఫిర్యాదు చేస్తా,కారణమై వారిపైతగిన చర్యలు తీసుకోవాలని ప్రభుత్వాన్ని కోరతా అని మండలి ఛైర్మన్ వారిని శాంతింప చేశారు. మంత్రి అచ్చెన్నాయుడు మాట్లాడుతూ...సోషల్ మీడియాలో పోస్టింగులు పెట్టింది వైసీపీ వారే..వారే ప్రస్తావిస్తున్నారని అన్నారు.నేను నిన్న ఏమతాన్ని,కులాన్ని ,దేవుడ్ని కించపరచలేదు.వైఎస్ జగన్ నూటికి వెయ్యిశాతం క్రిస్టియన్ అని చెబుతున్నా..నేను మాట్లాడి 24గంటలైనా ఇంకా ఎ ందుకు క్రిస్టియన్ కాదని చెప్పలేదు.ఎప్పుడూ ఇంత అన్యాయంగా కుట్ర పూరితంగా తిరుమల పవిత్రత దెబ్బతీయలేదు.వాస్తవాలు హిందూ సమాజానికి తెలుస్తాయని సంబంధం లేని అంశాలపై సభలో గొడవ చేస్తున్నారని అన్నారు. అన్ని మతాల విశ్వాసాలు కాపాడేందుకు కూటమి ప్రభుత్వం కట్టుబడి ఉందని,ఆలయాలు,మసీదులు,చర్చీల భద్రతపై ప్రభుత్వం ప్రత్యేక చర్యలు తీసుకుంటుందన్నారు.ఎవరి మత విశ్వాసాలు దెబ్బతీసేలా వ్యవహరించినా వారిపై ప్రభుత్వం చర్యలు తీసుకుంటుందన్నారు. తిరుమల దేవస్థానానికి విశిష్ట చరిత్ర ఉంది.

# శ్రీకాళహస్తీశ్వరాలయ కొత్త ఇఒగా వెంకటేశు బాధ్యతల స్వీకరణ



శ్రీకాళహస్తీశ్వరాలయ ఇఓగా గురుదక్షిణామూర్తి ఆలయం వద్ద బాధ్యతలు స్వీకరిస్తున్న బికె వెంకటేశు

**శ్రీకాళహస్తి,మార్చి 5 ప్రభాతవార్త:** శ్రీకాళహస్తీశ్వ రాలయ కార్యదనిర్వ హాణాధికారిగా రెవెన్యూశాఖకు చెందిన స్పెషల్ గ్రేడ్ డెప్యూటి కలెక్టర్ బికె వెంకటేశు గురువారం ఉదయం గురుదక్షిణామూర్తి ఆలయం వద్ద బాధ్యతలు స్వీకరించారు. వైయస్ఆర్ కడపజిల్లా ముద్దనూరు గాలేరు నగరి సుజల శ్రవంతిలో పని చేస్తున్న ఆయనను ప్రభుత్వం శ్రీకాళహస్తీశ్వరాలయ కార్యనిర్వహాణాధికారిగా నియమించింది. ఆయన బుధవారం రాత్రే శ్రీకాళహస్తి చేరుకొని దేవస్థానం అతిది గృహంలో కుటుంబ సభ్యులతో బస చేసారు.గురువారం ఉదయం ఆయన కుటుంబసభ్యులతో స్వామి అమ్మవార్ల దర్శనానికి వచ్చారు. దక్షిణ గోపురం వద్ద ఆలయ మర్యాదలతో ప్రోటోకాల్ ఎఇఓ మోహన్ ఎపిఆర్ఓ రవి సారధ్యంలో వేదపండితులతో స్వాగతం పలికారు.ఆయన స్వామి అమ్మవార్ల అంతరాలయ దర్శనం చేసుకున్న తరువాత ఆయనకు గురుదక్షిణామూర్తి ఆలయం వద్ద వేదపండితుల వేద మంత్రాలతో ఆశీర్వదించారు. స్వామి అమ్మవార్ల చిత్రపటాలను అందించారు. తీర్థ ప్రసాదాలు అందించారు. ఆయన బాధ్యతలు స్వీకరించటాని చాంబర్‌లో ఏర్పాట్లు చేసారు.అయితే ఇఓ తాను స్వామి సన్నిధానంలో గురుదక్షిణామూర్తి ఆలయం వద్ద బాధ్యతలు తీసుకుంటామని చెప్పారు.

# సాంకేతిక సమస్యతో నిలిచిపోయిన ఇండిగో విమానం

**గన్నవరం, మార్చి 5, ప్రభాతవార్త :** గన్నవరం నుండి హైదరాబాద్ బయలు దేరిన ఇండిగో విమానం గాలిలోకి ఎగిరే చివరి నిముషంలో సాంకేతిక లోపం తలెత్తటంతో గన్నవరంలో నిలిపివేసారు. ఉదయం 10.30 గంటలకు 71మంది ప్రయాణికులతో ఇండిగో విమానం హైదరాబాద్ బయలు దేరింది. రన్‌వేపై టెకాఫ్ అవుతున్న తరుణంలో ఇంజిన్‌లో సాంకేతిక లోపాన్ని గుర్తించిన పైలట్ విమానాన్ని నిలిపి వేసారు. అనంతరం దానిని ఆప్రాన్‌పై తరలించి మరమత్తులు చేపట్టారు. మరమత్తులు పూర్తికాక పోవటంతో విమానసర్వీసును రద్దుచేసారు. కాగా ఈవిమానంలో రాష్ట్ర ఇంధనశాఖామంత్రి గొట్టిపాటి రవికుమార్, ఎమ్మెల్యేలు పత్తిపాటి పుల్లారావు, కన్నా లక్ష్మీనారాయణతోపాటు మరో 68మంది ప్రయాణికులు ఉన్నారు. విమానం రద్దుఅవటంతో ప్రజాప్రతినిధులు రోడ్డుమార్గాన విజయవాడ వెళ్ళారు. మిగిలిన ప్రయాణికులకు మరో విమానంలో హైదరాబాద్ పంపిస్తామని ఇండిగో సంస్థ ప్రతినిధులు హామీ ఇచ్చారు.

# అంగన్వాడీల డిమాండ్లు తొమ్మిది పరిష్కరించాం

**వారికి 5జి ఫోన్లు ఇచ్చాం: మంత్రి సంధ్యారాణి**

**విజయవాడ,మార్చి 5,ప్రభాతవార్తప్రతినిధి:** అంగన్ వాడీలకు గతంలో రూ.4200 జీతం ఉండేదని కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత రూ.11,500 జీతం పెంచామని మంత్రి సంధ్యారాణి తెలిపారు. తమ ప్రభుత్వం అంగన్‌వాడీలకు మూడు సార్లు జీతం పెంచిందని చెప్పుకొచ్చారు. అంగన్‌వాడీలు పది డిమాండ్లు అడిగితే వాటిలో 9 పూర్తి చేశామని తెలిపారు. రూ.75 కోట్లతో 5జీ ఫోన్లను అంగన్ వాడీలకు ఇచ్చామని వివరించారు. జనాభా ప్రాతిపదికన కొత్త అంగన్‌వాడీలు ఇవ్వడానికి ప్రభుత్వం సిద్ధంగా ఉందన్నారు. అంగన్‌వాడీల అన్ని సమస్యలను త్వరలోనే పరిష్కరిస్తామని మంత్రి సంధ్యారాణి మాటిచ్చారు. ఆంధ్రప్రదేశ్ అసెంబ్లీ 14వ రోజు సమావేశాలు ప్రారంభమయ్యాయి. గురువారం శాసన సభలో అంగన్‌వాడీల అంశంపై చర్చించారు. ఈ సందర్భంగా పాక్షి కంగా పూర్తయిన అంగన్‌వాడీ భవనాల అంశంపై పెందుర్తి ఎమ్మెల్యే పంచకర్ల రమేష్ బాబు ప్రశ్నించారు. ఈ విషయంపై తెలుగుదేశం రాజమండ్రి రూరల్ ఎమ్మెల్యే గోరంట్ల బుచ్చయ్య చౌదరి మాట్లాడారు. అంగన్‌వాడీల్లో ఆకస్మిక తనిఖీలు చేయాలని తాము వెళ్లినప్పుడు ఆయా కేంద్రాల్లో ఐదుగురు మాత్రమే ఉంటున్నారని చెప్పుకొచ్చారు. ఇది భారీ కార్యక్రమమని.. చాలా మందికి ఉపాధి కల్పించిందని తెలిపారు. కడియం మండలంలో స్థానిక సంస్థల నిధులతో అంగన్‌వాడీ కేంద్రాల్లో తాగునీరు ఏర్పాటు చేశారని గోరంట్ల బుచ్చయ్య ప్రస్తావించారు. ఇదే అంశంపై మంత్రి గుమ్మిడి సంధ్యారాణి మాట్లాడారు. ఏపీ వ్యాప్తంగా 55,746 అంగన్‌వాడీ కేంద్రాల్లో 21,756 సొంత భవనాలు, 10,556 కేంద్రాలు ప్రభుత్వ భవనాల్లో ఉన్నాయని వివరించారు. 23,424 కేంద్రాలు అద్దె భవనాల్లో ఉన్నాయని... వాటిని అమలు చేస్తున్నామని,

వాటిలో కొన్ని భవనాలు నిర్మాణం చేపడుతున్నామని వెల్లడించారు. 2922 భవనాల నిర్మాణాలను అమలు చేశామని.. వీటిలో 948 అంగన్‌వాడీ భవనాలు పూర్తి దశలో ఉన్నాయని.. వాటికోసం రూ.4కోట్లు విడుదల అయ్యాయని చెప్పుకొచ్చారు.

# భూసేకరణ ప్రకటనలో యజమానుల పేర్లను ప్రచురించాల్సిన అవసరం లేదు : హైకోర్టు

**విజయవాడ,మార్చి 5,బెంగళూరుమైదుకూరు :**అమరావతి గ్రీన్ ఫీల్డ్ ఎక్స్‌ప్రెస్ హైవేలో భాగంగా వైఎస్సార్ కడప జిల్లాలో భూసేకరణ కోసం జారీచేసిన నోటిఫికేషన్‌లు సవాలు చేస్తూ భూ యజమానులు దాఖలు చేసిన వ్యాజ్యాలను ఏపీ హైకోర్టు కొట్టేసింది. వ్యక్తిగత ప్రయోజనాలు, ప్రజాప్రయోజనం మధ్య సంఘర్షణ తలెత్తినప్పుడు సమాజ హితానికే పెద్దపీట వేయాలని న్యాయస్థానం స్పష్టం చేసింది. భూసేకరణ ప్రకటనలో భూయజమానుల పేర్లను ప్రచురించాల్సిన అవసరం లేదని పేర్కొంది. జాతీయ రహదారుల భూసేకరణకు ఎక్కువ మంది యజమానులు సానుకూలంగా ఉన్నారని తెలిపిన కోర్టు, కొద్దిమంది అభ్యంతరం చెబుతున్నారన్న కారణంతో మొత్తం ప్రక్రియను నిలువరించలేమని తేల్చిచెప్పింది. భూసేకరణ ప్రకటనలో భూయజమానుల పేర్లను ప్రచురించాల్సిన అవసరం లేదని కోర్టు స్పష్టం చేసింది.నోటిఫికేషన్లో భూముల వివరాలను సంక్షి ప్తంగా పేర్కొంటే చాలంది. ప్రకటనలో భూయజమానుల పేర్లను పేర్కొనకపోయినంతమాత్రాన ఆ భూసేకరణ ప్రకటన చెల్లకుండా పోయినట్లు కాదంది. మరోవైపు నోటిఫికేషన్ వివరాలను రెండు స్థానిక పత్రికల్లో ప్రచురిస్తే సరిపోతుందని వెల్లడించింది. ఆయా పత్రికల సర్క్యులేషన్ ఎంత అనేదానితో సంబంధం లేదంది. విస్తృత సర్క్యులేషన్ ఉన్న పత్రికల్లోనే ప్రకటన ఇవ్వాలనే నిబంధనలు లేవని తెలిపింది. గ్రీన్ ఫీల్డ్ ఎక్స్‌ప్రెస్ హైవేలో భాగంగా జాతీయ రహదారి నిర్మాణ కోసం వైఎస్సార్ కడప జిల్లాలోని 12 మండలాల పరిధిలోని 49 రెవెన్యూ గ్రామాల్లో 124 కి.మీ(75 కి.మీ నుంచి 199 కి.మీ వరకు) రహదారి ఏర్పాటు కోసం అధికారులు 2023లో భూసేకరణ ప్రకటన జారీచేశారు. ఈ ప్రకటనను సవాలు చేస్తూ వివిధ ప్రాంతాల్లో భూములున్న కొందరు యజమానులు హైకోర్టును ఆశ్రయించారు. భూసేకరణ ప్రకటన చట్ట నిబంధనలకు అనుగుణంగా లేదన్నారు. వాస్తవానికి తమ భూమి జాతీయ రహదారి ఏర్పాటుకు అవసరం లేదన్నారు. డబుల్ ట్రంపెట్ ఇంటర్‌చేంజ్ మధ్య తమ భూములున్నాయన్నారు. తమ భూములను తీసుకొని వాణిజ్య అవసరాలకు వినియోగించాలని చూస్తున్నారన్నారు.

ong-7_ong-7.qxd 3/6/2026 1:51 AM Page 1





# ముగ్గురు సహచరులు.. ఒకే సందేశం

**- అత్యధిక మెజారిటీ నేతల ఫొటోను పంచుకున్న మంత్రి నారా లోకేశ్**

**గాజువాక,మార్చి 5,ప్రభాతవార్త**

2024 అసెంబ్లీ ఎన్నికల్లో అత్యధిక మెజారిటీలు సాధించిన ముగ్గురు నేతల అరుదైన ఫొటోను మంత్రి నారా లోకేశ్ సామాజిక మాధ్యమాల్లో పంచుకున్నారు. ఈ ఫొటోలో ఎమ్మెల్యేలు పల్లా శ్రీనివాసరావు, గంటా శ్రీనివాసరావు కూడా ఉన్నారు. అత్యధిక ఓట్ల మెజారిటీ సాధించిన ముగ్గురు సహచరులుగా ఈ గెలుపు తమపై ఉన్న బాధ్యతను గుర్తు చేస్తోందని లోకేశ్ పేర్కొన్నారు. ప్రజలు ఉంచిన నమ్మకాన్ని నిలబెట్టుకోవడం తమ ప్రధాన కర్తవ్యమని స్పష్టం చేశారు. ప్రతిరోజూ పూర్తి నిబద్ధతతో, వినమ్రతతో ప్రజలకు సేవ చేస్తామని వెల్లడించారు. భారీ మెజారిటీ ప్రజల ఆకాంక్షలకు ప్రతిబింబమని, ఆ ఆశలను నెరవేర్చే దిశగా కృషి కొనసాగిస్తామని తెలిపారు. ఈ ఫొటో పార్టీ వర్గాల్లో చర్చనీయాంశమైంది.





విశాఖపట్నం
అనకాపల్లి
అల్లూరి సీతారామరాజు
వార్త

## గీతం వేధికగా 6 నుండి "టైకాన్ వైజాగ్" సదస్సు

**విశాఖపట్నం మార్చి 5 ప్రభాతవార్త**

టై వైజాగ్ చాప్టర్ యొక్క ప్రతిష్టాత్మకమైన తొలి ఫ్లాగ్‌షిప్ కాంక్లేవ్ (టైకాన్ వైజాగ్ 2026) ఈ నెల 6వ తేదీ నుంచి 7వ తేదీ వరకు గీతం డీమ్డ్ విశ్వవిద్యాలయంలో నిర్వహిస్తారని టై వైజాగ్ అధ్యక్షుడు కళ్యాణ్ ముప్పనేని తెలిపారు. రెండు రోజుల పాటు జరిగే ఈ సదస్సులో స్టార్టప్ వ్యవస్థాపకులు, పెట్టుబడిదారులు, కార్పోరేట్ నాయకులు, విధానకర్తలు మరియు సాంకేతిక నిపుణులను ఒకే వేధికపైకి తీసుకురానుందని తెలిపారు. ఇది ఆంధ్రప్రదేశ్ ఆవిష్కరణలు, సాంకేతికత మరియు పారిశ్రామిక అభి వద్దికి ఒక డైనమిక్ హబ్‌గా బలోపేతం చేయడమే కాకుండా ప్రాంతీయ అభివృద్ధికి తోడ్పడే సహకార ఒప్పందాలకు వేధికకానుందని తెలిపారు. టైకాన్ వైజాగ్ లో డేటా సెంటర్లు, ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్(ఏఐ) కార్పోరేట్ గవర్నెన్స్, మహిళా పారిశ్రామికవేత్తలు, సుస్థిరత టూరిజం, అగ్రిటెక్ మరియు ఫుడ్‌టెక్ వంటి కీలక అంశాలపై చర్చలు జరుగుతాయని తెలిపారు. ఈ రెండు రోజులలో కీనోట్ ప్రసంగాలు, ప్యానల్ చర్చలు, స్టార్టప్ ఎలివేటర్ పిచ్‌లు, అవార్డుల ప్రధానం మరియు ఎగ్జిబీటర్ ప్రదర్శనలు ఉండనున్నాయని తెలిపారు.

## వయోవృద్ధుల సంరక్షణకు ప్రత్యేక శిక్ష

**: ఎమ్మెల్యే పల్లా శ్రీనివాసరావు**



**గాజువాక,మార్చి 5,ప్రభాతవార్త**

రాష్ట్రంలో పెరుగుతున్న వయోవృద్ధుల జనాభాను దృష్టిలో ఉంచుకుని, వారి సంరక్షణకు ప్రత్యేక శిక్షణ పొందిన ఖేర్ గివర్స్‌ఖిను సిద్ధం చేయాలని గాజువాక ఎమ్మెల్యే, టీడీపీ రాష్ట్ర అధ్యక్షుడు పల్లా శ్రీనివాసరావు ప్రభుత్వానికి సూచించారు. గురువారం అసెంబ్లీ సమావేశాల్లో ఆయన ఈ అంశాన్ని ప్రస్తా వించారు. పట్టణ ప్రాంతాల్లో ఉద్యోగ, వృత్తి బాధ్య తల వల్ల కుటుంబ సభ్యులు వృద్ధులను రోజంతా చూసుకోవడం కష్టతరమవుతోందని ఆయన పేర్కొ న్నారు. దీనిని పరిష్కరించేందుకు స్కిల్ డెవల ప్‌మెంట్ సెంటర్ల ద్వారా యువతకు వృద్ధుల సం రక్షణపై ప్రత్యేక శిక్షణ ఇవ్వాలని కోరారు. తద్వారా వయోవృద్ధులకు మెరుగైన సేవలు అంద డమే కాకుండా, యువతకు కొత్త ఉపాధి అవకాశాలు లభిస్తాయని పల్లా వివరించారు. సంక్షేమం, ఉపాధి అనే రెండు లక్ష్యాలను సాధించేలా ప్రభుత్వం చర్యలు తీసుకోవాలని ఆయన విజ్ఞప్తి చేశారు.

## కన్నులు వైభవంగా పుష్ప యోగోత్సవం తరలి వచ్చిన భక్తులు

**(నక్కపల్లి/ అడ్డు రోడ్డు/ ప్రభాతవార్త)**



మండలంలోని ఉపమాక వెంకటేశ్వర స్వామి వార్షిక కళ్యాణంలో భాగంగా స్వామివారికి పుష్పయాగోత్స వం మొదటి రోజు కార్యక్రమం కన్నులు వైభవంగా నిర్వహించారు. స్వామి అమ్మవార్లకు పూజలు చేసి అద్దాల మండపంలో పుష్పాలతో అలంకరించి పవళింపు చేశారు. కార్యక్రమంలో భక్తులు భారీగా పాల్గొన్నారు.




## మెట్ల వారి వివాహ వేడుకలో పాల్గొన్న మంత్రి లోకేష్

**విశాఖపట్నం మార్చి 5 ప్రభాతవార్త**



టిడీపీ రాష్ట్ర కార్యనిర్వాహక కార్యదర్శి మెట్ల వెంకటరమణ (రమణబాబు) సోదరుని కుమారుడి వివాహ వేడుకలో విద్య, ఐటీ శాఖల మంత్రి నారా లోకేష్ పాల్గొన్నారు. విశాఖలోని వాల్తేర్ క్లబ్ లో జరిగిన వివాహ వేడుకకు హాజరై నూతన వధూ వరులు సత్యనారాయణ రావు, లక్ష్మీ సౌపర్ణికలను ఆశీర్వదించారు. వైవాహిక జీవితంలోకి అడుగుపెడుతున్న నూతన దంపతులకు పుష్పగుచ్ఛం అందించి శుభాకాంక్షలు తెలిపారు. ఈ కార్యక్రమంలో మంత్రి లోకేష్ వెంట పలువురు టీడీపీ నేతలు పాల్గొన్నారు.

## మిషన్ పునర్వనం భేష్!

**- ఎలమంచిలి ఎమ్మెల్యే సుందరపు విజయ్ కుమార్‌ని అభినందించిన ఉప ముఖ్యమంత్రి కొణిదెల పవన్ కళ్యాణ్**

**విశాఖపట్నం మార్చి 5 ప్రభాతవార్త**



వృక్షో రక్షతి రక్షితః" అనే నానుడిని సార్థకం చేస్తూ, ఎలమంచిలి నియోజకవర్గంలో ఒక వినూత్న కార్యక్రమం చేపట్టారు శాసన సభ్యులు సుందరపు విజయ్ కుమార్ గారు. సాధారణంగా రహదారులు వెడల్పు చేసే పనుల్లో భాగంగా 100 నుంచి 200 సంవత్సరాల ప్రాయమున్న పెద్ద వృక్షాలను తొలగించడం జరుగుతుంటుంది. అయితే, ప్రకృతి పరిరక్షణను దృష్టిలో పెట్టుకుని విజయ్ కుమార్ వినూత్నంగా ఆలోచించారు. ఈ చెట్లను నరికి వేయకుండా, అనుభవజ్ఞుల సూచనలు, సలహాలతో వాటిని జాగ్రత్తగా తవ్వి వేరే ప్రదేశాలలో తిరిగి నాటించే ప్రక్రియను ప్రారంభించారు. ఈ విధంగా తొలగించాల్సి న సుమారు 18 భారీ వృక్షాలను మరో ప్రాంతంలో విజయవంతంగా పునర్నాటడం జరిగింది. ప్రస్తుతం అవి మళ్లీ చిగురించి పెరుగుతున్నాయి. ఈ కార్యక్రమానికి సహకరించిన అనకాపల్లి జిల్లా కలెక్టర్ విజయ్ కృష్ణన్ , అలాగే రోడ్లు భవనాల శాఖ మంత్రి జనార్దన్ రెడ్డి లకు ప్రత్యేక కృతజ్ఞతలు తెలియజేశారు. అలాగే ఈ చర్యను ప్రోత్సహించి ప్రారంభించిన ఆంధ్రప్రదేశ్ శాసనసభ స్పీకర్ చింతకాయల అయ్యన్నపాత్రుడు గారును కూడా అభినందించారు. ఈ వినూత్న కార్యక్రమాన్ని ఈరోజు శాసనసభలో సభ్యులందరి సమక్షంలో ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు మరియు ఉప ముఖ్యమంత్రి కొణిదెల పవన్ కళ్యాణ్ అభినందించారు. భవిష్యత్తులో రాష్ట్రంలోని ప్రతి ప్రాంతంలో ఇలాంటి ప్రకృతి పరిరక్షణ చర్యలు అమలు కావాలని, ఎలమంచిలి ఎమ్మెల్యే సుందరపు విజయ్ కుమార్ అందరికీ ఆదర్శంగా నిలవాలని ఉప ముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్ తెలిపారు. ఈ కార్యక్రమాన్ని ఆయన ."మిషన్ పునర్వనం"..గా అభివర్ణిస్తూ సభలో ప్రత్యేకంగా ప్రకటించారు.

# రెడ్ బుక్‌కు మా ఇంటి కుక్క కూడా భయపడదు!

**- లోకేష్‌పై నిప్పులు చెరిగిన మాజీ మంత్రి అంబటి రాంబాబు**
**- గాజువాకలో కాపు నేతల కీలక భేటీ.. రాజకీయాల్లో చర్చనీయాంశం**

**గాజువాక, మార్చి 5,ప్రభాతవార్త**

రాష్ట్రంలో కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చినప్పటి నుంచి ప్రతిపక్ష నేతలను లక్ష్యంగా చేసుకుని దాడులు చేయడం పరిపాటిగా మారిందని మాజీ మంత్రి, వైకాపా నేత అంబటి రాంబాబు ధ్వజమెత్తారు. ముఖ్యంగా నారా లోకేష్ ప్రస్తావిస్తున్న'రెడ్ బుక్' రాజకీయాలపై ఆయన తీవ్రస్థాయిలో మండిపడ్డారు. "లోకేష్ చూపిస్తున్న రెడ్ బుక్కుకు నా ఇంటి కుక్క కూడా భయపడదు" అంటూ ఎద్దేవా చేశారు. గురువారం గాజువాకలో మాజీ ఎమ్మెల్యే కరణం ధర్మశ్రీ నివాసానికి విచ్చేసిన ఆయన, అక్కడ ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో మాట్లాడారు. కాపు నేతలే లక్ష్యమా?...తెలుగుదేశం పార్టీకి కాపు నాయకులను హింసించడం కొత్తేమీ కాదని అంబటి విమర్శించారు. గతంలో వంగవీటి మోహన రంగా నుంచి నేటి ముద్రగడ పద్మనాభం వరకు అనేకమంది కాపు నేతలను టీడీపీ ఇబ్బందులకు గురిచేసిందని ఆరోపించారు. "పవన్ కల్యాణ్‌ను, కాపు సామాజికవర్గాన్ని అడ్డం పెట్టుకుని అధికారంలోకి వచ్చి.. ఇప్పుడు వారినే టార్గెట్ చేయడం ఎంతవరకు సమంజసం?" అని ప్రశ్నించారు. వందసార్లు జైలుకైనా సిద్ధమే....ప్రజాస్వామ్యబద్ధంగా పరిపాలన సాగించాలని, కక్ష సాధింపు చర్యలు మానుకోవాలని అంబటి సూచించారు. "వైఎస్ జగన్ మోహన్ రెడ్డి ఆదేశిస్తే ప్రజల కోసం పోరాడటానికి, వందసార్లు జైలుకు వెళ్లడానికైనా నేను సిద్ధం" అని స్పష్టం చేశారు. అక్రమ కేసులు, బెదిరింపులకు భయపడే ప్రసక్తే లేదని ఆయన తేల్చి చెప్పారు. ధర్మశ్రీ నివాసంలో కాపు నేతల ఖిఅల్పాహారఖి రాజకీయాలు.....అంబటి రాంబాబు పర్యటన సందర్భంగా గాజువాకలోని మాజీ ఎమ్మెల్యే కరణం ధర్మశ్రీ నివాసం రాజకీయ కోలాహలంగా మారింది. అంబటి రాంబాబుతో పాటు మాజీ మంత్రి గుడివాడ అమర్నాథ్, మాజీ ఎమ్మెల్యే చింతలపూడి వెంకటరామయ్య తదితరులు ఈ సమావేశంలో పాల్గొన్నారు. ముఖ్య చర్చ.....కాపు సామాజికవర్గానికి చెందిన కీలక నేతలందరూ ఒకేచోట చేరి అల్పాహార విందులో పాల్గొనడం స్థానికంగా చర్చనీయాంశమైంది. ప్రస్తుత రాజకీయ పరిస్థితులు, భవిష్యత్ కార్యాచరణపై వీరి మధ్య లోతైన చర్చ జరిగినట్లు తెలుస్తోంది. ఈ కార్యక్రమంలో పలువురు కాపు సంఘం నాయకులు, వైకాపా కార్యకర్తలు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.



### విశాఖ నగర భవిష్యత్

# నీటి అవసరాలకు సమగ్ర ప్రణాళిక అవసరం..

**- నీటి డిమాండ్, సరఫరాపై అధికారులతో సమీక్షించిన జిల్లా కలెక్టర్ ఎం.ఎన్. హరేంధిర ప్రసాద్ ..**
**- ప్రస్తుత తాగునీటి నిర్వహణ, భవిష్యత్తు కార్యాచరణపై ప్రజెంటేషన్ ఇచ్చిన జీవీఎంసీ కమిషనర్**



**విశాఖపట్టణం, మార్చి 5, ప్రభాతవార్త**

విశాఖపట్టణం నగరంలో పెరుగుతున్న జనాభా, పరిశ్రమల అభివృద్ధి దృష్ట్యా భవిష్యత్‌లో నీటి అవసరాలను దృష్టిలో ఉంచుకుని సమగ్ర ప్రణాళికలు రూపొందించాలని జిల్లా కలెక్టర్ ఎం.ఎన్. హరేంధిర ప్రసాద్ సంబంధిత అధికారులను ఆదేశించారు. గురువారం కలెక్టరేట్ మీటింగు హాలులో జరిగిన సమావేశంలో నగరానికి సంబంధించిన నీటి డిమాండ్, సరఫరా పరిస్థితులు, భవిష్యత్ అవసరాలపై అధికారులతో ఆయన సమీక్ష నిర్వహించారు. జీవీఎంసీ కమిషనర్ కేతన్ గార్గ్, సీఈ సత్యనారాయణ రాజు, ఎస్ఈ రవికుమార్, ఇరిగేషన్, విస్కో, ఇతర అధికారులు భాగస్వామ్యమై పలు అంశాలపై చర్చించారు. ముందుగా జీవీఎంసీ కమిషనర్ కేతన్ గార్గ్ ప్రస్తుత తాగునీటి నిర్వహణ, భవిష్యత్తు కార్యాచరణపై పవర్ పాయింట్ ప్రజెంటేషన్ ఇచ్చారు. 2024 నాటికి విశాఖ నగర జనాభా సుమారు 24 లక్షలుగా ఉండగా రోజుకు సుమారు 453 ఎంఎల్డీ నీటి అవసరం ఉంటుందని తెలిపారు. ప్రస్తుతం సుమారు 390 ఎంఎల్డీ నీటి సరఫరా జరుగుతున్నట్లు పేర్కొన్నారు. 2025 నాటికి నీటి అవసరం సుమారు 476 ఎంఎల్డీకి పెరిగే అవకాశముండగా, 2040 నాటికి ఇది 726 ఎంఎల్డీకి, 2055 నాటికి సుమారు 836 ఎంఎల్డీకి చేరుకునే అవకాశం ఉందని అంచనా వేశారు. ప్రస్తుత సరఫరా సామర్థ్యాన్ని పరిగణనలోకి తీసుకుంటే భవిష్యత్‌లో నీటి లోటు గణనీయంగా పెరిగే అవకాశముందని, దానికి తగ్గట్లుగా బృహత్ కార్యాచరణ చేపట్టాల్సి న ఆవశ్యకత ఉందన్నారు. భవిష్యత్తు కార్యాచరణపై మేథోపరమైన చర్చ.. కలెక్టర్ దిశానిర్దేశంసమీక్షలో భాగంగా విశాఖలో అభివృద్ధి చెందుతున్న పరిశ్రమల అవసరాలను కూడా చర్చించారు. అర్సెల్లార్ మిత్తల్ నిప్పన్ స్టీల్, హెచ్‌పీసీఎల్, ఏపీఐఐసీ పారిశ్రామిక పార్కులు, డేటా సెంటర్లు, ఎన్‌టీపీసీ గ్రీన్ హైడ్రోజన్ ప్రాజెక్టులు తదితర పరిశ్రమలకు భవిష్యత్‌లో గణనీయమైన స్థాయిలో నీటి అవసరం ఉండొచ్చని అధికారులు పేర్కొన్నారు. పరిశ్రమల అవసరాలను దృష్టిలో ఉంచుకుని ముందస్తుగా సమగ్ర ప్రణాళికలు సిద్ధం చేయాల్సి న అవసరం ఉందని జిల్లా కలెక్టర్ హరేంధిర ప్రసాద్ ఈ క్రమంలో సూచించారు. 2026 నుంచి 2031 మధ్య కాలంలో పరిశ్రమల అవసరాల కోసం, వ్యవసాయ, తాగునీటి అవసరాలను దృష్టిలో

మిగతా 8..లో

## ఎవరు ఆందోళన పడవద్దు.. నా ఆరోగ్యం బాగానే ఉంది :రాష్ట్ర హోం మంత్రి "అనిత"

**(నక్కపల్లి, ప్రభాతవార్త )**



నా ఆరోగ్య విషయంలో నా నియోజకవర్గ ప్రజలు ,నాయకులు ,కార్యకర్తలు, ఏ ఒక్కరు కూడా ఆందోళన చెందాల్సి న అవసరం లేదని నా ఆరోగ్యం బాగానే ఉందని రాష్ట్ర హోం మంత్రి వంగలపూడి అనిత ఫోన్ ద్వారా స్థానిక పాత్రికేయులకు శుక్రవారం సాయంత్రం తెలిపారు. అసెంబ్లీ సమావేశాల్లో శుక్రవారం పాల్గొన్న రాష్ట్ర హోం మంత్రి వంగలపూడి అనిత సభలో కొంత అలసటగా కనిపించిన విషయం తెలియడంతో దగ్గరలో ఉన్న వైద్యులు గమనించి సచివాలయంలో ఉన్న ఆసుపత్రిలో చికిత్స అందించారు. రాష్ట్ర హోం మంత్రి వంగలపూడి అనిత అస్వస్థత గురైందని సమాచారం అందుకున్న పాయక రావు పేట నియోజకవర్గం పార్టీ శ్రేణులు, కార్యకర్తలు, ప్రజలు ఒక్కసారిగా ఆందోళన గురయ్యారు. ఈ విషయం తెలిసిన వెంటనే మంత్రి అనుచరులకు మంత్రి ఆరోగ్యం పై ఆరా తీయడం మొదలుపెట్టారు. కొద్దిపాటి అలసట తప్ప ఎటువంటి ఇబ్బంది లేదని మంత్రి కార్యాలయ సిబ్బంది సమాచారం అందజేయ డంతో ఒక్కసారిగా ఊపిరి పీల్చుకున్నారు. అక్కడి నుంచి విజయవాడలో ఉన్న హాస్పిటల్ కి వెళ్లి వైద్య పరీక్షలు చేయించుకున్నారు. ఎటువంటి ఇబ్బంది లేదని కొద్దిగా అలసట కారణంగా ఇబ్బంది ఏర్పడిందని వైద్యులు చెప్పడంతో అక్కడినుంచి ఇంటికి చేరుకున్నారు. పార్టీ శ్రేణులు మహిళలు ఆమె ఆరోగ్యంపై దేవాలయాల్లో పూజలు చేశారు.

## షిప్ బిల్డింగ్ హెవీ ఇండస్ట్రీస్ పార్క్ ఆంధ్రప్రదేశ్ లిమిటెడ్ ఏర్పాటు

**విశాఖపట్నం, మార్చి 5, ప్రభాతవార్త**

రాష్ట్ర సముద్ర రంగాన్ని మరింత బలోపేతం చేసే దిశగా ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం కీలకమైన నిర్ణయం తీసుకుంది. దుగరాజపట్నంలో ప్రపంచ స్థాయి నౌకా నిర్మాణం, నౌకా మరమ్మత్తు మరియు అనుబంధ సముద్ర పరిశ్రమల మౌలిక వసతుల అభివృద్ధి కోసం షిప్ బిల్డింగ్ హెవీ ఇండస్ట్రీస్ పార్క్



ఆంధ్రప్రదేశ్ లిమిటెడ్‌ను ప్రత్యేక ప్రయోజన వాహక సంస్థ గా ఏర్పాటు చేయడానికి ఆమోదం తెలిపింది. ఈ వ్యూహాత్మక నిర్ణయం ఆంధ్రప్రదేశ్ సముద్ర రంగానికి మహత్తర ప్రోత్సాహాన్ని అందించడమే కాకుండా, రాష్ట్రాన్ని దేశంలో ప్రముఖ నౌకా నిర్మాణ మరియు హెవీ ఇండస్ట్రీస్ కేంద్రంగా నిలబెట్టే దిశగా కీలక అడుగుగా నిలుస్తుంది. దీని ద్వారా భారీ స్థాయిలో ఉపాధి అవకాశాలు కలగడంతో పాటు పారిశ్రామిక అభివృద్ధికి ఊతం లభిస్తుంది. ఈ ప్రాజెక్టును ఆంధ్రప్రదేశ్ మారిటైమ్ బోర్డు మరియు విశాఖపట్నం పోర్ట్ అథారిటీ సంయుక్తంగా 50:50 నిష్పత్తిలో ప్రత్యేక ప్రయోజన వాహక సంస్థ గా అమలు చేయనున్నాయి. ఈ కార్యక్రమం భారత ప్రభుత్వ పథకం కింద చేపడుతుండగా, సంబంధిత మార్గదర్శకాల ప్రకారం వ్యూహాత్మక షిప్‌యార్డ్ భాగస్వామిని ఎంపిక చేయనున్నారు. దుగరాజపట్నం షిప్‌బిల్డింగ్ క్లస్టర్ భారతదేశ నౌకా నిర్మాణ మరియు మరమ్మత్తు రంగాన్ని బలోపేతం చేయడంలో కీలక పాత్ర పోషించనుంది. అనుబంధ పరిశ్రమల అభివృద్ధికి తోడ్పడుతూ, పెద్ద ఎత్తున ప్రత్యక్ష మరియు పరోక్ష ఉపాధి అవకాశాలను సృష్టించడమే కాకుండా, దక్షిణ భారత తీర ప్రాంత

మిగతా 8..లో

## జనగణన 2027పై అధికారులకు మార్చి 7 నుంచి 9 వరకు శిక్ష..

**- జిల్లా కలెక్టర్, ప్రిన్సిపల్ సెన్సస్ అధికారి ఎం.ఎన్. హరేంధిర ప్రసాద్**

**విశాఖపట్నం, మార్చి 5, ప్రభాతవార్త**



దేశవ్యాప్తంగా నిర్వహించనున్న జనగణన 2027 కార్యక్రమం విజయవంతంగా అమలు కావడానికి జిల్లా స్థాయిలో సన్నాహాలు ప్రారంభమైనట్లు జిల్లా కలెక్టర్, ప్రిన్సి పల్ సెన్సస్ అధికారి ఎం.ఎన్. హరేంధిర ప్రసాద్ గురువారం ఓ ప్రకటనలో తెలిపారు. జనగణన2027లో తొలి దశగా నిర్వహించనున్న హౌస్ లిస్టింగ్, హౌసింగ్ సెన్సస్ కార్యక్రమానికి సంబంధించి జిల్లా, కార్పొరేషన్, ఛార్జ్ స్థాయి అధికారులకు ప్రత్యేక శిక్షణ కార్యక్రమాన్ని ఏర్పాటు చేసినట్లు పేర్కొన్నారు. ఈ శిక్షణ కార్యక్రమం మార్చి 7 నుంచి 9వ తేదీ వరకు మూడు రోజుల పాటు ఉదయం 9.30 నుంచి సాయంత్రం 6 గంటల వరకు ఆంధ్ర విశ్వవిద్యాలయం ఇంజినీరింగ్ కళాశాలలో నిర్వహించనున్నట్లు వెల్లడించారు. ఈ శిక్షణలో జిల్లా, మండల స్థాయి సెన్సస్ అధికా రులకు జనగణన నిర్వహణకు సంబంధించిన విధి విధానాలు, బాధ్యతలు, హౌస్ లిస్టింగ్ ప్రక్రియ, డేటా సేకరణ విధానం తదితర అంశాలపై సమగ్ర అవగాహన కల్పించనున్నట్లు తెలిపారు. శిక్షణ కార్యక్రమంలో జాయింట్ కలెక్టర్, జిల్లా రెవెన్యూ అధికారి, చీఫ్ ప్లానింగ్ ఆఫీసర్, జిల్లా విద్యాశాఖా ధికారి, జిల్లా పంచాయతీ అధికారి, జిల్లా అటవీ అధికారి, జడ్పీ సీఈఓ, సర్వే ల్యాండ్ రికార్డ్స్ విభాగాధికారి తదితర జిల్లా స్థాయి అధికారులు, భీమిలి, ఆనందపురం, పద్మనాభం, పెందుర్తి మండలాలకు చెందిన తహసీల్దార్లు, ఎంపీడీఓలు, సంబంధిత సిబ్బంది శిక్షణలో పాల్గొంటారన్నారు.

## డ్రగ్ కేసులో బెంగళూరు సప్లయర్ అరెస్ట్

**- ఎండీఎంఏ మత్తు పదార్థం సరఫరా**

**(విశాఖ క్రైమ్ ప్రభాతవార్త)**

పెందుర్తి పోలీస్ స్టేషన్ పరిధిలో వెలుగు చూసిన ఎండీఎంఏ మత్తు పదార్థం కేసులో పరారీలో ఉన్న బెంగళూరుకు చెందిన ప్రధాన సరఫరాదారుడిని పోలీసులు అరెస్ట్ చేశారు. పోలీసుల సమాచారం మేరకు జనవరి 22, 2026న పెందుర్తి ప్రాంతంలో

మిగతా 8..లో



## దివ్యాంగులకు ఉచిత సేవలు అందించాలి

**- మాజీఎమ్మెల్యే తిప్పల నాగిరెడ్డి**

**గాజువాక, మార్చి 5,ప్రభాతవార్త**

పెదగంట్యాడ సిద్ధేశ్వరంలో ఖిఅండీబోయిన అడ్వకేట్స్ అండ్ అసోసియేట్స్, ఆన్‌లైన్ సర్వీ సెస్‌ఖి కార్యాలయాన్ని మాజీ ఎమ్మెల్యే తిప్పల నాగిరెడ్డి, వైకాపా ఇంచార్జ్ తిప్పల దేవన్‌రెడ్డి గురువారం ప్రారంభించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. సామాన్యులకు న్యాయ సహాయంతో పాటు, దివ్యాంగులకు ఉచితంగా ఆన్‌లైన్ సేవలు అందించేందుకు ముందుకు రావడం అభినందనీయమన్నారు. తల్లిదండ్రుల ఆశయంతో సాఫ్ట్‌వేర్ వృత్తిని వదిలి న్యాయవాదిగా మారిన అరుణ్‌కుమార్ సేవలను స్థానికులు వినియోగించుకోవాలని కోరారు. కార్యక్రమంలో సిఐటియు నేత ఎన్.రామారావు ప్రముఖ న్యాయవాది అండి బోయిన లక్ష్మీ, వైకాపా నాయకులు మర్డపూడి పరదేశి తదితరులు పాల్గొన్నారు.



**మొదటి పేజీ తరువాయిలు**

## డ్రగ్ కేసులో బెంగళూరు సప్లయర్ అరెస్ట్



నిర్వహించిన తనిఖీలలో నలుగురు యువకులు నిషేధిత మత్తు పదార్థమైన ఎండీఎంఏ (మెథిలీన్డయాక్సీ మెథాంఫెటమైన్) తమ వద్ద కలిగి ఉన్నట్లు గుర్తించారు. దీంతో నిందితులు షేక్ మహ్మద్ తాహీర్ (24), ఉల్లి రవి తేజ (25), రెగులవలస సునీల్ కుమార్ (25), సబ్బవరపు సుజేష్ జార్జ్ (26)లను పోలీసులు అరెస్ట్ చేసి కోర్టు ఆదేశాల మేరకు రిమాండ్‌కు పంపించారు. అనంతరం కేసు విచారణలో బెంగళూరుకు చెందిన ప్రశాంత్ ప్రకాష్ అలియాస్ శంకర్ (25) అనే వ్యక్తి ఎండీఎంఏ మత్తు పదార్థాన్ని సరఫరా చేసినట్లు పోలీసులు గుర్తించారు. అతను బెంగళూరు దక్షిణంలోని జై భీమా నగర్‌కు చెందిన వాడిగా గుర్తించారు.. దీంతో పెందుర్తి ఇన్స్పెక్టర్ కె.వి. సతీష్ కుమార్ సూచనల మేరకు ప్రత్యేక బృందాలు సాంకేతిక ఆధారాలతో గాలింపు చర్యలు చేపట్టాయి. ఈ క్రమంలో సబ్ ఇన్స్పెక్టర్ స్వామి నాయుడు నేతృత్వంలోని బృందం నిందితుడిని గుర్తించి అరెస్ట్ చేసింది. అనంతరం అతడిని న్యాయస్థానంలో హాజరు పరచగా కోర్టు రిమాండ్ విధించినట్లు పోలీసులు వెల్లడించారు.

## విశాఖ నగర భవిష్యత్ నీటి అవసరాలకు సమగ్ర ప్రణాళిక అవసరం..

ఉంచుకొని చర్యలు తీసుకోవాలన్నారు. భవిష్యత్‌లో నీటి అవసరాలను తీర్చేందుకు ప్రత్యామ్నాయ వనరులను గుర్తించడం, రీసైకిల్ నీటి వినియోగాన్ని విస్తృతంగా పెంచడం, కొత్త ప్రాజెక్టులపై దృష్టి పెట్టడం అవసరమని కలెక్టర్ పేర్కొన్నారు. జీవీఎంసీ పరిధిలో ఉన్న నీటి నిల్వ ట్యాంకుల మరమ్మతులు పూర్తి చేసి వాటిని పూర్తిస్థాయిలో వినియోగంలోకి తీసుకురావాలని సూచించారు. నీటి పునర్వినియోగం (రీసైక్లింగ్) పై ప్రత్యేక దృష్టి పెట్టాలని, నగరంలో నీటి నిర్వహణను మెరుగుపరచేందుకు అవసరమైన క్యాపిటల్ ఇన్వెస్ట్‌మెంట్ ప్రణాళికలు సిద్ధం చేయాలని అధికారులను ఆదేశించారు. మేఘాద్రి రిజర్వాయర్ గేట్ల మరమ్మతులకు అవసరమైన చర్యలు తీసుకోవాలని కూడా సూచించారు. నీటి నిర్వహణలో అంతర్జాతీయ స్థాయి అనుభవాలను అధ్యయనం చేయడానికి సింగపూర్ నిపుణులు విశాఖపట్నం నగరాన్ని సందర్శించనున్న క్రమంలో ప్రాథమిక సమీక్ష నిర్వహించిన కలెక్టర్ పలు అంశాలపై అధికారులకు దిశానిర్దేశం చేశారు. సంబంధిత శాఖల అధికారులు ఫీల్డ్ స్థాయిలో పర్యటించి నీటి వనరుల పరిస్థితిని సమగ్రంగా పరిశీలించి, నగరంలోని గృహ, పరిశ్రమల అవసరాలను దృష్టిలో ఉంచుకొని దీర్ఘకాలిక ప్రణాళికను రూపొందించాలని ఆదేశించారు. ఈ నెల 10వ తేదీన సింగపూర్ వాటర్ సెంటర్ బృందంతో జరిగే కాన్ఫరెన్స్ లో ప్రస్తుత నీటి నిర్వహణ పద్ధతులు, భవిష్యత్తు కార్యాచరణ, ఆర్థిక ప్రణాళికలు, భాగస్వామ్య సంస్థల సహకారం గురించి వివరించాలని సంబంధిత అధికారులకు సూచించారు.

## షిప్ బిల్డింగ్ హెవీ ఇండస్ట్రీస్ పార్క్ ఆంధ్రప్రదేశ్ లిమిటెడ్ ఏర్పాటు

పారిశ్రామికీకరణకు దోహదం చేయనుంది. 29,662 కోట్ల అంచనా వ్యయంతో, నెల్లూరు జిల్లాలో 2,000 ఎకరాల విస్తీర్ణంలో అభివృద్ధి చెందనున్న ఈ ప్రాజెక్టు రాష్ట్ర స్థూల దేశీయోత్పత్తి పెరుగుదలకు గణనీయమైన తోడ్పాటు అందించనుంది. 974 కిలోమీటర్ల విస్తారమైన తీరరేఖను వినియోగించుకుంటూ, దిగుమతులపై ఆధారాన్ని తగ్గిస్తూ, దేశీయ మరియు అంతర్జాతీయ పెట్టుబడులను ఆకర్షించడమే లక్ష్యంగా ఈ ప్రాజెక్టు రూపుదిద్దుకుంటోంది. ఈ సమగ్ర సముద్ర పరిశ్రమ కేంద్రంలో నాలుగు డ్రై డాక్స్, షిప్ లిఫ్ట్ సదుపాయాలు మరియు అత్యాధునిక మౌలిక వసతులు ఏర్పాటు చేయనున్నారు. సంవత్సరానికి 1.2 మిలియన్ గ్రాస్ టన్నేజ్ నౌకా నిర్మాణ సామర్థ్యాన్ని సృష్టించడమే లక్ష్యంగా ఈ ప్రాజెక్టు రూపకల్పన చేశారు. ఇది భారతదేశం యొక్కమేక్ ఇన్ ఇండియా కార్యక్రమాన్నికి మరింత బలం చేకూర్చనుంది. అలాగే ప్రాంతీయ పరిశ్రమలకు లాజిస్టిక్స్ వ్యయాన్ని తగ్గించి తయారీ, వాణిజ్యం మరియు ఎగుమతులకు పోటీ శక్తిని పెంచనుంది. ఈ ప్రాజెక్టు ద్వారా నౌకా భాగాల తయారీదారులు, సముద్ర పరికరాల సరఫరాదారులు మరియు లాజిస్టిక్స్ సేవల సంస్థల నుండి ..8,000 నుండి ..10,000 కోట్ల వరకు అనుబంధ పెట్టుబడులు వచ్చే అవకాశముంది. ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం తో కలిసి ఈ ప్రాజెక్టుని ముందుకు తీసుకు వెళ్ళడంలో పోర్ట్ చైర్ పర్సన్ డా ఎం అంగముత్తు, ఐఏఎస్ అనిర్వచనీయమైన కృషి చేసారు.

## విశాఖలో మెట్ల వారి వివాహ వేడుకలో పాల్గొన్న మంత్రి లోకేష్









టీడీపీ రాష్ట్ర కార్యనిర్వాహక కార్యదర్శి మెట్ల వెంకటరమణ(రమణబాబు) సోదరుని కుమారుడి వివాహ వేడుకలో విద్య, ఐటీ శాఖల మంత్రి నారా లోకేష్ పాల్గొన్నారు. విశాఖలోని వాల్తేర్ క్లబ్ లో జరిగిన వివాహ వేడుకకు హాజరై నూతన వధూవరులు సత్యనారాయణ రావు, లక్ష్మీ సౌపర్ణికలను

## దార్లపూడి పాఠశాలసానిటరీ వర్కర్ లక్ష్మీకి ఆర్థిక సహాయం

(ఎస్ రాయవరం మార్చి 5 ప్రభాతవార్త)



దార్లపూడి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల సానిటరీ వర్కర్ కు గురువారం ఆర్థికసహాయం అందించిన పోలిశెట్టి నాయుడు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. గత కొంతకాలంగా ఇల్లు లేక బాధపడుతున్న దార్లపూడి స్కూల్ సానిటరీ వర్కర్ లక్ష్మికి పి ఆర్ టి యు వారి ఆధ్వర్యంలో ఇంటి పై కప్పులు రేకులకు ఆర్థికసహాయం అందించానన్నారు. పేదవారికి సహాయం చేయడం తనకిష్టమని, పేదవారికి చేసే సహాయం భావించి 12000 రూపాయలు ఖర్చు తో ముందుకు వచ్చానన్నారు. నాయుడును పి ఆర్ టి యు ఎస్ రాయవరం బృందం మరియు సానిటరీ వర్కర్ లక్ష్మి సన్మానించారు.

## మండల స్థాయిలో భాషోత్సవం వేడుకలు

(ఎస్ రాయవరం మార్చి 5 ప్రభాతవార్త)



మండలంలో భాషోత్సవం వేడుకలు సందర్భంగా గురువారం ధర్మవరం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో మండలస్థాయి పోటీలలో భాగంగా భువన విజయం నాటకాన్ని విద్యార్థులు ప్రదర్శించారు. వ్యాచరచన, పాటలు, పద్యాలు పోటీలు నిర్వహించారు. మండల స్థాయిలో గెలిపొందిన వారిని జిల్లా స్థాయికి ఎంపిక చేశారు. ఈ కార్యక్రమంలో ఎంఈఓ 2 శ్రీరామ్మూర్తి. ప్రధానోపాధ్యాయులు ఇంచార్చి రజియా మరియు ఉపాధ్యాయులు లలితాంబ , రాజు. ఈశ్వరరావు. శ్రీదేవి. అరుణ తదితరులు పాల్గొన్నారు...

## ముత్యాలమ్మ తల్లిని దర్శించుకున్న మండల టిడిపి పార్టీ అధ్యక్షులు.. గొంతిన శ్రీనివాసరావు

**కశింకోట, మార్చి 5, ప్రభాతవార్త;**



మండలం లోని పాత కన్నూరుపాలెం గ్రామ శ్రీ శ్రీ శ్రీ ముత్యాలమ్మ తల్లి పండుగ మహోత్సవం లో ముఖ్య అతిధి గా కశింకోట మండలం తెలుగుదేశం పార్టీ అధ్యక్షులు గొంతిన శ్రీనివాసరావు పాల్గొని అమ్మ వారి ఆశీస్సులు స్వీకరించారు. ఈ కార్యక్రమం లో జిల్లా తెలుగు రైతు ప్రధాన కార్యదర్శి ఉగ్గిన రమణ మూర్తి, ఏఎంసీ డైరెక్టర్ నైనంశెట్టి రమణారావు, కశింకోట మండలం తెలుగు యువత ప్రధాన కార్యదర్శి కుండ్రపు ప్రదీప్ , కూటమి నాయకులు, గ్రామ కమిటీ, పెద్దలు పాల్గొన్నారు.

## గుడ్లు వంటకాల తయారీ విక్రయ కేంద్రం ప్రారంభం

**గొలుగొండ మార్చి 5 ప్రభాతవార్త**



ప్రతి మండల కేంద్రంలో గుడ్లతో తయారు చేసే వంటకాలు తయారీ కేంద్రాలు ప్రారంభిస్తున్నట్లు డిపిఎం జీవనోపాదుల అధికారి సత్యనారాయణ తెలిపారు. హాలో నేషనల్ ఎగ్ కోఆర్డి నేషన్ కమిటీ ఆధ్వర్యంలో జోగంపేట కూడలి వద్ద గుడ్డుతో తయారు చేసే ఆహార పదార్థాల ఫాస్ట్ ఫుడ్ సెంటర్ ను టిడిపి అనకాపల్లి జిల్లా పార్లమెంట్ పార్టీ ఉపాధ్యక్షుడు అడిగర్ల అప్పలనాయుడు ప్రారంభించారు. నేషనల్ ఎగ్ కో ఆర్డినేషన్ కమిటీ ఆధ్వర్యంలో ఈ యొక్క ఫాస్ట్ ఫుడ్ సెంటర్ ను మంజూరు చేసినట్లు డి పి ఏం జీవనోపాదుల అధికారి సత్యనారాయణ తెలిపారు. ప్రజలు రోజు గుడ్డు తినేలాగా ప్రోత్సహించేందుకు ఈ సెంటర్ ను ఏర్పాటు చేశారన్నారు. ప్రజలకు గుడ్డు ద్వారా లభించే పౌష్టిక ఆహార కేంద్రంగా ఈ ఫాస్ట్ ఫుడ్ సెంటర్ నిర్వహణ జరుగుతుందని అన్నారు. శ్రీరాంపురం గ్రామానికి చెందిన ఒక నిరుద్యోగి ఒకడికి పాస్పోర్ట్ సెంటర్ కు సరిపడే సామాగ్రి మొత్తం నేషనల్ ఎగ్ కోఆర్డినేషన్ కమిటీ సమకూర్చిందన్నారు. దీనిద్వారా ఉపాధి అవకాశాలు మెరుగుపరుచుకోవాలని సూచించారు. ప్రజలు గుడ్డు ద్వారా లభించే పౌష్టికాహారాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు. ఈ కార్యక్రమంలో పాత మల్లంపేట సర్పంచ్ గద్దం ఆదిలక్ష్మి ఆనంద్, జోగంపేట మాజీ సర్పంచ్ సుర్ల బాబ్జి, ఏపీఎం కరుణానిధి, ఎఫ్ పి ఓ సీసీ యూ అమ్మాజీ, వెలుగు సీసీలు, సి ఏ లు డ్వాక్రా సంఘం సభ్యులు స్థానికులు పాల్గొన్నారు.

## ప్రతి ఒక్కరూ వ్యక్తిగత పరిశుభ్రత పాటించాలి వైద్యులు కాండ్రేగుల విష్ణుమూర్తి

**అనకాపల్లి మార్చి 5 (ప్రభాత వార్త)**




ప్రతి ఒక్కరు వ్యక్తిగత పరిశుభ్రత పాటిస్తూ సంపూర్ణ పోషకాహారం తీసుకోవాలని ప్రముఖ వైద్యులు కాండ్రేగుల విష్ణుమూర్తి విద్యార్థిని విద్యార్థులకు సూచించారు. శ్రీ వివేకానంద చారిటబుల్ ట్రస్ట్ ఆధ్వర్యంలో గురువారం స్థానిక బాలాజీరావు పేట ప్రైమరీ పాఠశాల నందు విద్యార్థిని, విద్యార్థులకు ఉచిత వైద్య శిబిరం నిర్వహించారు. ట్రస్ట్ చైర్మన్ డాక్టర్ కె విష్ణుమూర్తి ఆధ్వర్యంలో జరిగిన ఈ శిబిరంలో ఈఎన్టి టి వైద్య నిపుణులు డాక్టర్ కె విష్ణుమూర్తి సుమారు 70మంది విద్యార్థిని విద్యార్థులను పరీక్షించి ఉచితంగా మందులు అందజేశారు. ఈ సందర్భంగా డాక్టర్ కే విష్ణుమూర్తి మాట్లాడుతూ సంపూర్ణ పోషక ఆహారము తీసుకోవడం వల్ల , వ్యక్తిగత పరిశుభ్రత పాటించడం వలన అనారోగ్యానికి గురి కాకుండా ఉంటారని తెలిపారు. పాఠశాల ప్రధానోపాధ్యాయులు బి రామాంజనేయులు అధ్యక్షతన జరిగిన ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయులు వై రాము, బి రామలక్ష్మి, వి గౌతమీ, ఆర్ సరస్వతి, బి ఉదయ్ కుమార్ ట్రస్ట్ సిబ్బంది బి ఈశ్వర్ రావు, రామాజోగినాయుడు తదితరులు పాల్గొన్నారు.

## ఇంటర్నేషనల్ ఉమెన్స్ డే వారోత్సవాలు

**పాయకరావుపేట మార్చి 5 ప్రభాతవార్త**




పాయకరావుపేట జిల్లా పరిషత్ బాలికోన్నత పాఠశాలలో అనకాపల్లి జిల్లా ఎస్. పి. తుహిన్ సిన్హా ఉత్తర్వుల మేరకు పాయకరావుపేట పోలీస్ స్టేషన్ ఎస్ హెచ్ ఓ. జి అప్పన్న సూచనల మేరకు పాయకరావుపేట పరిధిలో ఇంటర్నేషనల్ ఉమెన్స్ డే వారోత్సవాలు సందర్భంగా విద్యార్థులందరికీ మేరీ కాం బయోపిక్ చలనచిత్రం ప్రదర్శించి విద్యార్థుల్లో ధైర్యమును ఎందులోనైనా రాణించగలము అనే వ్యక్తిత్వమును కల్పించేలా కరాటే మాస్టర్ తో బేసిక్ ట్రైనింగ్ సెల్ఫ్ డిఫెన్స్ టెక్నిక్స్ కొరకు కరాటే మొదలగు వాటిపై తర్ఫీదు ఇచ్చి తగు సూచనలు చేసి విద్యార్థులకు తెలియజేయడం జరిగింది. ఈ కార్యక్రమంలో పోలీస్ స్టేషన్ సిబ్బంది, ఉపాధ్యాయులు పాల్గొన్నారు

## ఉప్పరపల్లిలో అబ్దుల్ కలాం విజ్ఞాన కేంద్రం గ్రంధాలయం ప్రారంభం

**(ఎస్ రాయవరం మార్చి 5 ప్రభాతవార్త )**



ఉప్పరాపల్లి గ్రామం లో గురువారం గ్రామంలో ఎంప్లాయిస్ వారి ఆర్థిక సహకారం తో భారతరత్న తిశిరి అబ్దుల్ కలాం విజ్ఞాన కేంద్రం ( గ్రంధాలయం ) మండల విద్యాశాఖాధికారి శ్రీరాంమూర్తి గారి చేతులు మీదుగా ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గ్రామములో ఉన్న ఉద్యోగస్తులు ఇటువంటి కార్యక్రమాలు చేయడం యువతకు విద్యార్థులకు మనస్ఫూర్తిని ఆయన కొనియాడారు. ఇటువంటి కార్యక్రమాలు మరెన్నో చేయాలని ఆయన అన్నారు. ఈ కార్యక్రమం లో గ్రామ సర్పంచ్ శానాపతి శ్రాములు. సన్యాసిరావు, తుమ్మపాల అప్పలనాయుడు. ఎల్ఐసి శ్రీను వాసరావు , గ్రామ ఎంప్లాయిస్ సభ్యులు బొట్టా త్రిమూర్తులు, బోండా రమణ, ప్రజలు, యువత, విద్యార్థులు పాల్గొన్నారు.

## బొడ్డేడ ప్రసాద్ ను సత్కరించిన వైసిపి నేతలు

**అనకాపల్లి రూరల్ మార్చి 5 (ప్రభాత వార్త)**



వైసిపి అధ్యక్షులు వైయస్ జగన్మోహన్ రెడ్డి ఆశీస్సుల తో అనకాపల్లి జిల్లా వైసిపి అధ్యక్షులు గా నియమితులైన బొడ్డేడ ప్రసాద్ ని ఆయన కార్యాలయంలో గురువారం 80 వ వార్డు ఇంచార్జ్ కె ఎం.నాయుడు , 81 వ వార్డ్ ఇంచార్జ్ బొడ్డేడ శివ గజమాల తో ఘనంగా సత్కరించారు. ఈ సందర్భంగా బొడ్డేడ ప్రసాద్ మాట్లాడుతూ నాపై నమ్మకం తో వైయస్ జగన్ యిచ్చిన ఈ భాధ్యత ను సమర్థవంతంగా నిర్వహిస్తానని అందరూ సహకరించాలని కోరారు. కె ఎం నాయుడు, బొడ్డేడ శివ మాట్లాడుతూ పార్టీ పెట్టిన దగ్గర నుండి పార్టీ కి ఎనలేని సేవలు అందించిన ప్రసాద్ కి ఈ బాధ్యతలు అప్పగించడం పట్ల అనకాపల్లి అసెంబ్లీ నియోజకవర్గ ఇంచార్జీ మలశాల భరత్ విజయానికి ఎంతో మేలు చేస్తుందన్నారు. ప్రసాద్ కి అన్ని విధాలుగా సహాయ సహకారాలు అందిస్తూన్న మాజీ మంత్రి గుడివాడ అమర్ కి యీ సందర్భంగా కృతజ్ఞతలు చెప్పారు. ఈ కార్యక్రమం లో పార్టీ పట్టణ కార్యదర్శి వాసుపల్లి తాతీయలు 80 వ వార్డ్ వైస్ ప్రెసిడెంట్ విల్లూరి శివ సూరి పాల్గొన్నారు.

## ప్రజలు ట్రాఫిక్ నిబంధనలు పాటించాలి : ట్రాఫిక్ సిఐ వెంకటనారాయణ

**అనకాపల్లి మార్చి 5 :(ప్రభాత వార్త)**



ప్రజలు ట్రాఫిక్ నిబంధనలు తప్పనిసరిగా పాటించి పోలీసులకు సహకరించాలని ట్రాఫిక్ సీఐ వెంకటనారాయణ విజ్ఞప్తి చేశారు. స్థానిక ఆర్టీసీ కాంప్లెక్స్‌లో విద్యార్థిని, విద్యార్థులకు ట్రాఫిక్ నియమాలు , రోడ్డు భద్రతపై గురువారం అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో అనకాపల్లి ట్రాఫిక్ సీఐ ఎం. వెంకట నారాయణ పాల్గొని విద్యార్థులకు , ప్రయాణికులకు ట్రాఫిక్ నియమాల ప్రాముఖ్యతను వివరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, ఆర్టీసీ బస్సులు ఎక్కేటప్పుడు, దిగేటప్పుడు విద్యార్థులు తగిన జాగ్రత్తలు పాటించాలని సూచించారు. ఆర్టీసీ కాంప్లెక్స్‌లో ఎక్కడ పడితే అక్కడ బస్సులు ఎక్కకుండా నిర్దేశించిన ప్రదేశాలలోనే బస్సులు ఎక్కాలని తెలిపారు. ఇలా చేయకపోతే ప్రమాదాలు సంభవించే అవకాశం ఉందని హెచ్చరించారు. అలాగే బస్ డ్రైవర్లు, కండక్టర్లకు సహకరించాలని, వాహనాలపై ప్రయాణించే విద్యార్థులు కూడా తప్పనిసరిగా ట్రాఫిక్ నియమాలను పాటించాలని సూచించారు. రోడ్డు దాటేటప్పుడు జాగ్రత్తగా ఉండాలని, రోడ్డు పక్కన నడుస్తున్నప్పుడు గుంపులుగా వెళ్లి ప్రమాదాలకు గురికాకుండా అప్రమత్తంగా నడవాలని తెలిపారు. కార్యక్రమం ద్వారా విద్యార్థుల్లో ట్రాఫిక్ నియమాలపై చైతన్యంపెంపొందించి రోడ్డుప్రమాదాలను తగ్గించడం లక్ష్యమన్నారు

## మిస్సింగ్ కేసునమోదు: ఎస్ఐ విభీషణరావు

**ఎస్ రాయవరం మార్చి 5 ప్రభాతవార్త )**



వివరాల్లోకి వెళితే కర్రీ మాధవ తండ్రి లేటు విస్సన్న, వయసు 40 కాపు, గెడ్డపాలెం గ్రామం తేదీ 25.02.2026 నుండి కనిపించట్లేదని అతని భార్య కర్రీ లక్ష్మి ఇచ్చిన ఫిర్యాదు మేరకు మిస్సింగ్ కేసు రిజిస్టర్ చేయడం జరిగిందని. అతను ఆచూకీ తెలిసిన వ్యక్తులు ఈ కింది నెంబర్లకు తెలియపరచలన్నారు. పిర్యాది 9505515296 ఎస్సై విభీషణ రావు 9440796107

## తాళాలు వేసిన ఇళ్లను టార్గెట్ చేసిన దొంగ అరెస్ట్

**మూడు చోరీ కేసులు ఛేదించిన పెందుర్తి క్రైమ్ పోలీసులు**

**రూ.13 లక్షల విలువైన 160 గ్రాముల బంగారం, 700 గ్రాముల వెండి స్వాధీనం**

**మీడియా సమావేశంలో వివరాలు వెల్లడించిన క్రైమ్ డిసిపి లతా మాధురి**

**(విశాఖ క్రైమ్ ప్రభాతవార్త)**






తాళాలు వేసి ఖాళీగా ఉన్న ఇళ్లను లక్ష్యంగా చేసుకుని బంగారం, వెండి వస్తువులు దొంగిలిస్తున్న నిందితుడిని పెందుర్తి క్రైమ్ పోలీసులు అరెస్ట్ చేశారు. అతని వద్ద నుంచి సుమారు 160 గ్రాముల బంగారు ఆభరణాలు, 700 గ్రాముల వెండి వస్తువులు స్వాధీనం చేసుకున్నారు. వీటి విలువ సుమారు రూ.13 లక్షలు ఉంటుందని పోలీసులు తెలిపారు. విశాఖపట్నం నగర పోలీస్ కమిషనర్ డాక్టర్ శంఖబ్రత బాగ్చి ఆదేశాల మేరకు, క్రైమ్స్ డీసీపీ కె.లతా మాధురి, ఏసీపీ ఏ.నరసింహమూర్తి పర్యవేక్షణలో వెస్ట్ సబ్‌డివిజన్ క్రైమ్ ఇన్‌స్పెక్టర్ ఎం.చంద్రమోళి ఆధ్వర్యంలో పెందుర్తి పోలీస్ స్టేషన్ సిబ్బంది ప్రత్యేక బృందం ఏర్పడి దర్యాప్తు చేపట్టింది. దర్యాప్తులో భాగంగా మూడు చోరీ కేసులకు సంబంధించిన నిందితుడిని గుర్తించి అరెస్ట్ చేశారు. గురువారం పోలీస్ సమావేశ మందిరంలో ఏర్పాటుచేసిన మీడియా సమావేశంలో క్రైమ్ డిసిపి అరెస్టుకు సంబంధించిన వివరాలను తెలియజేశారు తాళాలు విరగగొట్టి చోరీలు వేపగుంట వరలక్ష్మీ నగర్‌కు చెందిన పారిపూడి వెంకటేశ్వరరావు కుటుంబంతో కలిసి బయటకు వెళ్లిన సమయంలో ఇంటి తలుపుల తాళాలు విరగగొట్టి బీరువా పగలగొట్టి సుమారు 8 తులాల బంగారం, 400 గ్రాముల వెండి వస్తువులు దొంగిలించారు. దీనిపై పెందుర్తి పోలీస్ స్టేషన్‌లో కేసు నమోదు చేశారు. ఇంకో ఘటనలో నాయుడు తోట అప్పలనరసయ్య కాలనీకి చెందిన సూరెడ్డి శ్రీనివాస్ ఇంటికి తాళాలు వేసి స్వగ్రామానికి వెళ్లిన సమయంలో ఇంటి తలుపులు పగలగొట్టి బీరువాలో ఉన్న సుమారు 15 గ్రాముల బంగారు ఆభరణాలు దొంగిలించారు. ఈ ఘటనపై కూడా పెందుర్తి పోలీస్ స్టేషన్‌లో కేసు నమోదైంది. అలాగే వేపగుంట వరలక్ష్మీనగర్‌కు చెందిన పప్పు ధర్మేంద్ర ఇంటికి తాళాలు వేసి ఆసుపత్రికి వెళ్లిన సమయంలో తలుపులు విరగగొట్టి నగదు రూ.5,000తో పాటు వెండి వస్తువులు, ఇతర సామగ్రి దొంగిలించిన ఘటన కూడా వెలుగులోకి వచ్చింది. ఒకే నిందితుడు.. మూడు కేసులు ఈ మూడు కేసులపై దర్యాప్తు చేపట్టిన పోలీసులు సింహాచలం ప్రాంతానికి చెందిన ఆది ప్రసాద్ శ్రీను (45)ను నిందితుడిగా గుర్తించి అరెస్ట్ చేశారు. అతని వద్ద నుంచి చోరీ చేసిన బంగారు, వెండి వస్తువులను స్వాధీనం చేసుకున్నారు. పోలీసుల ప్రతిభకు అభినందనలు ఈ కేసులను ఛేదించడంలో వెస్ట్ సబ్‌డివిజన్ క్రైమ్ ఇన్‌స్పెక్టర్ ఎం.చంద్రమోళి, డీఎస్ఐ డి.సూరిబాబు, ఏఎస్ఐ కె.శ్రీనివాసరావు, హెడ్ కానిస్టేబుళ్లు జి.నాగరాజు, వి.పెరయ్యనాయుడు, కానిస్టేబుళ్లు జి.శ్రీనివాస్, పి.శాంతకుమార్, బి.దేముడునాయుడు, ఎల్.కె.తాతారావు ప్రత్యేక ప్రతిభ కనబరిచారని క్రైమ్ డిసిపి లతా మాధురి అభినందించారు.

## బెట్టింగ్ యాప్ అప్పుల భారం.. ఆత్మహత్యకు యత్నించిన యువకుడు

- నిమిషాల్లో స్పందించిన మహారాణిపేట పోలీసులు
- సీపీ శంఖబ్రత బాగ్చి ఆదేశాలతో వెంటనే రంగంలోకి సీఐ దివాకర్ యాదవ్ బృందం
- జెట్టి నెంబర్11 వద్ద యువకుడిని గుర్తించి కుటుంబ సభ్యులకు అప్పగింత

**(విశాఖ క్రైమ్ ప్రభాతవార్త)**



ఆన్‌లైన్ బెట్టింగ్ యాప్‌లలో అప్పులు చేసి తీవ్ర మానసిక ఒత్తిడికి గురైన ఒక యువకుడు ఆత్మహత్యకు యత్నించిన ఘటనలో మహారాణిపేట పోలీసులు అప్రమత్తంగా వ్యవహరించి అతని ప్రాణాలను కాపాడారు. ఘటనపై విశాఖపట్నం పోలీస్ కమిషనర్ డాక్టర్ శంఖబ్రత బాగ్చి ప్రత్యేకంగా స్పందించి వెంటనే చర్యలు తీసుకోవాలని ఆదేశించడంతో పోలీసులు నిమిషాల్లో యువకుడిని గుర్తించి రక్షించారు. పోలీసుల సమాచారం మేరకు బెట్టింగ్ యాప్‌లో అప్పులు చేసి ఆర్థికంగా ఇబ్బందులు ఎదుర్కొంటున్న యువకుడు ఆత్మహత్య చేసుకోవాలని నిర్ణయించుకున్నాడు. ఈ విషయం తెలుసుకున్న బాధితుడి కుటుంబ సభ్యులు వెంటనే విశాఖపట్నం పోలీస్ కమిషనర్ డాక్టర్ శంఖబ్రత బాగ్చిని ఫోన్ ద్వారా సంప్రదించి సహాయం కోరారు. దీనిపై స్పందించిన కమిషనర్ శంఖబ్రత బాగ్చి వెంటనే మహారాణిపేట సీఐ దివాకర్ యాదవ్‌కు సమాచారం అందించి యువకుడిని గుర్తించి రక్షించాలని ఆదేశించారు. జెట్టి వద్ద నుంచి సురక్షితంగా రక్షణ సీపీ బాగ్చి ఆదేశాల మేరకు మహారాణిపేట సీఐ దివాకర్ యాదవ్ వెంటనే ప్రత్యేక బృందాలను ఏర్పాటు చేసి గాలింపు చేపట్టారు. యువకుడు సముద్ర తీరంలోని జెట్టి నెంబర్ 11 వద్దకు వెళ్లినట్లు సమాచారం రావడంతో అక్కడికి చేరుకున్న పోలీసులు తక్షణమే అతన్ని గుర్తించి రక్షించారు. తర్వాత అతనికి కౌన్సిలింగ్ ఇచ్చి కుటుంబ సభ్యులకు సురక్షితంగా అప్పగించారు. సీఐ దివాకర్ యాదవ్ కు అభినందనలు యువకుడి ప్రాణాలను కాపాడిన మహారాణిపేట సీఐ దివాకర్ యాదవ్ వారి బృందం తక్షణ స్పందనకు విశాఖపట్నం పోలీస్ కమిషనర్ డాక్టర్ శంఖబ్రత బాగ్చి ప్రత్యేకంగా అభినందించారు. ఆన్‌లైన్ బెట్టింగ్ యాప్‌లకు దూరంగా ఉండాలని, ఆర్థిక సమస్యలు ఎదురైనప్పుడు ఆత్మహత్యలాంటి ఆలోచనలు చేయకుండా కుటుంబ సభ్యులు లేదా అధికారులను సంప్రదించాలని ఈ సందర్భంగా మహారాణిపేట సీఐ దివాకర్ యాదవ్ ప్రజలకు సూచించారు.

## పేకాట స్థావరంపై టాస్క్ ఫోర్స్ దాడి పోలీసుల అదుపులో ఏడుగురు పేకాట రాయుళ్లు :రూ.40,300 లు స్వాధీనం

**(విశాఖ క్రైమ్ ప్రభాతవార్త)**



నగరంలోని నాల్గవ పట్టణ పోలీస్ స్టేషన్ పరిధిలో పేకాట స్థావరంపై టాస్క్ ఫోర్స్ పోలీసులు దాడి చేసి ఏడుగురిని అదుపులోకి తీసుకున్నారు. వారి వద్ద నుంచి రూ.40,300 నగదును స్వాధీనం చేసుకున్నారు. పోలీసుల సమాచారం ప్రకారం బాలయ్య శాస్త్రి లేఔట్ ప్రాంతంలో కొంతమంది వ్యక్తులు పేకాట ఆడుతున్నట్లు టాస్క్ ఫోర్స్ పోలీసులకు సమాచారం అందింది. దీంతో టాస్క్ ఫోర్స్ సీఐ భాస్కరరావు నేతృత్వంలో సిబ్బంది గురువారం అక్కడికి వెళ్లి ఆకస్మికంగా దాడి నిర్వహించారు. ఈ దాడిలో పేకాట ఆడుతున్న ఏడుగురు వ్యక్తులను పోలీసులు అదుపులోకి తీసుకున్నారు. వారి వద్ద నుంచి రూ.40,300 నగదు మరియు పేకాట సామగ్రిని స్వాధీనం చేసుకున్నట్లు పోలీసులు తెలిపారు. అనంతరం తదుపరి విచారణ నిమిత్తం నిందితులను ఫోర్త్ టౌన్ పోలీస్ స్టేషన్ అధికారులకు అప్పగించినట్లు తెలిపారు.

## వీసీఎస్సీ ఆధ్వర్యంలో.. మహిళలకు సైబర్ భద్రత అవగాహన

**(ప్రభాతవార్త విశాఖపట్నం)**



అంతర్జాతీయ మహిళా దినోత్సవాన్ని పురస్కరించుకొని వీసీఎస్సీ ఆధ్వర్యంలో మాసోత్సవ కార్యక్రమంలో భాగంగా ఈ నెల మొత్తాన్ని మహిళా మాసంగా పాటించాలని నిర్ణయించింది, ఇది మహిళల అవగాహన, సాధికారత, భద్రతపై దృష్టి సారించింది. ఈ చొరవలో భాగంగా, సాగర్ దుర్గ స్కూల్ ఆఫ్ నర్సింగ్‌లో మహిళలకు సైబర్ భద్రత, పోష్(పని ప్రదేశంలో లైంగిక వేధింపుల నివారణ)పై అవగాహన సెషన్ నిర్వహించారు. ఆన్‌లైన్ భద్రత, మహిళలను లక్ష్యంగా చేసుకునే సాధారణ సైబర్ మోసాలు, డిజిటల్ గోప్యత, సోషల్ మీడియా బాధ్యతాయుతమైన ఉపయోగంపై దృష్టి సారించి సీమా స్త్రీ ఈ సెషన్‌ను నిర్వహించారు. పోష్ చట్టంలోని నిబంధనలు, కార్యాలయంలో.. వారి హక్కులు, వేధింపులను నివేదించడంపై అవగాహన కల్పించారు. అదనపు ఇన్‌పుట్‌లను నవీన్ కుమార్, లేడీ కానిస్టేబుల్ కే.శ్యామల అందించారు. వీసీఎస్సీ జాయింట్ సెక్రటరీలు కిషోర్ దాసరి, లక్ష్మి మార్గదర్శకత్వంలో ఈ కార్యక్రమం జరిగింది. సాగర్ దుర్గ స్కూల్ ఆఫ్ నర్సింగ్ నిర్వాహకులు దువూరి మనోజ్ కుమార్ రెడ్డి, సీఐ డీవీలకు హృదయపూర్వక కృతజ్ఞతలు తెలిపారు. ఈ సెషన్‌ను విజయవంతంగా నిర్వహించడంలో సహకారం ఇచ్చినందుకు రమణకు ధన్యవాదాలు తెలిపారు.


**CLASSIFIEDS** (VAARTHA CLASSIFIEDS)

**CHANGE OF NAME**

I, SAMOJI VARAKONDALARAO S/O APPALARAJU, previously called SAMOJ VARA KODNALA RAO R/O 9-38, GAVARA JAGGAYYAPALEM, PENDURTHI, VISAKHAPATNAM, now changed my name from SAMOJ VARA KODNALA RAO to SAMOJI VARAKONDALARAO. Henceforth I will be called as SAMOJI VARAKONDALA RAO for all purposes.

(Ro.No.45645)

**గమనిక**

క్లాసిఫైడ్ ప్రకటనలకు ప్రతిస్పందించే ముందు తగినరీతిలో క్షుణ్ణంగా విచారించుకోవలసిందిగా పాఠకులకు సూచించడమైనది. ప్రకటనదారు చెబుతున్న లేదా చేసుకుంటున్న క్లెయిములతో "వార్త" దినపత్రికకు ఏ విధమైన సంబంధం లేదు.

## తీర్థయాత్రకు వెళ్లిన ఇంటిపై కన్నేసిన దొంగలు

- *రూ.8 లక్షల విలువైన బంగారం,వెండి దోపిడి*
- *కాల్‌డేటాతో క్లూ.. ముగ్గురు నిందితుల అరెస్ట్*
- *29 తులాల బంగారం, 101 తులాల వెండి స్వాధీనం*
- *ప్రతిభ కనబరిచిన పీ.ఎం.పాలెం క్రైమ్ పోలీసులకు ప్రశంసలు*
- *మీడియా సమావేశంలో వివరాలు వెల్లడించిన క్రైమ్ డిసిపి లతా మాధురి*

(విశాఖ క్రైమ్, ప్రభాతవార్త)




తీర్థయాత్రకు వెళ్లిన కుటుంబం ఇంటిని లక్ష్యంగా చేసుకుని దొంగతనానికి పాల్పడిన ముగ్గురు నిందితులను పీఎం పాలెం క్రైమ్ పోలీసులు అరెస్ట్ చేశారు. వారి వద్ద నుంచి దొంగిలించిన బంగారం, వెండి ఆభరణాలను స్వాధీనం చేసుకున్నారు. గురువారం పోలీస్ సమావేశ మందిరంలో ఏర్పాటుచేసిన మీడియా సమావేశంలో క్రైమ్ డిసిపి లలితా మాధురి వివరాలను వెల్లడించారు.. అయ్యప్పనగర్‌లోని వివేకానంద కాలనీ, కొమ్మడి జంక్షన్ ప్రాంతంలో నివాసం ఉండే బొడ్డేటి అప్పలరాజు (రిటైర్డ్ లైన్‌మ్యాన్) ఈ నెల 2న ఉదయం కుటుంబ సభ్యులతో కలిసి రామేశ్వరం నుంచి త్రివేండ్రం వరకు తీర్థయాత్రకు వెళ్లారు. ప్రయాణం ముగించుకుని ఇంటికి తిరిగి వచ్చినప్పుడు గ్రిల్ గేట్ తెరిచి చూసేసరికి ప్రధాన తలుపు తాళం విరగగొట్టినట్లు గమనించారు. ఇంట్లోకి వెళ్లి చూడగా అల్మారాలు తెరిచి ఉండటంతో పాటు నగదు, బంగారం, వెండి ఆభరణాలు కనిపించలేదు.దొంగిలించిన ఆభరణాల్లో నెక్లెస్, హారం, గొలుసులు, చెవి ఉంగరాలు, బంగారు ఉంగరాలు, కంకణాలు తదితరాలు ఉన్నాయి. మొత్తం 29 తులాల (335 గ్రాములు) బంగారం, 101 తులాల (1177 గ్రాములు) వెండి ఆభరణాలు దోచుకెళ్లినట్లు గుర్తించారు. వీటి విలువ సుమారు రూ.8 లక్షలుగా అంచనా. దీనిపై పీఎం పాలెం క్రైమ్ పోలీస్ స్టేషన్‌లో కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు.దర్యాప్తులో భాగంగా ఫిర్యాదుదారుడి కుటుంబ సభ్యులు, పరిచయస్తుల కాల్ డేటా పరిశీలించగా పెనుగుర్తి శ్రీదేవి తరచుగా ఫిర్యాదుదారుతో మాట్లాడినట్లు గుర్తించారు. ఆమె కాల్ డేటాను విశ్లేషించగా కోడూరు ప్రసాద్‌బాబుతో నేరానికి ముందు, తర్వాత పలుమార్లు మాట్లాడినట్లు బయటపడింది. నేరం జరిగిన తర్వాత ప్రసాద్‌బాబు ఫోన్ స్విచ్ ఆఫ్ చేయడంతో అనుమానం బలపడింది. దీంతో పోలీసులు ప్రత్యేక బృందాలు ఏర్పాటు చేసి నిందితుల కదలికలపై నిఘా పెట్టారు. మార్చి 3న ఎంవీపీ సిటీ సమీపంలో పెనుగుర్తి శ్రీదేవి , సావదాన హరికృష్ణ లను అదుపులోకి తీసుకున్నారు. అనంతరం మార్చి 5న పనోరమ హిల్స్ వద్ద మరో నేరస్తుడు కోడూరు ప్రసాద్‌బాబు ను అరెస్ట్ చేశారు.నిందితుల వద్ద నుంచి దొంగిలించిన 335 గ్రాముల బంగారం, 1177 గ్రాముల వెండి ఆభరణాలు, దొంగతనానికి ఉపయోగించిన కట్టర్, స్క్రూ డ్రైవర్, కట్టింగ్ ప్లయర్‌తో పాటు ఒక స్కూటీని పోలీసులు స్వాధీనం చేసుకున్నారు. అనంతరం నిందితులను రిమాండ్‌కు తరలించారు. ఉత్తమ ప్రతిభ కనబరిచిన క్రైమ్ బృందానికి ప్రశంసలు ఈ కేసును ఛేదించడంలో నార్త్ సబ్ డివిజన్ క్రైమ్ సిబ్బంది కీలక పాత్ర పోషించారు. ఇన్స్పెక్టర్ బి.ఎస్.ఎస్. ప్రకాష్ ఆధ్వర్యంలో ఎస్.ఐలు సూర్యప్రకాశరావు, ఆర్. శ్రీనివాసరావు, ఎండి షరీఫ్ మరియు కానిస్టేబుళ్లు జె. నాగరాజు, వి. చంద్రశేఖర్, ఎస్. రవి, బి. రవి, అప్పలరాజు విశేషంగా కృషి చేశారు. ఈ సందర్భంగా డిసిపి లతా మాధురి వీరిని అభినందించారు.



## దువ్వాడలో రైల్వే గేట్ లాకింగ్ సిస్టం

- ఫెయిల్‌గంటల తరబడి ట్రాఫిక్ జామ్.. వాహనదారుల ఆగ్రహం

గాజువాక,మార్చి 5,ప్రభాతవార్త



దువ్వాడ (తుంగ్లాం) రైల్వే గేట్ వద్ద గురువారం ఉదయం సాంకేతిక లోపం కలకలం రేపింది. ఉదయం సుమారు 7 గంటల సమయంలో గూడ్స్ రైలు రాకతో గేట్ మెన్ రెండు వైపులా గేట్లు మూసివేశారు. రైలు వెళ్లిన అనంతరం గేట్లు ఎత్తే క్రమంలో ఒక వైపు గేట్‌కు ఉన్న లాకింగ్ సిస్టం పనిచేయలేదు. దీంతో ఒక గేట్ తెరుచుకోకపోవడంతో రెండు వైపులా వాహనాలు భారీగా నిలిచిపోయాయి. పాఠశాలలు, ఉద్యోగాల కోసం బయలుదేరిన వారు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొన్నారు. ట్రాఫిక్ కిలోమీటర్ల మేరకు నిలిచిపోయింది.సమాచారం అందుకున్న రైల్వే సాంకేతిక బృందం ఘటనాస్థలికి చేరుకుని లోపాన్ని సరిచేయడానికి ప్రయత్నించింది. అయితే సమస్య పరిష్కారానికి ఎక్కువ సమయం పట్టిందని వాహనదారులు ఆగ్రహం వ్యక్తం చేశారు.భద్రతా కారణాల దృష్ట్యా గేట్‌ను పూర్తిగా సక్రమం చేసిన తర్వాతే వాహనాల రాకపోకలను అనుమతించినట్లు రైల్వే సిబ్బంది తెలిపారు. తరచూ ఇలాంటి లోపాలు తలెత్తకుండా శాశ్వత పరిష్కారం చూపాలని స్థానికులు కోరుతున్నారు.

## అధిక లాభాలు.. గ్యారంటీ రాబడులు అంటూ క్రిప్టో మోసం

- *యూఎంటీ, యూబిట్, అల్ట్రావర్స్ పేర్లతో చైన్ వ్యాపారం*
- *అమాయక ప్రజలను పెట్టుబడులకు ప్రలోభపెట్టి భారీ మోసం*
- *ముగ్గురు కీలక స్టార్ రేటింగ్ నిందితులు అరెస్ట్..*
- *14 రోజుల జ్యుడీషియల్ రిమాండ్*





(విశాఖ క్రైమ్, ప్రభాతవార్త)

అధిక లాభాలు.. గ్యారంటీ రాబడులు అంటూ ప్రచారం చేస్తూ అమాయక ప్రజల నుంచి పెట్టుబడులు వసూలు చేస్తున్న క్రిప్టో కరెన్సీ ఆధారిత చైన్ వ్యాపార మోసాన్ని విశాఖపట్నం నగర సైబర్ క్రైమ్ పోలీసులు ఛేదించారు. ఈ మోసానికి సహకరిస్తూ పెట్టుబడులు పెట్టించిన స్టార్ రేటింగ్ లీడర్లను పోలీసులు అరెస్ట్ చేసి రిమాండ్‌కు తరలించారు. విశాఖపట్నం పోలీస్ కమిషనర్ డాక్టర్ శంఖబ్రత బాగ్చి ఆదేశాల మేరకు సైబర్ నేరాల పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు. యూఎంటీ (యూనిటీ మెటా టోకెన్), యూబిట్, అల్ట్రావర్స్, ఎంఎంఎంసీ పేర్లతో నడిచిన క్రిప్టో ఆధారిత చైన్ పద్ధతి పెట్టుబడి పథకం ద్వారా ప్రజలను మోసం చేసినట్లు గుర్తించారు. ఈ కేసును క్రైమ్ నెంబర్ 282/2025 కింద భారత న్యాయ సంహిత , సమాచార సాంకేతిక చట్టాల ప్రకారం నమోదు చేశారు. చైన్ వ్యవస్థ పేరుతో మోసం పోలీసుల దర్యాప్తులో వెల్లడైన వివరాల ప్రకారం.. ఈ పథకం పూర్తిగా చైన్ వ్యవస్థ పద్ధతిలో నడిచింది. పెట్టుబడిదారులకు రోజుకు 0.4 శాతం లాభం, 500 రోజుల పాటు నిరంతర ఆదాయం వస్తుందని నమ్మించారు. 50 అమెరికా డాలర్ల నుంచి 10,000 అమెరికా డాలర్ల వరకు పెట్టుబడులు పెట్టించుకున్నారు. కొత్త సభ్యులను చేర్పిస్తే కమిషన్ వస్తుందని చెప్పి పరిచయ లింకుల ద్వారా పెద్ద సంఖ్యలో ప్రజలను ఈ పథకంలోకి చేర్చారు.ఈ పథకంలో ఎటువంటి నిజమైన వ్యాపారం లేకపోయినా కొత్తగా డబ్బు పెట్టేవాళ్ల ద్వారా వచ్చిన డబ్బుతో పాత పెట్టుబడిదారులకు లాభాలు చూపించే విధంగా నడిపినట్లు పోలీసులు తెలిపారు. ఇది పూర్తిగా పోంజీ పథకం లక్షణాలతో ఉన్న మోసం అని దర్యాప్తులో తేలింది. టోకెన్ల పేర్లు మార్చుతూ మోసం మొదట యూనిటీ మెటా టోకెన్ పేరుతో ప్రారంభించిన ఈ పథకాన్ని తర్వాత యూబిట్, అల్ట్రావర్స్ కాయిన్, చివరగా ఎంఎంఎంసీ (మేక్ మీ మిలియనీర్ కాయిన్) పేర్లతో మారుస్తూ పెట్టుబడిదారులను మభ్యపెట్టారు. రోజువారీ లేదా నెలవారీ భారీ లాభాలు వస్తాయని ప్రచారం చేసి పెట్టుబడులను పెంచుకున్నారు.దర్యాప్తులో భాగంగా ఈ పథకానికి భారతీయ రిజర్వ్ బ్యాంకు, భారతీయ పూచీకత్తు మరియు మారక ద్రవ్య నియంత్రణ మండలి (సెబీ) లేదా ఇతర అధికారిక నియంత్రణ సంస్థల నుంచి ఎలాంటి అనుమతి లేదని పోలీసులు గుర్తించారు. స్టార్ రేటింగ్ లీడర్ల అరెస్ట్ ఈ కేసులో ప్రజలను పెట్టుబడులకు ప్రోత్సహిస్తూ చైన్ వ్యవస్థను విస్తరించిన ముగ్గురు కీలక నిందితులు బాలభద్ర శ్రీ వెంకట నాగేశ్వరరావు అలియాస్ నాగేశ్ (4 స్టార్ రేటింగ్),పిరియా ప్రసాదరావు (3 స్టార్ రేటింగ్),కుడుపూడి కిరణ్ కుమార్ (2 స్టార్ రేటింగ్) లను పోలీసులు అరెస్ట్ చేశారు..వీరు ఎక్కువ మంది పెట్టుబడిదారులను చేర్చితే స్టార్ స్థాయిలు వస్తాయని, కార్లు, విదేశీ పర్యటనలు, విల్లాలు, విలాసవంతమైన బహుమతులు ఇస్తామని ఆశ చూపిస్తూ ప్రజలను ఈ పథకంలోకి తీసుకువచ్చినట్లు పోలీసులు తెలిపారు. వీరిని కోర్టులో హాజరుపరచగా న్యాయస్థానం 14 రోజుల జ్యుడిషల్ రిమాండ్ విధించింది.నిందితుల వద్ద నుంచి క్రిప్టో కరెన్సీ వాలెట్ యాప్‌లు, అనేక వినియోగదారుల ఖాతా వివరాలు, పాస్‌వర్డ్లు మరియు ప్రవేశ వివరాలు స్వాధీనం చేసుకున్నారు. క్రిప్టో మోసాలకు బలి అవ్వొద్దు"అధిక లాభాలు","గ్యారంటీ రాబడులు" అంటూ ప్రచారం చేసే క్రిప్టో లేదా ఆన్‌లైన్ పెట్టుబడి పథకాలను నమ్మి మోసపోవద్దని పోలీసులు హెచ్చరించారు. ఈ పథకంలో పెట్టుబడి పెట్టి నష్టపోయిన వారు విశాఖపట్నం నగర సైబర్ నేరాల పోలీసులను సంప్రదించాలని సూచించారు. సైబర్ నేరాలకు సంబంధించిన ఫిర్యాదుల కోసం వెబ్‌సైట్ లేదా టోల్ ఫ్రీ నెంబర్ 1930, అలాగే పోలీస్ కమిషనర్ కార్యాలయ నెంబర్ 7995095799 ను సంప్రదించవచ్చని తెలిపారు.

## కొబ్బరి పీసు ఫ్యాక్టరీ షెడ్ పై పనిచేస్తూ దురదుష్టరవశాస్తూ మృతి

(ఎస్ రాయవరం మార్చి 5 ప్రభాతవార్త)



వివరాల్లోకి వెళితే.. మండలం కొరుపోలు గ్రామంలో గల ప్రతిపాటి సత్యనారాయణ శ్రీ సత్య వినాయక ఫైబర్ ఫ్యాక్టరీలో ఉన్న స్టోరేజ్ షెడ్ రిపేరు చేస్తూ పైకి ఎక్కిన కొమ్ము నూకరాజు బాబ్జి సన్నాఫ్ నాగరాజు వయసు 50, అనే వ్యక్తి వెంటిలేషన్ ఫైబర్ షీట్ పై కాలు వేసి అక్కడి నుంచి ప్రమాదవశాత్తు జారి పడి గాయాలయ్యాయి. వెంటనే దగ్గర్లో ఉన్న సన్ షైన్ హాస్పిటల్ చూపిం చగా అక్కడినుండి అనకాపల్లి ఎన్టీఆర్ హాస్పిటల్ కి తీసుకెళ్లగా అక్కడ చని పోయినట్లు గా ఎస్సై విభీషణరావు ఫిర్యాదుపై కేసు నమోదుచేసి దర్యాప్తు చేస్తున్నామన్నారు.

## సింహాచలం గురుకుల పాఠశాల సందర్శించిన ఎంపి భరత్

సింహాచలం, ప్రభాతవార్త



ఒక సమున్నత లక్ష్యంతో వెనుకబడిన వర్గాల పిల్లల అభ్యున్నతికోసం మాజీముఖ్య మంత్రి దివంగత నేత నందమూరి తారకరామారావు అప్పట్లో విశాఖలోని సింహాచలంలో స్థాపించిన మహాత్మా జ్యోతిబా పూలే ఆంధ్రప్రదేశ్ వెనుకబడిన తరగతుల సంక్షేమ ఆశ్రమ పాఠశాలకు పూర్వవైభవం తీసుకు రావాల్సిన అవసరం వుందని విశాఖపట్నం పార్లమెంట్ సభ్యులు మతుకుమిల్లి శ్రీ భరత్ ఆకాంక్షించారు.. గురువారం ఆయన పాఠశాల ను సందర్శించి ప్రస్తుత పరిస్థితిని స్వయంగా పరిశీలించారు. ఈ సందర్భంగా విద్యార్థులతో, ఉపాధ్యాయులతో ముఖాముఖీ మాట్లాడి వారి ఆలోచనలు తెలుసుకున్నారు. అనంతరం విశాఖపట్నం పార్లమెంటు సభ్యులు భరత్ మాట్లాడుతూ మహాత్మా జ్యోతిబా పులే సంక్షేమ ఆశ్రమ పాఠశాల మొదట్లో 40 ఎకరాల క్యాంపస్ ని కలిగివుండగా ఎండోమెంట్ శాఖ 20 ఎకరాల్లో గోడ నిర్మాణం చేయడం వల్ల 18 ఎకరాల కి తగ్గిన్నారు. మిగిలిన భాగంలోని క్యాంపస్ లో మౌలిక సదుపాయాలు ఎలా ఉన్నాయో చూడడం జరిగిందన్నారు. అదనపు మౌలికవసతుల కోసం ప్రభుత్వం కేటాయించిన నిధుల్లో కొన్ని ప్రాజెక్ట్స్ ఇవాళ సగంలో ఆగిపోయి ఉన్నాయని, వాటిని పూర్తి చేయడానికి మళ్ళీ కొత్త బడ్జెట్ ఇచ్చిన విషయాన్ని వెల్లడించారు. అది కార్యరూపంలోకి తీసుకురాగలిగి భవనాలను పూర్తి చేస్తే ఏదైతే పాత భవనాలను ఇవాళ వాడలేని పరిస్థితిలో ఉన్నాయో వాటి నుంచి కొత్త బిల్డింగ్స్ లోకి తరలించవచ్చున్నారు. తద్వారా మౌలికవసతుల లేమి కారణంగా ఆశ్రమ పాఠశాలలో విద్యార్థుల సామర్థం తగ్గుదలను అదిగమించవచ్చున్నారు.. అలాగే ఈ పాఠశాల అభివృద్ధికి భవిష్యత్తులో ఒక సమగ్ర ప్రణాళిక తీసుకుని రావాలని అభిప్రాయపడ్డారు

## స్త్రీల వ్యాధిల పట్ల ఆర్ ఎం పి లకి అవగాహన సదస్సు

పద్మనాభం,మార్చి 5, ప్రభాతవార్త



మండలంలో పలు గ్రామాలలో ఉన్న గ్రామీణ వైద్యులకు గురువారం పద్మనాభంలో విశాఖ గుడ్ హెల్త్ క్లినిక్ ద్వారా వైద్యులు ఎన్ ఎస్ సాయి అనూష స్త్రీల వ్యాధుల పట్ల అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా అమె మాట్లాడుతూ స్త్రీలు నెలసరి కడుపు నొప్పులు,సర్వేకల్ క్యాన్సర్ వైరస్ గురించి వైద్య విజ్ఞాన కల్పించారు. ఈ కార్యక్రమంలో విజయనగర ఆర్ ఎం పి ల సంఘ అధ్యక్షుడు చిరంజీవి మండల ఆర్ ఎం పిల సంఘ అధ్యక్షుడు రాలి అప్పారావు పాల్గొన్నారు.

## బాధితురాలికి రూ.5 లక్షల సీఎంఆర్‌ఎఫ్ చెక్కు పంపిణీ

గాజువాక, మార్చి 5,ప్రభాతవార్త



నియోజకవర్గంలోని 85వ వార్డు తలారివానిపాలేనికి చెందిన తలారి కుంచమ్మకు మంజూరైన రూ. 5 లక్షల ముఖ్యమంత్రి సహాయనిధి (సీఎంఆర్‌ఎఫ్) చెక్కును గురువారం అందజేశారు. గాజువాక ఎమ్మెల్యే, టీడీపీ రాష్ట్ర అధ్యక్షుడు పల్లా శ్రీనివాసరావు ఆదేశాల మేరకు పార్టీ గాజువాక నియోజకవర్గ సమన్వయకర్త ప్రసాదుల శ్రీనివాస్ ఈ చెక్కును బాధితురాలికి పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. గత 20 నెలల్లో నియోజకవర్గంలో సుమారు రూ. 2.50 కోట్ల విలువైన సహాయనిధిని బాధితులకు అందజేశామని తెలిపారు. పేదల సంక్షేమమే కూటమి ప్రభుత్వ ధ్యేయమన్నారు. ఈ కార్యక్రమంలో వార్డు పార్టీ అధ్యక్షుడు కర్రి దసేంద్ర, ప్రధాన కార్యదర్శి విందుల రాజు పాల్గొన్నారు.

## ప్రతి మండలంలో బిజెపి కార్యశాల ఉంటుంది

- కేఎన్ఆర్ విజయానందరెడ్డి

గాజువాక,మార్చి5,ప్రభాతవార్త:



గాజువాక పోలీస్ స్టేషన్ ఎదురుగా ఉన్న వర్షిణి కళ్యాణ మండపంలో బిజెపి ముఖ్య నాయకుల సమావేశం జరిగింది. ముఖ్య అతిధిగా శ్రీకాకుళం జిల్లా ఇంచార్జ్ ఎమ్ఎస్ఎమ్ఈ మెంబరు విజయానందరెడ్డి, రాష్ట్ర మీడియా పేనలిస్ట్ గాజువాక ఇంచార్జ్ కరణంరెడ్డి నరసింగరావు లు పాల్గొని మాట్లాడుతూ బిజెపి సంస్థాగత నిర్మాణంలో భాగంగా పార్టీ రాష్ట్ర అధ్యక్షుడు పివిఎన్ మాధవ్ సూచనల మేరకు మార్చి ఏడవ తేదీ నుండి ఏప్రిల్ పద్నాల్గవ తేదీ వరకు ప్రతి మండలంలో దీనదయాళ్ ఉపాధ్యాయ ప్రశిక్షణ అభియాన్ 2026 పేరుతో సభను నిర్వహించాలని అన్నారు. ఆయొక్క కార్యక్రమంలో రాష్ట్ర, జిల్లా స్థాయి నాయకులు వచ్చి పాల్గొని పార్టీ సిద్ధాంతాలను కేంద్ర ప్రభుత్వం సంక్షేమ పథకాలకు వివరిస్తారని అన్నారు. అవి ప్రజల్లోకి తీసుకెళ్లాలని సూచించారు. కార్యక్రమంలో జిల్లా ప్రధాన కార్యదర్శి సిరసపల్లి నూకరాజు, జిల్లా కార్యదర్శి సోంబాబు,కట్టా పద్మ, రోహిణి, వర్రి లలిత, అశోక్,పావని,రూపాదేవి తదితరులు పాల్గొన్నారు.

## దివ్యాంగులకు ఉచిత సేవలు అందించాలి

- మాజీఎమ్మెల్యే తిప్పల నాగిరెడ్డి

గాజువాక, మార్చి 5,ప్రభాతవార్త



పెదగంట్యాడ సిద్ధేశ్వరంలో ఖిలండీబోయిన అడ్వకేట్స్ అండ్ అసోసియేట్స్, ఆన్‌లైన్ సర్వీసెస్‌ఖి కార్యాలయాన్ని మాజీ ఎమ్మెల్యే తిప్పల నాగిరెడ్డి, వైకాపా ఇంచార్జ్ తిప్పల దేవన్‌రెడ్డి గురువారం ప్రారంభించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. సామాన్యులకు న్యాయ సహాయంతో పాటు, దివ్యాంగులకు ఉచితంగా ఆన్‌లైన్ సేవలు అందించేందుకు ముందుకు రావడం అభినందనీయమన్నారు. తల్లిదండ్రుల ఆశయంతో సాఫ్ట్‌వేర్ వృత్తిని వదిలి న్యాయవాదిగా మారిన అరుణ్‌కుమార్ సేవలను స్థానికులు వినియోగించుకోవాలని కోరారు. కార్యక్రమంలో సిఐటియు నేత ఎన్.రామారావు ప్రముఖ న్యాయవాది అండిబోయిన లక్ష్మి, వైకాపా నాయకులు మర్దపూడి పరదేశి తదితరులు పాల్గొన్నారు.

## నకిలీ ఫేస్‌బుక్ ఖాతాతో వివాహితపై అసభ్య వేధింపులు

- *ఫోటోలు మార్ఫింగ్ చేసి బెదిరింపులు*
- *సైబర్ క్రైమ్ పోలీసుల చేతికి నిందితుడు*

(విశాఖ క్రైమ్ ప్రభాతవార్త)



ఆన్‌లైన్ మాధ్యమాల ద్వారా ఒక వివాహిత మహిళను అసభ్యకరంగా వేధిస్తున్న వ్యక్తిని విశాఖపట్నం సిటీ సైబర్ క్రైమ్ పోలీసులు అరెస్ట్ చేశారు. ఫేక్ ఫేస్‌బుక్ ఖాతా ద్వారా మహిళకు ఫ్రెండ్ రిక్వెస్ట్ పంపి, ఆమె ఫోటోలను మార్ఫింగ్ చేసి సోషల్ మీడియాలో పెట్టేస్తానని బెదిరించిన నిందితుడిని గుర్తించి పట్టుకుని రిమాండ్‌కు తరలించారు.పోలీసుల వివరాల ప్రకారం.. నగరానికి చెందిన ఒక వివాహిత మహిళకు ఓ వ్యక్తి ఫేక్ ఫేస్‌బుక్ ఖాతా ద్వారా ఫ్రెండ్ రిక్వెస్ట్ పంపాడు. ఆ మహిళ ఫేస్‌బుక్ ఖాతాలో ఉన్న ఫోటోలను డౌన్‌లోడ్ చేసి, వాటిని మార్ఫింగ్ చేసి అసభ్యకరంగా మార్చాడు. అనంతరం వాటిని ఆమెకు చాట్ ద్వారా పంపిస్తూ తనతో చాటింగ్ చేయకపోతే సోషల్ మీడియాలో అప్‌లోడ్ చేస్తానని బెదిరింపులకు పాల్పడ్డాడు. అదేవిధంగా అసభ్య పదజాలంతో మెసేజ్‌లు పంపుతూ మహిళను తీవ్రంగా వేధించాడు.దీంతో బాధితురాలు విశాఖపట్నం సిటీ సైబర్ క్రైమ్ పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేసింది. కేసు నమోదు చేసిన పోలీసులు విశాఖ పోలీస్ కమిషనర్ డాక్టర్ శంఖబ్రత బాగ్చి ఆదేశాల మేరకు రంగంలోకి దిగి సాంకేతిక ఆధారాలతో దర్యాప్తు చేపట్టి, నిందితుడిని కొబ్బరితోట ప్రాంతానికి చెందిన గరుబిల్లి భాస్కరరావుగా గుర్తించారు. అనంతరం మార్చి 3న అతడిని అరెస్ట్ చేసి చట్టపరమైన ప్రక్రియల అనంతరం రిమాండ్‌కు తరలించారు. జాగ్రత్తలు అవసరం: సోషల్ మీడియా వేదికలైన టెలిగ్రామ్, ఇన్‌స్టాగ్రామ్, ఫేస్‌బుక్, వాట్సాప్‌లలో అపరిచిత వ్యక్తుల నుంచి వచ్చే ఫ్రెండ్ రిక్వెస్టులను అంగీకరించవద్దని సైబర్ క్రైమ్ పోలీసులు సూచించారు. సోషల్ మీడియా ఖాతాలను ప్రైవేట్‌లో ఉంచుకోవాలని, తెలియని వ్యక్తులతో చాటింగ్ చేయకూడదని, అనుమానాస్పద లింక్‌లపై క్లిక్ చేయవద్దని హెచ్చరించారు. సైబర్ నేరాలకు సంబంధించిన ఫిర్యాదుల కోసం పోర్టల్‌లో లేదా టోల్ ఫ్రీ నెంబర్ 1930 ద్వారా, అలాగే పోలీస్ కమిషనర్ కార్యాలయ నెంబర్ 7995095799 కు సంప్రదించవచ్చని పోలీసులు తెలిపారు.



## సెమిస్టర్ ఫలితాల్లో ఆనందపురం గాయత్రి విద్యార్థుల ప్రతిభ

ఆనందపురం, మార్చి 5, ప్రభాతవార్త



ఆంధ్ర విశ్వ విద్యాలయం విడుదల చేసిన డిగ్రీ 3, 5వ సెమిస్టర్ ఫలితాల్లో ఆనందపురం గాయత్రి డిగ్రీ కాలేజ్ విద్యార్థులు ఉత్తమ ఫలితాలు సాధించినట్లుగా కళాశాల డైరెక్టర్ దుక్క అప్పలరాజు వెల్లడించారు. గురువారం కళాశాలలో నిర్వహించిన అభినందన కార్యక్రమంలో విద్యార్థులను అధ్యాపకులను అభినందించి ప్రశంసా పత్రాలు అందజేశారు. ఈ మేరకు కళాశాల కరెస్పాండెంట్ బెల్లాన రామకృష్ణ మాట్లాడుతూ.. సెమిస్టర్ ఫలితాలు ఆధారంగా డిగ్రీ లో పాయింట్ కొలమానం ఉంటుందన్నారు. తద్వారా ఉద్యోగ ఎంపికలు , పీజీ కోర్సులు చదివేందుకు మంచి పాయింట్లు సాధించిన విద్యార్థులకు మొదటి ప్రాధాన్యత ఉంటుందన్నారు. ఈ కార్యక్రమంలో కళాశాల డైరెక్టర్ బెల్లాన రామకృష్ణ, అధ్యాపకులు బి.సత్యనారాయణ, ఎస్. సునీత, టి.పద్మ, ఎస్. ప్రియాంక, బి.భారతి, కె.సోమేశ్వరరావు, జి లక్ష్మణ, కె.దుర్గ తదితరులు పాల్గొన్నారు.

## జై జవాన్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో అన్నదానం

ఆనందపురం, మార్చి 5, ప్రభాతవార్త




జై జవాన్ ఫౌండేషన్ 4వ వార్షికోత్సవాన్ని పురస్కరించుకొని గురువారం ఆనందపురం కూడలిలో ఫౌండేషన్ వ్యవస్థాపక అధ్యక్షులు కుప్ప రాజశేఖర్, రామలక్ష్మి ఆధ్వర్యంలో అన్నదాన కార్యక్రమం నిర్వహించారు. అభాగ్యులు, నిరాశ్రయులు, నిరుపేదలకు అన్నదానం చేశారు. ఈ సందర్భంగా జై జవాన్ ఫౌండేషన్ కోశాధికారి కుప్ప రామలక్ష్మి మాట్లాడుతూ గడచిన నాలుగేళ్లలో ఉచిత వైద్య, రక్తదాన శిబిరాలు ఏర్పాటు చేసి ఆపదలో ఉన్న వాళ్ళకి రక్తం అందిస్తూ ఎంతో మందికి తోడ్పాటును అందిస్తున్నామన్నారు. రోడ్డు సైడ్ ఉన్నటు వంటి అభాగ్యులకు, అనాధాశ్రమలకు వృద్ధాశ్రమలకు అన్నదానం, క్యాన్సర్ పేషెంట్లకు, కిడ్నీ బాధితులకు పేద వాళ్లకి ఆర్థిక సాయం అందిస్తున్నామన్నారు. ఈ కార్యక్రమంలో ఫౌండేషన్ వైస్ ప్రెసిడెంట్ ముడసల శ్రీను సెక్రెటరీ ముడసల కార్తీక్, ట్రెజరీ కుప్ప రామలక్ష్మి, జనరల్ సెక్రెటరీ ఇమంది శ్రీనివాసరావు, తదితరులు పాల్గొన్నారు.

## వార్డుల్లో పారిశుధ్యం మెరుగుపరచండి కమిషనర్ కేతన్ గార్గ్ ఆదేశాలు

గాజువాక,మార్చి 5,ప్రభాతవార్త



గాజువాక జోన్ పరిధిలో పారిశుధ్య నిర్వహణపై ప్రత్యేక దృష్టి సారించాలని జీవీఎంసీ కమిషనర్ కేతన్ గార్గ్ అధికారులను ఆదేశించారు. గురువారం 73, 72, 66వ వార్డుల్లో క్షేత్రస్థాయిలో పర్యటించి వంటిల్లు, కణితి రోడ్, అన్న క్యాంటీన్ ప్రాంతాల్లో పారిశుద్ధం, డ్రైనేజీ, రెవెన్యూ అంశాలను పరిశీలించారు. 73వ వార్డు వంటిల్లు వద్ద క్లాప్ వాహనాలు జింగిల్ అనౌన్స్మెంట్లు చేయకపోవడాన్ని గమనించిన కమిషనర్ తక్షణ చర్యలు తీసుకోవాలని సూచించారు. ఫుట్‌పాత్‌లు, సెల్లార్‌లలో ఆక్రమణలను యుద్ధప్రాతిపదికన తొలగించాలని జోనల్ అధికారులను ఆదేశించారు. అన్న క్యాంటీన్‌లో నాణ్యమైన భోజనం అందించడంతో పాటు పరిశుభ్రత కాపాడాలని పేర్కొన్నారు. కణితి రోడ్డులో జరుగుతున్న డ్రైనేజీ పనులను వేగవంతం చేయాలని ఇంజనీరింగ్ అధికారులకు దిశానిర్దేశం చేశారు. పాన్ షాపుల వద్ద డస్ట్‌బిన్‌లు ఏర్పాటు చేసి వ్యర్థాలను కాలువల్లో వేయకుండా కట్టడి చేయాలని సూచించారు. ఆస్తి పన్నుల లైన్ లిస్టింగ్, పెండింగ్ వసూళ్లపై ప్రత్యేక దృష్టి సారించాలని రెవెన్యూ అధికారులకు ఆదేశాలు జారీ చేశారు. జంక్షన్ అభివృద్ధి పనులు త్వరితగతిన పూర్తి చేయాలని సూచించారు. పర్యటనలో వార్డు కార్యదర్శులు, అధికారులు పాల్గొన్నారు.

## అంధుల పాఠశాలలో గీతం ఎన్.ఎస్.ఎస్ కార్యక్రమం

గాజువాక,మార్చి 5,ప్రభాతవార్త



గీతం డీమ్డ్ విశ్వవిద్యాలయం స్కూల్ ఆఫ్ ఆర్కిటెక్చర్ విభాగం జాతీయ సేవా పథకం (ఎనఎసఎస్) వలంటీర్ల ఆధ్వర్యంలో గురువారం స్థానిక సాగర్ నగర్‌లోని అంధుబాలికల పాఠశాలలో గీతం ఆర్కిటెక్చర్ డీన్ మరియు డైరక్టర్ విభూతి సత్యదేవ్ ప్రత్యేక అవగాహన కార్యక్రమాన్ని ప్రారంభించారు. గీతం ఎన్.ఎస్.ఎస్.ప్రోగ్రామ్ ఆఫీసర్ మర్రి జ్యోతి ఆధ్వర్యంలో ఎనఎసఎస్ వలంటీర్లు పాల్గొని పాఠశాల విద్యార్థులకు ఆరోగ్యం, పరిశుభ్రత, సమాజ సంక్షేమం, టెక్నాలజీ గురించి వివరిస్తూ వివిధ పోటీలను, సాం స్కతిక కార్యక్రమాలను నిర్వహించారు. పాఠశాల విద్యార్థులకు కంప్యూటర్ పై అవగాహనతో పాటు డిజిటల్ టెక్నాలజిల గురించి వివరించారు. పాఠశాల విద్యార్థులకు వైద్య శిభిరాన్ని నిర్వహించడంతో పాటు వ్యక్తిగత భద్రత, పరిశుభ్రత మరియు"గుడ్‌టచ్ బ్యాడ్ టచ" అంశాలపై అవగాహన నిర్వహించారు. అంధు విద్యార్థుల కోసం బ్రెయిలీ అక్షరాల ప్యానెల్, చారిత్రక కట్టడాల స్పర్శ నమూనాలు, స్పర్శ మ్యాప్‌లు మరియు చిహ్నాలను ఎనఎసఎస్ వలంటీర్లు స్వయంగా తయారు చేశారు. విద్యార్థుల జ్ఞానేంద్రియ శిక్షణను మెరుగుపరచడానికి ఒక కూరగాయల తోట, సెన్సరీ గార్డెన్ మరియు చెప్పులు లేకుండా నడిచే సెన్సరీపాత్‌వే ను ఏర్పాటు చేశారు. అంధుల పాఠశాల ప్రిన్సిపాల్ విజయ గీతం ఎనఎసఎస్ వలంటీర్లును అభినందించారు. ఎనఎసఎస్ ద్వారా విద్యార్థులలో సామాజిక బాధ్యత పెరుగుతుందన్నారు. కార్యక్రమంలో ఐజిబిసి కోఆర్డినేటర్ దివ్యహరిని, ఎన్.ఎస్.ఎస్ వలంటీర్లు, అంధుల పాఠశాల విద్యార్థులు పాల్గొన్నారు.

## అయినాడలో నూతన వితంతువు ఫించన్లు అందజేసిన కూటమి నాయకులు

పద్మనాభం, మార్చి 5, ప్రభాతవార్త



మండలంలో అయినాడ గ్రామంలో ఇటీవల నూతనం గా మంజూరైన వితంతువు ఫించన్లను గురువారం గ్రామ సచివాలయంలో ఇదే గ్రామానికి చెందిన బొత్స రాంబాయి, గిడిజాల రమణమ్మలకు భీమిలి ఎఎంసి చైర్మెన్ కె.రామస్వామినాయుడు, రాష్ట్ర కాపు కార్పొరేషన్ డైరెక్టర్ కురిమిన లీలావతి అందజేసారు. అర్హులైన లబ్దిదారులకు ఫించన్లు ఇవ్వడమే కూటమి ప్రభుత్వం లక్ష్యమని అన్నారు. ఈ కార్యక్రమంలో సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.

## ఆధ్యాత్మిక చింతనతో ముగిసిన అనంతపద్మనాభస్వామి కళ్యాణోత్సవాలు

పద్మనాభం, మార్చి 5, ప్రభాతవార్త



పద్మనాభం గ్రామంలో గత వారం రోజుల నుండి జరుగుతున్న స్వామివారి కళ్యాణ మహోత్సవాలు బుధవారం అర్ధరాత్రి నిర్వహించిన పుష్పాంజిలితో ఆధ్యాత్మిక చింతనతో ముగిసాయి.దేవాదాయ ధర్మాదాయ శాఖ అధికారి పి ఎల్ ఎన్ రాజు ఆధ్వర్యంలో భక్తుల సహకారంతో ఈ ఉత్సవాలను వైఖానస ఆగమ శాస్త్రం ప్రకారం ఆలయ ప్రధాన అర్చకులు సీతారామాంజనేయస్వామి అర్చక బృందం జరిపించారు. అయితే శ్రీదేవి భూదేవి సమేత అనంతునిని పూలమాలలు,పట్టువస్త్రాలతో అలంకరించి పల్లకీలో ద్వాదశ ఆలయ ప్రదక్షణలు చేసారు.అనంతరం స్వామివారికి అమ్మవార్లకి విశాఖపట్నంకి చెందిన సురేష్ దంపతులు ఇచ్చిన పలు రకాల పువ్వులతో వేదమంత్రాలు, సన్నాయి మేళాలు మధ్య పుష్పయాగం చేసారు. అనంతరం పూలపల్లకీలో ఉయ్యాల సేవ నిర్వహించారు.ఈ కార్యక్రమంలో సర్పంచ్ తాలాడ పాప, నాయకులు ఎర్రినాయడు, పద్మనాభం, నాగు,రాము, సన్నిబాబు,భక్తులు పాల్గొన్నారు.

## మారిడిమాంబ అమ్మవారి దర్శనం చేసిన టిడిపి రాష్ట్ర కార్యనిర్వాహక కార్యదర్శి కర్రి సాయికృష్ణ

పద్మనాభం, మార్చి 5, ప్రభాతవార్త



యలమంచిలి నియోజకవర్గం మునగపాక మండలం తోటాడ పంచాయతీలో వెలసియున్న శ్రీ శ్రీ శ్రీ మారిడిమాంబ అమ్మవారి పండుగ సందర్భంగా తెలుగుదేశం పార్టీ రాష్ట్ర కార్యనిర్వాహక కార్యదర్శి కర్రి సాయికృష్ణ అమ్మవారిని దర్శించుకుని ప్రత్యేక పూజల్లో పాల్గొన్నారు. ఈ సందర్భంగా అమ్మవారి ఆశీస్సులు అందరిపై ఉండాలని, గ్రామ ప్రజలకు శాంతి, సౌభాగ్యం కలగాలని ప్రార్థించారు.ఈ కార్యక్రమంలో టిడిపి మండల అధ్యక్షుడు పెంటకోట విజయ్, జిల్లా తెలుగు మహిళ అధ్యక్షురాలు అడారి మంజు, క్లస్టర్ ఇన్‌చార్జ్ దొడ్డి రమేష్, సీనియర్ నాయకులు ఎంవీఆర్ నాయుడు, దాడి శ్రీను, గ్రామ శాఖ అధ్యక్షుడు దాడి గంగాజీ, నాయకులు దాడి జగన్నాధరావు మరియు కూటమి నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.అమ్మవారి పండుగను ఘనంగా నిర్వహిస్తున్న గ్రామ పెద్దలను మరియు కమిటీ సభ్యులను కర్రి సాయికృష్ణ అభినందించారు.

6-3 pg4.qxd:6-3 pg4.qxd 1/1/02 8:53 AM Page 1



# వార్త

మనిషి వంటిపై దుస్తులు వేసుకున్నా ముఖం మీద చిరునవ్వు లేనివే ముస్తాబు పూర్తికానట్లే.

న-మహాత్మా గాంధీ

## కాలుష్య కాసారంలో నగరాలు!

కాలకూట విషంగా మారుతున్న నీటి, వాయు కాలుష్యాల నుండి ప్రజలను కాపాడేందుకు పాలకులు చట్టాలపై చట్టాలు చేస్తున్నారు. ఎందరిపైనో చర్యలు తీసుకుంటున్నామనిచెప్పుకుంటున్నా ఆశించిన ఫలితాలు చేకూరడం లేదు. కాలుష్య కాటుకు బలయ్యేవారి సంఖ్య అంతకంతకు పెరిగిపోతుండడం ఆందోళన కలిగించే అంశం. ఈసమస్యను పరిష్కరించడంలో ప్రభుత్వాలు ఇంకా జాప్యం చేస్తే కాలుష్యకాటుకు దేశవ్యాప్తంగా కోట్లాది మంది బలికాక తప్పదని పర్యావరణ శాస్త్రజ్ఞులు హెచ్చరిస్తున్నారు. జీవించే హక్కు కల్పించాల్సిందిగా కోరుతూ ఎందరో ఈ కాలుష్యకాసారంలో చిక్కుకున్న నిర్భాగ్యుల వేదన అరణ్యరోదనగానే మిగిలిపోతున్నది. కాలుష్య నియంత్రణకు ఏనాడో మండలని ఏర్పాటు చేశారు. అనేక చట్టాలు తెచ్చారు. చర్యలు తీసుకుంటున్నారు. అయినా అవేమీ ఈకాలుష్యం నుండి ప్రజలను కాపాడలేకపోతున్నాయి. ముఖ్యంగా దేశవ్యాప్తంగా నగరాల్లో కాలుష్యం అంతకంతకు పెరిగి నగర పరిసర ప్రాంతాలకు కూడా విస్తరిస్తున్నది. ప్రపంచ జనాభాలో ప్రస్తుతం సగం నగరాల్లోనే నివసిస్తున్నది. మరో మూడు దశాబ్దాల నాటికి నగరాల జనాభా అదనంగా మూడువందల కోట్లకుపైగా పెరుగుతుందని అధికారుల అంచనా. భూభాగంపై నగరాల వైశాల్యం రెండు శాతానికి మించకపోయినా కాలుష్యంలో మాత్రం అది ప్రపంచ జనాభా ఆరోగ్యంపై తీవ్రప్రభావం చూపే స్థాయిలో విస్తరిస్తున్నది. ప్రపంచవ్యాప్తంగా స్థూల దేశీయోత్పత్తిలో అరవైశాతం ఆరువందల పట్టణాల్లో కేంద్రీకృతమై ఉందంటే నగరాల ప్రాధాన్యత ఎంతగా ఉందో చెప్పనవసరం లేదు. వ్యవసాయ రంగంలో ఏర్పడిన సంక్షోభం,గ్రామీణ ప్రాంతాన్ని అతలాకుతలం చేస్తుండడంతో వలసలు పెరిగిపోయాయి. అందుకే గ్రామీణ జనాభా తగ్గుతుండగా పట్టణాల్లో జనాభా యేడాది యేడాదికి ఊహాకందని రీతిలో పెరిగిపోతున్నది.ప్రధానంగా భారతదేశంలో పట్టణీకరణ అందుకోలేనంతగా విస్తరిస్తున్నది. 2001లో పట్టణ ప్రాంతాల్లో జనాభా ఇరవైఎనిమిదిన్నర కోట్లు ఉండగా ఇప్పుడది నలభై కోట్లకుపైగా చేరుకున్నది. 2005లో ప్రారంభించిన జవహర్‌లాల్‌నెహ్రూ జాతీయ పట్టణ నవీకరణ కార్యక్రమం (జెఎన్‌ఎన్‌యుఆర్‌ఎమ్) కింద పట్టణ ప్రాంతాలకు మరికొన్ని సౌకర్యాలు కల్పించి మెరుగైన జీవనం కల్పించేందుకు ప్రయత్నాలు చేస్తున్నప్పటికీ పెరుగుతున్న అవసరాలు, జనాభాను అవి అందుకోలేకపోతున్నాయి. భారత్‌లోని ఆరుమెట్రోనగరాలు హైదరాబాద్,ఢిల్లీ, బెంగళూరు, కోల్‌కత్తా, ముంబాయి, చెన్నైలలో ఒక ప్రైవేట్ సంస్థ నిర్వహించిన సర్వేలోవిస్తుపోయే విషయాలు వెలుగుచూశాయి. పర్యావరణం, గాలినాణ్యత, నీటి నాణ్యత, అటవీ విస్తీర్ణం, పచ్చదనం, వాతావరణ మార్పులు, చెత్త నిర్వహణ,తదితర అంశాల ప్రాతిపదికగా ఆ సర్వేనిర్వహించారు. విస్తరణ, తదితర అంశాల్లో కొన్ని నిర్దిష్టమైన ప్రణాళిక లేకుండా చేపట్టడం వల్ల తీవ్రమైన దుష్ప్రభావం చూపుతున్నట్లు వెలుగు చూసింది. ముఖ్యంగా నగరాల్లో వాయుకాలుష్యం వల్ల పౌరుల ఊపిరితిత్తులకు తూట్లు పడుతున్నాయని హెచ్చరించింది. చెన్నై, కోల్‌కతా, ముంబాయిలలో వాహన కాలుష్యం తీవ్రంగా ఉంది. తర్వాత స్థానంలో పారిశ్రామిక కాలుష్యం బెంగళూరులో పరిస్థితి మరొకరకంగా ఉంది. పరిశ్రమల కారణంగా అక్కడ వాయుకాలుష్యం తీవ్రస్థాయికి చేరినట్లు ఆ సర్వే చెప్తున్నది. ఇక వాహనాలు, నీటికాలుష్యంలో హైదరాబాద్ అగ్రస్థానంలో ఉంది. నిర్మాణరంగం వల్ల పీల్చే గాలిలో అధికశాతం దుమ్ముధూళి చేరుతుండడంతో ప్రజారోగ్యం రానురాను ప్రశ్నార్థకంగా మారింది. హైదరాబాద్ మహానగరంలో వాయుకాలుష్యానికి నీటి కాలుష్యంకూడా తోడుకావడంతో పరిస్థితి ఆందోళనకరంగా తయారవుతున్నది. ముఖ్యంగా విషపూరితమైన రసాయనిక కలుషిత జలాలను శుద్ధి చేయకుండా మూసీలో కలుపుతున్న పరిశ్రమలపై చర్యలు అంతంత మాత్రంగా ఉండడంతోమూసీ పరివాహక ప్రాంతం కాలుష్యకాసారంలో కొట్టుకమిట్టాడుతున్నది. వాస్తవానికి ఈ సమస్య కొత్తగా పుట్టుకువచ్చింది కాదు. ప్రభుత్వ విధానాలు,కొందరు అధికారుల అవినీతి, అసమర్థత, అంతులేని నిర్లక్ష్యం కారణంగా ఈ సమస్య రోజురోజుకు అంతకంతకు పెరిగిపోతున్నది. గత పాలకుల నిర్వాహకంతో మూసీతోపాటు దానిపరివాహక ప్రాంతాల్లో కుంటలు,చెరువులెన్నో కాలుష్యకాసారాలుగా మారిపోయాయి. ఒక్క హైదరాబాదే కాదు అటు విజయవాడ, విశాఖపట్నం, గుంటూరు తదితర ఆంధ్రప్రదేశ్‌లోని అనేక పట్టణాల పరిస్థితి కూడా ఇందుకు భిన్నంగా లేదు. ముఖ్యంగా నీటి, వాయు కాలుష్యాలతో మనిషి మనుగడే ప్రశ్నార్థకంగా మారుతున్నది.దేశంలో వాతావరణంలో ధూళికణాలు ఉండాల్సిన స్థాయి కన్నా ఐదురెట్లు అధికంగా ఉండటంతో శ్వాససమస్య నుంచి కేన్సర్ దాకా అనేక రోగాల బారినపడుతున్నారని వైద్యనిపుణులు అభిప్రాయపడుతున్నారు. వాయుకాలుష్యం మనిషికే కాదు దేశ సుసంపన్నమైన చరిత్ర సంస్కృతులకు ప్రతీకలుగా భాసిల్లు తున్న వారసత్వ కట్టడాలకు కూడా ముప్పు ముంచు కొస్తు న్నదని పర్యావరణ శాస్త్రజ్ఞులు హెచ్చరిస్తున్నారు. ప్రభుత్వమే అధికారికంగా నిర్వహించిన పరిశీల నలో ముప్పైతొమ్మిది నగరాల్లో 138 వారసత్వ కట్టడాల పరిస్థితి వాయుకాలుష్యం వల్ల ఆందోళనకరంగా ఉన్నట్లు వెల్లడయింది. ఇప్పటికైనా పాలకులు కాలుష్య నివారణకు చట్టాలు, నిబంధనలు విధించి చేతులు దులుపుకోకుండా నియంత్రణకు నిర్దిష్టమైన ప్రణాళికతో పటిష్టమైన చర్యలు తీసుకోవాల్సిన అవసరం ఉంది.

ప్రపంచాన్ని జయించిన వాడి కంటే తన మనస్సును జయించినవాడు వీరుడు, ధైర్యవంతుడు.



థామస్ ఫుల్లర్

మిక్కిలి ధనం కానీ, గొప్ప విద్య కానీ, గొప్ప అధికారం కానీ పొందినప్పటికీ గర్వం లేక ఏ వ్యక్తి ప్రవర్తిస్తాడో అతడే పండితుడు.



ప్లినీ

## ప్రజావాక్కు



### ఉపాధ్యాయుల సమస్యలు పట్టించుకోండి

ప్రభుత్వ పాఠశాలల్లో పనిచేయుచున్న ఉపాధ్యాయినీ ఉపాధ్యాయులతో పెట్టుకున్న రాజకీయ పార్టీలు వాటి మనుగడ ఏమైందో చరిత్ర రుజువు చేస్తూనే ఉంది. నిజా నికి ప్రజల్లో ప్రభుత్వపాఠశాలలో పనిచేయుచున్న ఉపా ధ్యాయునీ ఉపాధ్యాయులు పట్లతీవ్రమైన అసూయ ఉన్న ది. ఉపాధ్యాయినీ ఉపాధ్యాయులకు నచ్చినా, నచ్చక పోయినా కొన్ని ఖచ్చితంగా అమలవుతాయి. మొదటిది జీతాలు భారీగా పెరిగే అవకాశాలు తగ్గుతాయి. ముప్పై మూడు సంవత్సరాల సర్వీసు లేదా అరవై రెండు సం వత్సరాలు ఏది ముందు నిండితే వారిని తక్షణమే పదవీ విరమణ చేయిస్తారు. ఇంగ్లీష్ మీడియంలో పాఠశాలలు కళాశాలలు కొనసాగుతాయి. కేజీ టు పీజీ పాఠశాలలు పుట్టుకొస్తాయి. కేంద్ర ఎన్నికలు రాష్ట్రాల ఎన్నికలు ఇకపై ఐదేళ్ల కాకుండా పదేళ్ల కాలపరిమితి అయ్యే అవకాశం ఉన్నది. స్థానిక సంస్థల అవసరం ఉండకపోవచ్చు.

- వీరగంట భాస్కర్ రావు, బొబ్బిలి

### అంతా రాజకీయమే

ఆప్తులు అర్థాంతరంగా మరణిస్తే రాజకీయాలకు స్వస్తి పలికినవార్కుపదవులను తృణప్రాయంగా భావించి వాటిని వదులుకున్నవారు చాలా తక్కువగా ఉంటారు. కానీ వారి వారసులమంటూ రాజకీయాల్లోకి వస్తున్న వారు ఎన్నికల్లో పోటీ చేస్తున్నవారు గెలిచిన మూడో రోజు మంత్రిగా ప్రమాణస్వీకారం చేస్తున్నవారు,పదవుల కోసం అధికారం కోసం ఆప్తులైన వారికి వెన్నుపోటు పొడుస్తు న్నవారు కోకొల్లలుగా ఉంటున్నారు. అయితే ధనం, పదవులు, అధికారం కన్నా మానవతా విలువలు గొప్పవి.

- శాస్త్రి, హైదరాబాద్

### ట్రంప్ వల్లనే యుద్ధాలు!

అమెరికా చెపుతున్నట్టుగా ఇరాన్ అణ్వాయుధాలను తయారు చేస్తున్నదా లేదు. చైనా వంటి దేశాలు ఒక ప్రబల శక్తిగా మారడం, చిన్నదేశాలు కూటములుగా మారడం, దక్షిణాసియాలో అతిపెద్ద దేశం ప్రతి ఒక్క దేశంతో స్వేచ్ఛ వాణిజ్య ఒప్పందాలు చేసుకోవడం ఈ కారణాల వల్ల తమ పెద్దన్న పాత్రకు అవమానం అని భావించిన అమెరికా ఇవ్వాలా ఆఫ్ఘాన్, ఇరాక్ దేశాలపైన దాడి చేయాలిఅనుకుంటుంది.యుద్ధానికి ముఖ్య కారణం అమెరికా వ్యాపార ఆకాంక్ష మాత్రమే.

### భయం వీడితేనే విజయం

నేటి సమాజంలో ఉద్యోగం సాధించాలంటే చాలా మందికి ముందుగా గుర్తుకు వచ్చేది పోటీ పరీక్షలు. కానీ 'పోటీ పరీక్ష' అనే మాట వినగానే చాలా మంది యువతలో భయం మొదలవుతుంది.నేను రాయగలనా?", విజయం సాధించగలనా? అనే అనేక సందేహాలు మనస్సును వెంటాడుతుంటాయి. నిజానికి పోటీ పరీక్షలు భయపడాల్సినవి కావు. సరైన ప్రణాళిక, క్రమశిక్షణ, పట్టుదల ఉంటే ఎవరికైనా విజయం సాధించడం సాధ్యమే. పోటీ పరీక్షలకు సిద్ధమయ్యే ముందు మనస్సును బలంగా తయారు చేసుకోవాలి. భయం, ఆందోళన, నిరుత్సాహం ఇవి విజయానికి పెద్ద అడ్డంకులు. నేను సాధిస్తాను అనే ఆత్మవిశ్వాసం ముందుగా ఉండాలి. ఇతరులతో పోల్చుకోవడం కంటే మన సామర్థ్యాన్ని గుర్తించి ముందుకు సాగాలి. రోజూ కొంత సమయం ధ్యానం, వ్యాయామం లేదా నడక చేయడం ద్వారా మనస్సు ప్రశాంతంగా ఉంటుంది. మానసిక స్థైర్యం ఉంటే చదువు మీద ఏకాగ్రత పెరుగుతుంది.

- డాక్టర్. వై. సంజీవ కుమార్,హైదరాబాద్

### సవాల్‌గా మారుతున్న యుద్ధం

ఇరాన్-ఇజ్రాయెల్ మధ్య తలెత్తిన ఉద్రిక్తతలు ప్రపంచ వాణిజ్య వ్యవస్థలో తీవ్ర ప్రకంపనలు సృష్టిస్తున్నాయి. ఈ ఘర్షణ కేవలం రెండు దేశాలకే పరిమితం కాకుండా సముద్ర రవాణా మార్గాలు,ఇంధన సరఫరా అంతర్జాతీయ ఆర్థిక వ్యవస్థపై ప్రతికూల ప్రభావం చూపుతోంది. ప్రపంచ చమురు సరఫరాలో ఐదవ వంతు వాటా కలిగిన హార్ముజ్ జలసంధిలో రవాణా అంతరాయం కలగడం వల్ల చమురు ధరలు బ్యారెల్‌కు 80 డాలర్ల వరకు పెరిగాయి. భద్రతా కారణాల దృష్ట్యా నౌకలను ఆఫ్రికా ఖండం మీదుగా మళ్లించడం వల్ల ప్రయాణ కాలం 10 నుండి 14 రోజులు పెరుగుతోంది. ఈ సంక్షోభం భారతదేశం వంటి దేశాలకు ద్వంద్వ సవాల్‌గా మారింది.

- సి.హెచ్.ప్రతాప్, శ్రీకాకుళం

### అధిక సెలవులు ఇవ్వాలి

గురుకులాలలో పనిచేస్తున్న గురువులుటీచర్స్ లెక్చరర్స్ ప్రభుత్వం నిర్ణయించిన సెలవులకు మించి అధిక సెలవులు వాడుకుంటున్నారు.రిజిస్టర్‌లలో మొత్తం సెలవుల జాబితా ఎక్కువగా ఉంటుంది. నైట్‌స్టడీ డ్యూటీలను వికలాంగులకు మినహాయింపుఇవ్వాలి.దృష్టిలోపంకలిగినవారు ఇబ్బందులు పడుతున్నారు. వికలాంగులకు అదనంగా 10 సెలవులను మంజూరు చేయాలి.

- రాపాక రవీందర్, జనగాం

మనవి

ఎడిట్ పేజీకి..

ఆర్థిక, సాంఘిక, రాజకీయ పరిణామాలకు సంబంధించిన విశ్లేషణాత్మక వ్యాసాలు పంపగోరేవారు ఈ కింది ఈ మెయిల్ చిరునామాకు పంపగలరు e-mail: editpage@vaartha.com

## పటిష్టంగా లేని రాయబార కార్యాలయాలు!

**భారతదేశం కంటే ఎంతో తక్కువ జనాభా కలిగిన దేశాలు, ఆర్థికంగా వెనుకబడిన దేశాలకు సంబంధించిన విదేశీ రాయబార కార్యాలయాల అధికారులు, సిబ్బంది సంఖ్యతో పోల్చుకుంటే విదేశాలలో వున్న మన రాయబార కార్యాలయాల అధికారులు,సిబ్బంది విషయంలో చాలా వెనుకబడి వున్నాం. ఇజ్రాయెల్, ఇరాన్‌తో సహా అరబ్ దేశాలలో దాదాపు పెద్ద సంఖ్యలో భారతీయులు పనిచేస్తున్నారని అంచనా. ఒక్క ఇరాన్లోనే వేలాదిమంది భారతీయ వైద్య విద్యార్థులు చదువుకుంటున్నారు. ఇరాన్‌పై ఇజ్రాయెల్, అమెరికా దేశాలు సంయుక్తంగా ఆకస్మిక దాడులు చేయడం, ఆ దాడులలో ఆయుతుల్లా ఖొమేనీ మరణించడం, ఆ తర్వాత యుద్ధం ప్రారంభమైన నేపథ్యంలో భారతదేశ విదేశీ వ్యవహారాల శాఖ ఆయా దేశాలలో నివసిస్తున్న భారతీయులను రక్షించే విషయంలో దేవుడిపై భారం వేయడం మినహా ఏమి చేయలేని స్థితిలో వుండాల్సి వచ్చింది. దీనికి ప్రధాన కారణం యుద్ధమేఘాలు ఆకస్మికంగా కమ్ము కోవడంతోపాటు మన దేశానికి చెందిన రాయబార కార్యాలయాలు బలహీనంగా వుండటం ప్రధాన కారణం.**



అన్నవరపు బ్రహ్మయ్య

విపత్కర పరిస్థితులు ఎదురైనప్పుడే పరిపాలన పరమైన లోపాలు బహిర్గతం అవుతాయి. ఇరాన్‌పై ఇజ్రాయెల్, అమెరికాచేస్తున్న యుద్ధం కారణంగా విదేశీ వ్యవహారాలకు సంబంధించిన భారతీయ పరిపాలనాశాఖ ఎంత బలహీనంగా వుందో అర్థం అవుతోంది. ప్రపంచంలో అత్యంత జనాభా కలిగిన దేశమే కాకుండా, ప్రపంచ ఆర్థిక వ్యవస్థలలో మూడో స్థానానికి చేరుకొంటున్న మన దేశానికి సంబంధించిన విదేశీ రాయబార కార్యాలయాల నిర్వహణ విషయంలో కేంద్రప్రభుత్వం నిర్లక్ష్యంగా వ్యవ హరించడం ఆశ్చర్యం కలిగిస్తోంది. భారతదేశం కంటే ఎంతో తక్కువ జనాభా కలిగిన దేశాలు, ఆర్థికంగా వెనుకబడిన దేశాలకు సంబంధించిన విదేశీ రాయబార కార్యాలయాల అధికారులు, సిబ్బంది సంఖ్యతో పోల్చుకుంటే విదేశాలలో వున్న మన రాయబార కార్యాలయాల అధికారులు,సిబ్బంది విషయంలో చాలా వెనుకబడి వున్నాం. ఇజ్రాయెల్,ఇరాన్‌తో సహా అరబ్ దేశాలలో దాదాపు పెద్ద సంఖ్యలో భారతీయు లు పనిచేస్తున్నారని అంచనా. ఒక్క ఇరాన్లోనే వేలాదిమంది భారతీయ వైద్య విద్యార్థులు చదువుకుంటున్నారు. ఇరాన్‌పై ఇజ్రాయెల్, అమెరికా దేశాలు సంయుక్తంగా ఆకస్మికదాడులు చేయడం, ఆ దాడులలో ఆయుతుల్లా ఖొమేనీ మరణించడం, ఆ తర్వాత యుద్ధం ప్రారంభమైన నేపథ్యంలో భారతదేశ విదేశీ వ్యవహారాల శాఖ ఆయా దేశాలలో నివసిస్తున్న భారతీయులను రక్షించే విషయంలో దేవుడిపై భారం వేయ డం మినహా ఏమి చేయలేని స్థితిలో వుండాల్సి వచ్చింది. దీనికి ప్రధాన కారణం యుద్ధమేఘాలు ఆకస్మికంగా కమ్ము కోవడంతోపాటు మన దేశానికి చెందిన రాయబార కార్యాల యాలు బలహీనంగా వుండటం ప్రధాన కారణం. 2025 నాటి గణంకాల ప్రకారం భారతదేశం ప్రపంచ వ్యాప్తంగా ఐక్యరాజ్య సమితిలో సభ్యత్వం కలిగిన 193 దేశాలలో విదేశీ రాయబార కార్యాలయాలను నిర్వహిస్తోంది. నిబంధ నల ప్రకారం అమోదించిన విదేశీ రాయబారుల సంఖ్య 1177 కాగా, ప్రస్తుతం పనిచేస్తున్న రాయబారుల సంఖ్య 667మాత్రమే. వీరు కాకుండా న్యూఢిల్లీలో విదేశీ మంత్రిత్వ శాఖలోమరో 334మంది ఐఎఫ్ఎస్ అధికారులు పనిచేస్తు న్నారు. ఇదే సమయంలో చైనా ప్రపంచంలో అన్ని దేశాల కంటే అత్యధికంగా 274విదేశీ రాయబార కార్యాలయాలను నిర్వహిస్తుండగా తర్వాత స్థానంలో అమెరికా 271 కార్యా లయాలను నిర్వహిస్తోంది. 'లో ఇనిస్టిట్యూట్' కు చెందిన ఇండెక్స్ ప్రకారం పట్టుమని 10కోట్ల జనాభా కూడా లేని టర్కీ



252,ఫ్రాన్స్ 249, బ్రిటన్ 225 రాయబార కార్యాలయాలను నిర్వహిస్తోంది. ఈ ఇండెక్స్ ప్రకారం భారతదేశం 11వ స్థానంలో వుంది. దీనిని బట్టి ఇండియా రాయబార కార్యాలయాల విషయంలో ఎంత వెనుకబడి వుందో అర్థం చేసుకోవచ్చు. రెండో ప్రపంచ యుద్ధం అనంతరం ఏర్పడిన ఐక్యరాజ్య సమితి నిబంధనల ప్రకారం సమితిలో సభ్య దేశంగా వుండే ప్రతిదేశం ప్రపంచవ్యాప్తంగా ప్రతి దేశంలో తమ రాయబార కార్యాలయాలను ఏర్పాటు చేసుకోవచ్చు. ఈకార్యాలయాలనే ఎంబసీ లేదా విదేశీ రాయబార కార్యాలయాలని అంటారు. ఈ కార్యాలయంలో పని చేసే ప్రధాన అధికారిని విదేశీ రాయబారి లేదా అంబాసిడర్ లేదా హైకమిషనర్ అని అంటారు. వీరికి సహాయకారిగా ఒక డిప్యూటీ అంబాసిడర్ వుంటారు. ఈ కార్యాలయాలలో పర్సనల్/అడ్మినిస్ట్రేషన్ వింగ్, పొలిటికల్ వింగ్, కౌన్సిలర్ వింగ్, కమర్షియల్/ఎకనామిక్ వింగ్, డిఫెన్స్ వింగ్, ప్రెస్ కల్చరల్ వింగ్ అనే విభాగాలు వుంటాయి. ఆయా విభాగాలలో ఇన్ఛార్జ్ అధికారి అధికారితోపాటు సాధారణ ఉద్యోగులు వుంటారు. విదేశాల వైశాల్యం,ఆర్థిక, రాజకీయ స్థితిగతులను బట్టి రాయబార కార్యాలయాల సిబ్బంది సంఖ్యలో కొంచెం అటుఇటుగా వుంటుంది.ఎంబసీ కార్యాలయాలలో ప్రధాన, ఉప ప్రధాన అధికారులుగా ఇండియన్ ఫారెన్ సర్వీస్ (ఐఎఫ్ఎస్)/ ఇండియన్ అడ్మినిస్ట్రేటివ్ (ఐఎఎస్)లను నియమిస్తారు. ఆయా దేశాలలో మారుతున్న రాజకీయ, సామాజిక పరిస్థితులను తమ దేశాలకు చేరవేయడం, ఆయా దేశాలతో మధ్యవర్తిత్వం నడపడం, తమ దేశం సందర్శించాలనుకొనే వారికి విదేశీయులకు వీసాలు మంజూరు చేయడం, ఆయా దేశాలలోపని/ఉద్యోగం చేసే స్వదేశీ పౌరులకు, టూరిస్టులుగా వచ్చేవారికి మద్దతు గా వుండటం, విపత్కర సమయంలో సాయం అందించడం ఈ రాయబార కార్యాలయాల ప్రధాన లక్ష్యం. మధ్యప్రాచ్యంలో కొనసాగుతున్న యుద్ధం నేపథ్యంలో ఈ ప్రాంతంలో నివసిస్తున్న భారతీయులు తీవ్రమైన భయాందోళనలకు గుర య్యారు. ప్రయాణం మధ్యలో దుబాయ్ వంటి ప్రాంతాల లో విమానాశ్రయాలలో చిక్కుకుపోయిన టూరిస్టులు, ఇతర ప్రాంతాలకు వెళుతున్న ప్రయాణీకుల పరిస్థితి మరీ దారుణంగా వుంది. యుద్ధం భయం, బాంబుల శబ్దాల కారణం గా ఒకవ్యక్తి మరణించినట్టు సోషల్ మీడియాలో ప్రచారం జరుగుతుండగా అనేకమంది మానసిక డిప్రెషన్కు గుర య్యారు.ప్రధానంగా ప్రస్తుతం యుద్ధం జరుగుతున్న మధ్యప్రాచ్య ప్రాంత దేశాలలోని రాయబార కార్యాలయాలలో మంజూరు చేసిన అధికారుల సంఖ్యే చాలా తక్కువ. మంజూరి సంఖ్యలో పోస్టులు ఖాళీగా కారణంగా ఆయా దేశాలలో జీవిస్తున్న భారతీయులకు, విమానాశ్రయాలలో చిక్కుకుపోయిన ప్రయాణీకులకు తగిన విధంగా ధైర్యం కలిగించలేకపోయారు. అదృష్టం కొద్ది కొన్ని విమాన సంస్థలు ధైర్యం చేసి దుబాయ్ నుంచి ఢిల్లీకి విమానాలు నడపటం వల్ల కొంతమేరకు ప్రజలు కుదుటపడ్డారు. అయితే ఇరాన్లో విద్యనభ్యసిస్తున్న విద్యార్థులపరిస్థితి భయంకరంగానేవుంది. ఇరాన్ రాజధాని టెహరాన్లో భారతదేశ రాయబార కార్యాలయం పనిచేస్తున్నప్పటికీ ఎంతమంది అధికారులు, ఉద్యోగులు వున్నారనే సమాచారం అందుబాటులో లేదు. భారతదేశ జనాభాను దృష్టిలో పెట్టుకొంటే ప్రస్తుతం పనిచేస్తున్నరాయబారుల సంఖ్యను కనీసం రెండు రెట్లుఅదనంగా పెంచాల్సి వుంటుంది. ప్రస్తుతం ఎదురైన అనుభవాలను దృష్టిలో

## అక్రమ మానవ రవాణా ముఠాలకు ఏఐ కంచె

ఈ. శ్రీనివాస్ రావు

డిజిటల్ యుగంలో ప్రపంచం దగ్గరవుతోంది. కానీ మానవత్వం దూరమవుతోంది. సాంకేతిక విప్లవం మన జీవితాలను సులభతరం చేసినప్పటికీ, అదే సాంకేతికతను అడ్డం పెట్టుకుని మానవ అక్రమ రవాణా ముఠాలు అమాయకుల జీవితాలను చీకటిలోకి నెట్టేస్తున్నాయి. మహిళలను వ్యభిచారబారిన, చిన్నారులను వెట్టిచాకిరి బారిన, పేదలను నిర్బంధ శ్రమ బారినపడేస్తూ అంతర్జాతీయ స్థాయిలో నేర జాడలు విస్తరిస్తున్నాయి. అవయవాల అక్రమ వ్యాపారం ఈ దందాకు మరింత క్రూరత్వాన్ని జోడిస్తోంది. ఈ కొత్త తరహా నేరాన్ని పాత పద్ధతులతో ఎదుర్కోలేం. నేరగాళ్లు కృత్రిమ మేధను దుర్వినియోగం చేస్తున్న ఈ కాలంలో, అదే కృత్రిమ మేధను సమాజ రక్షణకు ఆయుధంగా మలచాల్సిన అత్యవసర పరిస్థితి నెలకొంది. మహిళలను వ్యభిచారానికి, బాలలను వెట్టిచాకిరికి, పేదలను నిర్బంధ శ్రమకు గురిచేస్తూ దారుణాలు సృష్టిస్తున్నాయి. అవయవాల అక్రమ వ్యాపారం ఈ చీకటి ప్రపంచానికి మరింత బలాన్నిస్తోంది. జాతీయ నేర గణాంకాల సంస్థ గణాంకాలు ఈ విపత్తు తీవ్రతను చూపిస్తున్నాయి. 2023లో 2,183 కేసులు నమోదై 6,288 మంది బాధితులుగా గుర్తించబడ్డారు. వీరిలో 42 శాతానికి పైగా మైనర్లే. 2018 నుంచి 2022 మధ్య నమోదైన వేల కేసుల్లో అరెస్టులు జరిగినా శిక్షల శాతం అత్యల్పం. నేరం వేగంగా మారుతున్నా చట్టపరమైన వ్యవస్థ మాత్రం అంతే వేగంతో మారలేకపోతోంది. ఇదే పరిస్థితి కొనసాగితే 2026 చివరి నాటికి కేసులు మరింత పెరిగే ప్రమాదం ఉంది. మహారాష్ట్ర, తెలంగాణ, ఒడిశా, ఉత్తరప్రదేశ్, బీహార్, ఆంధ్రప్రదేశ్ వంటి రాష్ట్రాలు ప్రధాన కేంద్రాలుగా మారుతున్నాయి. ఈనేపథ్యంలో కృత్రిమ మేధ



ఒక శక్తివంతమైన ఆయుధంగా మారవచ్చు. సామాజిక మాధ్యమాలు,డిజిటల్ చెల్లింపులు, ఆన్‌లైన్ వేదికలను వినియోగిస్తూ నేరగాళ్లు తమ మార్గాన్ని ఎంచుకుంటున్నారు. ఇదే డిజిటల్ ప్రపంచంలో కృత్రిమ మేధను వినియోగించి నేరాలను ముందుగానే పసిగట్టడంసాధ్యం.రియల్ టైమ్‌విశ్లేషణ, నమూనాల గుర్తింపు వంటి పద్ధతులతో అనుమా నాస్పద కదలికలను గుర్తించవచ్చు. లక్షల ప్రకటనలను క్షణాల్లో స్కాన్ చేసి అనుచిత పదజాలం, చిత్రాలను గుర్తిం చడం ద్వారా అధికారులను అప్రమత్తం చేయవచ్చు.రైల్వే స్టేషన్లు, బస్టాండ్లు, వంటి రవాణా కేంద్రాలు అక్రమ రవాణాదారుల ప్రధాన మార్గాలు.అక్కడ ఏర్పాటు చేసే సీసీటీవీ కెమేరాలను కృత్రిమ మేధతో అనుసంధానిస్తే అదృశ్యులైన బాధితులను, రికార్డులకెక్కిన నేరగాళ్లను గుర్తించడం సులభమవుతుంది.ముఖగుర్తింపు సాంకేతికత, ప్రవర్తన విశ్లేషణ పద్ధతులు బాధితులను రక్షించడంలోతోడ్పడగలవు. అమెరికా, కెనడా, ఐరోపాదేశాలు వినియోగిస్తున్న ఆధునిక పద్ధతులను భారతదేశం కూడా స్వీకరించాలి. అంతర్జాతీయ సహకారం పెంపొందించాలి.పెండింగులో ఉన్నమానవ అక్రమ రవాణా నిరోధచట్టానికి రూపంఇవ్వాలి.వ్యవస్థీకృత నేరాలపై ప్రత్యేక దర్యాప్తు సంస్థను ఏర్పాటు చేయాలన్న సుప్రీంకోర్టు సూచ నలను కార్యరూపం దాల్చాలి.అయితే కృత్రిమమేధ వినియో గం గోప్యత,మానవ హక్కుల పరిరక్షణకు భంగం కలిగించ కూడదు. డేటా సేకరణలో పక్షపాతం చోటుచేసుకోకూడదు. ముఖగుర్తింపు సాంకేతికతలు దుర్వినియోగం కాకుండా కట్టు దిట్టమైన నియంత్రణ అవసరం. నేరగాళ్లు కూడా కృత్రిమ మేధను వాడుతున్న ఈకాలంలో పోలీసు, భద్రతా సంస్థల కు నిరంతర శిక్షణ,సరిపడ నిధులు అత్యవసరం.సాంకేతికత స్వయంగా మంచిదో కాదోకాదు, ఏఐని ఎలా వినియోగిస్తామన్నదే కీలకం. బాధితులు పెరుగుతున్న నేపథ్యంలో ఎఐ మేధను బాధ్యతాయుతంగా వినియోగించి, మానవ అక్రమ రవాణా ను నిర్మూలించేందుకు సమగ్ర పోరాటం అవసరం. చట్టం, సాంకేతికత, సమాజం ఈమూడు కలిసివచ్చినప్పుడే

## జ్యోతిష్యంపై పెరుగుతున్న మోజు!



ఎం.నారాయణ స్వామి

వాస్తే మాజీవితం.. జ్యోతిష్యమే మా ప్రాణం..ఆ రెండు లేకుండా మేము బతకలేం.మేము చేసే ప్రతి పనికి ఆ శాస్త్రాల సహకారం అవసరం. వాస్తు జ్యోతిష్య పండితులు చెప్పి న్నట్లుగా, వింటాం, నడుచుకుంటాం, అమలు చేస్తాం,ప్రాణాలను కూడా త్యాగం చేస్తాం, గత కొన్నేళ్ల నుంచి వాస్తు జ్యోతిష్య ప్రభావం వలనే ఎన్నికలలో విజయం సాధించాం, మంత్రుల పదవులు చేపట్టాం, కోట్లకు పడగలెత్తాం,దీనిని బట్టి వాస్తు,జ్యోతిష్య వలలో ప్రజాప్రతినిధులు, కీలక నాయకులు ఏ విధంగా చిక్కుకుపోయి ఉన్నారోస్పష్టం అవుతుంది. ఆశాస్త్రాల ప్రభావం ఉంటే ఉన్నత శిఖరాలను అధిరోహించవచ్చు, లక్ష్మీదేవిని ఇంట్లో భద్రపర్చుకోవచ్చు, ఊహించని పదవులు, ప్రమోషన్లు చేపట్టవచ్చు అంటూ సామాన్యులు, డబ్బున్న వాళ్లు, చిన్న ఉద్యోగి మొదలుకొని ఉన్నత పదవులలో ఉన్నఅధికారులు పేర్కొంటున్నారు. ఆ శాస్త్రాలను వారు గాఢంగా విశ్వసిస్తున్నారు. వాస్తుశాస్త్రం, జ్యోతిష్యశాస్త్రం వంటివి శాస్త్రాలు అవునో? కాదో?కాని వాటిని నమ్మే ప్రజా ప్రతినిధులు భారీ సంఖ్యలో ఉన్నారు. బ్రహ్మరాత చదవటం ఎవరికీ సాధ్యం కాదని ప్రతి ఒక్కరు పేర్కొంటున్నప్పటికీ జ్యోతిష్యశాస్త్ర పండితులు మాత్రం సునాయాసంగా చదివి భూతభవిష్యత్తు వర్తమానాలను ఇట్టే చెబుతామంటూ చేస్తున్న దానిలో వాస్తవం ఉందని ముఖ్య మంత్రులు, మంత్రులు, పార్లమెంటు, శాసనసభ్యులు ఎక్కువగా విశ్వసిస్తున్నారు. వాస్తు బలంగా ఉంటేనే విజయం సాధిస్తాం, కీలకమైన పదవులు వరిస్తాయి. జ్యోతిష్య పండితులు చెప్పినవన్నీ తూ.చా తప్పకుండా పాటిస్తే తిరుగు ఉండదు, ఎదురు ఉండదు. నామినేషన్ మొదలు ప్రచారం ప్రారంభం వరకు వాస్తు, జ్యోతిష పండితులు చెప్పినవన్నీ జాగ్రత్తగా పాటిస్తున్నారు. గెలవడానికి వాస్తుసహకరించక పోతే ఎన్నికోట్లు ఖర్చుచేసినా ఫలితం ఉండదని మూర్ఖంగా ప్రతినిధులు నమ్ముతున్నారంటే వాస్తు, జ్యోతిష్యప్రభావం ఏస్థాయిలో ఉందో అర్థంఅవుతుంది. గతంలో వాస్తు, జ్యోతిష్యాన్ని విమర్శించిన వారే ఆ శాస్త్రాలను నమ్ముతుండడటం గమనార్హం. ఎలాంటి శాస్త్రాలను పాటించని విద్యావంతులైన ముస్లింలు వాస్తును పాటించడం విశేషం.ఉత్తరభారతంలోనే కాకుండా, దక్షిణ భారతంలో ఉండే పేరున్న బడానాయ కులు ఆస్తిపాస్తులు పెంపొందించుకోవడానికి ఉన్నత హోదాలు చేజిక్కించుకోవడం కోసం వాస్తును పాటిస్తూనే, జ్యోతిష్య పండితులుచెప్పిన్నట్లుగా యజ్ఞయాగాలు, దాన ధర్మాలు, అన్నదానాలు చేస్తున్నారు. ప్రజాప్రతినిధులు కోట్ల రూపాయలతో నిర్మించుకున్న భవనానికి వాస్తు లేదు, ఏవీ కలిసి రావు అని చెబితే వెంటనే వాటిని కూల్చివేసి వాస్తు పండితులు చెప్పిన్నట్లుగా తిరిగి నిర్మించడానికి లక్షలు ఖర్చు చేస్తున్నారు. వాస్తుప్రకారం ఎన్నికల కార్యాలయం భవనా లను నిర్మిస్తున్నారు. ఉత్తరంలో కూర్చోని ఉత్తరం రాయాలి, దక్షిణంలో ఉండి దానం చేయాలి, పడమటి నుంచి పందెం కాయాలి, తూర్పులో నిలబడి దండెం పెట్టాలి అని పండిం తులు చెబితే వెంటనే నాయకులుఅమలు చేస్తున్నారు. అది ఎంతవరకు నిజమో



అన్న విషయాన్ని కూడా ఆలోచించడం లేదంటే ఆ నాయకులు వాస్తు, జ్యోతిష్య ఊబిలో ఏ స్థాయిలో దిగబడిపోయి ఉన్నారో అర్థం అవుతుంది. 2023 తెలంగాణాలో,2024ఆంధ్రాలో జరిగిన అసెంబ్లీ ఎన్నికలలో వాస్తు, జ్యోతిష్యం సరిగా లేక వక్ర చూపుతో చూడటం వలనే ఓడిపోయాం, శాస్త్రాలన్నిటిని సరిచేసుకొని 2029లో జరిగే ఎన్నికల రణంలోకి దిగి విజయం సాధిస్తాం అని కొంతమంది ఓడిపోయిన శాసనసభ్యులు బహిరంగంగా పేర్కోవడాన్ని బట్టి వారు ఏస్థాయిలో ఆ శాస్త్రాలను నమ్ముతున్నారో స్పష్టం అవుతుంది. దేశంలో 90శాతం మంది పార్టీ అధినేతలు,కీలకమైన నాయకులు వాస్తు, జ్యోతిష్యాన్ని నమ్ముకొని 2029లోజరిగే పార్లమెంటు, అసెంబ్లీ ఎన్నికల యుద్ధంలో దిగి కోట్లు ఖర్చు చేయాలనీ నిర్ణయించుకొన్నారు, వీరిలో ఎంతమంది గెలుస్తారో వేచి చూడాలి. ఎన్నికలలో విజయం సాధించడానికి, క్షుద్రపూజలు చేయించే నాయకులు లేకపోలేదు. కానీ దేశంలో అలాంటి వారి శాతంచాలా తక్కువ. ఈ క్షుద్ర వ్యవహారాన్ని అతి రహస్యంగా నిర్వహిస్తారు.గతంలో కొంతమంది నాయకులు క్షుద్రపూజలు చేయిస్తున్నారని ఆరోపణలు చేసినా వారు సరైన సాక్ష్యాలు, ఆధారాలు చూపకపోవడంతో ఆ విమర్శలకు అడ్డు తెరపడింది. వాస్తు ప్రకారం ఢిల్లీలో 2023 సంవత్సరం మే నెలలో కొత్త పార్లమెంటు భవనాన్ని ప్రారంభించకముందు పాత పార్లమెంటు భవనం ప్రభావం వలన ప్రభుత్వాలుసుస్థిరంగా మనుగడ సాగించలేకపోతున్నాయంటూ ఇండోర్లో జరిగిన ఒక సదస్సులో కొందరు వాస్తు పండితులు పేర్కొ న్నారు. న్యూఢిల్లీ పాత పార్లమెంటు భవనాన్ని నిర్మించిన తీరు, ఉపయోగించిన రంగులు, భవనంలోకి వచ్చే గాలిని బట్టి ఏపార్టీ అయినా కేంద్ర పీఠాన్ని చేజిక్కించుకున్నా ఫలి తం పెద్దగా చూపలేవని వాస్తు పండితులు స్పష్టంచేసారు. పార్లమెంటు భవనంలోకి వచ్చే దిశను మార్చడంతోపాటు, మరికొన్ని మార్పులు చేస్తే వాస్తు దోషాలు ఉండవని పండితులు చెప్పారు. భవనానికి వేసిన రంగులు మార్చాలని, పార్లమెంటులో వేసిన కార్పెట్లపైన నడవటం మంచిదికాదు. 'పాలరాళ్లను పరిపించాలని కూడా వాస్తు పండితులు స్పష్టం చేసారు. వాస్తుసరిలేకపోవడం వలనే గతంలో అస్థిర ప్రభుత్వాలు అధికారం చేపట్టాయి. ఒకవేళ పూర్తి అధికారాన్ని చేపట్టిన ప్రభుత్వం ఆ తర్వాత జరిగే ఎన్నికలలో పరాజయం పాలవుతుందని, ఏ పార్టీకి పూర్తి మెజారిటీ రాదు, కొన్నిపార్టీలు కలిసి కలగూర గంపలాంటి ప్రభుత్వాలు ఏర్పాటు చేసినా మధ్యలోనే అభిప్రాయ భేదాలొచేస్తాయి. కొమ్ము కాసిన పార్టీయే ప్రభుత్వాన్ని కూల్చేయడానికి ప్రయత్నాలు చేస్తాయని పండితులు వివరించారు. దేశంలోని మహా నగరాలలో నివసిస్తున్న వారికి వాస్తుశాస్త్రం పై విపరీతంగా నమ్మకం పెరిగిపోయింది. సామాన్యుడిని మొదలుకొని ధనవంతుడు వరకు, చిన్న ఉద్యోగి నుంచి ఉన్నత పదవుల్లో ఉన్న అధికారి వరకు వాస్తుమైకంలో కూరుకుపోయి ఉన్నారు. అద్దెఇళ్లలో వుండటానికి నివాసులు వాస్తునే దృష్టిలో పెట్టుకోవడం విశేషం. వాస్తును నమ్ముకున్న మధ్యతరగతి కుటుంబాలు వాస్తు సరిగ్గాలేదని పండితులు చెబితే వెంటనే లక్షల్లో నిర్మించిన ఇళ్లను నేలమట్టం చేసేస్తున్నారు. మధ్య తరగతికి చెందిన వారు అద్దెఇళ్లలో ఉండి వేల రూపాయలు చెల్లించేదానికన్నా సొంత ఇల్లు నిర్మించుకోవాలని నిర్ణయించుకొని, గృహప్రవేశాన్ని ఆర్భాటంగా పూర్తి చేసి, సంతోషంతో ఊపిరి పీల్చుకున్నకొద్ది రోజులలోనే వాస్తుపండితులుజోక్యం చేసుకొని ఇదేమిటయ్యా ఈశాన్య మూల ఖాళీగా వుంచాలి. ఇక్కడ గది ఉండకూడదు, వెంటనే కూలగొట్టు, వెంటనే ఈ గుమ్మం మార్పించు, మీకు తెలిసిన వారు సరిగా వాస్తు గురించి చెప్పలేదు.అని ఆయా ఆసాముల 'మైండును' పండితులు పాడు చేసి వెళ్ళిపోతున్నారు. భయ పడి పోయిన కొంతమంది ఇళ్ల యజమానులు లక్షలు ఖర్చుచేసి నిర్మించిన ఇళ్లను మరమ్మత్తులు చేసి చివరకు చూస్తే గోడలు, పైకప్పు మాత్రమే మిగిలిపోతున్నాయి.ఇల్లు కట్టడమంటే అన్ని తిరకాసులే. కనుకనే పెద్దలు ఇల్లుకట్టడాన్ని పెళ్ళితో పోల్చారు. గతంలోపాలకులు నగర నిర్మాణాలు కావించేటప్పుడు కూడా వాస్తు శాస్త్ర సమ్మతంగానే ఆ పనులు నిర్వహించేవారు.

ong-55_ong-55.qxd 3/6/2026 1:55 AM Page 1






# పి.జి.ఆర్.ఎస్ అర్జీలను పునరావృతం కాకుండా తక్షణమే పరిష్కరించాలి

**- అర్జీ దారునితో సమస్యపై ఫోన్లో చర్చించి, ప్రత్యక్షంగా పరిశీలించి పరిష్కరించాలి: జిల్లా కలెక్టర్ దినేష్ కుమార్**

**పాడేరు, మార్చి 5, ప్రభాతవార్త**

జిల్లాలో ప్రజా పరిష్కార వేదిక ద్వారా వచ్చిన అర్జీలు, రెవెన్యూ క్లినిక్ ద్వారా ప్రజల నుండి అందిన అర్జీలను అధికారులు అత్యంత ప్రాధాన్యతతో పరిశీలించి, నిర్ణీత కాలపరిమితిలోగా పరిష్కరించాలని జిల్లా కలెక్టర్ దినేష్ కుమార్ అధికారులను ఆదేశించారు. గురువారం కలెక్టర్ తన క్యాంపు కార్యాలయంలో నుండి వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించిన రెండు జిల్లాల అధికారులతో సమీక్షా సమావేశం నిర్వహించి, పి జి ఆర్ ఎస్, రెవిన్యూ క్లినిక్ ద్వారా వచ్చిన అర్జీలపై వారి వారి పరిధిలో పెండింగ్‌లో ఉన్న వివిధ అర్జీలపై ఆయన సుదీర్ఘంగా చర్చించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ క్షేత్రస్థాయిలో అధికారులు అర్జీలను పెండింగ్‌లో ఉంచకుండా, ఎప్పటికప్పుడు పరిష్కరించి బాధితులకు న్యాయం చేయాలని, రెవిన్యూ క్లినిక్ భూ సంబంధిత సమస్యలు, మ్యుటేషన్లు మరియు ఇతర రెవిన్యూ అంశాలపై వచ్చిన ఫిర్యాదులను క్షుణ్ణంగా పరిశీలించాలని సూచించారు. బాధ్యతాయుతంగా వ్యవహరించాలని ప్రజలు సమస్య తీరడం కోసం ఎన్నో ఆశలతో ప్రభుత్వానికి విన్నవించుకుంటున్నారని, వారి సమస్యల పట్ల నిర్లక్ష్యం వహిస్తే కఠిన చర్యలు తప్పవని హెచ్చరించారు. నాణ్యమైన పరిష్కారం



మన వద్దకు దొరుకుతుందని, అర్జిదారుడు వచ్చినప్పుడు వాటిని పరిష్కరించకుండా ఇతర కారణాలతో టెక్నికల్ సమస్యలను చూపి వాటిని కేవలం అర్జీని క్లోజ్ చేయడం ముఖ్యం కాదని, అర్జీదారుడు సంతృప్తి చెందేలా నాణ్యమైన పరిష్కారం చూపాలని అధికారులకు స్పష్టం చేశారు. అర్జీదారం నుండి ఒకే సమస్యపై అప్లికేషన్ ప్రూనా వృతం కాకుండా చూడాలన్నారు.అప్పుడే అర్జిదారుడు సంతృప్తి చెంది ఐవీఆర్ఎస్ కాల్స్ పై అవగాహన కల్పించినప్పుడు వారు సంతృప్తికరంగా ఒకటి నొక్కి వారి అభిప్రాయాన్ని తెలియజేస్తారు. ఆర్టీసీ బస్సు డిపోలలో మరుగుదొడ్ల వినియోగము పరిసరాల శుభ్రత పై ప్రజల నుండి సంతృప్తికరం లేదని, ఆర్టిసి బస్సు డిపోల ప్రాంగణంలో చెత్త పేరుకుపోయి ఉంటుందని, ఆర్టీసీ అధికారులు పూరుకుపోయి చెత్తను తొలగించేలా చర్యలు తీసుకొని సంబంధిత అధికారులు పర్యవేక్షించి బస్సు డిపో ప్రాంతాలు శుభ్రంగా ఉండే విధంగా చూడాలన్నారు. డోర్ టు డోర్ కలెక్షన్, తడి పొడి చెత్త కలెక్షన్,వినియోగం పై ప్రజా వ్యతిరేకత శాతం తగ్గించాలని, వారికి చెత్త కలెక్షన్ పై అవగాహన కల్పించాలని పంచాయతీరాజ్, డి ఎల్ పి ఓ అధికారులను ఆదేశించారు. ఏకోటూరిజం ప్రాంతాలలో ఎన్విరాన్మెంట్ ఉండే విధంగా చూడాలని ఫారెస్ట్,టూరిజం, పంచాయతీ రాజ్ శాఖల సమన్వయంతో పనిచేయాలన్నారు. ఈ సమావేశంలో పోలవరం, అల్లూరి జిల్లా కు సంబంధించిన ఐటీడిఏ ప్రాజెక్టు అధికారులు తిరుమణి శ్రీ పూజ, స్మరణ రాజ్, చింతూరు ఇంచార్జ్ పీవో శుభం నోక్వాల్,రెవిన్యూ అధికారులు పాడేరు ఇంచార్జి డిఆర్ఓ అంబేద్కర్, పాడేరుఇంచార్జి ఆర్డిఓ లోకేశ్వరరావు, వివిధ మండలాల తహశీల్దార్లు ఇతర శాఖల ఉన్నతాధికారులు పాల్గొన్నారు.

## జూనియర్స్ బ్యాట్మెంటన్ ఛాంపియన్ 18 పాల్గొంటున్న క్రీడాకారిణి

**- రాజాన గంగోత్రికి టిడిపి రాష్ట్ర కార్యదర్శి కొట్టగుల్లి సుబ్బారావు ఆర్థిక సహాయం**

**పాడేరు, మార్చి5, ప్రభాతవార్త**



10వ ఆల్ ఇండియా నేషనల్ డఫ్ సబ్ జూనియర్స్ బ్యాట్మెంటన్ ఛాంపియన్ 18 పోటీల్లో పాల్గొనేందుకు పాడేరు మండలం, సెరిబయలు గ్రామం కిండంగి పంచాయితీకి చెందిన బ్యాట్మెంటన్ క్రీడాకారిణి రాజాన గంగోత్రి ఎంపికయింది. ఈ నేపథ్యంలో ఈనెల మార్చి 21, 23 తేదీల్లో చండీగర్ పంజాబ్ రాష్ట్రంలో పాల్గొంటున్న క్రీడాకారిణి రాజాన గంగోత్రి కి ప్రయాణ ఖర్చులు,భోజన ఖర్చులు నిమిత్తం /10,వేల ర్ రూపాయలను తెలుగుదేశం పార్టీ రాష్ట్ర కార్యదర్శి మరియు ఆలయ ధర్మకర్త కొట్టగుల్లి సుబ్బారావు అందజేశారు. ఈ టోర్నీలో విజయం సాధించాలని ఆమె పేరిట శ్రీ శ్రీ శ్రీ పూర్ణ పుష్కల అయ్యప్ప స్వామి దేవాలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించి క్రీడాకారిణి ఆర్థిక సహాయం సుబ్బారావు అందజేశారు. ఈ కార్యక్రమంలో ఆలయ కమిటీ సభ్యులు వర్తన పెన్నయదొర,వర్మ సత్తి, ఆది, దాము, వర్తన శ్రీను మాస్టర్, నాని,ఆలయకమిటీ మహిళలు తదితరులు పాల్గొన్నారు.

## ఇస్కలి గ్రామంలో ఘనంగా పట్టాదారు పాసు పుస్తకాల పంపిణీ

**- భూమికి సంబంధించిన రికార్డులను భద్రపరుచుకోవాలి**
**- రెవెన్యూ డివిజనల్ అధికారి ఎం వి ఎస్ లోకేశ్వరరావు**

**పాడేరు,మార్చి5, ప్రభాతవార్త**





ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన భూ రీసర్వే ప్రక్రియలో భాగంగా, కుజ్జలి పంచాయతీ పరిధిలోని ఇస్కలి గ్రామంలో శుక్రవారం నాడు పట్టాదారు పాసు పుస్తకాల పంపిణీ కార్యక్రమం నిర్వహించారు. రీసర్వే పూర్తి చేసుకున్న ఈ గ్రామంలోని 66 మంది రైతులకు ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వ రాజముద్రతో కూడిన నూతన పట్టాదారు పాసు పుస్తకాలను రెవెన్యూ డివిజనల్ అధికారి ఎం వి ఎస్ లోకేశ్వరరావు అందజేశారు. భూ రికార్డుల ప్రక్షాళనలో భాగంగా అత్యాధునిక సాంకేతికతతో రీసర్వే నిర్వహించి, ఎలాంటి తప్పులు లేకుండా సరిహద్దులను ఖరారు చేసినట్లు అధికారులు తెలిపారు. గతంలో ఉన్న పుస్తకాలతో పోలిస్తే, ఇప్పుడు అందజేస్తున్న రాజముద్ర కలిగిన పాసు పుస్తకాలు రైతులకు భూమిపై పూర్తి స్థాయి చట్టబద్ధమైన హక్కును మరియు భద్రతను కల్పిస్తాయి. ఏళ్ల తరబడి పరిష్కారం కాని భూ సమస్యలు ఈ రీసర్వే ద్వారా పరిష్కారం కావడంపై ఇస్కలి గ్రామ రైతులు సంతోషం వ్యక్తం చేశారు.భూ యజమానులు తమ భూమికి సంబంధించిన రికార్డులను భద్రపరుచుకోవాలని సూచించారు. ఈ కార్యక్రమంలో మాజీ ఎమ్మెల్యే ఈశ్వరి, ఇస్కలి గ్రామ సర్పంచ్ స్థానిక రెవెన్యూ సిబ్బంది, సర్వేయర్లు మరియు గ్రామ ప్రజా ప్రతినిధులు పాల్గొన్నారు.

## ఆయుష్ ఆయుర్వేద మెగా వైద్య శిబిరానికి విశేష స్పందన

**డుంబ్రిగుడ: మార్చి: 05: (ప్రభాతవార్త)**



ఆదివాసి గిరిజన సంఘం పీపుల్స్ సొసైటీ సౌజన్యంతో గురువారం మండలంలోని రంగిలి సింగి పంచాయతీ కింజెరు గ్రామంలో నిర్వహించిన ఆయుష్ ఆయుర్వేద ఉచిత మెగా వైద్య శిబిరానికి విశేష స్పందన లభించింది. రంగేలి సింగ్ పంచాయతీ పరిధిలో ఉన్న ఏడు గ్రామాల వివిధ రకాల గిరిజన వ్యాధిగ్రస్తులు ఈ శిబిరంలో సుమారు 140 మంది వ్యాధిగ్రస్తులు పాల్గొన్నారు. వైద్యాధికారి ఎం .విజయ్ భాస్కర్ వారికి వైద్య పరీక్ష నిర్వహించి, ఉచితంగా మందులు పంపిణీ చేసి వైద్య సేవలు అందించారు. మారుమూల గిరిజన గ్రామాల్లో మెరుగైన వైద్య సేవలు అందించేందుకు గాను ఆదివాసి గిరిజన సంఘం ఆధ్వర్యంలో ఈ వైద్య శిబిరాన్ని నిర్వహించామని అసంఘం జిల్లా ఉపాధ్యక్షుడు టి. సూర్యనారాయణ తెలిపారు. ఈ కార్యక్రమంలో వైద్య సిబ్బంది, గిరిజన సంఘం నాయకులు పి మోహన్ దాస్, వి కేశవరావు, కే దాస్ బాబు, చండల్, తదితరులు పాల్గొన్నారు.

## 10 ఏళ్ల కల నెరవేర్పు రూ.5 కోట్లతో బీటీ రోడ్డుకు శంకుస్థాపన

**హుకుంపేట మార్చి5 ప్రభాతవార్త**



మండలంలోని పట్టం పంచాయతీ పరిధిలోని శిరసావలస జంక్షన్ నుంచి బూరు వలస వరకు సుమారు 5 కిలోమీటర్ల బీటీ రోడ్డు నిర్మాణానికి రూ.5 కోట్లతో గురువారం శంకుస్థాపన కార్యక్రమాన్ని ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా అరకు నియోజకవర్గ టీడీపీ ఇంచార్జి, విజయనగరం జోనల్ ఆర్టీసీ రీజనల్ చైర్మన్ సియ్యారి దొన్నుదొర హాజరై కొబ్బరికాయ కొట్టి పనులను ప్రారంభించారు. ఈ సందర్భంగా వందలాది మంది గ్రామస్తులు, గిరిజనులు పాల్గొని సంప్రదాయ పద్ధతుల్లో కార్యక్రమాన్ని నిర్వహించారు. చాలా సంవత్సరాలుగా రోడ్డు సౌకర్యం లేక తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నామని గ్రామ ప్రజలు తెలిపారు. మెటల్ రోడ్డులో ప్రయాణించడం వల్ల విద్యార్థులు, రోగులు, రైతులు, గ్రామస్తులు తీవ్ర ఇబ్బందులు పడేవారని చెప్పారు. నిత్యావసర సరుకులు తెచ్చుకోవడం, ఆసుపత్రులకు వెళ్లడం కూడా కష్టంగా మారిందని వారు ఆవేదన వ్యక్తం చేశారు. గ్రామస్థులు, టీడీపీ నాయకుడు సంతోష్ మాట్లాడుతూ గత పదేళ్లుగా ఈ రోడ్డు సమస్యను పరిష్కరించాలనే డిమాండ్‌తో ఎన్నో పోరాటాలు చేశామని తెలిపారు. 2015-16 సంవత్సరంలో రోడ్డుకు శంకుస్థాపన చేసినప్పటికీ పనులు మధ్యలోనే ఆగిపోయాయని, అప్పటి నుంచి అనేకసార్లు ధర్నాలు, నిరసనలు నిర్వహించి ఐటీడీఏ అధికారులకు ఫిర్యాదులు చేసినప్పటికీ ఫలితం రాలేదని అన్నారు. చివరకు పదేళ్ల తర్వాత ఈ రోడ్డు మళ్లీ మంజూరు కావడం తమకు ఎంతో ఆనందంగా ఉందని పేర్కొన్నారు. ఈ సందర్భంగా మాట్లాడిన టీడీపీ అరకు నియోజకవర్గ ఇంచార్జి సియ్యారి దొన్నుదొర మాట్లాడుతూ గ్రామాభివృద్ధి లక్ష్యంగా తెలుగుదేశం ప్రభుత్వం ముందడుగు వేస్తోందని తెలిపారు. గ్రామస్థాయిలో ప్రజా సమస్యలను గుర్తించి పరిష్కరించడమే ప్రభుత్వ ప్రధాన లక్ష్యమని చెప్పారు. శిరసావలస జంక్షన్ నుంచి బూరు వలస వరకు బీటీ రోడ్డు నిర్మాణం ద్వారా ఆరు గ్రామాల ప్రజలకు పెద్ద ఎత్తున ప్రయోజనం కలుగుతుందని అన్నారు. ఎన్నో ఏళ్లుగా ప్రజలు ఎదుర్కొంటున్న రోడ్డు సమస్యకు కూటమి ప్రభుత్వం శాశ్వత పరిష్కారం చూపిందని పేర్కొన్నారు. రూ.5 కోట్ల వ్యయంతో 5 కిలోమీటర్ల మేర రోడ్డును నిర్మించనున్నట్లు తెలిపారు. కాంట్రాక్టర్లు పనులను త్వరగా ప్రారంభించి నాణ్యతతో పూర్తి చేయాలని సూచించారు. ప్రజలకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా రోడ్డు నిర్మాణాన్ని పూర్తి చేసి అందుబాటులోకి తీసుకురావాలని అధికారులను ఆదేశించారు.టీడీపీ మండల అధ్యక్షుడు బొంజు బాబు ఆధ్వర్యంలో ఈ కార్యక్రమం నిర్వహించగా, సర్పంచులు, మండల నాయకులు, గ్రామ పెద్దలు, యువకులు, మహిళలు తదితరులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.

### ఆధునిక సాంకేతికతతో పాటు,సాంప్రదాయ, హస్తకలపై

## గిరిజన మహిళలకు ఉచిత శిక్షణ

**- ఐటిడిఎ ప్రాజెక్టు అధికారి, ఇన్చార్జ్ జాయింట్ కలెక్టర్ తిరుమణి శ్రీ పూజ**

**పాడేరు,మార్చి5, ప్రభాతవార్త**



గిరిజన మహిళా కు ఆధునిక సాంకేతికతతో సాంప్రదాయ హస్తకళల పై ఉచిత శిక్షణ పై సమీకృత గిరిజన అభివృద్ధి సంస్థ పాడేరు ప్రాజెక్ట్ అధికారి తిరుమాని శ్రీపూజ వెల్లడించారు . పాడేరు సమీకృత గిరిజన అభివృద్ధి సంస్థ వారు, గాయిత్రి విద్యపరిషత్ కాలేజి ఆఫ్ ఇంజనీరింగ్ మరియు డిపార్ట్మెంట్ ఆఫ్ సైన్స్ అండ్ టెక్నాలజీ భారతదేశ ప్రభుత్వ సహకారంతో, షెడ్యూల్ ట్రైబ్ (ఎస్టి) స్వయం సహాయక సంఘాల (యస్.హెచ్.జి) మహిళా సభ్యులు, హస్తకళలు విక్రయించే మహిళల కోసం ప్రత్యేక శిక్షణ కార్యక్రమాన్ని నిర్వహించడానికి ప్రతిపాదించబడింది. సాంప్రదాయ హస్తకళలను ఆధునిక 3డీ ప్రింటింగ్ సాంకేతికతతో సమన్వయం చేసి, "బాంబూ ఫ్యూషన్"(వెదురుతో అల్లకలు )ద్వారా గిరిజన మహిళలను సాధికారత కల్పిస్తూ, స్థిరమైన ఉపాధిని అభివృద్ధి చేయడం ఈ కార్యక్రమం ప్రధాన ఉద్దేశ్యం.ఈ ప్రాజెక్టులో భాగంగా, 10వ తరగతి కనీస అర్హత కలిగిన 30 మంది ఎస్టీ మహిళలు, హస్తకళలు విక్రయించే ఎస్ హెచ్ జీ సభ్యుల కోసం ఈనెల 9వ తేదీ 10వ తేదీలలో పాడేరులోని కాఫీహౌస్ వద్ద రెండు రోజుల ఉచిత శిక్షణ కార్యక్రమం నిర్వహించబడును. అర్హత కలిగిన ఎస్టీ ఎస్ హెచ్ జీ మహిళా సభ్యులు మరియు హస్తకళలు విక్రయించేఎస్టీ,ఎస్ హెచ్ జీ సభ్యులు తమ విద్యార్హత సర్టిఫికెట్ మరియు ఎస్టీ కుల ధృవపత్రాలను జతచేసి ఈనెల 7వ తేదీ లోపు పాడేరు ఐటిడిఎ కార్యాలయానికి దరఖాస్తులు సమర్పించవలసినదిగా ప్రాజెక్ట్ అధికారి,తిరుమాని శ్రీపూజ పేర్కొన్నారు.

## మ్యూజియం పనులు త్వరితగత పూర్తి చేయండి

**- ఇన్చార్జి జాయింట్ కలెక్టర్, పాడేరుఐటీడీఏ పీవో తిరుమాని శ్రీ పూజ**

**పాడేరు,మార్చ్5, ప్రభాతవార్త**



ట్రైబల్ ఫ్రీడమ్ ఫైటర్ మ్యూజియం ని త్వరితగత పూర్తి చేయాలని ట్రైబల్ వెల్ఫేర్ ఇంజనీరింగ్ అధికారులను ఆదేశించారు. గురువారం చింతపల్లి మండలం లంబసింగి లో నిర్మాణంలో ఉన్న ట్రైబల్ ఫ్రీడమ్ ఫైటర్ మ్యూజియం ని ఐటీడీఏ పీవో సందర్శించారు. ఈ సందర్భంగా పి ఓ మాట్లాడుతూ మ్యూజియం నిర్మాణం పనులు త్వరితగత పూర్తి చేసి ప్రారంభో త్సవానికి తయారు చేయాలని సంబంధిత అధికారులను ఆదేశించారు. నిర్మాణ పనులు వేగవంతం చేయడానికి కార్మికుల పెంచాలని మరియు సమన్వయంతో పనిచేయాలని సూచించారు. ఈ కార్యక్రమంలో ట్రైబల్ వెల్ఫేర్ ఈ ఈ ,



ఏఈ డేవిడ్ రాజు మరియు కిషోర్, ట్రైబల్ రీసెర్చ్ ఇన్స్టిట్యూట్ ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ మాదారాణి, క్యూ రైటర్స్ తదితరులు పాల్గొన్నారు

### జిల్లాలో నిర్దేశించిన గడువులోగా అనుమతి పొందిన

## మొబైల్ టవర్ల నిర్మాణం పూర్తి చేయాలి: జిల్లా కలెక్టర్ దినేష్ కుమార్

**పాడేరు, మార్చి 5, ప్రభాతవార్త**

జిల్లాలో మొబైల్ కనెక్టివిటీ లేని ప్రాంతాల్లో సిగ్నల్ వ్యవస్థను మెరుగుపరిచేందుకు, అనుమతులు లభించిన సిగ్నల్ టవర్స్ ను నిర్దేశించిన గడువులోగా నిర్మాణ పనుల ఏర్పాటు పూర్తి చేయాలని జిల్లా కలెక్టర్ దినేష్ కుమార్ సంబందించిన అధికారులను ఆదేశించారు. గురువారం కలెక్టర్ క్యాంపు కార్యాలయం నుండి వీడియో కాన్ఫరెన్స్ ద్వారా రెవెన్యూ, బిఎస్ఎన్ఎల్,జియో,ఫారెస్ట్, ఇంజనీరింగ్ విభాగాలకు చెందిన రెండు జిల్లలా అధికారులతో నిర్వహించిన సమన్వయ కమిటీ సమావేశంలో మొబైల్ టవర్ల నిర్మాణం, సిగ్నల్ వ్యవస్థ, రోడ్డు కనెక్టివిటీ పై కలెక్టర్ సుదీర్ఘంగా సమీక్షించారు. ఈ



సందర్భంగా ఆయన మాట్లాడుతూ కీలక సలహాలు సూచనలను తెలియజేశారు. జిల్లాలలో అనుమతులు పొందిన బిఎస్ఎన్ఎల్, జియో నెట్వర్క్ సంస్థలకు సంబంధించిన అధికారులతో సెల్ టవర్లను ఏర్పాట్లపై, వారి సమస్యలు సంబంధించి రెవెన్యూ, ఫారెస్ట్ శాఖల అధికారుల సమన్వయంతో పనిచేయాలని, పనులపై ఎటువంటి ఇబ్బందులు ఉన్నా ముందుగానే చర్చించుకోని క్లియరెన్స్ తీసుకోవాలని, టవర్స్,రోడ్స్ ఏర్పాట్లు పై వచ్చిన ప్రతిపాదనలు అనుమతులపై వెంటనే క్లియరెన్స్ ఇవ్వాలని సంబంధిత అధికారులకు ఆదేశించారు.టవర్ల ఏర్పాటులో ఎదురవుతున్న అడ్డంకులను తొలగించేందుకు రెవిన్యూ, ఫారెస్ట్, బి.ఎస్.ఎన్.ఎల్, జియో అధికారులు పరస్పర సమన్వయంతో పనిచేయాలని సూచించారు. అనుమతులు నిర్మాణ పనులు ఇప్పటికే అనుమతులు లభించిన ప్రాంతాల్లో ఏమాత్రం ఆలస్యం చేయకుండా టవర్ల నిర్మాణ పనులను వెంటనే ప్రారంభించి, గడువులోగా లక్ష్యన్ని పూర్తి చేయాలన్నారు. మారుమూల ప్రాంతాల్లో ప్రజలకు మొబైల్ సేవలు అందడమే ప్రభుత్వ లక్ష్యమని, దీనికోసం నిర్ణీత గడువులోగా సిగ్నల్స్ అందుబాటులోకి వచ్చేలా చూడాలని స్పష్టం చేశారు. ఫీల్డ్ లెవల్ పర్యవేక్షణ చేసి పనుల పురోగతిని నిర్ధారించాలన్నారు. పర్యవేక్షణ జరిపిన అనంతరం ఎప్పటికప్పుడు పనితీరుపై సమీక్షించుకొని ఏవైనా సాంకేతిక సమస్యలు ఉంటే తక్షణమే ఉన్నతాధికారుల దృష్టికి తీసుకురావాలని, సమస్యను వెంటనే పరిష్కరించుకోవాలని అధికారులకు ఆదేశించారు. ఈ వీడియో కాన్ఫరెన్స్ సమావేశంలో రెండు జిల్లాల ఐటిడిఎ ప్రాజెక్టు అధికారులు,అటవీ శాఖ అధికారులు, రెవిన్యూ అధికారులు, బి.ఎస్.ఎన్.ఎల్, జియో ప్రతినిధులు పాల్గొన్నారు.

## లింగ నిర్ధారణ పరీక్షలు చట్టరీత్య నేరం

**చోడవరం, మార్చి 5, ప్రభాతవార్త:**



రావికమతం ప్రాజెక్ట్ లోని చోడవరం సెక్టార్ పరిధిలో గల కే కాలనీ ద్వారకా నగర్ అంగన్వాడీ కేంద్రాల్లోని అంతర్జాతీయ మహిళా దినోత్సవం లో భాగంగా సూపర్వైజర్ మాట్లాడుతూ లింగ నిర్ధారణ పరీక్షలు నేరమని తెలియజేశారు ఈ సందర్భంగా రూపొందించిన యాక్షన్ ప్లాన్ (మార్చ్116) లో భాగంగా కిషోర్ బాలికలకు సెక్సువల్ అండ్ రిప్రొడక్టివ్ హెల్త్ గురించి మరియు లబ్ధిదారులకు తల్లిదండ్రులకు పి సి పి ఎన్ డి టి యాక్ట్ 1994(లింగ నిర్ధారణ నిరోధక చట్టం) గురించి సూపర్వైజర్ బి శాంతిప్రియ క్లుప్తంగా వివరించడం జరిగింది అలాగే స్వచ్ఛత పక్వాడ పక్షోత్సవాల్లో(మార్చ్ 115) భాగంగా పరిసరాల శుభ్రత చేతుల పరిశుభ్రత తడి చెత్త పొడి చెత్త వేరు చేయడం వంటి కార్యక్రమాల గురించి అలాగే అంగన్వాడీ కేంద్రాలు లోపల బయట పరిశుభ్రంగా ఉంచడం గురించి వివరించడం జరిగింది. ఈ కార్యక్రమానికి హాజరైన తల్లులందరికీ మరియు కిషోర్ బాలికలికి బాల్యవివాహాలు వాటి వలన కలుగు అనర్థాలు గురించి కూడా వివరించడం జరిగింది. ఈ కార్యక్రమంలో కే కాలనీ మరియు ద్వారకా నగర్ అంగన్వాడి కార్యకర్తలు బి కృష్ణవేణి, వి ఈశ్వరమ్మ పాల్గొన్నారు.

## మహిళా చట్టాలపై అవగాహన

**(నక్కపల్లి రూరల్ ,ప్రభాతవార్త)**





జాతీయ మహిళా దినోత్సవం సందర్భంగా సిఐడి జూరెడ్డి మురళి ఆదేశాల మేరకు పలు పాఠశాలల్లో మహిళా చట్టాలపై మహిళా ఎస్సై సాహిబా అంజుమ్ తన సిబ్బందితో కలిసి అవగాహన కల్పించారు. మండలంలోని రాజయ్యపేట స్కూల్ ను సందర్శించి విద్యార్థులకు సోషల్ మీడియా వల్ల పెరుగుతున్న నేరాల గురించి అవగాహన కార్యక్రమం నిర్వహించి పలు సూచనలు చేశారు.సోషల్ మీడియాను బాధ్యతారహితంగా అధికంగా ఉపయోగించడం వల్ల కలిగే ప్రతికూల పరిస్థితులపై.ముఖ్యంగా ఆన్‌లైన్ బెట్టింగ్ గేమ్స్, సోషల్ మీడియాతో సంబంధం ఉన్న సైబర్ నేరాలు, సోషల్ మీడియా ప్రభావంతో యువతలో డ్రగ్స్ వినియోగం పెరుగుతున్న విషయం గురించి వారికి అవగాహన కల్పించారు. 10వ తరగతి బోర్డు పరీక్షలు సమీపిస్తున్న నేపథ్యంలో, విద్యార్థులు చదువుపై దృష్టి పెట్టాలని, పరీక్షలకు బాగా సిద్ధం కావాలని . మార్కులు ఆశించిన విధంగా రాకపోయినా ఒత్తిడికి లోనవకుండా, ఆత్మహత్య వంటి ఆలోచనలు చేయకుండా ధైర్యంగా ముందుకు సాగాలని పిలుపునిచ్చారు .

## చోడవరం సమస్యలపై డిప్యూటీ సీఎంకు ఎమ్మెల్యే వినతి

**చోడవరం, మార్చి 5, ప్రభాతవార్త**



ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర ఉప ముఖ్యమంత్రి పంచాయతీరాజ్ శాఖ మంత్రి కొణిదెల పవన్ కళ్యాణ్ ని గురువారం చోడవరం ఎమ్మెల్యే కె.ఎస్ ఎన్ఎస్ రాజు అమరావతి లో మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా చోడవరం నియోజకవర్గంలో రోడ్ల అభివృద్ధి ఇంటింటికి కొళాయి పనులు కోసం వినతి పత్రం అందజేశారు. స్పందించిన డిప్యూటీ సీఎం అతి త్వరలో నిధులు మంజూరు చేస్తామని హామీ ఇచ్చినట్టు ఎమ్మెల్యే తెలిపారు. దీంతో చోడవరం నియోజకవర్గ కూటమి తరపున కృతజ్ఞతలు తెలియజేసారు.



## రాళ్లగడ్డలో ఘనంగా చీడికొండమ్మ జాతర

**గూడెం కొత్తవీధి,మార్చి 5 (ప్రభాతవార్త)**

మండలంలోని జెర్రీల పంచాయితీ రాళ్లగడ్డ గ్రామంలోని గ్రామ దేవత శ్రీ శ్రీ చిడి కొండమ్మ అమ్మవారి జాతరను గ్రామస్తులు ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా గ్రామస్తులు భక్తులకు భారీ అన్న సమరాతన కార్యక్రమం ఏర్పాటు చేసి అనంతరం వాలీబాల్ పోటీలను నిర్వహించి గెలుపొందిన వారికి బహుమతులు అందజేశారు మారుమూల గ్రామాల నుండి తరలివచ్చిన భక్తులను అన్నప్రసాధన ఏర్పాటు చేసి గ్రామ దేవతకు మొక్కులు చెల్లించి తీర్థ ప్రసాదాలు స్వీకరిం చారు.ఈ కార్యక్రమంలో గ్రామ స్తులు యువకులు పెద్ద ఎత్తున పాల్గొని భక్తులకు ఎటువంటి అసౌకర్యాలు కలగకుండా ఘనంగా నిర్వహించారు.



6-3P8exHMNWJQE.qxd:6-3P8exHMNWJQE.qxd 1/1/02 8:18 AM Page 1



# టెన్త్ విద్యార్థుల హాల్‌టికెట్లు విడుదల

### వాటిపై క్యుఆర్‌కోడ్.. పరీక్షలకు హాజరుకానున్న

### 5,28,239 లక్షల మంది విద్యార్థులు

### మార్చి 14 నుంచి ఏప్రిల్ 16 వరకు పరీక్షలు

**హైదరాబాద్, మార్చి 5, ప్రభాతవార్త:** రాష్ట్రంలో ఈ ఏడాది మార్చి 14 నుంచి ప్రారంభం కానున్న 10వ తరగతి వార్షిక పరీక్షల హాల్ టికెట్లను గురువారం విడుదల చేశారు. విద్యార్థులు తమ హాల్ టికెట్లను బిఎస్ఈ వెబ్‌సైట్ నుంచి డౌన్‌లోడ్ చేసుకోవచ్చని ప్రభుత్వ పరీక్షల డైరక్టర్ తెలిపారు. విద్యార్థులకు జారీ చేసే హాల్ టికెట్లపై క్యూఆర్ కోడ్‌తో ఉండనుంది. విద్యార్థులు తమ హాల్ టికెట్లను పొందడం కోసం 8096958096 వ్యాట్సాప్ నంబర్‌కి హాయ్ అని టైప్ చేసి.. వెంటనే ఎస్ఎస్‌సి హాల్ టికెట్ మార్చి-2026 అని సెండ్ చేస్తే.. హాల్ టికెట్‌ను సెండ్ చేయనున్నారు. విద్యార్థులు తమ హాల్ టికెట్లపై ఉన్న క్యూఆర్ కోడ్‌ను స్కాన్ చేసి వారి పరీక్షా కేంద్రం ఎక్కడ ఉందో తెలుసుకోవచ్చని.. వారికి ఎంత దూరంలో ఉందో కూడా తెలుస్తుంది. తద్వారా వారు ఆయా పరీక్షా కేంద్రాలకు చేరుకునేందుకు ముందుగానే ప్లాన్ చేసుకునే వెలుసుబాటు కలగనుంది. రాష్ట్రంలో ఈ ఏడాది ఎస్ఎస్‌సి పరీక్షలకు 5,28,239 మంది పరీక్షలకు హాజరు కానున్నారు. వారిలో రెగ్యులర్ విద్యార్థులు 5,17,727 మంది విద్యార్థులు కాగా.. 10,512 మంది ప్రైవేటు విద్యార్థులు హాజరు కానున్నారు. వారి కోసం రాష్ట్ర వ్యాప్తంగా 2676 పరీక్షా కేంద్రాలను ఏర్పాటు చేశారు. వాటిలో 1582 ప్రభుత్వ స్కూల్స్ ఉండగా.. 1094 స్కూల్స్ ప్రైవేటు స్కూల్స్ ఉన్నాయి. ఇంగ్లీష్ మీడియం విద్యార్థులు 4.70 లక్షల మంది ఉండగా.. తెలుగు మీడియం వారు 44,881 మంది ఉన్నారు. 3720 మంది ఉర్దూ మీడియం విద్యార్థులున్నారు. ఎస్ఎస్‌సి వార్షిక పరీక్షలు మార్చి 14 నుంచి ఏప్రిల్ 16 వరకు కొనసాగనున్నాయి. ఉదయం 9 గంటల నుంచి మధ్యాహ్నం 12 గంటల వరకు పరీక్షలు కొనసాగనున్నాయి. ప్రభుత్వ పరీక్షల డైరక్టర్ కార్యాలయంలో 24 గంటలపాటు అందుబాటులో ఉండేలాగా 040-23230942 నంబర్ అందుబాటులో ఉంచినట్టు ప్రభుత్వ పరీక్షల డైరక్టర్ తెలిపారు.

## ఎసిబి వలలో జిహెచ్‌ఎంసి అవినీతి అధికారి



ఎసిబి అధికారులకు పట్టుబడిన సంతోష్

**హైదరాబాద్ (సికిందరాబాద్), మార్చి 5, ప్రభాతవార్త:** అవినీతి తిమింగలం ఏసీబీ అధికారులకు చిక్కింది. 35 వేల రూపాయలు డబ్బులు తీసుకుంటూగా పట్టు బడ్డాడు. సికిందరాబాద్ జిహెచ్‌ఎంసి కార్యాలయంలోని ఫైనాన్స్ విభాగంలో ఎగ్జామినర్ ఆఫ్ అకౌంటెంట్ అధికారి సంతోష్‌ను ఏసీబీ అధికారులు రెడ్ హ్యాండ్‌గా పట్టుకున్నారు. గతంలో మున్సిపల్ కార్యా లయంలో పనిచేసే రిటైర్డ్ ఉద్యోగ వద్ద నుంచి 40 వేలు డిమాండ్ చేశాడు. 35000 ఇస్తానని ఒప్పందం చేసుకోవడంతో ఆ డబ్బులు ఇస్తుండగా రెడ్ హ్యాండ్‌గా పట్టు కున్నారు. ఏసీబీ అధికారులు సికింద్రాబాద్లోని కార్యాలయంతో పాటు అతని ఇంటి వద్ద కూడా తనిఖీలు నిర్వహిస్తున్నట్లు ఏసిబి డిఎస్పి గంగసాని శ్రీధర్ తెలిపారు. మూడు రోజుల క్రితం సమాచారం రావడంతో అధికారులు అతనికి 35 వేల రూపాయలు ఇస్తుండగా పట్టుకున్నారు. ఇతన్ని అదులోకి తీసుకొని అరెస్టు చేసినట్లు శ్రీధర్ వెల్లడించారు.

## కుమ్మెర నిందితులను తక్షణం శిక్షించాలి

### ప్రజాసంఘాల నిరసనలకు సంపూర్ణ మద్దతు

### సిపిఎం రాష్ట్ర కార్యదర్శి జాన్‌వెస్లీ

**హైదరాబాద్, మార్చి 5,ప్రభాతవార్త:** కుమ్మెర నిందితులను తక్షణం శిక్షి ంచాలి భారత కమ్యూనిస్టు పార్టీ మార్క్సిస్టు(సీపీఐఎం) తెలంగాణ రాష్ట్ర కమిటీ ప్రభుత్వాన్ని డిమాండ్ చేసింది. ప్రజాసంఘాల నిరసనలకు సంపూర్ణ మద్దతు ఉంటుందని రాష్ట్ర కార్యదర్శి జాన్‌వెస్లీ తెలిపారు. నాగర్కర్నూల్ జిల్లా కుమ్మెర గ్రామంలో రజక, దళిత కుటుంబాలపై జరిగిన దాడిని, రెండు నెలల పసిపాప హత్యను ఖండిస్తూ గురువారం రజక, ప్రజా సంఘాలు చేపట్టిన నిరసన కార్యక్రమాలలో అరెస్టయిన వారిని చిక్కడపల్లి పోలీస్‌స్టేషన్‌లో సీపీఐ(ఎం) రాష్ట్ర కార్యదర్శి జాన్‌వెస్లీ, కార్యదర్శివర్గ సభ్యులు బండారు రవికుమార్, సీనియర్ నాయకులు డీజీ నరసింహారావు కలిసి సంపూర్ణ మద్దతు తెలిపారు. ఘటన జరిగి రోజులు గడుస్తున్నా ఇప్పటివరకు కుమ్మెర గ్రామ సర్పంచ్ రాంరెడ్డి, ఇతర నిందితులపై ఎస్సీ, ఎస్టీ అట్రాసిటీ యాక్ట్ కింద గానీ, హత్య కేసు గానీ నమోదు చేయలేద న్నారు. రాష్ట్రమంతా ప్రజాసంఘాలు, స్వచ్ఛంద సంస్థలు ఘటనను ఖండిస్తున్నా, హోం మంత్రిగా కూడా కొనసాగుతున్న ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ఇప్పటివరకు స్పందించకపోవడం విచారకరమన్నారు. బాధితులకు అండగా నిరసన తెలుపుతున్న ప్రజా సంఘాల నాయకులను అరెస్ట్ చేయడం అప్రజాస్వామికమని, ప్రభుత్వం ఇప్పటికైనా స్పందించి ఈ కేసు విచారణ కోసం ప్రత్యేకంగా ఫాస్ట్ ట్రాక్ కోర్టును ఏర్పాటు చేసి, నిందితులను అరెస్టు చేసి కఠిన శిక్ష పడేలా చూడాలని డిమాండ్ చేశారు. బాధితులకు న్యాయం చేయకపోతే, రాబోయే శాసనసభ సమావేశాల సందర్భంగా సిపిఎం పార్టీ ఆధ్వర్యంలో అసెంబ్లీని ముట్టడిస్తామని, నేడు(శుక్రవారం) రేపు(శనివారం) ప్రజాసంఘాలు నిర్వహించే కార్యక్రమాల్లో పాల్గొని, సంపూర్ణమద్దతు తెలియజేస్తామని జాన్‌వెస్లీ స్పష్టం చేశారు.

## కోతికి పచ్చ బొట్టు!

### నుదుట 25 యేళ్లు వెలిగేరీతిలో ముద్ర

### కుటుంబనియంత్రణ శస్త్ర చికిత్స

**హైదరాబాద్, మార్చి 5, ప్రభాతవార్త:** 'పచ్చబొట్టు చెరిగిపోదులే నా రాజా.. పదుచు జంట చెదరిపోదూలే నా రాణీ' అంటూ కోతులు హాయిగా కోతి కొమ్మచి ఆటలు ఆడుతూ యువగీతం పాడుకొంటూ సంసారం చేసుకొనేలా నిర్మల్ జిల్లా పశు సంవర్ధకశాఖ అధికారులు ఏర్పాటు చేశారు. కోతులకు ఈ పచ్చబొట్టు ఇరువైఐదు యేళ్లు నుదుట వెలిగే రీతిలో బొట్టుపెట్టి మరి విడిచిపెడుతున్నారు. నమ్మ లేకపోతే నిర్మల్ జిల్లా సారంగపూర్ మండలం చించోలి (బి) పునరావాస, పునరుత్పత్తి నిరోధక కేంద్రం సందర్శించండి.



నుదుటన పచ్చబొట్టుతో కోతి

కోతులు పెద్ద ఎత్తున పుట్టి పెరగకుండా నియంత్రించేందుకు అటవీశాఖ ఆధ్వర్యంలో వాటికి కుటుంబ నియం త్రణ శస్త్ర చికిత్సలు చేయిస్తున్నారు. మూడేళ్ళ వయస్సు నుంచి కోతులు సంతానోత్పత్తి చేసే సామర్థం ఇరువై ఐదేళ్ళ వరకు కలిగి ఉంటాయి మూడేళ్ల వయసున్న వాటిని గుర్తించి కుటుంబ నియంత్రణ శస్త్రచికిత్సలు చేస్తారు. ఆపరేషన్ చేసిన కోతులను భవిష్యత్తులో గుర్తించడానికి ఆపరేషన్ అనంతరం కోతుల నుదిటిపై త్రిశూలం ఆకారంలో పచ్చబొట్టు వేస్తున్నారు. సాధరణంగా కోతులు 25 -30 ఏళ్ల పాటు జీవిస్తాయి. కోతుల త్రిశూలం పచ్చ బొట్టు జీవితకాలం ఉండనుందని అక్కడి పశువైద్యులు చెబుతున్నారు . నిర్మల్ జిల్లా సారంగాపూర్ మండలం చించోలి(బి) సమీపంలోని కోతుల పునరావాసం, పునరుత్పత్తి నిరోధక కేంద్రంలో కుటుంబనియంత్రణ శస్త్ర చికిత్సలు చేసిన 1653 కోతులకు ఇప్పటికి పచ్చబొట్ల వేశారు.

# ప్రజాపాలన - ప్రగతి ప్రణాళిక సమర్థంగా అమలు చేయండి



### కార్యక్రమం అమలుతీరుపై పంచాయతీల వారీగా ఆడిట్

### నిర్లక్ష్యం చేసే అధికారులు, పాలకవర్గాలపై కఠిన చర్యలు

### గ్రామీణాభివృద్ధి శాఖ మంత్రి సీతక్క

**హైదరాబాద్, మార్చి 5, ప్రభాతవార్త:** గ్రామాల్లో ప్రజా పాలన - ప్రగతి ప్రణాళిక కార్యక్రమాన్ని విజయ వంతంగా అమలు చేయాలని రాష్ట్ర పంచాయతీరాజ్, గ్రామీణాభివృద్ధిశాఖ మంత్రి సీతక్క జిల్లాల సిఇఒలు,డిపిఒలు, డిఆర్‌డిఒలకు ఆదేశాలు జారీ చేశారు. ఈ మేరకు గురువారం సచివాలయం నుంచి వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించి అధికారులకు దిశానిర్దేశం చేశారు. గ్రామ పంచాయతీల్లో ప్రజా పాలన - ప్రగతి ప్రణాళిక కార్యక్రమాన్ని శుక్రవారం నుంచి ప్రారంభిస్తున్నామని తెలిపారు. 99 రోజులపాటు గ్రామాల్లో ప్రత్యేక కార్యక్రమాలు నిర్వహించి మౌళిక మార్పులు తీసుకురావాలని అధికారులకు సూచించారు. గ్రామీణ ప్రాంతాల్లో ప్రజలకు ఆరోగ్యకరమైన వాతావరణం కల్పించడం ఈ కార్యక్రమం ప్రధాన లక్ష్యమని తెలిపారు.

గతంలో 15వ ఆర్థిక సంఘం నిధులు లేకపోవడం, సర్పంచ్‌లు లేకపోవడం వల్ల గ్రామాల్లో అభివృద్ధి పనులు వేగంగా సాగలేదని మంత్రి చెప్పారు. ఇప్పుడు నిధులు కూడా ఉన్నాయని గుర్తు చేశారు. ప్రజా ప్రతినిధులు కూడా ఎన్నికై ఉన్నందున అధికారులు కష్టపడితే గ్రామాల్లో విప్లవాత్మక మార్పులు తీసుకురావచ్చని పేర్కొన్నారు. పంచాయతీరాజ్, గ్రామీణాభివృద్ధిశాఖ ద్వారా చేపట్టిన అభివృద్ధి కార్యక్రమాలను ప్రగతి నివేదిక రూపంలో విడుదల చేయాలని ఆదేశించారు. పనుల జాతరలో భాగంగా ప్రారంభించిన పనులను పూర్తి చేయాలని సూచించారు. అలాగే మిషన్ భగీరథ ద్వారా అందుతున్న నీటిని వినియోగించేలా ప్రజలకు అవగాహన కల్పించాలని గ్రామ సభల్లో తీర్మానాలు చేయించాలని తెలిపారు.

గ్రామాల్లో బాల్య వివాహాల నివారణపై ప్రజల్లో అవగాహన కల్పించాలని అధికారులకు మంత్రి సూచించారు. 15వ ఆర్థిక సంఘం నిధులను నిబంధనల ప్రకారం మాత్రమే వినియోగించాలని స్పష్టం చేశారు. 2023-24 ఆర్థిక సంవత్సరంలో చేపట్టిన పనులకు సంబంధించి రూ.245 కోట్లను ఆర్థిక సంఘం విడుదల చేసిందని తెలిపారు. ఆ నిధులను ప్రధానంగా పారిశుధ్యం, తాగునీటి పనులకు వినియోగించాలని సూచించారు. నిబంధనలకు విరుద్ధంగా నిధులు వినియోగిస్తే చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. ఆ సమయంలో పూర్తయిన ఇతర పనులకు రాష్ట్ర ప్రభుత్వం నిధులను విడుదల చేస్తున్నట్లు తెలిపారు. గ్రామాల్లో పారిశుధ్య నిర్వహణను మెరుగుపరచడం, ప్రభుత్వ సేవలు ప్రజలకు చేరేలా చేయడం, గ్రామాభివృద్ధిని వేగవంతం చేయడం, పెండింగ్ పన్నుల వసూళ్ల పెంచడం ప్రధాన లక్ష్యాలుగా పనిచేయాలని మంత్రి సూచించారు. గ్రామ శుభ్రత, పన్నుల వసూళ్ల డ్రైవ్, తాగునీటి వనరుల పరిశీలన, డ్రైనేజీల శుభ్రత, వీధి దీపాల మరమ్మతులు, చెత్త నిర్వహణ చర్యలు, ప్రభుత్వ పథకాలపై అవగాహన కార్యక్రమాలు చేపట్టాలని ఆదేశించారు.

కొత్తగా ఎన్నికైన సర్పంచ్‌లు, వార్డు సభ్యుల్లో ఉన్న ఉత్సాహాన్ని వినియోగించుకోవాలని మంత్రి తెలిపారు. పైస్థాయి నుంచి కింది స్థాయి సిబ్బంది వరకు బాధ్యతాయుతంగా పనిచేయాలని సూచించారు. ప్రతి వారం చేపట్టిన పనులు, సాధించిన పురోగతిపై నివేదికలు ఇవ్వాలని ఆదేశించారు. పనులపై ఆడిట్ కూడా నిర్వహిస్తామని మంత్రి సీతక్క తెలిపారు. ఫీల్డ్ వర్క్‌తోపాటు పేపర్ వర్క్ కూడా సమర్థవంతంగా చేయాలని, ఏ విషయంలో నిరక్ష్యం చేసినా చర్యలు తప్పవని హెచ్చరించారు. 99 రోజులపాటు సిబ్బంది గ్రామాల్లో ఉండి ప్రజల అవసరాలు, సమస్యలు తెలుసుకోవాలని సూచించారు. సంక్షేమ పథకాలు సరైన లబ్ధిదారులకు అందుతున్నాయా, అనర్హులు ఉన్నారా అనే అంశాలను పరిశీలించి నమోదు చేయాలని సూచించారు. భవిష్యత్ విధానాల రూపకల్పనకు ఈ సమాచారం ఉపయోగ పడుతుందని పేర్కొన్నారు. కేరళలో కడు పేదరికాన్ని తగ్గించేందుకు ఇలాంటి సమాచార సేకరణ ఎంతో ఉపయోగపడిందని మంత్రి గుర్తు చేశారు. అదే విధంగా సెర్ప్ ద్వారా కడు పేదరికాన్ని గుర్తించి ఆర్థిక సహాయం అందించే కార్యక్రమాన్ని వచ్చే ఆర్థిక సంవత్సరంలో ప్రారంభించనున్నట్లు తెలిపారు. ఈ సమావేశంలో పంచాయతీరాజ్‌శాఖ కార్యదర్శి సంజయ్ కుమార్, డైరెక్టర్ దివ్య దేవరాజన్, మిషన్ భగీరథ ఈఎన్‌సి కృపాకర్‌రెడ్డి తదితర అధికారులు పాల్గొన్నారు.

# పంచాయతీల్లో బకాయి బిల్లుల చెల్లింపునకు ప్రాధాన్యత

### గ్రామీణాభివృద్ధి శాఖ మంత్రి సీతక్క కీలక నిర్ణయం

**హైదరాబాద్, మార్చి 5, ప్రభాతవార్త:** రాష్ట్రంలోని తాజా మాజీ సర్పంచ్‌లకు ఊరట కలిగించే నిర్ణయాన్ని రాష్ట్ర పంచాయతీరాజ్‌శాఖ మంత్రి సీతక్క తీసుకున్నారు. కేంద్ర ప్రభుత్వం విడుదల చేస్తున్న 15వ ఆర్థిక సంఘం పెండింగ్ నిధులనుండి గతంలో చేసిన పనుల తాలూకు బిల్లులను చెల్లించాలని పంచాయతీ నూతన పాలకవర్గాలకు సూచించారు. ఈ నేపథ్యంలో కొత్త, పాత సర్పంచ్‌ల మధ్య నెలకొన్న వివాదానికి మంత్రి సీతక్క తెరదించినట్లయింది. గ్రామ పంచాయ తీలకు 15వ ఆర్థిక సంఘం తాలూకు పెండింగ్ నిధులు దాదాపు రూ. 1,034 కోట్ల నిధులను ఇటీవల కేంద్ర ప్రభుత్వం విడుదల చేసింది. కాగా వీటిపై పాత, కొత్త సర్పంచుల మధ్య గందరగోళం నడుస్తోంది. గత ప్రభుత్వ హయాంలో గ్రామాల్లో డ్రైనేజీలు, వైకుంఠ ధామాలు, క్రీడా ప్రాంగణాలు వంటి పనులు చేపట్టిన పాత సర్పంచులు, అప్పట్లో బిల్లులు రాక అప్పులపాలయ్యామని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. దాదాపు రూ. 1,000 కోట్లకు పైగా పెండింగ్‌లో ఉన్న ఈ పాత బకాయిలను వెంటనే చెల్లించాలని, ఇప్పుడు వచ్చిన నిధులు తమ హక్కు అని భీష్మించుకుకూర్చున్నారు.

మరోవైపు అప్పుడే ఎన్నికల్లో గెలిచి ఉత్సాహంగా ఉన్న కొత్త సర్పంచులు తమ పదవీ కాలం ప్రారంభంలోనే నిధులన్నీ పాత బాకీలకే పోతే, ప్రజలకు ఇచ్చిన హామీలను ఎలా నెరవేర్చాలని ప్రశ్నిస్తున్నారు. ఊరి అభివృద్ధి కోసం కొత్త పనులు చేపట్టకుండా కేవలం పాత అప్పులు తీర్చడానికే తాము పదవుల్లో ఉన్నామా అంటూ వారు అసహనం వ్యక్తం చేస్తున్నారు. ఈ నేపథ్యంలోనే మంత్రి సీతక్క క్లారిటీ ఇచ్చారు. విడుదలవుతున్న పెండింగ్ నిధుల్లోంచి గతంలో చేపట్టిన మంచినీరు, పారిరిశుధ్య పనులకు సంబంధించిన బిల్లులు మాత్రమే క్లియర్ చేయాలని స్పష్టం చేసింది. అలాగే పంచియితీల్లో అందుబాటులో ఉన్న నిధుల్లో నుంచి మల్టీ పర్పస్ వర్కర్లకు వేతనాలు ఇవ్వాలని కూడా సూచించారు. అయితే కేంద్ర ప్రభుత్వం కొద్ది నిధులు మాత్రమే విడుదల చేయడం.. వాటిలో చాలా వరకు గత బకాయిలు చెల్లించడానికే వాడటం వల్ల, క్షేత్రస్థాయిలో ప్రస్తుతం చేపట్టాల్సిన పారిశుధ్యం, తాగునీరు, వీధి దీపాల వంటి అత్యవసర మౌళిక వసతుల నిర్వహణకు కూడా నిధులు లేకుండా పోతున్నాయని కొత్త సర్పంచులు వాపోతున్నారు.



# గాంధీభవన్‌కు వచ్చిన రాజ్యసభ అభ్యర్థులు

### అభిషేక్ మనుసింఘ్వి, వేం నరేందర్‌రెడ్డిలకు

### బి-ఫారం అందజేసిన పిసిసి అధ్యక్షుడు

### పిసిసి చీఫ్‌ను ఇంటి వద్ద మర్యాదపూర్వకంగా కలిసిన వేం నరేందర్‌రెడ్డి

**హైదరాబాద్, మార్చి5,ప్రభాతవార్త:** రాజ్యసభ అభ్యర్థులు డాక్టర్ అభిషేక్ మను సింగ్వి తెలంగాణ ప్రభుత్వ సలహాదారు వేం నరేందర్ రెడ్డి గురువారం గాంధీభవన్‌కు వచ్చి లాంఛనంగా సమావేశంలో పాల్గొన్నారు. టిపిసిసి అధ్యక్షులు, ఎమ్మెల్సీ మహేష్ కుమార్ గౌడ్ మర్యాదపూర్వకంగా కలిసేందుకు వారు గాంధీభవన్‌కు వచ్చారు. ఈ సందర్భంగా పార్టీ నాయకులు, కార్యకర్తలు వారికి స్వాగతం పలికారు. అనంతరం తెలంగాణ రాష్ట్రం నుంచి రాజ్యసభ సభ్యునిగా ఎంపికైన వేం నరేందర్ రెడ్డి. అభిషేక్ స్వింఘిలకు కాంగ్రెస్ పార్టీ తరపున అధికారిక అభ్యర్థిగా టిపిసిసి అధ్యక్షులు మహేష్ కుమార్ గౌడ్ బి ఫాం అందజేశారు. అంతకుముందు రాజ్యసభ అభ్యర్థిగా ఎఐసిసి అదిష్ఠానం ఎంపిక చేసిన ప్రభుత్వ సలహాదారు వేం నరేందర్‌రెడ్డి గురువారం టిపిసిసి అధ్యక్షులు మహేష్ కుమార్ గౌడ్‌ను ఇంటివద్ద మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా టిపిసిసిచీఫ్ మహేష్ కుమార్‌గౌడ్. వేంనరేందర్ రెడ్డి, నేతలు శాలువాతో సత్కరించి అభినందించారు. ఈ కార్యక్రమంలో ఎమ్మెల్యేలు రేవూరి ప్రకాష్ , విజయరమణ రావు,గండ్ర సత్యనారాయణ, చైర్మన్ చల్లా నర్సింహారెడ్డి,ఏఐసీసీ కార్యదర్శి సంపత్ కుమార్‌పాల్గొన్నారు.

## వేం నరేందర్‌రెడ్డికి రాజ్యసభ టికెట్ ఇవ్వడం హర్షణీయం : ఎంపి మల్లు రవి

**హైదరాబాద్, మార్చి 5, ప్రభాతవార్త:**తెలంగాణలో కేసిఆర్ నియంత పాలనను గద్దె దింపేందుకు అప్పటి టిపిసిసి అధ్యక్షులు, సిఎం రేవంత్ రెడ్డి తో అత్యంత కీలకంగా పని చేసిన సీనియర్ నాయకులు వేం నరేందర్ రెడ్డికి ఎఐసిసి రాజ్యసభ టికెట్ ఇవ్వడం పట్ల ఎంపి మల్లు రవి హర్షం వ్యక్తం చేశారు. రాష్ట్రంలో కాంగ్రెస్ ప్రజా ప్రభుత్వం ఏర్పాటు తో పాటు గత రెండేళ్లకు పైగా రాష్ట్రంలో ప్రజా రంజకమైన ప్రజా పాలనకు ముఖ్యమంత్రి కి సలహాదారుగా కీలకమైన బాధ్యతలు నిర్వహిస్తున్న వేం నరేందర్ రెడ్డి రాజ్యసభ కు సంపూర్ణంగా అర్హులు అని ఆయన అన్నారు. ఈ సందర్భంగా ఎఐసిసి అగ్రనేతలు సోనియాగాంధీ, మల్లికార్జున ఖర్గే, రాహుల్‌గాంధీ, కేసి వేణుగోపాల్, రాష్ట్ర ఇన్‌చార్జి మీనాక్షి , ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి, పిసిసి అధ్యక్షుడు మహేష్‌కుమార్‌గౌడ్ మల్లు రవి ధన్యవాదాలు తెలిపారు.

## పుదుచ్చేరి అసెంబ్లీ ఎన్నికల పరిశీలకుడిగా మంత్రి పొన్నం ప్రభాకర్

**హైదరాబాద్, మార్చి 5,ప్రభాతవార్త:** త్వరలో అసెంబ్లీ ఎన్నికలు జరుగ బోతున్న పుదుచ్చేరి రాష్ట్రానికి రాష్ట్ర రవాణశాఖ మంత్రి పొన్నం ప్రభాకర్‌ను పరిశీలకుడిగా నియమిస్తూ ఎఐసిసి ప్రధాన కార్యదర్శి కెసి వేణుగోపాల్ గురువారం ఉత్తర్వులు జారీచేశారు. ఎఐసిసి అధ్యక్షుడు మల్లి కార్జున ఖర్గే నిర్ణయం మేరకు పుదుచ్చేరికి ఇద్దరు పరిశీలకులను నియ మించారు. దినేష్ గుండూ రావు, పొన్నం ప్రభాకర్‌లు పరిశీలకులుగా ఉంటూ ఎన్నికల కార్యక్రమాన్ని ముందుకు తీసుకొనివెళ్తారు. పుదుచ్చేరిని పాండిచ్చేరి అని కూడా అంటారు. పుదిచ్చేరిలో ప్రస్తుతం ఆల్ ఇండియా ఎన్ఆర్ కాంగ్రేస్ పార్టీ బిజెపి అలయన్స్ అధికారంలో ఉంది. ఎఐఎన్ఆర్‌సి పార్టీకి చెందిన ఎన్ రంగ స్వామి ముఖ్యమంత్రిగా 2021 మే 7 నుంచి కొనసాగుతున్నారు. భారత దేశంలోని ఒక ప్రత్యేకమైన కేంద్రపాలిత ప్రాంతం ఇది ఫ్రెంచ్ సంస్కృతి నిర్మాణ శైలీ,బీచ్‌లకు ప్రసిద్ధి, యానం (ఆంధ్రప్రదేశ్) మహే(కేరళ) కారైకల్ (తమిళ నాడు) వంటి నాలుగు విడి ప్రాంతాలు ఉంటాయి. నాలుగు జిల్లాలు కలిగిన ఫ్రెంచివారి కాలనీ ఇది ప్రొమెనేడ్ బీచ్, పార్యడైస్ బీచ్ ఉన్నాయి.

# కోతుల సమస్యతో కొత్త సర్పంచ్‌లు ఉక్కిరిబిక్కిరి

### వానరాలను బంధించేందుకు అష్టకష్టాలు

### మళ్లీ ఎలాగోలా ఊరికి చేరుకుంటున్న వైనం

### అడవుల్లో వదిలితే పరిసర గ్రామాలపై పడి బీభత్సం

### దీంతో సర్పంచ్‌ల మధ్య వివాదాలు

**హైదరాబాద్, మార్చి 5, ప్రభాతవార్త:** పంచాయతీ ఎన్నికల సమయంలో ప్రధాన ఎజెండాగా మారిన కోతుల సమస్య ఇప్పుడు కొత్త సర్పంచులను ఉక్కిరిబిక్కిరి చేస్తోంది. గెలిపిస్తే కోతులను ఊళ్ళ నుండి తరిమేస్తామని హామీ ఇచ్చిన సర్పంచులు ఇప్పుడు కోతుల బెడద నుండి ఊళ్ళకు విముక్తి కల్పించడం కోసం పడరాని పాట్లు పడుతున్నారు. మంకీ క్యాచర్స్‌తో కోతులను పట్టించి సమీప అడవుల్లో వదిలేస్తున్నారు. ఆ కోతులు పొరుగు గ్రామాలపై పడడంతో కొత్త పంచాయతీ మొదలవుతుంది. వానరాలు ఊళ్లలో పంటలను చిన్నాభిన్నం చేస్తున్న కోతులు ఊళ్లలో జనానికి నిద్ర లేకుండా చేస్తున్నాయి. వానర సేనల మూకుమ్మడి దాడులతో ఊళ్లు ఉక్కిరిబిక్కిరి అవుతున్నాయి. జనం అంతా బేజారైపోతున్నారు. కోతులను తరిమెందుకు కొత్తగా ఎన్నికైన సర్పంచులు పడరాని పాట్లు పడుతున్నారు. వాటిని పట్టి అడవుల్లోకి సాగనంపుతున్నారు. గెలిపిస్తే కోతుల లేకుండా చేస్తామని గ్రామ పంచాయతీ ఎన్నికల సమయంలో ప్రజలకు హామీ ఇచ్చిన సర్పంచులు ఇప్పుడు కోతులను తరిమే పనిలో పడ్డారు. ఆయా గ్రామాల్లో పట్టిన కోతులను సమీప అడవుల్లో వదిలేస్తున్నారు. ఆ కోతులు పక్కనే ఉన్న ఊర్లపై పడడంతో అక్కడ కొత్త సమస్య మొదలవుతుంది. కోతుల మధ్య బీకర యుద్ధం కొనసాగుతుంటే వాటిని ఎలా సాగనంపాలో తెలియక సర్పంచులు, గ్రామస్తులు తలలు పట్టుకుంటున్నారు. తాజాగా హనుమకొండ లోని భీమదేవరపల్లి మేజర్ గ్రామ పంచాయతీలో కోతుల బెడద విపరీతంగా మారింది. మండలంలోని వివిధ గ్రామాల్లో పట్టిన కోతులను భీమదేవరపల్లి పక్కనే ఉన్న బూడిదగుట్టపై వదిలేస్తున్నారు. ఆ కోతులన్నీ ఇప్పుడు భీమదేవర పల్లి గ్రామాన్ని ఉక్కిరిబిక్కిరి చేస్తున్నాయి. మొత్తానికి కోతుల వల్ల పంట నష్టంతో గ్రామస్తులకు మానసిక ప్రశాంతత కరువైందని రాష్ట్ర వ్యాప్తంగా ఉన్న రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

# మహిళలు దేశాభివృద్ధిలో భాగస్వాములు

### తెలంగాణ ఉన్నత విద్యామండలి ఛైర్మన్ బాలకిష్టారెడ్డి

### సమాజ పురోగతిలో మహిళలది కీలక పాత్ర

### మహిళా వర్సిటీ వైస్‌చాన్సలర్ సూర్యధనుంజయ్

**హైదరాబాద్, మార్చి 5, ప్రభాతవార్త:** మహిళలు నాటికి నేటికి ప్రత్యక్షంగా, పరోక్షంగా కూడా దేశ అభివృద్ధిలో భాగస్వాములేనని తెలంగాణ ఉన్నత విద్యా మండలి ఛైర్మన్ ప్రొఫెసర్ వి బాలకిష్టారెడ్డి అన్నారు. వీరనారి చాకలి ఐల్లమ్మ మహిళా విశ్వవిద్యాలయంలో వికసిత భారత్‌లో మహిళల పాత్ర- అవకాశాలు, సవాళ్లు అనే అంశంపై రెండు రోజుల జాతీయ సదస్సు గురువారం ప్రారంభమైంది. సదస్సును విశ్వవిద్యాలయ మహిళా అధ్యయన కేంద్రం (విమెన్స్ స్టడీ సెంటర్) నిర్వహించగా ఇండియన్ కౌన్సిల్ ఆఫ్ సోషల్ సైన్స్ రీసెర్చ్(ఐసీఎస్ఎస్ఆర్ దక్షి ణ ప్రాంతీయ కేంద్రం), రాష్ట్రీయ ఉచ్చతర శిక్ష అభియాన్(రూసా) తెలంగాణ, తెలంగాణ రాష్ట్ర ఉన్నత విద్య మండలి(టిజిసీహెచ్‌ఈ) ఆధ్వర్యంలో నిర్వహించారు. సదస్సు ప్రారంభ కార్యక్రమానికి తెలంగాణ రాష్ట్ర ఉన్నత విద్యా మండలి ఛైర్మన్ ప్రొఫెసర్ వి. బాలకిష్ట రెడ్డి, హైదరాబాద్ విశ్వ విద్యాలయం ప్రొఫెసర్ అనురాధ జొన్నలగడ్డ, మహిళా వర్సిటీ వైస్ చాన్సలర్ ఆచార్య సూర్య ధనుంజయ్, ప్రిన్సిపల్ డాక్టర్ లోకపావని, సదస్సు కన్వీనర్, మహిళా అధ్యయన కేంద్రం డైరెక్టర్ డాక్టర్ కె. బి. రత్న కుమారి పాల్గొన్నారు. ప్రొఫెసర్ వి. బాలకిష్ట రెడ్డి మాట్లాడుతూ.. మహిళలు నాటికి నేటికి ప్రత్యక్షంగా, పరోక్షంగా దేశ అభివృద్ధిలో భాగస్వాములే అయినప్పటికీ, గతంలో వారి కృషికి తగిన గుర్తింపు లభించ లేదన్నారు. ప్రస్తుతం పరిస్థితులు మారి, ప్రతి రంగంలోనూ మహిళలు పురుషులతో సమానంగా పోటీపడుతున్నారని పేర్కొన్నారు. అలాగే చట్టం, రాజ్యాంగంపై అవగాహన లేకపోవడం మనం వెనుకబడిపోవడానికి ఒక కారణమన్నారు. రాజ్యాంగం, చట్టాలు మనకు ప్రాథమిక హక్కులు, కర్తవ్యాలను తెలియజేస్తాయన్నారు. వర్సిటీ వైస్ చాన్సలర్ ప్రొఫెసర్ సూర్య ధనుంజయ్ మాట్లాడుతూ.. మహిళలు సృష్టి కేంద్రంగా ఉండి సమాజ పురోగతిలో కీలక పాత్ర పోషిస్తారని తెలిపారు. సమాజ సమగ్ర అభివృద్ధికి మహిళల విద్య, సాధికారత ఎంతో అవసరమన్నారు. ప్రొఫెసర్ అనురాధ జొన్నలగడ్డ మాట్లాడుతూ.. వికసిత భారత్ లక్ష్యాన్ని సాధించాలంటే లింగ వివక్షతో కూడిన స్థూల అభిప్రాయాలను మహిళలు అధిగమించడం అత్యంత అవసరమన్నారు. మహిళలు తమ ఆసక్తి రంగాలను గుర్తించి, ఆ రంగాల్లో నైపుణ్యం సాధిస్తూ తమ అభిరుచిని కొనసాగిస్తే విజయాన్ని సాధించగలరని సూచించారు. ఈ జాతీయ సదస్సు రెండు రోజులపాటు జరగనున్న నేపథ్యంలో నేడు(శుక్రవారం) కూడా కొనసాగనుంది. నేటి సదస్సులో దేశ నిర్మాణంలో మహిళల పాత్రపై వివిధ అకాడమిక్ సమావేశాలు నిర్వహించబడనున్నాయి.

# 15 నుంచి డిఇఇ సెట్-2026 దరఖాస్తుల స్వీకరణ

### వివరాల బులెటిన్ జారీ

### ఏప్రిల్ 15 దరఖాస్తుల స్వీకరణకు తుదిగడువు

### మే 21, 22 తేదీల్లో పరీక్ష

**హైదరాబాద్, మార్చి 5, ప్రభాతవార్త:** డిప్లొమా ఇన్ ఎలిమెంటరీ ఎడ్యుకేషన్ కామన్ ఎంట్రన్స్ టెస్ట్ (టిజిడీఈఈ సెట్-2026)కి సంబంధించిన దరఖాస్తులను మార్చి 15 నుంచి స్వీకరించ నున్నారు. ఇందుకు సంబంధించిన నోటిఫికేషన్ బులెటిన్‌ను గురువారం జారీ చేసినట్టు డీఈఈ సెట్-2026 కన్వీనర్ జి రమేష్ ఒక ప్రకటనలో తెలిపారు. ఇందుకు సంబంధించిన షెడ్యూల్‌ను విడుదల చేశారు. 2026-27 విద్యా సంవత్సరం కోసం రాష్ట్రంలోని ప్రభుత్వ డైట్స్/ప్రైవేట్ అన్ ఎయిడెడ్ ఎలిమెంటరీ టీచర్ ఎడ్యుకేషన్ ఇన్‌స్టిట్యూషన్స్ (డీఈఎల్. ఈడీ) (మైనారిటీ, నాన్‌మైనారిటీతో సహా)లో రెండేళ్ల కోర్సులో ప్రవేశానికి కంప్యూటర్ ఆధారిత పరీక్ష (సీబీటీ) ఆన్‌లైన్ విధానంలో టిజి డీఈఈ సెట్-2026 ద్వారా డిప్లొమా ఇన్ ఎలిమెంటరీ ఎడ్యుకేషన్ (డీఈ ఎల్.ఈడీ), డిప్లొమా ఇన్ ప్రీస్కూల్ ఎడ్యుకేషన్(డీపీఎస్ఈ) కోసం దరఖాస్తులను ఆహ్వానిస్తూ బులెటిన్‌ను వెబ్‌సైట్ లో పొందుపరిచారు. డీఈఈ సెట్ పరీక్షను మే 21, 22 తేదిల్లో నిర్వహించనున్నారు. ఈ నెల 15 నుంచి దరఖాస్తులను స్వీకరించనున్నారు. దరఖా స్తులను ఏప్రిల్ 15 వరకు స్వీకరించ నున్నట్టు కన్వీనర్ తెలిపారు. ఎస్సీ, ఎస్టీ, దివ్యాం గ అభ్యర్థులకు రూ. 450 ఫీజు కాగా.. ఇతరులకు రూ. 500గా నిర్ణయించారు. ఫీజును ఆన్‌లైన్ చెల్లింపు గేట్‌వే ద్వారా మాత్రమే చెల్లించాలి. ఈ నెల 15 నుంచి ఏప్రిల్ 15 వరకు దరఖాస్తులను స్వీకరించనున్నారు. మే15 నుంచి 21 వరకు హాల్ టికెట్ల డౌన్‌లోడ్‌కి అవకాశం కల్పించారు. మే 21, 22 తేదిల్లో పరీక్షను నిర్వహించనున్నారు. మే 25న ప్రాథమిక కీని విడుదల చేయనున్నారు. మే 30న ఫలితాలను విడుదల చేయనున్నారు. జూన్ 1 నుంచి 5 వరకు సర్టిఫికెట్ వెరిఫికేషన్‌ను నిర్వహిసానతరు. జూన్ 6 నుంచి 8 వరకు వెబ్ ఆప్షన్లకు అవకాశం కల్పించారు. జూన్ 9 వరకు వెబ్‌ఆప్షన్లకు ఎడిట్ సౌకర్యాన్ని కల్పించారు. జూన్ 14న సీట్లను కేటా యించారు. జూన్ 14 నుంచి 17 వరకు విద్యార్థులు ట్యూషన్ ఫీజు చెల్లించ డానికి అవకాశమిచ్చారు. జూలై 1 నుంచి క్లాసులు ప్రారంబించనున్నారు.

## ఎండలు ముదరడంతో పెరుగుతున్న బీర్ల అమ్మకాలు

**హైదరాబాద్, మార్చి 5, ప్రభాతవార్త:** రాష్ట్రంలో పెరుగుతున్న ఎండలకు తోడు బీర్ల అమ్మకాలు కూడా అనూహ్యంగా పెరుగుతున్నాయి. సాధారణంగా ప్రతీ వేసవి కాలంలో మద్యం అమ్మకాల్లో బీర్లదే అగ్రస్థానం.ఎండ వేడి నుంచి ఉపశమనం పొందేందుకు మందుబాబులు చల్లగా ఉండే బీర్లను ఆశ్రయిస్తుంటారు. దీంతో బీర్ల అమ్మకాలు గణనీయంగా పెరుగుతున్నాయి. ఈ ఏడాది ఫిబ్రవరి నెలలో మొత్తం రూ.3,210 కోట్ల మద్యం అమ్మకాలు జరగగా.. ఫిబ్రవరి 28వ తేదీ ఒక్క రోజే 3 లక్షల 28 వేల కేసుల బీర్లు, 2 లక్షల 85 కేసుల లిక్కర్ (హార్డ్) అమ్మకాలు జరిగినట్లు అధికారులు తెలిపారు. ఇక పెరిగిన బీర్ల అమ్మకాలకు తగినట్లు ఉత్పత్తిని పెంచాలని బీర్ల తయారీ కంపెనీలను ఎక్సైజ్ శాఖ ఉన్నతాధికారులు ఆదేశాలు జారీ చేశారు. బీర్ కొరత రాకుండా చర్యలు తీసుకోవాలని, వేసవిలో బీర్‌ల ఫ్యాక్టరీలకు నీటి సరఫరా ఆగకుండా చర్యలు తీసుకోవాలని జలమండలి అధికారులకు ఆదేశాలు జారీ చేసినట్లు తెలిసింది.



## ప్రభుత్వ బడిలో పిల్లలను చేర్పించండి..

గరివిడి మార్చి,5 ప్రభాత వార్త

ప్రభుత్వ బడిలో పిల్లలకు చేర్పించి ప్రభుత్వ పాఠశాలలు బలోపేతానికి ప్రయత్నించాలని టీడీపీ జిల్లా ఉపాధ్యక్షుడు వెంపడాపు రమణ మూర్తి అన్నారు. అనుభవజ్ఞులైన ఉపాధ్యాయులకి నిలయాలగా నిలిచే ప్రభుత్వ బడిలో చిన్నారులకు చేర్పించాలని ఆయన చిన్నారుల తల్లిదండ్రులు కి అభ్యర్థించారు. ప్రైవేట్ విద్యార్థులను ప్రభుత్వ బడిలో చేర్పించే ప్రక్రియ లో భాగంగా కోనూరు ఉన్నత పాఠశాల ఉపాధ్యాయులు చేపట్టే ప్రత్యేక కార్యక్రమంలో పాల్గొన్న వెంపడాపు విద్యార్థుల తల్లిదండ్రులను చైతన్య చకితులను చేశారు. దుమ్మెద గ్రామంలో ప్రభుత్వ పాఠశాలలో చిన్నారులను చేర్పించాలని ఉపాధ్యాయులు, వెంపడాపు తదితరులు కోరారు.

## బాలికలు లైంగిక వేధింపుల నుండి రక్షణపై అవగాహన

గరివిడి మార్చి,5 ప్రభాత వార్త



బాలికలు లైంగిక వేధింపుల నుండి రక్షణ పై ఐ సి డి ఎస్ అధికారులు అవగాహన కల్పించారు. మండలం లోని తొండ్రంగి ఉన్నత పాఠశాల లో మిషన్ శక్తి అబ్జర్వేన్స్ 20 రోజుల కార్యక్రమంలో భాగంగా విద్యా,వైద్య శాఖలు, ఎన్ జి ఓలు సహకారం ,సమగ్ర బాలిక అభివృద్ధి సంస్థ ఆధ్వర్యంలో కిషోర్ బాలికలకు అవగాహన సదస్సు నిర్వహించారు. కార్యక్రమంలో ఐ సి డి ఎస్ సి డి పి ఓ ఎన్ ఆరుద్ర మాట్లాడుతూ లైంగిక వేధింపుల నుండి రక్షణ పొందేందుకు చిన్నారుల్లో తలిదండ్రులు ధైర్యాన్ని నింపాలన్నారు. అలాగే వారికి చైతన్య పరచాలని సూచించారు. బాలికలు భవిష్యత్తు లో తల్లులు గా ఎదుగుతారని ఈ నేపథ్యంలో చిన్నారులు ఇప్పటినుండే పౌష్టికాహారం తీసుకోవాలని కోరారు. రక్త హీనత లేకుండా చూడాలని అన్నారు. కార్యక్రమంలో ఐ సి డి ఎస్ సూపర్ వైజర్ లు మల్లాజ్యోషుల జ్యోతి, ఎస్. భారతి, తొండ్రంగి ఉన్నత పాఠశాల ఉపాధ్యాయులు, అంగన్వాడీ సిబ్బంది పాల్గొన్నారు.



## 8న మండల సర్వసభ్య సమావేశం

మెరకముడిదాం, మార్చి 5 ప్రభాత వార్త

మండల పరిషత్ సమావేశ భవనంలో ఈనెల 8తేదీ నా ఉదయము10-30 గంటలకు మండల సర్వసభ్య సమా వేశం జరగనున్నట్లు మండల అభివృద్ధి అధికారి జి భాస్కర రావు తెలిపారు. మండల అధ్యక్షురాలు తాడ్డి కృష్ణవేణి అధ్యక్షతన జరగనున్న ఈ సర్వసభ్య సమావేశానికి ఎంపీటీసీ సభ్యులు సర్పంచులు విధిగా హాజరు కావాలని, అధికారులు వారి శాఖలకు సంబంధించి పూర్తిస్థాయి సమాచారంతో హాజరు కావాల్సిందిగా ఎంపీడీవో కోరారు.

## అగ్నిమాపక నిర్లక్ష్యం.. రైతుల ఆస్తులు ధ్వంసం..

చీపురుపల్లి మార్చి 5, ప్రభాతవార్త



అగ్నిమాపక అధికారుల నిర్లక్ష్యం కారణంగా ఆరుగాలం పండించిన పంటతోపాటు ప్రస్తుతం సాగు చేస్తున్న జొన్న పంట సైతం అగ్నికి ఆహుతి కావలసిన దుస్థితి ఏర్పడిందంటూ పలువురు రైతుల ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. చీపురుపల్లి పట్టణ పరిధిలోని స్థానిక రామాంజనేయ రైస్ మిల్ వెనుక భాగంలో కొంతమంది రైతులు పంటలను సాగు చేసుకోవడంతో పాటు పాడి పరిశ్రమ కొరకు అవసరమైన గడ్డి నిలవలను ఏర్పాటు చేశారు. గురువారం నాడు మధ్యాహ్నం ఒంటి గంటన్నర సమయానికి ప్రమాదం జరిగిన వెంటనే అగ్నిమాపక అధికారులకు ఫోన్ చేసినప్పటికీ కనీసం స్పందించలేదని సంబంధిత రైతులు వాపోయారు. అగ్నిమాపక అధికారులు పట్టించుకోకపోవడం వలన ఏడాది మొత్తం తాను సంపాదించుకున్న సంపద కాలీ బూడిద పాలయింది అంటూ సమీప రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.. అగ్నిమాపక అధికారుల నిర్లక్ష్యం కారణంగా తన జీవనోపాధి పోయిందంటూ సంబంధిత రైతు వాపోతున్నారు. ప్రమాదం సంభవించిన వెంటనే స్థానిక అగ్నిమాపక అధికారులకు ఫోన్ చేసినప్పటికీ స్థానిక అగ్నిమాపక అధికారి అధికారిక కార్యక్రమంలో వేరే ప్రాంతంలో ఉండడం వలన రాజాం అగ్నిమాపక అధికారులకు సమాచారం అందజేశారు. ఈ సమాచారాన్ని అందుకున్న రాజాం అగ్నిమాపక అధికారులు ఆరాతీస్తూ నిర్లక్ష్యం చేయడం వలన అప్పటికే జరగవలసిన నష్టం జరిగిపోయింది అంటూ రైతులు వాపోతున్నారు. సంబంధిత రాజాం అగ్నిమాపక అధికారులు సంఘటన స్థలానికి చేరుకొని మంటలను అదుపు చేసే ప్రయత్నం చేశారు. మంటలు ప్రారంభమైన మూడు గంటల పాటు కూడా అగ్నిమాపక అధికారులు సంఘటనా స్థలానికి చేరుకోవడం పట్ల నిర్లక్ష్యం ప్రదర్శించారంటూ పలువురు ఆరోపిస్తున్నారు. కాలినవి గడ్డివాములే అయినప్పటికీ పక్కనే గల జొన్న పంట సైతం మంటలకు గురై నష్టపోవలసిన దుస్థితి ఏర్పడింది అంటూ పలువురు రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. అగ్నిమాపక అధికారుల నిర్లక్ష్యం పట్ల స్థాయి అధికారులు చర్యలు చేపట్టాలని పలురు కోరుతున్నారు.

## పలు అంశాలపై వెలుగు వి.ఓ కమిటీలకు శిక్షణ



నెల్లిమర్ల,మార్చి 5, ప్రభాతవార్త

స్థానిక వెలుగు కార్యాలయంలో ఏ.పి ఎం ఎ.సురేష్ కుమార్ ఆధ్వర్యంలో గ్రామ సంఘం ఎస్ ఎ సి కమిటీ ప్రతినిధులకు ఆహారం, పోషణ, ఆరోగ్యం, నీరు, పారిశుధ్యం కార్యక్రమాల ప్రమాణాలను మెరుగుపర చడం తదితర అంశాలపై గురువారం శిక్షణ కార్యక్రమం జరిగింది. హక్కులను వినియోగించడం, పేదకుటుంబాలలో తగిన పోషణ, ఆరోగ్యం, పారిశుధ్యం మెరుగుపరచడం, మానవాభివృద్ధి సేవలు, ప్రతి ఇంటిలో వివిధరకాల ఆహార పదార్థాల వియోగం, అంగన్వాడీ, ఆరోగ్య ఆశా కార్యకర్తలు అందించే సేవలు మెరుగుపరిచే విషయంపై ఏపీఎం సురేష్ అవగాహన కల్పించారు. అలవాట్లలో సరియైన పద్ధతులు, పిల్లలు పెరుగుదల సరిగా ఉన్నది లేనిదీ ఎప్పటికప్పుడు తెలుసుకోవాలని సూచించారు. పోషకాహారం లోపానికి గురి అయిన వారి జాబితా తెలుసుకుని సంఘాల మీటింగులో చర్చించడం ద్వారా తల్లుల తగినంత శ్రద్ధ వహించ్చునట్లుగా వివో సంఘాల ప్రతినిధులు చర్యలు చేపట్టాలని అన్నారు. గ్రామ సంఘం సభ్యులలో అర్హులైన వారందరు అంగన్వాడీ లో ఇచ్చే ఆహారాన్ని అందుకునేలా చూడాలని. అంగన్ వాడీ అందించే పోషణ ఆరోగ్య విద్యలో చెప్పిన విధంగా విషయాలు పాటింప చేయాలని అన్నారు. పోషకాహర లోపానికి, రక్తహీనతకు గురికాకుండా చూడాలని తెలిపారు. కార్యక్రమంలో మండల సమాఖ్య ప్రతినిధి రేవల్ల అప్పయ్యమ్మ, సిసి లు అప్పలనాయుడు, శ్రీను, సూరీడమ్మ , విజయలక్ష్మి గ్రామ సంఘం సబ్ కమిటీ మెంబర్లు, వి. ఓ. ఏ లు పాల్గొన్నారు.

## మొయిదలో ఘనంగా సీతారామ ఆలయ ప్రతిష్ట మహోత్సవాలు

నెల్లిమర్ల, మార్చి 5, ప్రభాతవార్త



మండలంలోని మొయిద గ్రామంలో శ్రీ సీతారామ లక్ష్మణ సమేత రామాలయం ప్రారంభోత్సవ, విగ్రహ ప్రతిష్ట కార్యక్రమం గురువారం ఘనంగా జరిగింది. ఈ కార్యక్రమానికి విజయనగరం జిల్లా పరిషత్ చైర్మన్, వైఎస్ఆర్సిపి జిల్లా అధ్యక్షులు మజ్జి శ్రీనివాసరావు (చిన్న శ్రీను) హాజరయి సీతారాములను దర్శించుకుని ప్రత్యేక పూజ కార్యక్రమాలు నిర్వహించారు. వేద పండితులు ప్రత్యేక పూజలు నిర్వహించి చిన్న శ్రీను కు ఆశీర్వాదం అందించారు. ఈ సందర్భంగా చిన్న శ్రీను మాట్లాడుతూ గ్రామ ప్రజలు ఎల్లప్పుడూ సుఖసంతోషాలతో, ఐశ్వర్యంతో ఉండాలని ఆకాంక్షించారు.అలాగే ఈ కార్యక్రమంలో మాజీ ఎంపీ బెల్లాన చంద్రశేఖర్ , నెల్లిమర్ల మాజీ శాసనసభ్యులు బడుకొండ అప్పలనాయుడు పాల్గొని ఆలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. వారికి గ్రామ ప్రజల తరఫున ఆలయ కమిటీ ప్రతినిధులు ఘన సత్కారం చేశారు.ఈ కార్యక్రమంలో వైఎస్ఆర్సిపి సీనియర్ నాయకులు కె.వి.వి. సూర్యనారాయణ రాజు, జడ్పిటిసి గదల సన్యాసినాయుడు, నెల్లిమర్ల ఎంపీపీ అంబళ్ల సుధారాణి, శ్రీరాములనాయుడు దంపతులు, వైస్ ఎంపీపీలు సారిక వైకుంఠం, పతివాడ సత్యనారాయణ, మొయిద గ్రామ పెద్దలు అట్టాడ కృష్ణ, యడ్ల ధర్మ, వైఎస్ఆర్సిపి కార్మిక విభాగం రాష్ట్ర అధికార ప్రతినిధి లక్ష్మణరావు, భక్తులు గ్రామస్తులు తదితరులు పాల్గొన్నారు.

## పూర్తయిన వంతెన నిర్మాణ పనులు

### తీరనున్న మూడు జిల్లాల ప్రజల ఇబ్బందులు

వేపాడ, మార్చి 5, ప్రభాతవార్త



విజయనగరం, విశాఖపట్నం, అనకాపల్లి జిల్లాల ప్రజల రాకపోకలకు తీవ్ర అంతరాయం కలిగించిన కృష్ణారాయుడుపేట వంతెన నిర్మాణ పనులు పూర్తి కావడంతో అతి త్వరలో ప్రారంభించడానికి ఏర్పాట్లు జరుగుతున్నాయి. ఆ మేరకు విశాఖ జీవీఎంసీ ఇంజనీరింగ్ అధికారులు గురువారం వంతెనను పరిశీలించారు. ప్రజా ప్రతినిధులతో చర్చించి పది రోజుల్లో వంతెన ప్రారంభించడానికి ఏర్పాట్లు జరుగుతున్నాయని సూపర్వైజర్ పోలినాయుడు తెలిపారు. వేపాడ మండలంలోని కృష్ణారాయుడు పేట గ్రామం వద్ద రైవాడ ఓపెన్ కాలువపై వంతెన శిథిలావస్థకు చేరుకోవడంతో ఎనిమిది నెలల క్రితం నుండి ఆర్టీసీ బస్సులు రాకపోకలు నిలిపివేయడం, ప్రజా ప్రతినిధుల కృషి ఫలితంగా వంతెన నిర్మాణానికి కాస్త ఆలస్యమైనా 91 లక్షల రూపాయలు నిధులు మంజూరు కావడం, ఆ మేరకు నవంబరు 25వ తేదీన విశాఖ మేయర్ శంకుస్థాపన జరిపిన విషయం పాఠకులకు తెలిసిందే. అప్పట్లో కాంట్రాక్టర్ నెల రోజుల్లో పని పూర్తి చేసి అప్పగిస్తారని ప్రజాప్రతినిధులు ప్రకటించినప్పటికీ మూడు నెలలు గడిచిపోవడంతో ఈ ప్రాంతీయులు అసంతృప్తిని వ్యక్తం చేస్తున్నారు. ఆర్టీసీ బస్సులు రాకపోకలు నిలిచిపోవడంతో మూడు జిల్లాల ప్రజలు రాకపోకలు సాగించడానికి అనేక అవస్థలు పడుతున్నారు. ఇప్పటికైనా సంబంధిత అధికారులు, ప్రజాప్రతినిధులు స్పందించి వీలైన త్వరలో వంతెనను ప్రారంభించి ఆర్టీసీ బస్సు రాకపోకలు యధావిధిగా జరిగేలా చూడాలని మూడు జిల్లాల ప్రజలు కోరుతున్నారు.



## రాజ్యాంగ బద్ధం పదవికి మతం రంగు.. దేనికి..

### జిల్లా వైయస్సార్ కాంగ్రెస్ పార్టీ పబ్లిసిటీ వింగ్ అధ్యక్షులు వలి రెడ్డి

చీపురుపల్లి మార్చి 5 ప్రభాతవార్త

రాజ్యాంగబద్ధముగా లభించే పదవులకు సైతం మతం రంగు పోయడం హిందువుల మనోభావాలను దెబ్బతీస్తుం దని జిల్లా వైఎస్ఆర్ కాంగ్రెస్ పార్టీ ప్రచార వింగ్ అధ్యక్షులు వలి రెడ్డి శ్రీనివాస్ నాయుడు అన్నారు. గురువారం నాడు ఆయన విలేకరులతో మాట్లాడుతూ కూటమి ప్రభుత్వంలో మంత్రి చేసిన హేయ మైన చర్యను తెలియ జేస్తుంది అని దీన్ని ప్రజాస్వామ్య వాదులు అందరూ ముక్త కంఠంతో ఖండించాలని ఆయన కోరారు.శాసనమండలిలో శాసనమండలి చైర్మన్ కొయ్యే మోషేష్ అలాగే సభలో లేని మాజీ ముఖ్యమంత్రి వై యస్ జగన్మోహన్ రెడ్డి శ్రీని మతం రంగు పులుముతూ ప్రజల మనోభావాలను కించపరిచే విదంగా వారు ఇద్దరూ క్రిస్టియన్స్ అని మంత్రి కింజరాపు అచ్చం నాయుడు ప్రవరించిన తీరు ఖండిస్తున్నామన్నారు. రాష్ట్రంలో తెలుగుదేశం ప్రభుత్వం రెడ్ బుక్ రాజ్యాంగం, ఆగడాలకు ఇది పరాకాష్ట అని అన్నారు, శాసనమండలిలో ప్రజాసమస్యలు మీద రాష్ట్ర అభివృద్ధి మీద చర్చించవలిసిన కూటమి నాయకులు మంత్రులు, ఎమ్మెల్యే లు కు అధికారం ఇచ్చింది మత విద్వేషాలు రెచ్చగొట్టాడానికా అని వలిరెడ్డి ఆగ్రహం వ్యక్తం చేసారు, మంత్రి అచ్చం నాయుడు అసలు మంత్రి పదవికి అనర్హుడు అని అతని చేత మంత్రి పదవికి చంద్రబాబు కు చిత్తశుద్ధి ఉంటే రాజీనామా చేయించాలని డిమాండ్ చేశారు. కోట్ల మంది హిందువులు పవిత్రంగా భావించే తిరుమల తిరుపతి లడ్డునే తమ అవకాశవాధ రాజకీయాలకు వాడుకోవాలనుకునే కూటమి నాయకులుకు ఆ ఏడుకొండలవాడే తగిన బుద్ధి చెప్తాడు అని అన్నారు. ఇన్నేళ్ల తిరుమల చరిత్రలో ఎప్పుడు లేని విదంగా తిరుమల ప్రతిష్ట ను తెలుగుదేశం ప్రభుత్వం కూటమి నాయకులు భ్రష్టు పట్టించారు అని టీటీడీ చైర్మన్ బి.ఆర్ నాయుడు ఈ వయసులో అతను చేస్తున్న తప్పుడు కార్యక్రమాలు, అతని వ్యవహార శైలి తిరుమల ప్రతిష్టను ఎప్పుడు లేని విదంగా దేశవిదేశాల్లో తిరుమల ప్రతిష్టను మంటగలిపిందిఅనిఅన్నారు. తాను క్రిస్టియన్ కాదు హిందువునే అని చెప్పుకోవాల్సిన దౌర్భాగ్య మైన దుస్థితి మండలి చైర్మన్ కి కూటమి నాయకులు అచ్చం నాయుడు కల్పించారు,అని రాజ్యాంగ వ్యవస్థ లో ఇది చీకటిరోజు గా చూడాలని వలిరెడ్డి శ్రీనివాసనాయుడు అన్నారు.తెలుగుదేశం పార్టీ లో కూటమి పార్టీ లో నాయకులుగా వున్న క్రిస్టియన్ సోదరులు అందరూ పార్టీ లకు అతీతంగా ఖండించాలని కోరారు,. మాజీ ముఖ్యమంత్రి జగన్మోహన్ రెడ్డి వెనకబడిన కులాలకు చెందిన మోషేన్ని ఉన్నతమైన శాసన మండలి చైర్మన్ గా నియమిస్తే కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చినప్పటినుంచి ప్రోటోకాల్ పాటించకుండా శాసనమండ లిలో కొత్తగాబ్లాక్ ప్రారంభిస్తే శిలాఫలకం మీద శాసన మండలి చైర్మన్ పేరు వెయ్యకుండా ఎదో ఒక విదంగా అతన్ని అవమానిస్తూ వస్తున్నారు అని అన్నారు. చంద్రబాబు నాయుడు, కూటమి నాయకులు ఇకనైనా మతతత్వ రాజకీయాలు,మత విద్వేషాలు రెచ్చగొట్టే కుటిల కుతంత్ర రాజకీయాలు మానుకోకపోతే రాబోయే రోజుల్లో ప్రజలు మీకు తగిన బుద్ధి చెప్పడానికి సిద్ధంగా వున్నారు అని వలిరెడ్డి శ్రీనివాసనాయుడు హెచ్చరించారు.

## గరివిడి పోలీసులు నేతృత్వంలో రక్త దానం శిబిరం

గరివిడి మార్చి,5 ప్రభాత వార్త



మహిళా దినోత్సవ వారోత్సవాలు పురస్కరించుకుని స్థానిక పోలీస్ స్టేషన్‌లో గరివిడి పోలీసులు ఆధ్వర్యంలో ఉచిత రక్తదాన శిబిరం నిర్వహించారు. శిబిరాన్ని చీపురు పల్లి సి ఐ శంకర రావు ప్రారంభించగా, 20 మంది రక్త దాతలు రక్తదానం చేశారు.చీపురుపల్లి ప్రభుత్వ ఆసుపత్రి వైద్యులు దాతల నుండి రక్తాన్ని స్వీకరించారు. కార్యక్రమంలో గరివిడి ఎస్ఐ బి.లోకేశ్వర రావు, మానవీయత స్వచ్ఛంద సేవా సంస్థ వ్యవస్థాపక అధ్యక్షుడు బివి గోవింద రాజులు తదితరులు పాల్గొన్నారు. కాగా గరివిడి పశువైద్య కళాశాల బాలికల భద్రత రక్షణకు సంబంధించిన వీడియోలు ప్రదర్శన ద్వారా విద్యార్థినులకు గరివిడి పోలీసులు చైతన్య పరిచారు. విద్యార్థినులు అన్నింటా ముందు ఉండాలని ఎస్ఐ లోకేశ్వర రావు పేర్కొన్నారు. పశువైద్య కళాశాల అసోసియేట్ డీన్ డాక్టర్ మక్కేన శ్రీను కార్యక్రమంలో పాల్గొన్నారు.

## రామభద్రపురంలో నాఖాబందీ వాహనాలు తనిఖీ చేస్తున్న ఎస్ఐ వెలమల ప్రసాదరావు



రామభద్రపురం, మార్చి,5 ప్రభాత వార్త

రామభద్రపురం మండల కేంద్రంలోని జాతీయ రహదారిపై గురువారం సాయంత్రం ఎస్ఐ వెలమల ప్రసాద్ ఆధ్వర్యంలో పోలీసులు నాఖాబందీ నిర్వహించారు. మూడున్నర నుంచి ఆరున్నర గంటల వరకు ఈ నాఖాబందీలో మమ్మరంగా వాహనాలు తనిఖీ చేశారు. ఈ వాహనాల్లో ఎటువంటి మత్తు పదార్థాలు, నిషేధిత వస్తువులు ఉన్నాయో అని క్షుణ్ణంగా తనిఖీలు నిర్వహించారు. అలాగే హెల్మెట్లు లేని ద్విచక్రవాహనదారులకు హెల్మెట్ల ఆవశ్యకతను తెలియజేశారు. ప్రతీ ఒక్కరూ తప్పనిసరిగా హెల్మెట్ ధరించాలన్నారు. ఆటో డ్రైవర్లు కూర్చున్న ముందుసీటులో ప్రయాణీకులను ఎక్కిస్తే ప్రమాదాలు జరుగుతాయని, పరిమితికి మించి ఆటోల్లో ప్రయాణీకులను ఎక్కించవద్దని సూచించారు. అలాగే ఎట్టి పరిస్థిత ఎల్లో మద్యం సేవించి వాహనాలు నడుపరాదని తెలిపారు. ఈ కార్యక్రమంలో ఏఎస్ఐ ఆర్. అప్పారావు, కానిస్టేబుళ్ల పెంకి నాగార్జునరావు, సురేంద్ర, బాలి విశ్వేశ్వరరావు, విశాల, తదితరులు పాల్గొన్నారు.

## నేడు పోలమాంబ హుండీల లెక్కింపు

మక్కువ మార్చి 5 ప్రభాతవార్త



మక్కువ మండలం శంబర గ్రామములో ఉన్న ఉత్తరాంధ్ర గిరిజన ఆరాధ్య దేవత రాష్ట్ర ప్రభుత్వంచే రాష్ట్ర పండుగగా గుర్తింపు పొందిన పోలమాంబ అమ్మవారి జాతర మహోత్సవములు 3,4,5,6వ మంగళవారంలు యొక్క ఆలయ హుండీలను శుక్రవారం ఉదయం 9 గంటలకు దేవదాయ శాఖ ఉన్నతాధికారులు, ఆలయ ధర్మ కర్తల మండలి చైర్మన్ మరియు సభ్యులు, రెవెన్యూ మరియు పోలీసు అధికారులు, ఆలయ కార్య నిర్వహణ అధికారి, గ్రామ పెద్దలు, మాజీ చైర్మన్లు, సేవకులు భక్తులు సమక్షంలో ఆలయ హుండీలను తెరిచి లెక్కించుటకు నిర్ణయించమని ఆలయ కార్యనిర్వాహక అధికారి బి శ్రీనివాసరావు తెలిపారు.కావున ఆశక్తి గల భక్తులు హుండీలు లెక్కింపు కార్యక్రమంలో పాల్గొంటారని కోరుచున్నాను.

## కొత్త ఎమ్మార్వోగా ఎం సురేష్ భాధ్యతలు స్వీకరణ

### పుష్పగుచ్ఛాలు అందజేసి శుభాకాంక్షలు చెప్పిన సిబ్బంది



సాలూరు ఫిబ్రవరి 5 ప్రభాతవార్త

సాలూరు పట్టణ నూతన తాసిల్దార్ గా మామిడిపల్లి. సురేష్ బాధ్యతలు స్వీకరించారు.ఈ సందర్భంగా గురువారం ఎమ్మార్వో ఆఫీస్ సిబ్బంది ఆయనకు బొకేలు అందించి శుభాకాంక్షలు తెలియజేశారు. ఇంతకుముందు ఇక్కడ తాసిల్దార్ గా పనిచేసిన నీలకంఠరావు పాడేరు డిప్యూటీ కలెక్టర్ గా ప్రమోషన్ రావడంతో వెళ్లిపోయారు.అలాగే పార్వతీపురం మన్యం జిల్లా ఎమ్మార్వో గా ఉన్న సురేష్ ను సాలూరు తాసిల్దార్ (ఎఫ్ఏసి)గా ప్రభుత్వం నియమించింది.ఇక్కడ ప్రజల సమస్యలపై ప్రత్యేక దృష్టి సారించి పరిష్కరిస్తానని కొత్త ఎమ్మార్వో సురేష్ స్థానిక విలేకరులకు క్లారిటీ ఇచ్చారు. టౌన్ సర్వేయర్ రామ్మోహన్ తదితరులు పాల్గొన్నారు.

## ఆర్టీసీ అద్దె బస్సు డ్రైవర్ల ధర్నాకు మాజీ డి.సీఎం సంఘీభావం

సాలూరు ఫిబ్రవరి 5 ప్రభాతవార్త




సాలూరు పట్టణ ఆర్టీసీ కాంప్లెక్స్ ఎదురుగా పెరగుతున్న నిత్యవసర ధరలు దృష్టిలో పెట్టుకొని రాష్ట్ర ప్రభుత్వం తమ వేతనాలను పెంచాలని డిమాండ్ చేస్తూ ఆర్టీసీ అద్దె బస్సులు డ్రైవర్లు ధర్నా చేపట్టారు.ఈ మేరకు గురువారం అక్కడికి వెళ్లిన మాజీ డిప్యూటీ సీఎం పీడిక రాజన్నదొర వారికి సంఘీభావం తెలియజేశారు. అనంతరం అద్దె బస్సుడ్రైవర్లు వారి సమస్యలను విన్నవిం చుకుంటు రాజన్నదొరకు వినతిపత్రాన్ని అందజేశారు.అలాగే అద్దె బస్సులపై రోజుకు ఎక్కువ సేపు విధులు నిర్వర్తిస్తున్నా తగిన వేతనం అందడం లేదని డ్రైవర్లు ఆవేదన వ్యక్తం చేశారు.వేతనాలు పెంచి జీవనోపాధికి భరోసా కల్పించాలని రాష్ట్ర ప్రభుత్వానికి డిమాండ్ చేశారు.వైసీపీ టౌన్ ప్రెసిడెంట్ అప్పలనాయుడు,గిరి రఘు,ఎన్.వై నాయుడు పాల్గొన్నారు.

## యుద్ధప్రాతిపదికన డోలీ రోడ్లు పూర్తి చేయాలి

### రోడ్ల నిర్మాణంలో నిర్లిప్తత పనికిరాదు -అధికారులను ఆదేశించిన జిల్లా కలెక్టర్ డా. ఎన్.ప్రభాకర రెడ్డి

పార్వతీపురం, మార్చి 5 ప్రభాతవార్త



జిల్లాలో పంచాయతీ రాజ్, గిరిజన సంక్షేమ శాఖల ద్వారా చేపడుతున్న డోలీ రోడ్లన్నీ యుద్ధప్రాతిపదికన పూర్తి చేయాలని జిల్లా కలెక్టర్ డా. ఎన్.ప్రభాకర రెడ్డి ఇంజినీరింగ్ అధికారులను ఆదేశించారు. పనుల్లో నిర్లిప్తత పనికిరాదని, అలాగే నిర్మాణంలో ఎటువంటి పొరపాట్లకు తావులేకుండా నాణ్యత, పారదర్శకతతో పూర్తి చేయాలని కలెక్టర్ స్పష్టం చేశారు. డోలి రహిత రోడ్ల నిర్మాణ పనులపై సబ్ కలెక్టర్లు, డ్వామా పీడీ, ఎంపీడీఓలు, ఈఈలు, ఏఈలతో జిల్లా కలెక్టర్ గురువారం వీడియో కాన్ఫరెన్స్ ద్వారా జిల్లా జాయింట్ కలెక్టర్ సి.యశ్వంత్ కుమార్ రెడ్డితో కలిసి సమీక్షించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ పార్వతీపురం, మక్కువ, కొమరాడ మండలాల్లో ఇప్పటివరకు పూర్తిచేసిన డోలీ రోడ్లకు సంబంధించిన బిల్లులను తక్షణమే ఆన్ లైన్ నందు నమోదు చేయాలని ఆదేశించారు. ప్రగతిలో ఉన్న రోడ్లకు సంబంధించి ఈ నెల 10వ తేదీలోగా అప్పటి వరకు పూర్తిచేసిన పనులకు బిల్లులను సమర్పించాలని తేల్చిచెప్పారు. మిగిలిన మండలాల్లో వివిధ దశల్లో జరుగుతున్న పనులపై ఆరా తీసిన ఆయన, ప్రతి రోజూ పురోగతి ఉండాలని తెలిపారు. బిల్లులను సమర్పించేందుకు ఇంకా 10 రోజులు గడువు ఉన్నందున, దాన్ని దృష్టిలో ఉంచుకొని యుద్ధప్రాతిపదికన పనులు పూర్తిచేసేలా రోజు వారీ కార్యాచరణను సిద్ధం చేసుకోవాలని సూచించారు. అవసరమైతే ఉదయం, రాత్రి సమయంలో కూడా పనులు జరిగేలా చర్యలు చేపట్టాలని హితవు పలికారు. మంజూరు చేసిన, ప్రగతిలో ఉన్న పనుల్లో నిర్లక్ష్యధోరణి కనబరచకుండా, సకాలంలో పూర్తిచేయాలని కలెక్టర్ ఆదేశించారు. ఆయా మండలాల్లో జరుగుతున్న పనులకు సంబంధించిన బిల్లులను, పనులు పూర్తయ్యేవరకు వేచి

# విజయనగరం పార్వతీపురం మన్యం వార్త

25 Glorious years

## విలేజ్ రెవిన్యూ క్లినిక్‌లను సద్వినియోగం చేసుకోండి



కొమరాడ, మార్చి 5 ప్రభాతవార్త

ప్రజలు తమ రెవిన్యూ సమస్యల పరిష్కారం కోసం జిల్లా మరియు మండల కేంద్రాల చుట్టూ తిరిగే అవసరం లేకుండా, వారి గ్రామంలోనే పరిష్కారం చూపేందుకే 'విలేజ్ రెవిన్యూ క్లినిక్' కార్యక్రమాన్ని చేపట్టినట్లు జిల్లా కలెక్టర్ డా. ఎన్.ప్రభాకర రెడ్డి వెల్లడించారు. గురువారం కొమరాడ మండలం విక్రమపురం సచివాలయంలో నిర్వహించిన గ్రామ రెవిన్యూ క్లినిక్ కార్యక్రమంలో జిల్లా కలెక్టర్, సబ్ కలెక్టర్ ఆర్.వైశాలితో కలిసి పాల్గొన్నారు. కలెక్టర్ అర్జీదారుల నుండి వినతులను స్వీకరించి, అక్కడికక్కడే అధికారులతో సమీక్షించారు. అర్జీదారుల సమస్యలపై తక్షణమే చర్యలు చేపట్టాలని ఆదేశించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ...భూ సమస్యలు, సర్వే, పట్టాదారు పాస్ పుస్తకాలు వంటి రెవిన్యూ సంబంధిత సమస్యలను వేగంగా పరిష్కరించడమే ఈ క్లినిక్ ప్రధాన ఉద్దేశ్యమన్నారు. ఈ అవకాశాన్ని రైతులు సద్వినియోగం చేసుకోవాలని కోరారు. మారుమూల గ్రామాల ప్రజలు తమ సమస్యల కోసం వ్యయప్రయాసలకోర్చి కార్యాలయాల చుట్టూ తిరగాల్సిన అవసరం ఉండరాదని చెప్పారు. సచివాలయ స్థాయి లోనే ఆధికారులు అందుబాటులో ఉండటం వల్ల పనుల్లో జాప్యం తగ్గుతుందని పేర్కొన్నారు.

## జేఎల్ఎం సస్పెన్షన్‌కు ఆదేశాలు

విక్రాంపురం గ్రామ సచివాలయం జేఎల్ఎంను సస్పెండ్ చేయాలంటూ ఎంపీడీవోకు కలెక్టర్ ఆదేశించారు గ్రామ సచివాలయంలో సిబ్బంది అంత అందుబాటులో ఉండవలసి ఉన్నప్పటికీ జూనియర్ లైన్మెన్ కలెక్టర్ తనిఖీ చేసే సమయానికి గైర్హాజరు కావడంతో పాటు వీధుల ను నిర్లక్ష్యంగా చేపడుతున్నట్లు కలెక్టర్ అందిన ఫిర్యాదులు మేరకు జేఎల్ఎం ను సస్పెండ్ చేయవలసిందిగా ఆదేశించారు. అనంతరం జడ్పీ ఉన్నత పాఠశాలను కలెక్టర్ ఆకస్మికంగా సందర్శించారు ఈ సందర్భంగా ఆయన విద్యార్థుల విద్యా ప్రమాణాలను అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పదవ తరగతిలో శత శాతం ఉత్తీర్ణత సాధించి మంచి పేరు తీసుకురావాలన్నారు. ఈ కార్యక్రమంలో సబ్ కలెక్టర్ ఆర్.వైశాలి, తాసిల్దార్ సత్యనారాయణ, స్థానిక రెవిన్యూ అధికారులు, సచివాలయ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

## బాలికలు వ్యక్తిగత పరిశుభ్రతను పాటించి ఆరోగ్యం కాపాడుకోవాలి

రామభద్రపురం, మార్చి 5 ప్రభాతవార్త



రామభద్రపురం మండలం పాఠశాలలో చదువుతున్న విద్యార్థినిలు వ్యక్తిగత పరిశుభ్రతను పాటించి ఆరోగ్యాన్ని మెరుగుపరచుకోవాలని ఐసీడీఎస్ సూపర్వైజర్ పోలాకి కృష్ణకుమారి తెలిపారు. మండల పరిధిలోని బూసాయ వలస కేజీబీవి విద్యార్థులను ఉద్దేశించి ఆమె మాట్లాడారు. శక్తి కార్యక్రమంలో భాగంగా విద్యార్థులకు సూచనలు, సలహాలు అందించారు. ముఖ్యంగా 18 సంవత్సరాలలోపు వారు వివాహాలు చేసుకోవద్దని, దీనివల్ల ఆరోగ్యం పాడై ఎన్నో ఇబ్బందులు ఎదుర్కొంటారని తెలిపారు. అలాగే భోజనం చేసే ముందు చేతులు శుభ్రం చేసుకోవాలని సూచించారు. ప్రతీ విద్యార్థిని ఆరోగ్యంపై దృష్టి సారించాలని కోరారు. అనంతరం విద్యార్థినిలతో వ్యక్తిగత పరిశుభ్రతపై ప్రతిజ్ఞ చేయించారు. ఈ కార్యక్రమంలో పాఠశాల ఉ పాధ్యాయులు, అంగన్వాడీ కార్యకర్తలు పాల్గొన్నారు.

## వెలుగు కార్యాలయంలో విఓలకు జెండర్‌లకు శిక్షణ

తెర్లాం, మార్చి 05 ప్రభాతవార్త

మండలంలోని వెలుగుకార్యాలయంలో ఆరోగ్య కమిటీలకు, జెండర్ కమిటీలకు, గ్రామ సంఘం వి.ఓ.ఏ లకు గురువారం శిక్షణా కార్యక్రమం నిర్వహించారు. ఏ.పి.ఎం కెల్ల ఉమామహేశ్వరరావు మాట్లాడుతూ ఎస్.హెచ్.జి మీటింగ్‌లు, గ్రామసంఘం మీటింగ్ లలో ఆరోగ్యం, పరిసరములు పరిశుభ్రత పాటించడం గూర్చి చర్చ జరపాలని అన్నారు. 2025 -26 ఆర్థిక సంవత్సరమునకు బ్యాంక్ లింకేజ్ ద్వారా అప్పులు టార్గెట్ 33 కోట్లుకు 277 కోట్లు, ఎస్.హెచ్.జికు 28 కోట్ల రూపాయాలు గ్రౌండింగ్ జరిగిందని అన్నారు. స్త్రీనిధి 2025-26 ఆర్థిక సంవత్సరమునకు 6 కోట్ల 30 లక్షలు టార్గెట్‌కు గాను 277 కోట్లు, ఎస్.హెచ్.జికు 6 కోట్లు ఎస్.హెచ్.జి సభ్యులకు మంజూరు చేయటం జరిగిందని అన్నారు. మార్చ్ 2026 నాటికి అన్ని రకాల అప్పులు 100% రికవరీ చేయాలని, అలాగే అక్షర ఆంధ్రా కార్యక్రమంలో భాగంగా వయోజనులకు మార్చ్ 15 తేదీన పరీక్ష నిర్వహించటం జరుగునని అన్నారు. ఈ కార్యక్రమంలో వి.ఓ.ఏ.లు, సి.సి లు అందరు హాజరు కావటం జరిగింది.

## జీతాలు పెంచేందుకు అంగీకరించిన అద్దె బస్సు యజమానులు.

### సమ్మె విరమిస్తున్నట్లు అద్దె బస్సు డ్రైవర్ల సంఘం ప్రకటన




సాలూరు ఫిబ్రవరి 5 ప్రభాతవార్త

సాలూరు ఏపీఎస్ఆర్టీసీ డిపో పరిధిలో అద్దె బస్సు డ్రైవర్లు చేపడుతున్న రెండు రోజులు సమ్మె చర్చలు సందర్భంగా గురువారం సాయంత్రం ముగిసినట్లు యజమా నులు ఇంకా అద్దెబస్సు డ్రైవర్ల సంఘం సిఐటియు ఉమ్మడిగా ప్రకటిం చింది. ప్రతినిధులు ఆర్ సత్యనా రాయణ,ఎస్ఎస్ రాజు,కె ప్రవీణ్ వివరాలు ఇలా ఉన్నాయి. అంగీకార పత్రం ప్రకారం రెండున్నర సంవత్సరాల గడువుగా అద్దె బస్సు డ్రైవర్లు అలాగే ఓనర్లు సమన్వయం చేసుకొని ముందుకు వెళ్లేందుకు సమ్మతి కుదిరిందని తెలియజేశారు.అంతే కాకుండా సమ్మె సందర్భంగా సహకరించిన ఆర్టీసీ అధికారులు,పోలీసులు పత్రికా విలేకరులకు అద్దె బస్సు డ్రైవర్ల సంఘం,సిఐటియు ధన్యవాదాలు తెలియజేసింది. అద్దె బస్సు డ్రైవర్ల సంఘం గౌరవ అధ్యక్షులు ఎన్ వై నాయుడు కమిటీ సభ్యులు,కార్మికులు పాల్గొన్నారు.



## నాఖాబందీ నిర్వహించిన ఎస్ఐ

తెర్లాం, మార్చి 05, ప్రభాతవార్త

మండలంలో తెర్లాం జంక్షన్ వద్ద నాఖా బందీ ఎస్ ఐ సాగర్ బాబు ఆధ్వర్యంలో గురువారం నిర్వహించారు. సాయంత్రం నాలుగు గంటల నుంచి ఆరు గంటల వరకు నాఖా బందీని నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ముమ్మురం గా వాహనాలు తనిఖీ లు చేసారు.వాహనాలకు అన్ని డాక్యూమెంట్ లు విధిగా ఉండాలన్నారు. అలాగే ప్రతి ఒక్క ద్విచక్ర వాహనదారుడు తప్పనిసరిగా హెల్మెట్ ధరించాలన్నారు. ఆటో లో ముందు సీట్ లో డ్రైవర్ ప్రక్కన అదనంగా ఎవరైనా కూర్చోపెడితే కఠిన చర్యలు తప్పవున్నారు. ఈ కార్యక్రమం లో కానిస్టేబుల్స్ పాల్గొన్నారు.

## మహిళలు అన్ని రంగాలలో ముందుండాలి

తెర్లాం, మార్చి 05 (ప్రభాత వార్త)



మహిళలు అన్ని రంగాలలో రాణించాలని ఉన్నత శిఖరాలు అధిరోహించాలని స్త్రీ శక్తి నారీమణులుగా వెలుగొందాలని జిల్లా మహిళా శిశు సంక్షేమ శాఖ అధికారిణి కేవీ బాలమణి పిలుపునిచ్చారు. గురువారం స్థానిక కేజీబీవీ పాఠశాల జడ్పీ ఉన్నత పాఠశాలలో జరిగిన మిషన్ శక్తి స్కీమ్ సంకల్ప హబ్ ఆధ్వర్యంలో జరిగిన సమావేశానికి హాజరయ్యారు మిషన్ శక్తి స్కీం సంకల్ప 20 రోజులు ప్రోగ్రాం లో భాగంగా అదేవిధంగా ఈనెల 8న జరుగునున్న అంతర్జాతీయ మహిళా దినోత్సవాన్ని పురస్కరించుకొని వివిధ కార్యక్రమాల్లో ఆమె భాగస్వాములయ్యారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ పురుషులతో సమానంగా మహిళలు అభివృద్ధిలో పయనిస్తున్నారని ఇంకా ధైర్య సాహసాలు ప్రదర్శించి తనను తాను రక్షించుకునే విధంగా ఆలోచన చేసి అభివృద్ధి పథంలో నడవాలని ఆకాంక్షించారు.ఈ సందర్భంగా ఉన్నత పాఠశాల కేజీబీవీ పాఠశాలలో ఆడో మరియు బాయ్స్ కి మిషన్ శక్తి సంకల్ప స్కీములో ఉన్నటువంటి వన్ స్టాప్ సెంటర్ సర్వీసెస్ కోసం మరియు హెల్ప్ లైన్ నెంబర్స్ కోసం సైబర్ క్రైమ్ గుడ్ టచ్ బ్యాడ్ టచ్ కోసం అవగాహన కల్పించారు. అలాగే ఇతర శాఖలకు సంబంధించిన అధికారులు ఈ కార్యక్రమంలో భాగస్వాములై మహిళ స్వేచ్ఛ స్వాతంత్ర్యాల పైన అనేక సూచనలు చేశారు. కార్యక్రమంలో జిల్లా మహిళ శిశు సంక్షేమ శాఖ అధికారిణి కేవీ బాలమణి బాడంగి ఐసిడిఎస్ సిడిపిఓ వన్ స్టాప్ సెంటర్ అడ్మినిస్ట్రేటర్ మరియు కౌన్సిలర్ తదితరులు పాల్గొన్నగా అంగన్వాడి కార్యకర్తలు వై శ్రీదేవి ఎం గీతా జి లక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

## స్వర్ణాంధ్ర కేలండర్‌ను ఆవిష్కరించిన కలెక్టర్

విజయనగరం, మార్చి 5 (ప్రభాతవార్త ప్రతినిధి )



రాష్ట్ర ప్రభుత్వం ప్రత్యేకంగా రూపొందించిన స్వర్ణాంధ్ర - 2047 కేలండర్‌ను జిల్లా కలెక్టర్ ఎస్ రాంసుందర్ రెడ్డి గురువారం ఆవిష్కరించారు. వాటిని అన్ని ప్రభుత్వ కార్యాలయాల్లో ఉంచాలని అధికారులను ఆదేశించారు. ఈ కార్యక్రమంలో జిల్లా సమాచార పౌర సంబంధాల శాఖ ఎడి పి.గోవిందరాజులు, వివిధ శాఖల జిల్లా అధికారులు పాల్గొన్నారు.

06-03pg10exHMNWJQE.qxd:06-03pg10exHMNWJQE.qxd 1/1/02 7:40 AM Page 1



# వాంఖడేలో విజయ గర్జన




## సంజూ తీన్‌మార్

**సంజూ శాంసన్...**ఈడెన్‌ను రిపీట్ చేశాడు. వాంఖడేలో పరుగుల వరద పారించాడు. 97 నాటౌట్ ఇన్నింగ్స్‌ను కంటిన్యూ చేశాడు. ఈడెన్‌లో విండీస్ బౌలర్లు బలయితే.. వాంఖడేలో ఇంగ్లాండ్ బౌలర్ల వంతయింది. జోఫ్రా అర్చర్ వేసిన ఇన్నింగ్స్ మొదటి రెండు బంతులను కూల్‌గా డిఫెన్స్ ఆడిన సంజూ ఆ తర్వాత నుంచి విశ్వరూపం చూపాడు. లాంగాన్ బౌండరీతో ఖాతా తెరిచిన సంజూ... తరువాతి బంతిని లాంగ్ ఆన్ మీదుగా స్టాండ్స్‌లోకి పంపాడు. తొలి ఓవర్లో 12 పరుగులు రాబట్టాడు.

**బ్రూక్స్ క్యాచ్ డ్రాప్... బలైన ఇంగ్లాండ్ బౌలర్లు**

ఆర్చర్ వేసిన మూడో ఓవర్ మొదటి బంతికి ఫోర్ కొట్టిన సంజూ.. సెకండ్ బంతిని కూడా ధాటిగా ఆడాడు. అయితే మిడ్ ఆన్‌లో డాలీ లాంటి క్యాచ్‌ను బ్రూక్స్ వదిలేయడంతో సంజూకు లైఫ్ లైన్ లభించింది. ఫామ్‌లో ఉన్న బ్యాట్స్‌మెన్ క్యాచ్ వదిలేస్తే ఫలితం ఎలా ఉంటుందో ఇంగ్లాండ్‌కు ఆ తర్వాత అర్థమైంది. ఆ ఓవర్లోనే మరో సిక్స్ బాదాడు.

**ఏ బౌలర్‌ను వదలకుండా సిక్స్‌ల మోత**

ఇక వెనక్కి తిరిగిచూడకుండా సంజూ.. ఇషాన్ కిషన్ అండగా రన్ ఫీస్ట్ చేశాడు. ఫోర్లతో కదం తొక్కుతూ పవర్ ప్లే ఆరు ఓవర్లలో భారత్ స్కోరును 67కు చేర్చాడు. ఆదిల్ రషీద్‌ను బౌండరీ, సిక్స్‌లతో వెల్‌కమ్ చెప్పిన సంజూ... డాసన్ బంతికి సిక్స్ బాది హాఫ్ సెంచరీ పూర్తి చేశాడు. కేవలం 26 బంతుల్లో ఈ పరుగులు వచ్చాయి. సామ్ కుర్రాన్ ఓవర్లో మరో సిక్స్‌తో భారత్ స్కోరును వంద పరుగులు దాటించాడు.

ఓవర్టన్‌ను కూడా సిక్స్‌తో స్వాగతం చెప్పాడు. 13వ ఓవర్ వేసిన ఆర్చర్ బంతుల్లో 2 సిక్స్‌లు బాదడంతో చూస్తుండగానే భారత్ స్కోరు 150 మార్కు దాటింది. చివరి సంజూ జోరుకు విల్ జాక్స్ తెలివైన బంతితో బ్రేక్ వేశాడు. ఆఫ్ స్టంప్‌కు దూరంగా వేసిన ఈ బంతి ని సంజూ సిక్స్‌కు తరలించబోయి సాల్ట్ చేతికి చిక్కాడు. కేవలం 42 బంతుల్లోనే 8 బౌండరీలు, 7 సిక్స్‌లతో 89 పరుగులు చేసి పెవిలియన్ చేరాడు. ఈ క్రమంలో రెండో వికెట్‌కు 45 బంతుల్లో 97 రన్స్, మూడో వికెట్‌కు 22 బంతుల్లో 43 రన్స్ జోడించాడు.

## ఇంగ్లాండ్‌కు షాక్ - ఫైనల్లో భారత్

*సూర్య సేన సూపర్ షో చేసింది. పరుగుల వరద పారిన రెండో సెమీస్‌లో విజయ గర్జన చేసింది. మొదట బ్యాటింగ్‌లో, ఆ తర్వాత బౌలింగ్‌లో రాణించింది. మధ్యలో బెతెల్ సూపర్ సెంచరీతో భారత్ శిబిరంలో కలవరం రేపినా.. బుమ్రా 18వ ఓవర్లో 7 పరుగులే ఇచ్చి మలుపు తిప్పాడు. 19వ ఓవర్లో హార్దిక్ కూడా చక్కగా బౌలింగ్ చేసి దారిలో పెట్టాడు. 30 రన్స్ కావాల్సిన చివరి ఓవర్లో దూబే ఇంగ్లాండ్‌కు అవకాశం ఇవ్వకుండా ముగించాడు. ఉత్కంఠ రేపిన రెండో సెమీస్‌లో భారత్ ఏడు రన్స్‌తో గెలుపొంది ప్రపంచ కప్‌కు అడుగు దూరానికి చేరింది. ఫైనల్లో న్యూజిలాండ్‌తో పోరుకు సిద్ధమైంది.*

**ముంబై:** రెండో సెమీఫైనల్లో మొదట బ్యాటింగ్ చేసిన భారత్ నిర్ణీత 20 ఓవర్లలో 7 వికెట్లకు 253 రన్స్ చేసింది. ఓపెనర్ సంజూ శాంసన్(89)కు తోడు ఇషాన్ కిషన్ (18 బంతుల్లో 39), శివమ్ దూబే(25 బంతుల్లో 43), హార్దిక్ (12 బంతుల్లో 27), తిలక్ (7 బంతుల్లో 21) ధూమ్‌ధామ్ బ్యాటింగ్ చేశారు.

254 పరుగుల లక్ష్యంతో బ్యాటింగ్‌కు దిగిన ఇంగ్లాండ్‌ను ఆరంభంలోనే సాల్ట్(5)ను హార్దిక్, కెప్టెన్ బ్రూక్(7) బుమ్రా అవుట్ చేసి దెబ్బతీశారు. బట్లర్(25)ను వరుణ్ చక్రవర్తి, టామ్ బాటమ్(17)ను అక్షర్ పటేల్ బోల్తా కొట్టించారు. దీంతో 95 రన్స్‌కే ఇంగ్లాండ్ 4 వికెట్లు కోల్పోయింది.

ఈ దశలో జాకబ్ బెతెల్...విల్స్ జాక్స్(20 బంతుల్లో 35) ధాటిగా ఆడి భారత్ శిబిరంలో ఆందోళన రేపాడు. భారత బౌలర్లపై సిక్స్‌లు, ఫోర్లతో విరుచుకుపడుతూ 48 బంతుల్లోనే 105 రన్స్ చేశాడు. విల్ జాక్స్ అవుటైనా సామ్ కుర్రాన్ అండగా గెలుపుకు దగ్గర చేశాడు. చివరి మూడు ఓవర్లలో ఇంగ్లాండ్ 50 పరుగులు చేయాల్సిన దశలో బుమ్రా, హార్దిక్ పొదుపుగా బౌలింగ్ చేసి మ్యాచ్‌ను భారత్ వైపు నిలిపాడు. చివరి ఓవర్లో 30 పరుగులు చేయాల్సిన దశలో బెతెల్ రనౌట్ అయ్యాడు. చివరి 2 బంతులకు ఆర్చర్ సిక్స్‌లు బాదినా అప్పటికే ఓటమి ఖరారైంది. ఇంగ్లాండ్ నిర్ణీత 20 ఓవర్లలో 7 వికెట్లకు 246 రన్స్‌కే పరిమితమైంది. భారత బౌలర్లలో హార్దిక్ రెండు వికెట్లు.. బుమ్రా, అర్షదీప్, వరుణ్, అక్షర్ తలో వికెట్ తీశారు. ఆదివారం జరిగే ఫైనల్లో న్యూజిలాండ్‌తో టీమిండియా తలపడనుంది.



## 45 బంతుల్లో 97 రన్స్

ఇషాన్ తుఫాన్ ఇన్నింగ్స్ ఆడాడు. సంజూతో కలిసి ఇంగ్లాండ్ బౌలర్లపై విరుచుకుపడ్డాడు. సింగిల్‌తో ఖాతా తెరిచి ఆకాశమే హద్దుగా చెలరేగాడు. 5వ ఓవర్లో వరుసగా రెండు బౌండరీలు.. డాసన్, సామ్ కుర్రాన్ బంతులకు చెరో సిక్స్, రషీద్ బౌలింగ్‌లో మరో బౌండరీ... ఇలా ఓదశలో సంజూని మించి ధాటిగా ఆడాడు. తొమ్మిదో ఓవర్‌కే భారత్ స్కోరు వంద దాటించాడు. కేవలం 18 బంతుల్లోనే రెండు సిక్స్‌లు, నాలుగు బౌండరీలతో 39 మెరుపు వేగంతో 39 రన్స్ చేయడమే గాక.. రెండో వికెట్‌కు కేవలం 45 బంతుల్లోనే 97 రన్స్ జోడించాడు.

## క్వార్టర్ ఫైనల్లో లక్ష్యసేన్



**బర్మింగ్హామ్:** ఆల్ ఇంగ్లాండ్ ఓపెన్ ఛాంపియన్‌షిప్‌ను సంచలన విజయంతో ఆరంభించిన భారత షట్లర్ లక్ష్యసేన్ అదే జోరు కొనసాగిస్తూ క్వార్టర్ ఫైనల్లో ప్రవేశించాడు. ప్రిక్వార్టర్ ఫైనల్లో హాంకాంగ్ ప్లేయర్ అంగుస్ లాంగ్‌పై మూడు గేమ్‌ల పోరులో కష్టపడి నెగ్గాడు. తొలి రౌండ్‌లో ప్రపంచ ఛాంపియన్‌ను ఓడించిన లక్ష్యసేన్ ప్రి క్వార్డర్ ఫైనల్లోనూ జోరు చూపాడు. తొలి గేమ్‌ను 21-19తో నెగ్గి శుభారంభం చేశాడు. అయితే రెండో గేమ్ నువ్వానేనా అన్నట్లుగా సాగింది. ఆరంభంలో 14-7తో లక్ష్యసేన్ ఆధిక్యం చాటాడు. కానీ అద్భుతంగా పుంజు కున్న అంగస్ పోటాపోటీగా పాయింట్లు రాబట్టడంతో గేమ్ టైబ్రేకర్‌కు కొనసాగింది. చివర్లో లక్ష్యసేన్ కాస్త ఒత్తిడికి గురై అనవసర తప్పిదాలు చేసి 21-23తో చేజార్చుకున్నాడు. దీంతో ఇద్దరూ 1-1తో సమవుజ్జీగా నిలిచాడు.

ఫలితం తేల్చే మూడే గేమ్‌లో లక్ష్యసేన్.. ప్రత్యరి అంగస్ పుంజుకునే అవకాశం ఇవ్వకుండా పాయింట్ల మీద పాయింట్లు రాబట్టాడు. ఎదురులేని స్మాష్‌లతో మూడో గేమ్‌ను 21-10తో ముగించి ముందంజ వేశాడు. ప్రపంచ 12వ ర్యాంక్ ఆటగాడైన లక్ష్యసేన్‌కు 31 ఏళ్ల లాంగ్‌పై ఇది తొలి విజయం. ఇంతకుముందు అతనితో ఆడిన రెండు సార్లు కూడా లక్ష్యసేన్‌కు పరాజయాలే ఎదురయ్యాయి. లక్ష్యసేన్‌కు క్వార్టర్ ఫైనల్లో మరో చైనా షట్లర్ లి షి ఫెండ్ ఎదరయ్యే అవకాశం ఉంది.

## కొనసాగిన అభిషేక్ పూర్‌షో



డైనమైట్ ఓపెనర్ అభిషేక్ శర్మ పూర్‌షో సెమీస్‌లోనూ కొనసాగింది. మూడు గోల్డెన్ డక్‌ల తర్వాత జింబాబ్వేపై హాఫ్ సెంచరీతో అభిషేక్ బ్యాటింగ్ గాడిన పడిందని అంతా అనుకున్నారు. దీనికి భిన్నంగా విండీస్‌పై నిరాశ పరిచాడు. ఇంగ్లాండ్‌పైన అయినా జోరు చూపుతాడని ఆశించారు. సింగిల్‌తో ఖాతా తెరిచిన అభిషేక్..స్పిన్నర్ విల్ జాక్స్ మొదటి బంతినే బ్యాక్‌వర్డ్ పాయింట్ దిశగా బౌండరీ సాధించాడు. అదే క్రమంలో మరో ఫోర్ కొట్టి జోరు మీద కనిపించాడు. తరువాతి బంతికి భారీ షాట్ ఆడబోయి సాల్ట్‌కు క్యాచ్ ఇచ్చి పెవిలియన్ చేరాడు. అప్పటికి టీమిండియా స్కోరు 20 పరుగులే.

## రషీద్ ఖాన్‌పై వేటు: అఫ్ఘాన్‌కు కొత్త కెప్టెన్

**దుబాయి:** అఫ్ఘానిస్తాన్ మేటి స్పిన్నర్ రషీద్ ఖాన్‌పై వేటు పడింది. టీ20 కెప్టెన్సీ నుంచి ఆ దేశ క్రికెట్ బోర్డు తొలగించింది. రషీద్ ఖాన్ స్థానంలో ఓపెనర్ ఇబ్రహీం జద్రాన్‌ను కొత్త కెప్టెన్‌గా నియమించింది. శ్రీలంకతో జరిగే వన్డే సిరీస్ నుంచి ఇబ్రహీం జద్రాన్... కెప్టెన్‌గా వ్యవహరిస్తాడని తెలిపింది. ఈ సందర్భంగా రషీద్ ఖాన్ కెప్టెన్సీలో జట్టు సాధించిన చిరస్మరణీయ విజయాన్ని ఏసీబీ ప్రస్తావించింది. రషీద్ ఖాన్ కెప్టెన్సీలో 2024 టీ20 ప్రపంచకప్‌లో సంచలన విజయాలతో ఏకంగా సెమీఫైనల్ చేరుకున్న అఫ్ఘానిస్తాన్... ఈసారి మాత్రం నిరాశపరిచింది. గ్రూప్ దశలోనే ఇంటిదారి పట్టింది. గ్రూప్-డిలో సౌతాఫ్రికా, న్యూజిలాండ్, యూఏఈ, కెనడా జట్లతో పోటీపడ్డ అఫ్ఘానిస్తాన్... రెండు మ్యాచ్‌ల్లోనే గెలుపొందింది. గ్రూప్-డిలో మూడో స్థానంలో నిలిచి సూపర్8 చేరకుండానే నిష్క్రమించింది. కాగా శ్రీలంకతో మార్చి 13, 15, 17 తేదీల్లో షార్జాలో మూడు టీ20లు, దుబాయ్‌లో మార్చి 20, 22, 25 తేదీల్లో మూడు వన్డేలు ఆడనుంది.

## సచిన్ ఇంట పెళ్లి బాజా



**ముంబై:** భారత క్రికెట్ దిగ్గజం సచిన్ తెండ్యూలర్ ఇంట పెళ్లి బాజా మోగింది. సచిన్ తనయుడు అర్జున్ తెండూల్కర్, తన స్నేహితురాలు సానియా చందోక్ మూడుముళ్ల బంధంతో ఒక్కటయ్యారు. ముంబైలో వీరి కళ్యాణం వైభవంగా జరిగింది. సన్నిహితులు, బంధుమిత్రుల సమక్షంలో సౌత్ ముంబైలో అర్జున్, సానియాల పెళ్లి తంతు నిర్వహించారు. కొత్త జంటను ఆశీర్వదించేందుకు క్రీడా, సినీ ప్రముఖులు, రాజకీయ నాయకులు భారీగా తరలివచ్చారు. ఐసీసీ ఛైర్మన్ జైషా, కామేంటేటర్ హర్షభోగ్లే, టీమిండియా మాజీ క్రికెటర్లు ఎంఎస్ ధోనీ, ఇర్ఫాన్ పఠాన్, యూసుఫ్ పఠాన్, సురేష్‌రైనా, ఆకాశ్ చోప్రా, మహ్మద్ కైఫ్‌తో పాటు మాజీ కోచ్‌లు రాహుల్ ద్రావిడ్, అనిల్ కుంబ్లే, రవి శాస్త్రి, బాలీవుడ్ స్టార్ షారుక్ ఖాన్‌తో పాటు సినీ సెలెబ్రిటీలు పెళ్లికి హాజరయి కొత్త జంటను దీవించారు.

## మళ్లీ తగ్గిన బంగారం ధర

**రూ.10 వేలకు పైగా దిగొచ్చిన పసిడి**

**4 రోజులుగా భారీ పతనం**

గురువారం ఒక్క రోజే 24 క్యారెట్ల బంగారం రూ.1630, 22 క్యారెట్ల పసిడి రూ.1500 తగ్గుదల



**ముంబై, మార్చి 5:** దేశీయ మార్కెట్లో బంగారం ధరలు వరుసగా నాలుగో రోజూ తగ్గాయి. ఇరాన్ యుద్ధం వేళ భారీగా పెరుగుతాయన్న అంచనాలకు విరుద్ధంగా బంగారం ధరలు దిగివస్తుండడం గమనార్హం. నాలుగు రోజుల్లో తులం బంగారం రూ.10 వేల మేర దిగివచ్చింది. అమెరికా, ఇజ్రాయెల్, ఇరాన్ మధ్య యుద్ధం జరుగుతున్నప్పటికీ బంగారం ధరలు తగ్గుతుండడం భారీ ఊరట కల్పిస్తోంది. ఇలాంటి సంక్షోభ సమయంలో బంగారం ధరలు పెరుగుతాయి. అయితే, ప్రస్తుతం గోల్డ్ రేట్లు భారీగా దిగివస్తున్నాయి. ఇందుకు ప్రధానంగా కరెన్సీ మార్పులు, మార్కెట్ లిక్విడిటీ, డాలర్ విలువ పెరగడం వంటివి కీలకంగా మారుతున్నాయని మల్టీనేషనల్ ఇన్వెస్ట్‌మెంట్ బ్యాంక్, ఫైనాన్షియల్ సర్వీసెస్ కంపెనీ మోర్గాన్ స్టాన్లీ విశ్లేషణ చేసింది. ఫెడరల్ రిజర్వ్ వడ్డీ రేట్లు తగ్గించే అవకాశం లేదన్న అంశం సైతం బంగారం ధరలపై ప్రభావం చూపిస్తున్నట్లు తెలుస్తోంది. మార్కెట్ ఒత్తిడి సమయంలో పెట్టుబడిదారులు క్యాష్ అవసరాల కోసం బంగారాన్ని విక్రయిస్తున్నట్లు విశ్లేషకులు అంచనా వేస్తున్నారు. అయితే, రాజకీయ, భౌగోళిక ఉద్రిక్తతలు ఇలాగే కొనసాగితే బంగారం ధరలు మళ్లీ పెరగవచ్చంటున్నారు. అయితే, గత నాలుగు రోజుల్లోనే బంగారం ధర తులంపై ఏకంగా రూ.10 వేల వరకు దిగొచ్చింది. 24 క్యారెట్ల స్వచ్ఛమైన బంగారం రేటు తులంపై ఏకంగా రూ.10,210 మేర తగ్గింది. ఇక 22 క్యారెట్ల బంగారం రేటు తులంపై రూ.9,350 మేర దిగివచ్చింది. గురువారం ఒక్కరోజే 24 క్యారెట్ల గోల్డ్ రేటు తులంపై రూ.1630 తగ్గగా 22 క్యారెట్ల బంగారం రేటు తులానికి రూ.1500 మేర దిగివచ్చింది.



## భారీగా పుంజుకున్న స్టాక్ మార్కెట్

**ఒక్కరోజే దాదాపు 900 పాయింట్లు లాభపడిన సెన్సెక్స్**

**ముంబై, మార్చి 5:** ప్రపంచ ఉద్రిక్తతలు తగ్గుముఖం పట్టడంతో సెన్సెక్స్, నిఫ్టీ గురువారం భారీ లాభాలతో ముగిశాయి. అమెరికా, ఇరాన్ మధ్య భౌగోళిక రాజకీయ ఉద్రిక్తతలు తగ్గడం పెట్టుబడిదారుల విశ్వాసాన్ని పెంచడంతో భారత స్టాక్ మార్కెట్లు గురువారం బాగా లాభపడ్డాయి. బెంచ్‌మార్క్ సూచీలు ఒక నెలలోనే అత్యుత్తమ సెషన్‌ను నమోదు చేశాయి. నిఫ్టీ 1.17 శాతం లేదా 285.40 పాయింట్లు పెరిగి 24,765.90 వద్ద ముగిసింది. ఇంతలో, సెన్సెక్స్ 899.71 పాయింట్లు లేదా 1.14 శాతం పెరిగి 80,015.90 వద్ద ముగిసింది. "మార్కెట్ ఇంకా పూర్తిగా సంక్షోభం నుండి బయటపడలేదు. నిఫ్టీ 25,200 స్థాయి కంటే తక్కువగా ట్రేడవుతున్నంత వరకు ప్రస్తుత చర్యను పుల్‌బ్యాక్‌గా మాత్రమే పరిగణించాలి" అని ఒక విశ్లేషకుడు పేర్కొన్నారు. "తక్కువగా, తక్షణ మద్దతు 24,600 వద్ద ఉంచబడింది. ఈ స్థాయి కంటే తక్కువ విరామం సూచికను 24,400 వైపు మరింత లాగవచ్చు" అని మార్కెట్ నిపుణుడు పేర్కొన్నారు. అమెరికా సంతృప్తికరమైన ప్రత్యామ్నాయ ప్రతిపాదనను అందిస్తే ఇరాన్ తన అణు కార్యక్రమాన్ని వదులుకోవడానికి సిద్ధంగా ఉండవచ్చని నివేదికలు సూచించిన తర్వాత మార్కెట్ సెంటిమెంట్ మెరుగుపడింది. నిఫ్టీలో అత్యధికంగా లాభపడిన వాటిలో అదానీ పోర్ట్స్, స్పెషల్ ఎకనామిక్ జోన్, హిండాల్కో ఇండస్ట్రీస్, లార్సెన్ టూబ్రో ఉన్నాయి, ఇవి సెషన్‌లో బలమైన కొనుగోళ్లను చూశాయి. విస్తృత మార్కెట్లు కూడా బాగా పనిచేశాయి. బెంచ్‌మార్క్ సూచీలను అధిగమించాయి. నిఫ్టీ మిడ్‌క్యాప్ 100 1.52 శాతం లాభపడగా, నిఫ్టీ స్మాల్‌క్యాప్ 100 1.58 శాతం పెరిగింది. రంగాలవారీగా, మెటల్ స్టాక్‌లు ర్యాలీకి నాయకత్వం వహించాయి, నిఫ్టీ మెటల్ ఇండెక్స్ 2.3 శాతం లాభపడింది. చమురు, గ్యాస్, నిర్మాణ సంబంధిత స్టాక్‌లు వంటి ఇతర రంగాలు కూడా రోజులో బలమైన కొనుగోళ్ల ఆసక్తిని చూశాయి. భౌగోళిక రాజకీయ ఉద్రిక్తతలు తగ్గుముఖం పట్టి ప్రపంచ ఆర్థిక మార్కెట్లకు మద్దతు ఇవ్వవచ్చనే ఆశల మధ్య మార్కెట్‌లోని సానుకూల ఊపు పెట్టుబడిదారుల సెంటిమెంట్‌ను మెరుగుపరుస్తుందని నిపుణులు తెలిపారు. ఇంతలో, ఇండియా విఐఎక్స్ బాగా చల్లబడి, దాదాపు 16 శాతం తగ్గి 18 మార్కు కంటే దిగువకు పడిపోయింది. అస్థిరతలో మరింత సడలింపు బుల్లిష్ సెంటిమెంట్‌కు మద్దతుగా ఉండే అవకాశం ఉందని నిపుణులు పేర్కొన్నారు.

## పెరుగుతున్న పట్టణీకరణ

**ఆర్థిక విధానాల్లో సరికొత్త మార్పులు**

**ఎస్‌బిఐ తాజా నివేదికలో వెల్లడి**

**న్యూఢిల్లీ, మార్చి 5:** దశాబ్దకాలంలో దేశంలో ప్రజాజీవనంలో అనూహ్య మార్పులు చోటుచేసుకున్నాయి. మారుతున్న కాలానికి అనుగుణంగా ఆహార నియమాలతోపాటు ఆర్థిక విధానాల్లోనూ సరికొత్త మార్పులు వచ్చాయి. అంతేగాక దేశవ్యాప్తంగా పట్టణ, నగరీకరణ అనూహ్య రీతిలో పెరిగిపోతున్నదని ఎస్‌బిఐ రీసెర్చ్ గురువారం విడుదల చేసిన నివేదికలో పేర్కొంది. ఆధునిక వినియోగ అలవాట్లను బాగా ప్రతిబింబించేలా అనేక కొత్త వస్తువులు కూడా జోడించబడ్డాయి. వీటిలో ఆన్‌లైన్ మీడియా, స్ట్రీమింగ్ సేవలు, గ్రామీణ గృహనిర్మాణం, విలువ ఆధారిత పాల ఉత్పత్తులు, బార్లీ, పెన్ డ్రైవ్‌లు, బాహ్య హార్డ్ డిస్క్‌లు ఉన్నాయి. డేటాలో ప్రతిబింబించే పట్టణీకరణ ధోరణులు కొత్త సిపిఐ సిరీస్ భారతదేశంలో మారుతున్న పట్టణీకరణ ధోరణులను ప్రతిబింబిస్తుందని ఎస్‌బిఐ నివేదిక పేర్కొంది. తెలంగాణ, గుజరాత్, మహారాష్ట్ర, హర్యానా వంటి రాష్ట్రాలు గత దశాబ్దంలో పట్టణీకరణ బరువులో అతిపెద్ద పెరుగుదలను




చూశాయి. రాష్ట్రాలలో, తెలంగాణ అత్యధిక ద్రవ్యోల్బణాన్ని నమోదు చేసింది, ఇది పూర్వ సమైక్య ఆంధ్రప్రదేశ్ విభజన తర్వాత ఆర్థిక సర్దుబాట్లను పాక్షికంగా ప్రతిబింబిస్తుంది. ఇంతలో, తమిళనాడు, కర్ణాటక మినహా చాలా ప్రధాన రాష్ట్రాలు జనవరి 2026లో ద్రవ్యోల్బణాన్ని 3శాతం కంటే తక్కువగా నమోదు చేశాయి. గ్రామీణ, పట్టణ వెయిటేజీలో మార్పులు కొత్త సిపిఐ నిర్మాణం గ్రామీణ, పట్టణ ప్రాంతాలలో అనేక వర్గాల ప్రాముఖ్యతను కూడా మారుస్తుంది. గ్రామీణ ప్రాంతాల్లో, గృహనిర్మాణం, నీరు, రవాణా, సమాచారం, కమ్యూనికేషన్ బాగా అందుబాటులోకి వచ్చాయి. అయితే, పట్టణ ప్రాంతాల్లో, కొత్త సిపిఐ సిరీస్‌లో గృహనిర్మాణం, నీరు, ఆహారం, పానీయాల వాటా కొద్దిగా తగ్గింది. భారతదేశ కొత్త వినియోగదారుల ధరల సూచిక (సిపిఐ) 2024 సిరీస్ విశ్వసనీయతను మెరుగుపరచడానికి, ప్రపంచ ద్రవ్యోల్బణ ప్రమాణాలతో పోల్చదగినదిగా చేయడానికి నవీకరించబడిందని ఎస్‌బిఐ రీసెర్చ్ నివేదిక తెలిపింది. కొత్త సిపిఐ సిరీస్ సిఓఐసిఓపి 2018 వర్గీకరణ వ్యవస్థను అనుసరిస్తుందని నివేదిక పేర్కొంది. ఇది అంతర్జాతీయంగా వినియోగ విధానాలు, ద్రవ్యోల్బణాన్ని కొలవడానికి ఉపయోగించబడుతుంది. ఈ నవీకరణ భారతదేశం తన ద్రవ్యోల్బణ కొలత పద్ధతులను ప్రపంచ పద్ధతులతో సమలేఖనం చేయడంలో సహాయపడుతుంది, అదే సమయంలో కాలక్రమేణా వినియోగం, ఆర్థిక విధానాలలో మార్పులను కూడా ప్రతిబింబిస్తుంది. కొత్త సిపిఐ సిరీస్‌లోని ప్రధాన మార్పులలో ఒకటి ద్రవ్యోల్బణంలో ఆహారం, పానీయాల వాటా తగ్గింది. మునుపటి సిపిఐ 2012 వర్గీకరణ ప్రకారం, ఆహారం, పానీయాల వాటా 40.10 శాతంగా ఉండేది. అయితే, కొత్త సిపిఐ 2024 సిరీస్‌లో, బరువు 36.75 శాతంగా ఉంది. మొత్తంమీద, కొత్త సిపిఐ బాస్కెట్ ఆహార బరువును గతంలో 45.8 శాతం నుండి 40.1 శాతానికి తగ్గిస్తుంది, ఇది ఖర్చు విధానాలు క్రమంగా ఆహారం నుండి ఇతర సేవలు, వస్తువుల వైపు మారుతున్నాయని సూచిస్తుంది. కొత్త సిరీస్ ద్రవ్యోల్బణ అంచనా, కార్పొరేట్ ధరల నిర్ణయాలు, ఆర్థిక దృశ్య విశ్లేషణకు ఉపయోగపడుతుందని నివేదిక పేర్కొంది.




Printed and Published by Gireesh Sanghi, CMD and Managing Editor on behalf of AGA Publications Ltd., at Flat.No. 22, G Block ,Industrial park Auto Nagar , Gajuwaka, Visakhapatnam-530 012, Phones:2706784,2706785,2706786,2706787,2706622, Fax: 2706522, RNI No.64864/96, Editor : *Damerla Sai Baba, *Responsible for selection of News under the PRB Act. Regd.No. H/SD/337/12-14.